తాళ్లపాక సాహిత్యము

# శృంగార సంకీర్తనలు



తాళ్లపాక అన్నమాచార్యులు

శ్రీ తాళ్ళపాకవారి పదసాహిత్యము—సంపుటము 25

# శృంగార సంకీర్తనలు.

(అన్నమాచార్య విరచితములు)

పరిష్కర్త:

గౌరిపెద్ది రామసుబ్బశర్మ

తిరుమల తిరుపతి దేవస్థానం బోర్డు ఆఫ్ ట్రస్టీస్‌వారి తరపున
ఎగ్జిక్యూటివ్ ఆఫీసరువారగు
శ్రీ పి. యస్. రాజగోపాలరాజు I. A. S., గారి
అనుమతిని ప్రకటింపబడినది.

1977

సర్వస్వామ్యసంకలితము.
తిరుమల తిరుపతి దేవస్థానములు.

ప్రథమ ముద్రణము :
1,000 ప్రతులు

ముద్రణము :
తిరుమల తిరుపతి దేవస్థానముల ముద్రణాలయము,
తిరుపతి.

# తొలిపలుకు

"ఏవేల్పు సర్వేశుఁడేవేల్పు పరమేశుఁ
డేవేల్పు భువనైక హిత మనోభావకుఁడు
యేవేల్పు కడుసూక్ష్మ మేవేల్పు కడుఘనము
ఆ వేల్పు తిరువేంకటాద్రివిభుఁడు" —

అని లోకమునకు చాటిన మహాభక్తుడు తాళ్లపాక అన్నమాచార్యులు. 'వేంకటేశు మంత్రమే' తనకు సర్వస్వమని జీవయాత్ర సాగించిన పరమభాగవతు డితడు. అన్నముని రక్తిలో, విరక్తిలో రెంటా ప్రత్యక్షంగ అలమేలుమంగావల్లభుడే సాక్షాత్కరించినాడు. అతని శృంగార, అధ్యాత్మసంకీర్తనలు మధురవైష్ణవభక్తిప్రబంధాలు. సుమారు ఐదువందల సంవత్సరాల క్రితం గానం చేయబడిన ఈ గేయరచనలు రాగిరేకులలో నిక్షిప్తం కావడం గొప్ప ఆశ్చర్యం. కాలగర్భంలో కలసిపోగా మిగిలిన రాగిరేకులలోని (సుమారు 3000) సంకీర్తనలను పరిష్కరించి ప్రకటించే కార్యక్రమం కొన్ని దశాబ్దాల క్రితమే ప్రారంభమైంది. ఎన్నడో అచ్చుపడిన అధ్యాత్మ సంకీర్తనల సంపుటాలు ఒక్కప్రతికూడ మిగులలేదు. వానిని మళ్ళీ ముద్రించే ప్రయత్నం చేస్తున్నాము. శృంగారసంకీర్తనలు ఇప్పటికే పదకొండు సంపుటాలలో తీరినవి. ఇంక పది సంపుటాలకు సరిపడే పాటలు పరిష్కరింపవలసి వున్నది. ఈ పరిష్కరణ కార్యాన్ని బ్రహ్మశ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మగారు నిర్వహిస్తున్నారు. రాగి రేకులమీది తాళ్లపాకవారి సంకీర్తనలను త్వరగ ప్రకటించి తెలుగు దేశానికి అందివ్వాలనే మా తీవ్రప్రయత్నము.

ఈ 25 వ సంపుటంలో మొత్తం 587 పాటలున్నవి. ఇవి 98 రేకులలోనివి. 901 నుండి 1000 వ రేకు వరకు గల పాటలిందు చోటుచేసుకొన్నవి. 912, 915 అంకెలుగల రెండు రేకులు మాకు లభించలేదు. పరిష్కర్త ఈ సంపుటమున 14 పుటల పీఠికను సందిగ్ధపదసమీక్షతో చేర్చికూర్చినారు. ఇది విశంకటమైన వీరి పాండిత్యమునకు నిదర్శనము.

అపూర్వమైన ఈ వాఙ్మయరాశిని కళారసికుల కందించే ప్రయత్నం మాది. దీనిని అర్థవంతంగ ఉపయోగించుకొనే బరువు బాధ్యతలు మీవి. ఇంతకంటె మేము మనవి చేయగలిగిన దేమున్నది.

**" అడుసు చొలనే పట్టె అటునిటు కాళ్ల**
**కడుగుకొననే పట్టె కలకాలము**
**ఒడలికి జీవునికి ఒడయండైన హరి**
**దడవఁగాఁ గొంతయు బ్రొద్దు లేదు "**

తిరుపతి,
4–1–78.

పి. యస్. రాజగోపాలరాజు,
ప్రకాశకులు.

# పీఠిక

**ఆత్మానం నాయికాం కృత్వా రచనాం రసవాహినీమ్।**
**అర్పయద్వేంకటేశాయ యః కృతీ తముపాస్మహే॥**

ఇరవైనాల్గవ సంపుటమున, ఇకమీదట ప్రతిసంపుటమునను ఒక్కొకవిషయమును గూర్చి చర్చించుటకు సంకల్పించినట్లు మనవి చేసియుంటిని. భాషామర్యాదలకు, భావసంపదలకు, అలంకార విశేషములకు, తాళ్లపాకకవులవాఙ్మయరాశిలో వెలితి కానరాదు.

ఈ సంపుటమునందు ముఖ్యముగ 1. అనుస్వారము, 2. రాగి రేకులవ్రాతలో కొన్ని విశేషములు అను రెండంశములను గూర్చి యథామతి సంగ్రహముగ ముచ్చటింపదలచితిని.

## 1. అనుస్వారము

ఈ అనుస్వారమును చర్చించుటకుముందు దీనికి పూర్వరూపమైనవర్ణములనుగూర్చి కొంత విచారింపవలసి యున్నది. మూల-రూపములను చర్చించునపుడు కొంత దీర్ఘప్రస్తావనగూడ అవసరమే.

పాణినీయ వ్యాకరణమున లఘు గురువులను నిరూపించుచు, "హ్రస్వం లఘు" 1–4–10 "సంయోగే గురు" 1–4–11 "దీర్ఘంచ" 1–4–12 అని సూత్రించియున్నారు. దీనివలన, "అచల" వంటి వర్ణములు లఘువులని "అన్యత్ర" లో క్రీగీతలు గల వర్ణములు గురువులని, అట్లే "పారావార" లో దీర్ఘము లన్నియు గురువులని తేలుచున్నది. గురులఘు నిర్వచనము ఛాందసులకు (ఛందశ్శాస్త్రజ్ఞులకు,) ప్రధానమైనను వారుగూడ కొంత వరకు వ్యాకరణము ననుసరించియే సాగించినారని తోచుచున్నది. అందువలన ఈ గురులఘు విషయమున వ్యాకరణశాస్త్రమునుగూడ ప్రస్తావించితిని. పై శాస్త్రమును గురిగా చూచితిమేని "సంయమి"

వంటిపదములలో సున్నతో గూడిన 'సం' అనునది గురువగుటకు వ్యాకరణములోఆధార మగపడదు, కాని ఛందశ్శాస్త్రకర్తలు,

**శ్లో॥ "దీర్ఘం సంయోగపరం తథా ప్లుతం వ్యంజనాంత మూష్మాన్తం।**
**సానుస్వారం చ గురు క్వచిదవసానేఽపి లఘ్వన్త్యమ్॥"**

(పిం-సూ-1-4)

అని వాకొని యున్నారు. దీనికి గూడ యేదో వ్యాకరణ సంబంధము కలదని భావన. నిరాధారముగ వట్టి మర్యాదపాటగ ఛాందసులు చెప్పియుండరు గదా!

అనుస్వారముతో కూడిన 'సంయమి' వంటి పదముల స్వరూపమును విచారింతము. 'సమ్ + యమి' అనునప్పుడు "మోఽనుస్వారః" 8-3-23 అనుసూత్రముచే మకార మనుస్వారమై 'సంయమి' గా మారుచున్నది. ఇట్లే సంవాద సంబంధాదులు. సంస్కృతమునన్నైనచో 'హరిమ్ + వందే' ఇత్యాదులలో 'హరిం వందే' ఇత్యాదిగ మారుటయు పైసూత్రప్రభావమే. ఇది నిత్యసూత్రమే; కాని, యీసూత్రముతో మకార మనుస్వారముగ మారనిపక్షమున[1] 'సమ్యమి' 'సమ్వాద' ఇత్యాదిగ రూపము లుండవలసివచ్చుగదా. అప్పు డాసకారము సంయోగపరము కావున "సంయోగే గురు" అను సూత్రముచే తప్పక గురువు కాగలదు. అందువలననే మకారస్థానీయమైన అనుస్వారమును గూడ సంయుక్తముగ భావించి దానికి ముందున్న వర్ణమునకు గురుత్వము ఘటించియుందురు. అట్లే 'అన్ + కితః' శామ్ + తః' ఇత్యాది యేకపదములందును "నశ్చాపదాన్తస్య ఝలి" 8-3-24 అనుసూత్రముచే నకార మకారములు సున్నలుగమారి 'అంకిత' 'శాంత' వంటిరూపములు కాగా, "అనుస్వారస్య యయి పరసవర్ణః" 8-4-58 సూత్రముచే పరసవర్ణమువచ్చి 'అఙ్కిత' 'శాన్త' ఇత్యాదిగ సంస్కృతమున రూపము లగుచున్నవి.

---

1. 'ఆంధ్రాశబ్దతత్త్వము' లో పాడి-వేంకటస్వామిగారి వాదమిది.

అనునాసికాక్షర సంయోగమున్న స్థలములందంతట సున్ననే పాటించి 'అంకిత' 'శాంత' ఇత్యాదిగ వ్రాయుట మన తెనుగువారి సంప్రదాయము. దీనికి "యయితద్వర్గాన్తః" (ప్రాకృతప్రకాశము 4–17) అను వైకల్పిక సూత్రము ఆధారమని చెప్పుటయు కలదు. 'బిందుల్' (1-1-40) (ప్రాకృతమణిదీపిక) అను సూత్రమునందలి నిత్య విధి కారణమనుట బాగుండునేమో ? "అఙ్కిత" 'కాఞ్చన' వంటివి 'అంకిత' 'కాంచన' ములుగామారుటకు పై ప్రాకృతపద్ధతినే మన తెలుగువారు అవలంబించి యుందురు. పై నిరూపించినకారణములతో వ్యస్త, సమస్త పదములయందు అనుస్వారమునకు (బిందువుకు), సాధారణముగ మూలరూపములోని అనునాసికాక్షరములు కారణములగుచున్నవని తేలినది.

ఈ బిందువు మన తెలుగుభాసలో సిద్ధ, సాధ్య, ఖండా–ఖండ [(ఁ) (ం)] భేదములతో నుండుట మరీ వినోదకరము. సిద్ధ బిందువుగల పదములందు దానిమూలరూప మందలి అనునాసికాక్షరమును మాత్రము పరిశీలించినచో చాలును. మన తెనుగునకు సంస్కృత, ప్రాకృత, తమిళ, కన్నడపదములు మూలరూపములగుటచే, వానిలో అనునాసికాక్షరమున్నచో వానినుండి బుట్టిన మన తెనుగుపదములందు, యథాశాస్త్రముగ సున్న లరసున్నలు ఏర్పడి యుండును. పదాద్యక్షరములపై సున్న లరసున్న లేర్పడునపుడు, పదాద్యక్షరము లఘువైనచో దానిపై వచ్చు సున్న నిండుసున్న గను, పదాద్యక్షరము దీర్ఘమైనచో దానిపై వచ్చుసున్న అరసున్న గను, తక్కినస్థలములయందు వచ్చుసున్న ఉభయాత్మకముగను ఉండుట మనతెనుగుశాస్త్ర సంప్రదాయము. ఉదా: 'దణ్డః' సంస్కృతము' 'దంటు' తెలుగు, 'కాణ్డః' సంస్కృతము 'కాఁడ, తెలుగు. ఇట్లే తమిళమునందుగూడ సంస్కృతము నందువలె సున్నలకు బదులుగ అనునాసికాక్షరసంయోగముతో వ్రాయుటయే పద్ధతిగా

కనబడుచున్నది కావుననే ఉదా: 'ఉరోఙ్గల్' అను తమిళ పదము "రోఁకలి" గా 'శేణ్డు' అనునది 'చేఁదు' గను 'ఆన్దోఙ్గై' అనునది 'అఁదోఁక' గను, అట్లే 'దాఁటు' అను కన్నడపదము 'దాఁటు,' 'దూంటు,' 'దూఁటు', గ మారుట గుర్తింపదగిన విషయము.

ఇక్కడ ఒకవిషయము విచారింపవలసియున్నది. మూల పదములలో అనునాసికాక్షరములు లేకపోయినను తద్భవములలో అనుస్వారములుండుట, మూలసంస్కృతములో 'అనునాసిక, అనుస్వార' అక్షరమున్నను తద్భవములలో అనుస్వారము లేకుండుటయు పై సిద్ధాంతమునకు విరుద్ధముగ తోచుచున్నది. 'వక్ర' శబ్దము 'వంకర' గా, 'స్త్రీ' శబ్దము 'ఇంతి' గా, 'కక్ష' శబ్దము 'చంక' గా మారునపుడు ఈ విరోధము స్పష్టముగ తెలియుచున్నది. కాని 'వక్ర' శబ్దము వంటి వానిలో అనుస్వారమును "వక్రాదిషు" (ప్రా. ప్ర. 4–15) సూత్రముచే ప్రాకృతవైయాకరణులు సాధించిరి. దానినే మనవారాదరించిరి. 'ఇంతి' శబ్దములో భ్రాంతి చేతను'చంక'లో భ్రాంతి-వర్ణవ్యత్యయములచేతను బిందువులు సాధించుచున్నారుగదా! అనుస్వార, అనునాసికములు గల్గిన 'మాంసాది' శబ్దములు తద్భవములలో అవిలేకుండ ప్రయోగించుటను "మాంసాదిషు వా" (ప్రా. ప్ర. 4–16) అనుసూత్రముచే ప్రాకృతవైయాకరణులు సమర్థించిరి.

సిద్ధ సాధ్య ఖండాఖండ బిందు స్వరూప మిట్లుండగా తాళ్లపాక అన్నమాచార్యులకీర్తనలలో పై విధులను అన్నిటిని దాటిన ప్రయోగములు కొన్ని కానవచ్చుచున్నవి. అందుకొన్ని నాబోటివాని జ్ఞానమితికి సహేతుకములుగా, కొన్ని హేతుదూరములుగా కనపడుచున్నవి. తెనుగువాఙ్మయమున ఇతరకవుల ప్రయోగములలో 'యేమిటికి' అనుశబ్దసంగ్రహరూపమైన 'ఏటికి'

అనునది అర్ధానుస్వారరహితముగనే యున్నది. కాని ఈ వాఙ్మయము నందంతట ఆశబ్దము 'ఏఁటికి' అని సార్ధానుస్వారముగనే కన్పట్టుచున్నది. మూలపదములోని మకారము లోపించుటచే ఆస్థానములో అర్ధబిందువుండుట న్యాయ్యముగనే తోచుచున్నది. మాట, మాటు, మాటికి శబ్దములందు ఈవాఙ్మయము నందచ్చటచ్చట అర్ధానుస్వార ముండుట కొంత విచిత్రమే. కాని మాట శబ్దములో అర్ధానుస్వారము హేతువాదమునకు, పూర్వప్రయోగములు సాక్షిగా తోచుచున్నను, మాటు, మాటికి పదములలో హేతువు కనబడుటలేదు. అట్లే "కడ+కడ=కట్టకడ" అను రూపము 'కట్టఁగడ' గ ఈ వాఙ్మయమునందు కనపడుచున్నది. ఇది తమిళ సంప్రదాయమా యనిపించుచున్నది. 'అంట' (అనుట) కు రూపాంతరమగు 'అఁట' లో 'ఎసఁగు' మొదలగు నిత్యసార్ధానుస్వారములైన రూపములలో అర్ధానుస్వారము లేకుండుటయు నీవాఙ్మయమున విచిత్రమే. 'ఎసఁగు' లో నొక్కొక్కచోట కనపడినను 'అఁట' లో మాత్రము ఇంతవరకు నాదృష్టి కెచ్చటను అరసున్న కనపడలేదు. 'రాఁగు' 'రాఁపు' అని సార్ధానుస్వారము లున్నవి. 'రంగు' రాఁగైతే, 'రంపు' రాఁపైతే పరవాలేదు.

అన్నమాచార్యులు భాషావిషయమున భావకల్పనమున చాలస్వతంత్రుడు. ఆయన ఈపదములను ఏదృష్టితో ప్రయోగించెనో, దానిని పెద్ద తిరుమలాచార్యులవారు ఎంత పరిశీలించి రేకులపై చెక్కించిరో, ఇందు పోగరపనివారి కైవాడ మెంత యున్నదో చెప్పలేము. మనకు లభించిన శాస్త్రములను, మనము చదివిన చదువును ఊతగా చేసికొని ఆయన భాషాపాండిత్యము కొలవలేము. ఇకపై అన్నచామార్య భాషా సారస్వతములను సూటిగా విమర్శింపగల పెద్దలు పై విషయములను సహేతుకముగ నిర్ధరింపగలరు.

ప్రాతకాలపు ప్రాతలలో అరసున్న కానరాదు. అంతటా నిండుసున్నయే. కాని ద్విరుక్తాక్షరములకు ముందున్న నిండుసున్న పూర్ణానుస్వారముగ, అద్విరుక్తములైన హల్లులకు ముందున్న నిండుసున్న అరసున్నగా గుర్తించు సంప్రదాయము గలదు.

## 2. రాగిరేకుల వ్రాతలోని విశేషములు

పైచెప్పినవిధముగనే ఈ రేకులలో అరసున్న నిండుసున్నల వ్రాత నిండియున్నది. కాని కొన్నియక్షరములయందు పలుతావుల ఆ పద్ధతి భేదించియున్నది. ఉదా:- రేకల వ్రాతపద్ధతిప్రకాము, 'ఎంతైనా' 'ఎన్దాఁకా' ఇత్యాదిగా వ్రాయవలసిన స్థలములలో 'ఎంతైనా' 'ఎందాఁకా' అనియు, 'కాంబోోది' అని వ్రాయవలసిన స్థలములలో 'కాంబోది' అనియు 'సుఖంబ్బు' అని వ్రాయవలసిన స్థలములలో 'సుఖంబు' అనియు వ్రాత మాటిమాటికి కనపడుచున్నది. ఇట్టి స్థలములయందు మేము 'ఏఁ (ఎం?) తైనా' ఇత్యాదిగా సూచించుచున్నాము. ఇట్టి వ్రాత అక్కడక్కడ విరివిగానుండుటచే ఈ సూచనలు అచ్చులో కొంతవికారముగ గన్పట్టునని, పదములను సందర్భములను అనుసరించి 'ఎంతైనా' అని వుంటేగూడ సూచనయివ్వకుండ 'ఎంతైనా' ఇత్యాది మామూలుగనే వ్రాయుచున్నాము. కారణము పై తెల్పిన వికారము తొలగించుటయే. అట్లే పెక్కుచోట్ల 'వ్రాయు' టకు, 'వాయు' అనియే రేకులలో కన్పడుచున్నది. దానికిని పైవిధముగ [వా(వ్రా?)] సూచించుచు వచ్చితిమి. ఇదియు ననంతమగుటచే అచ్చులో వికారమును తొలగించుటకై 'వాయు' ను 'వ్రాయు' గనే వ్రాయుచున్నాము. 'భ్రమయుకు'[1] 'భ్రమయు' అనియే పలుతావుల గలదు. బతుకు, బలిమి ఇత్యాదులలో 'బ' ప్రత్యేకముగ కనపడుటచే, 'భ్ర' లో మహాప్రాణ సూచకమగు ఒత్తు లోపించియుండునని 'భ్ర' గనే వ్రాయుచున్నాము. ఎచ్చటైన అర్థముతో సందర్భముతో పెద్దగా సందేహము తోచునపుడు సూచన

---

1. తలకట్టుగ ఐవర్ణ మిప్పు డచ్చులో లేదు.

లిచ్చుట అచ్చులో అంత బాధకము కాదుగాని, చేతిపనివారిపొర పాటుచే అక్కడక్కడ దొరలిన యీ చిన్ని దోసములకు అచ్చులో సూచనలిచ్చుట వ్యర్థ మనిపించినది.

ఇక్కడింకొక విషయముకూడ గమనింపవలసి యున్నది. రేకులలోని పంక్తులకు ముందుగ ఒకపద్ధతి ప్రకారము గీతలు గీచుకొని తగినంత యెడమిచ్చి అక్షరములు చెక్కుతూవచ్చిరి. అందు 'ఎంత్తై' అనుస్థలమున 'తా' వత్తు (ా) 'ఐత్వము' (ై) లకు చాలినంత స్థలము దొరక నప్పుడెల్లా ఈపని చేసిరేమోయని తోచుచున్నది. ఒక 'త్తై' కి ఈహేతువు చెప్పవచ్చుగాని, పైదెలిపిన మిగత వర్ణముల విషయమున నేమి చెప్పుటకూ తోచదు, చేతిపొరపాటుగనే గుర్తింప వలసియున్నది. ఇట్టి ప్రమాదము ఇతర పదములందును గలదు.

ఈ వాఙ్మయపరిష్కరణమున తమ నిండు సహకారములను ఉత్సాహమును చూపుచున్న తి. తి. దేవస్థానము కమిటీ అధ్యక్షులు శ్రీ సి. అన్నారావుగారికి, ఈ వాఙ్మయరాసిక్యమును లోకమునకు నెంతోగొప్పగ అందివ్వవలెనను ఆసతో పనిచేయించుచున్న తి. తి. దేవస్థానముల కార్యనిర్వహణాధికారులు శ్రీ పి. యస్. రాజగోపాల్ రాజు, ఐ. ఏ. యస్., గారికిని నా ధన్యవాదములు. మాకు వలసిన విధముగ ఈ కార్యమున తోడ్పడుచున్న శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాలాధ్యక్షులు డా॥ కె. సేతురామేశ్వరదత్తాగారికి, వెంట వెంటనే ముద్రణమునకు సర్వసంభారములను సమకూర్చుచున్న తి. తి. దే. ప్రెస్ మేనేజరు శ్రీ యమ్. విజయకుమార్ రెడ్డిగారికిని, నా ప్రశంస దప్ప వేరేమీయగలను. నాచేర్పులు కూర్పులన్నింటిని సావధానముగ వీలైనంత నిర్దుష్టముగ ముద్రించుచున్న తి. తి. దే. ప్రెస్ అచ్చుకూర్పరులకు, ఈ పీఠిక వ్రాతలో తగు విధముగ సహకరించిన చిరంజీవి కె. రామచంద్రరాజుకును నామంగళాశాసనములు.

" ఎచ్చునైనను తప్పుండు చేసికైన, ధర్మమే భ్రాంతి పురుషుల ధర్మమగుట" అను తిరుపతి వేంకటకవులమాట ననుసరించి, ఎంత జాగ్రత్తగ పరిశీలించినను మాకనుగప్పి దొరలిన దోషములను సహృదయులు మన్నించి తెల్పినచో పైపై సంపుటములలో మరింత జాగ్రత్తపడగలమని మనవి.

సంగీతే సాహిత్యే చాంగీకారాయ శారదా ముద్రామ్ ।
యస్య నిరీక్షేత స్వయ మభివందే రాళ్లపల్లికులమందారమ్ ॥

తిరుపతి
27–11–77

బుధవిధేయుడు,
శ్రీ గౌరిపెద్ది రామసుబ్బశర్మ.
(తాళ్లపాక వాఙ్మయ పరిశోధకుడు)
ఆంధ్రశాఖాధ్యక్షుడు,
శ్రీ వేంకటేశ్వర ప్రాచ్యకళాశాల.

# సందిగ్ధపదసమీక్ష

[తాళ్లపాకకవులవాఙ్మయములో అపూర్వపదరాశి గొప్పది. దానినిగూర్చి విస్తారముగ పరిశ్రమ సాగవలసియున్నది. దాని కుపస్కారకముగ నిఘంటువుల కెక్కనివీ, ఎక్కినా అర్థాంతరమున ప్రయోగింపబడినవీ, ఇతర ప్రయోగములందు కానరానివీ, మాత్రమే యీ సమీక్షలో లఘువుగ చర్చింపబడునవి. ఈ చర్చలో నాది సూచనమాత్రమే. పైపై పెద్దలు పరామర్శింపగలరు. ఈ సంపుటమునుండి ఈ సమీక్ష కడపటగాక పీఠికానంతరము చేర్పబడుచున్నది.]

1. అఁడుఁబోడి (517 పాట). 'అఁడుఁబోఁడిమి' లో సామాసికముగ 'మి' లోపించి యేర్పడిన రూపము కావచ్చు. ఈ పద్ధతి ఈ వాఙ్మయమున అక్కడక్కడ కానవచ్చుచున్నది. చూ:- "మఱి యాఁడుఁబోడెడ్డెడు మగపోడిమా నేఁడు" 22 వ సంపుటము 456 పాట. అక్కడ "దీనియర్థము విచార్యము" అని వ్రాసియుంటిని. పరిశీలింపగా 'అఁడువారిపద్ధతి, అఁడుఁదనము' అని అర్థముగా తోచుచున్నది.

2. ఉంగిటి (149 పాట) ఉంగిడి = 'ఊపిరియాడనిస్థితి' అని వా. ని. ఆ 'ఉఁగిడియే ఉంగిటి' అయి యుండవచ్చు. ఉంగిడికి ఛాయార్థముగా 'మీదమీద' 'యెడతెరపిలేక' 'దండి' ఇత్యాద్యర్థములలో ప్రయోగించినట్లున్నది.

3. ఒలినిలయా (414 పాట) ఒలి = 'శబ్దము' అని తమిళము. అదే మన 'ఉలివు' కావచ్చు. ఒలిశబ్దార్థమునకు ఛాయగా శ్రుతి (వేదము) అని అర్థమైనచో, వేదాధారా అని అర్థము కావచ్చు.

4. కడమదొడమలు = (181 పాట) ఇది జంటపదముగా తోచుచున్నది. ఈనాటివ్యవహారములో కానవచ్చుటలేదు. 'మిగిలింది,

ఁగిలింపె', 'వచ్చ్రింది, పోయింది' ఇత్యాద్యర్థములలో వాడినట్లు తోఁచుచున్నది. 'మిగిలినది' అను నర్థమున కడమశబ్ద మీనాటికిని వ్యవహారములో గలదు.

5. కలుపడఁజేసితి (481 పాట) ఇది నిఘంటువుల కానరాదు. ప్రకరణమునుబట్టి 'నివ్వెరపడునట్లు,' 'ప్రమాన్పడునట్లు,' కలవర పడునట్లు,' చేసితివి ఇత్యాదిగ నూహింపవచ్చు.

6. కొండల మొయిలు మేసినట్లు (559 పాట) కొండల మొయిలు మేయుట అను పలుకుబడి యీనాటికినిగలదు. దండిగ మబ్బులు కొండలపై పారాడు చుండినచో, అదిచూచి గ్రామీణులు 'కొండ మొగిలి మేస్తావుంది వానకు బలమబ్బా' అంటూరు. ఆయర్థము-లోనే యీ పలుకుబడి నిచట మాండలికముగ ప్రయోగించి నట్లున్నది.

7. గురుమ (449 పాట) 'కురుమై' Lustre, Brightness, Superiority. అని తమిళము. అదియే ఇది కావచ్చు. 'పెద్దరికము, మహిమ' ఇత్యాది అర్థములు-డవచ్చు. ఈ పదప్రయోగము మరియొకచోట చూ:- 517 పాట. 'గరిమ' శబ్దవికారమైన కావచ్చు.

8. గొల్లము జులు (505 పాట) ముంజు = 'మెదుక' అని వా. ని. ఆ అర్థ మిక్కడ సరిపడనట్లు తోఁచుచున్నది. ప్రకరణమును బట్టి 'ముఁజులు=నుచ్చులు' గా తోఁచుచున్నది. మేకల గొర్రెల-పెంటలు బురదగ తడిపి, దానిని చిన్నపేలికలకు అంటించి, మేకపిల్లలు, గొర్రెపిల్లలు తల్లులదగ్గర పాలు త్రాగకుండుటకై వాటిరొమ్ములకు చుట్టుచుందురు. వాటినే 'నుచ్చు' లని మాండ-లికముగ వ్యవహరింతురు. ఆశబ్దము ఇక్కడ 'అసహ్యము' అను ఛాయార్థమున ప్రయోగించినట్లున్నది.

9. చేపట్టు గుంచమవు (పాట 201) 'చేతికిలోనైన కొల-పాత్రము' అనునర్థమున వాడినట్లున్నది. 'పరాధీనుడు' చాయార్థము కావచ్చు.

10. చేలాగు (14 పాట) 'చేయూత' అను నర్థమున వాడి-నట్లున్నది. చేయిచ్చి లాగుకొనుటయు కావచ్చు.

11. తిరువుమొరువు (12 పాట) 'తికమక' అనునర్థమున వాడి-నట్లున్నది. ఈ యర్థమున శకటరేఫతో నీజంటపదము తమిళ-నిఘంటువున గలదు.

12. తీసిపెట్టుగానితమిన్ (96 పాట) 'తీయుటకు పెట్టుటకు వలనుపడని, లేదా తొలగించుటకు సాధ్యపడని' అను నర్థమున నీధాతుజవిశేషణములు క్త్వా. తముతోకూర్చి ప్రయోగించి-నట్లున్నది.

13. నిజపట్టేవు (48 పాట) 'భయము + పడు = భయపడువలె, నిజము + పట్టు = నిజపట్టు' వాడినట్లున్నది. ఇది అపురూపమే.

14. నిట్టి పిడిమేఁదాన (పాట 435) నిఘంటువుల కానరాదు. ప్రకరణమునుబట్టి, 'నిలువైనపిడివంటి శరీరముగలదానను' అని తోచుచున్నది. 'సౌందర్యము లేకుండుట' గీ లో అభివ్యక్త-మగునేమో ?

15. బగివాయ కాపెమీఁది <u>పరాకున</u> నున్నవేళ (189 పాట) ఇక్కడ పరాకు శబ్దము, 'పరవశము - మగ్నత' అను నర్థమున సరిపోవుచున్నది. పరాఙ్ముఖ శబ్దభవము గదా ఇది. పై తెల్పిన యర్థముతోనే 'విస్మరణంబైనది మాటలపరాకుచే ననుచు' కళా 3-81. దీనినే వా. ని కూడ నుదాహరించినది.

16. పేనిపట్టుక (186 పాట) అక్కడక్కడ 'పానిపట్టి' అని కానవచ్చు-దాని కిదియే మూలరూపమా అనిపించుచున్నది. ఈ 'పానిపట్టి'

'పనిపట్టి' అనుదాని వ్యావహారికరూపము కావచ్చునని. 22వ సంపుటము సందిగ్ధ పదసమీక్షలో 30 వదిగ నిచ్చియున్నాను. పరిశీలించగ పేనిపట్టి లేక పూనిపట్టి అనువానివికారముగ తోచుచున్నది.

17. చేసేటి బత్తి (265 పాట) భక్తిశబ్దభవమైనయీబత్తి, ఈ వాఙ్మయములో, స్త్రీపురుషు లొకరొకరిపై చూపెడి 'ప్రేమ' కు పర్యాయముగ చాలచోట్ల గలదు. పై యర్థములోనే యెక్కువగ నుండుట గమనింపదగినవిషయము.

18. మోమోము (437 పాట) మోము+మోము=మోమోము అని విచిత్రమైన ఆమ్రేడితసంధి. ప్రతివారిముఖము అనియే కాక, ఒకరిముఖము నింకొకరుచూచుట, (మొగము మొగము చూచుకొంటే) అను నర్థముగూడ సరిపోవుచున్నది.

19. లాగవేగాలు (234 పాట) 'లాఘవ' శబ్దభవము 'లాగ' కాగా, 'సుళువుగ వేగముగ' అని యీజంటపదముల కర్థము కావచ్చు, వేగమునకు లాఘవము కారణమూ కావచ్చు. అప్పుడు ద్వంద్వము పొసగదు.

20. సంతము (197 పాట) శాంతశబ్దభవముగా తోచుచున్నది. అర్థము అదే. తద్భవించుటలో అన్నమయ్య స్వతంత్రుడు.

21. వెఱంజరో (534 పాట) వెరంజు ధాతువేనా? శకటరేఫము చింత్యము. అర్ధానుస్వారమును బట్టి పై 'వెరంజు' గనే భావింపవచ్చు.

N. B. కొన్నిశబ్దములకు వివరణము పాదదీపిక (Foot-Note) లోనే ఇచ్చియుండుటచే ఈ సమీక్షలో శబ్దసంఖ్య తగ్గినది. ఇకపై సంపుటములలో గూడ; పాదదీపికనే యీవివరణమున కెక్కువగ నుపయోగింపదలచితిని.



'పదకవితా పితామహుడు'

శ్రీ తాళ్లపాక అన్నమాచార్యులు

శ్రీరస్తు

శ్రీ తాళ్లపాక

# అన్నమాచార్యుల శృంగార సంకీర్తనలు

25 వ సంపుటము

స్వస్తిశ్రీ జయాభ్యుదయ శాలివాహన శకవరుషంబులు ౧౩౪౬ అగు నేఁటిక్రోధి సంవత్సరమందు తాళ్లపాక అన్నమాచార్యులు అవతరించిన పదారు యేండ్లకు తిరువేంగళనాథుండు ప్రత్యక్షమైతేను అది మొదలుగాను శాలివాహన శకవరుషంబులు ౧౪౨౪ అగు నేఁటి దుందుభిసంవత్సర ఫాల్గుణబహుళ ౧౨ నిరుధానకు[1] తిరువేంగళనాథుని మీఁదను అంకితముగాను తాళ్లపాక అన్నమాచార్యులు విన్నపముచేసిన శృంగార సంకీర్తనలు.

రేకు 901 దేసాళం

అందకు రావయ్యా అన్నియుఁ దెలిసెను
నిండి నొసలిలత్తుక నీరువలె నున్నది ॥ పల్లవి ॥

ముసుఁగు వెట్టుకొని మూల నేమిసేసేవు
నుసరానఁ బెదవులు చూపవయ్యా
యెసఁగి రెప్పలమీఁది కేలవచ్చెఁ దమ్మలము
కొసరితేను చెక్కుటగోరువలె నున్నది ॥ అంద ॥

---

(1) ఈశబ్దము 'విరోధ' 'నిరుద్ధ' శబ్దములకు వ్యావహారిక రూపముగా కానవచ్చుచున్నది. అడ్డగింపు, అవధి అని యర్థము. ఆనాడు కతపటిదినమని తాత్పర్యము. కీ॥ శే॥ ప్రభాకరశాస్త్రిగారూహించిన 'సరియగు' అను నర్థము తాత్పర్యార్థము కావచ్చును. 'అవధి' అను నర్థములో, "ఈ విరుద్ధమునకుఁ గుశలంబు మాకు" అను తరిగొండ–వెంగమాంబగారి ప్రయోగము 'విష్ణుపారిజాతము' 55 వ పుట–సాహిత్య అకాడమీవారిది దీనికి సహాయపడుచున్నది. నేనీప్రయోగ మివ్వగా శ్రీమాన్ రాళ్ళపల్లి–అనంతకృష్ణశర్మగారు, 'విఱుత్తం' అను అరవపదము గూడ 'విడుపు' అను నర్థముతో దీనికి సహాయపడు ననిరి.

క్రీగీతగల స్థలము చెదలు దినుటచే దుంక పడియున్నది.

కాయమెల్లాఁ గప్పుకొని కడులోన నున్నాఁడవు
సోయగపునీవురము చూపవయ్యా
చాయలకెంపు లెడవిసరీ బాహుమూలముల
నీయందుఁ గళలు నేఁడు నెలకొన్నట్లున్నవి ॥ అంద ॥

తెరవేసు కేలితి పొద్దిక నలమేల్మంగను
సొరిది నీనెమ్మొగము చూపవయ్యా
ఇరవై నన్ను శ్రీవేంకటేశుఁడ యేలితివి
వెరవుతో నీపుక్కిట విడె మున్నట్లున్నది ॥ అంద ॥ 1

మాళవి

ఇయ్యకొంటి నిఁక నీయిచ్చాయను
కొయ్యతనాలదానవా కొసరితిఁ గాక ॥ పల్లవి ॥

యెనయక నీతోసు యెదురాదేదానవా
అనవల శొకమాట ఆడితిఁ గాక
పెనఁగుచు నీతోను బిగిసేటిదానవా
చనవుమెఱసి కొంతజంకించితిఁ గాక ॥ ఇయ్య ॥

యెదచొచ్చి నీపట్టుకు నెగసక్కెపువానవా
నడుమ నూరకే నీతో నవ్వితిఁ గాక
జడిగొని నిన్ను మీఁకి సాదించేదానవా
వుడివోఁచచన్నుల నొత్తితిఁ గాక ॥ ఇయ్య ॥

సొరిది గబ్బితనము చూపేటిదానవా
కెరలి కాఁగిటను బిగించితిఁ గాక
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
జరగేదానవా మోవి చవిగొంటిఁ గాక ॥ ఇయ్య ॥ 2

సాళంగనాట

తొలుత నెఱఁగవా తొయ్యలిలాగు
బలిమి చూపఁగనేల పంతమియ్యనేల ॥ పల్లవి ॥

వాడివట్టి తీసి నీవు వాడఁబరచఁగ నిసె
కొడిమెలు నిన్ను నెంచి కొసరీనాపె
అదరి యప్పటి నీవు అవుఁగాము లాడుకోఁగా
బెడిదపుఁబెదవులు పిప్పిగట్టీ నిదివో ॥ తొలు ॥

కక్కసించి పెనఁగుచు కాఁగిలించి వేఁడుకోఁగా
చక్కఁ గిందవేసుకొని జరసీ నాపె
వెక్కసమై నీ వందుకు వినయాలు సేయఁగాను
పక్కన నీసేఁతలెల్లాఁ బచ్చిదేరీ నిదివో ॥ తొలు ॥

శ్రీ వేంకటేశుఁడ యిట్టె చేరి నీవు గూడఁగాను
భావించి నీవురముపై నెక్కీ నాపె
వేవేగ నిప్పుడే నీవు విడెము చేతి కియ్యఁగా
చేవదేరి నీవలపు చిమ్మిరేఁగె నిదివో ॥ తొలు ॥ 3

దేవగాంధారి

దేవరగుణములు దెలియవు
నీవే మాకును నేరుపవయ్యా ॥ పల్లవి ॥

వదలక నీతో వాసికిఁ బెనఁగిన
యెదుటనె నీమన సెట్టుండునో
కదిసి నీరతికిఁ గడుదమకించిన
యిది వేసాలని యెంతువో నీవు ॥ దేవ ॥

చెనకఁగ నీయెడ సిగ్గులు నెరపిన
పనులవి యేమని భావింతువో
ననిచి నీయెదుట నవ్వులు నవ్విన
తనివిలేనిదని తగ నాడుదువో ॥ దేవ ॥

కూడుచు నిన్నిటు గుబ్బల నొత్తిన
వోడ దనుచు గో రూఁదుదువో
యీడనె శ్రీవేంకటేశ యేలితివి
వీడె మిచ్చితే వెరగందుదువో ॥ దేవ ॥ 4

కన్నడగౌళ

నేసతోఁ బెండ్లాడితివి చెల్లుబడి కాకపోదు
గాసిఁ బెట్ట కిట్టె నన్నుఁ గరుణించరాదా ॥ పల్లవి ॥

చెన్నుమీర చిత్తము రా సేవలు సేయకుండితే
నన్ను నీవప్పుడు మరి నగరాదా
వన్నెల నిన్నిట్టె కైవసము సేసుకుంటే
మిన్నక నీ పంతము లు మెరయరాదా ॥ నేస ॥

ఆయము లంటుచు నిన్ను నాసకొలుపకుండితే
పాయపుమదాన నన్నే పలుకరాదా
చాయల నే నీమోవి చవులుగొనకుండితే
సోయగపుబి(వి?)న్నాణానఁ జూడఁగరాదా ॥ నేస ॥

చేవమీరినరతుల సిగ్గులు రేఁచకుండితే
నీవాసు లిన్నియును నెరపరాదా
శ్రీవేంకటేశ్వర యిట్టె చేకొని కూడితివి
యీ వేడుకలు గలిగె నిఁక మెచ్చరాదా ॥ నేస ॥ 5

మంగళకౌశిక

ఎటువంటివాఁడవయ్యా యిచ్చకము సేయఁగాను
సటలంటా బొమ్మలను జంకింతురా ॥ పల్లవి ॥

వూరకే నీపాదములు వొత్తుచుఁ బిసుకఁగాను
గోరుదాఁకెనంటా యేల కొచ్చి చూచేవు
చేరిపూడిగాలు గడుఁ జేసితే మెచ్చుఁగాక
నేరుపు నేరము లెంచి నిందవేతురా ॥ ఎటు ॥

కన్నగన్నచోటనెల్లా గందము నీకుఁ బూయఁగా
చన్నులు నాటెనంటా సాదించేవు
వున్నతి బత్తిసేసితే నొడఁబడుదురుగాక
సన్నలఁ దప్పులుమోపి చండిసేతురా ॥ ఎటు ॥

మొల్లమిరతుల నిన్ను మోవి యాని కూడఁగాను
పల్లు సోఁకెనంటా నాతోఁ బంతమాడేవు
యిల్లిదె (శ్రీ) వేంకటేశ ఇందుకె నవ్వుట గాక
కొల్లగా సిగ్గువరచి కొసరుదురా ॥ ఎటు ॥ 6

రేకు 902 దేశాక్షి

ఏమనేమయ్యా నీవు యేలికవు మాకునెల్లా
ఆమనిగా మోవి చూపి యాసరేఁచేవు ॥ పల్లవి ॥

ఇచ్చకములే సేసి యెలయించి యెలయించి
పచ్చిదేర నింతులను భ్రమయించేవు
ముచ్చటలాడి కడుమోహములు పైఁజల్లి
మెచ్చులుగా వలపించి మేకులుసేసేవు ॥ ఏమ ॥

---

(శ్రీగీతగలది చిలుము దిని దుంకపడిన స్థలము.

సందడిఁ జేతులు చాఁచి జవ్వనము లంటియంటి
మందపెండ్లికూఁతులను మరిగించేవు
విందులవీడెము లిచ్చి వేసాలు గతునెరపి
యిందులోనే యేకతాన యెమ్మెల మించేవు ॥ ఏమ ॥

నమ్మిక లెన్నైనా నిచ్చి నగవులు పచరించి
మమ్ము నిందరినిఁ గూడి మన్నించేవు
నెమ్మది శ్రీవేంకటేశ నేరుపులు పచరించి
నిమ్మపండు చేతికిచ్చి నీటులు చూపేవు ॥ ఏమ ॥ 7

తెలుఁగుఁగాంబోది

దయఁజూడవయా తతిగొని మొక్కేము
ప్రియురాండ్లము నినుఁ బెండ్లాడితిమి ॥ పల్లవి ॥

చలములు నీతో సాదించేమా
వలచినవారము వనితలము
బలుములు నీతోఁ బచరించేమా
కొలిచినవారము గోలలము ॥ దయఁ ॥

పెనఁగుచు నీతో బిగిసేమా నీ-
నునుపులవారము నాతులము
పనివడి నేరమి పైవేసేమా
చనవరివారము సాదులము ॥ దయఁ ॥

యీవేళఁ గూడితి మెలయించేమా
దేవుళ్లము నీతెలవలము
శ్రీవేంకటేశ్వర చెలఁగి నగేమా
బూవపువారము భోగులము ॥ దయఁ ॥ 8

## శుద్ధవసంతం

జంకించితనేవు నన్ను సాదవా నీవు
సంకించ వేమిటికి సాదవా నీవు ॥ పల్లవి ॥

దూరి కొపకత్తెనంటా తొయ్యలుల కందరికి
సారె సారెఁ జెప్పేవు సాదవా నీవు
వూరకే మాటలాడుతా నొద్దఁ గూచుండి నా కిట్టె
సారపుబుద్ది చెప్పేవు సాదవా నీవు ॥ జంకిం ॥

గొరబుగా నావలపు కొల్లున నవ్వుతా నీవు
సరవితోఁ గేరేవు సాదవా నీవు
తెరవేసి యానవెట్టి దిమ్మరిసేఁతలు చేసి
సరుగఁ జెక్కునొక్కేవు సాదవా నీవు ॥ జంకిం ॥

కలికినాకుచములు కాఁగిటను బిగియించి
చలపట్టి కూడితివి సాదవా సీవు
అలరి శ్రీవేంకటేశ: అదరపుతేనె లిచ్చి
చలివాసితివి సిగ్గు సాదవా నీవు ॥ జంకిం ॥ 9

## కేదారగౌళ

వింటిమి యీకొత్తలు వీనులు చల్లఁగాను
జంటలై నీపై వలపు చల్లెనట చెలియ ॥ పల్లవి ॥

వేడుకలు వెదచల్లి వీడెము పుక్కిటఁ బెట్టి
ఆడరానిమాట లాపె ఆడెనట
కోడెకాఁడవై నీవు కొండగాడ(డు?) గెత్తఁగాను
నీడనుండే చెమటలు నించెనట చెలియ ॥ వింటి ॥

చిప్పిల నవ్వులు నవ్వి చేతులు బుజాల వేసి
 చెప్పరానిసేఁత లాపె చేసెనట
గొప్పలుగా నీవు పిల్లఁగోవి రాగా లొత్తఁగాను
 దెప్పరాన నలపెల్లాఁ దేరెనట చెలియ ॥ వింటి ॥

చాయలు సన్నలు చూపి చన్ను లురమున నాని
 సేయరానిసేవ లాపె చేకొనెనట
యీయెడ శ్రీవేంకటేశ ఇటు నన్నుఁగూడితివి
 మోయరానిచోటు మోపి మొక్కెనట చెలియ ॥ వింటి ॥ 10

ఆహిరి

ఎప్పుడు మన్నించేవయ్య ఇఁక నీవు
 వుప్పతిల్లువేడుకెల్లా వొడిఁగట్టుకొన్నది ॥ పల్లవి ॥

జవ్వనమదముతోడ చన్నులవేఁకముతోడ
 నివ్వెరగుపడి చెలి నిలుచున్నది
నవ్వులు సెలవిఁగార నయము మోమున మీర
 వువ్విళ్లూరుచు నీపై నొరగుకొనున్నది ॥ ఎప్పు ॥

సిగ్గులనే విఱ్ఱవీఁగి చిప్పిలఁగ మోవి మాఁగి
 వొగ్గి విడె మందుకొని వూరకున్నది
నిగ్గుఁబులక లెసఁగ నిట్టూర్పులు వొసఁగ
 కగ్గుదేర నేకతానఁ గాఁగిలించుకొన్నది ॥ ఎప్పు ॥

పెనుఁగొప్పు కడుపీడ ప్రియాలు మాటలఁగూడ
 గునియుచు నీతొడపైఁ గూచున్నది
యెనసితివి శ్రీవేంకటేశ యీకెనుమన్నించి
 ననుపుల నిన్ను నిట్టె నమ్మివున్నది ॥ ఎప్పు ॥ 11

సాళంగం

ఏమయ్య యింతయేల యెకసక్కెలు
సామసేసిననీతో సతి పెనఁగీనా ॥ పల్లవి ॥

పలచనినగవులపగిడికాఁడవు
వెలలేనివేడుకలవేసదారివి
మలకలపలుకులమతకరివాఁడవు
కలికి నీకు నేఁడు కత చెప్పఁగలదా ॥ ఏమ ॥

తిరువు మురువు సేసేదిమ్మరీఁడవు
పరుగుపెక్కువిద్యలబయకాఁడవు
అరుదైనజూదాలఆగడీఁడవు
గరిమ నీకు నింతి కత చెప్పఁగలదా ॥ ఏమ ॥

సంతకూటముల జాణకాఁడవు
మంతనపురతులమాసటీఁడవు
చెంతఁ గలసితివి శ్రీవేంకటేశ్వర
కాంత నీకు నిట్టె కత చెప్పఁగలదా ॥ ఏమ ॥ 12

రేకు 903 లలిత

[1]కానీవే గొల్లెతా గబ్బిగొల్లెతా
అనుక తెలుసుకొంటి వవునవురా గొల్లఁడా ॥ పల్లవి ॥

పంతకారిగొల్లెతా పదరకు గొల్లెతా
రంతుల నట్టెకానీరా గొల్లఁడా
యింతగట్టు(ట్టి?)వాయవౌత యెరిఁగితినే నేను
సంతలోనె వింటిరా నీసాదుఁదనాలెల్లను ॥ కానీ ॥

---

1. ఇది వాకోవాక్యము.

మతకారిగొల్లెతా మంకులాఁడిగొల్లెతా
రతులకు మాయింటికి రారా గొల్లఁడా
కతకారివౌర ఇట్టె కానవచ్చెనే నేఁడు
చతురతలు మోమున జడిసేరా నీకును ॥ కానీ ॥

చనవరిగొల్లెతా చనవిమ్మా గొల్లెతా
కెలయకు శ్రీ వేంకటగిరిగొల్లఁడా
పొలఁతు లందరు నేఁడు పొగడేరే నిన్నును
కలపితి వౌర నిన్ను కమ్మటి మెచ్చితిని ॥ కానీ ॥ 13

## హిజ్జిజి

విన వేడుకయ్యీ మాకు వింతలైనమీసుద్దులు
యెనలేనిముచ్చటలు యెటువంటివో ॥ పల్లవి ॥

యెంగిలిపెదవి వంచి ఇందాఁకా నీ చేతిలోన—
నంగవించి మాటలాడె నది యెవ్వతో
పొంగుచు నీమేన నిట్టె పులకలు గడునిండె
సంగతి న వెటువంటిసంతోసములో ॥ విన ॥

చెమటచన్నులు దాఁక చేలాగు నీకు నిచ్చి
అమర లోనికిఁ దెచ్చె నది యెవ్వతో
తమితోఁ గళలు రేఁగి తతి నివ్వెరగైతివి
సమమైన వెటువంటిసంగడిపొందులో ॥ విన ॥

జవ్వనమదము గార సదమదముగ నిన్ను
అవ్వలఁ గాఁగిటఁ గూడె నది యెవ్వతో
ఇవ్వల శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
వువ్విళ్లూర నెటువంటి వుపాయములో ॥ విన ॥ 14

వరాళి

ఏఁటికి సత్యాలు సేసే వెందాఁకా నీవు
  గాఁటముగ నింకాఁ దాపకాణించవలెనా ॥ పల్లవి ॥

చెలియిచ్చినపువ్వులచెండు నీచేత నున్నది
  మలసి నీచేఁత కది మచ్చము గాదా
  కొలఁదిమీరఁగ తొల్లె గొల్లెతల మగఁడవు
  యెలమి నీయెడ్డతనా లెంచిచూపవలెనా ॥ ఏఁటి ॥

రమణిచేముద్దుటుంగరము నీవేల నున్నది
  కొమరై నీపొందు కది గురుతుగాదా
  తమితోడ నీవు తొల్లె ధర్మరాజు మఱఁదివి
  గములై నీ నిజాలకు కడగురు తున్నదా ॥ ఏఁటి ॥

అంగనకంటసరి నేఁడట్టె మెడ నున్నది
  సంగతిగా నీకదె లాంచనము గాదా
  చెంగట నన్నేలితివి శ్రీ వేంకటేశ్వర
  అంగపునీరతులకు నొఁగాము లున్నవా ॥ ఏఁటి ॥ 15

శ్రీరాగం

అంతలోనె తేరెనా ఆకెమనసు
  పొంతనుండి యింకానేమి బుజ్జగించేవయ్యా ॥ పల్లవి ॥

నెలవి నవ్వులతోడ చెలియ మాటాడఁగాను
  వెలయఁ బూబంతిఁ గొని వేసితివి
  నిలువుఁదురుము దాఁకె నిన్ను నాకె చూడఁగాను
  చెలరేఁగి యేమిటికిఁ జెక్కు నొక్కేవయ్యా ॥ అంత ॥

కొసరుఁజూపులతోడ కోమలి నీకు మొక్కఁగా
పొసఁగఁ బన్నీరు దిగఁబోసితివి
వెసఁ బయ్యద దడిసి వేడుక యానవెట్టఁగా
విసువక ఇప్పుడేమి విడెమిచ్చేవయ్యా ॥ అంత ॥

సిగ్గులచేఁతలతోడ చెలి కాఁగిలించుకోఁగా
వొగ్గి గందవొడి చల్లి వొనరితివి
నిగ్గుల శ్రీవేంకటేశ నిన్ను నాకె మెచ్చఁగాను
అగ్గమై యప్పటి నెంత ఆససేసేవయ్యా ॥ అంత ॥ 16

ముఖారి

నీవలెనుఁ గొసరఁగ నేరుతుమా
సేవలు చేసి నిన్నుఁ జేకొందుఁ గాక ॥ పల్లవి ॥

వెలలేనివలపులవేడుకకాఁడవు
చలమరిచేఁతలజాజరకాఁడవు
పలుకులఁ గరిగించేబయకారివాఁడవు
నిలువుఁజక్కఁదనాలనీటుకాఁడవు ॥ నీవ ॥

తచ్చనతరితీపులతగవరివాఁడవు
[1] పచ్చలాయకట్టేలాబపువాఁడవు
లచ్చిగొండితనములలాగవేగకాఁడవు
విచ్చనవిడి తగులువిరికాఁడవు ॥ నీవ ॥

చొప్పులెత్తి సోదించేసుంకరివాఁడవు
కుప్పళించి పొందుసేసేకోడెకాఁడవు
ఇప్పుడె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
తొప్పఁదోగేరతులకు దొమ్మికాఁడవు ॥ నీవ ॥ 17

---

1. పచ్చలు + ఆయకట్టే. పచ్చలు = నాట్యములు (రూకలు), ఆయకట్టు = ఆదాయము వచ్చునట్లుసాగుచేయు (పండించు).

శంకరాభరణం

అలివేణిని( బెండ్లాడవయా
చెలులవిన్నపము చేకొనవయ్యా ॥ పల్లవి ॥

సొలపుల( దొలితొలి చూచినచూపులు
కొల(దిమీర నుంకువలాయ
చెల(గి చేతులను నేసినసన్నలు
తల(ప(గ నలుగడ( దల(బాలాయ ॥ అలి ॥

ననుపున సెలవుల నవ్వినవవ్వులు
గొనకొన(గ( బాలకూళ్ళాయ
అనువుగ ప్రియమున నాడినమాటలు
మనసిజతంత్రపుమంత్రములాయ ॥ అలి ॥

వేడుకకా(గిటివినయపుసే(తలు
కూడినకూటపుగురులాయ
యీడనె శ్రీ వేంకటేశ యేలితివి
తోడలమేల్మంగ దోమట్లాయ ॥ అలి ॥ 18

రేకు 904 వేళావళి

ఏమిటికి( ఐలము యెందా(కా
నాములతోడుత నగవే యి(కను ॥ పల్లవి ॥

బలుము లేమిటికి( బచరించేవే
వలచినదానవు వనితవు
సొలయచు రమణుని సోదింతురటే
అలరి ఇచ్చకములాడుట గాక ॥ ఏమి ॥

తగవులఁ బెట్టఁగ తెగునటవే యిఁక
మగనితోడ పలుమరు నిపుడు
అగడుసేతురా ఆతని నింతేసి
చిగురుమోవి పొసఁగి చెలఁగుటగాక ॥ ఏమి ॥

కూడినవేళను గుట్టుసేతురా
యీడనె శ్రీ వేంకటేశునెడ
ఆడకు వెంగెము లలమేల్మంగవు
వీడెము లందుక వెలయుటగాక ॥ ఏమి ॥ 19

రామక్రియ

అవునయ్య నీసుద్దు లటువంటివి
జవళితో నంటుబచ్చలివంటివాఁడవు ॥ పల్లవి ॥

చెలరేఁగి యేడలేని చేఁతలెల్లాఁ జేసివచ్చి
వెలయ నిప్పుడు నన్ను వేఁడుకొనేవు
పలుమారు నీచేత బాసలుగొన వెరతు
కలువకంటులయెడ కాతరీఁడ వనుచు ॥ అవు ॥

వాడవారిపైనెల్లా వలపులు చల్లి వచ్చి
యీడ నాతో నేడలేని యిచ్చలాడేవు
కోడెకాఁడ నీవోజ కొనియాడ సిబ్బితయ్యీ
జాడతో నింతులయెడ చంచలుఁడ వనుచు ॥ అవు ॥

పెక్కుగోపికలనెల్లాఁ బెండ్లాడి యిట వచ్చి
గక్కన నాకాఁగిటఁ గలసితివి
నిక్కి శ్రీ వేంకటేశుఁడ నే నలమేల్మంగను
కక్కసించ నోప నీవు గబ్బివాఁడ వనుచు ॥ అవు ॥ 20

### గౌళ

చెలులాల చూడరే చెలువునిబాగులెల్లా
నిలువుఁజక్కఁదనాల నిలుచున్నాఁ డీడను ॥ పల్లవి ॥

ఇయ్యఁగదే విడెము యిందాఁకా నేడ నుండెనే
నెయ్యపురమణుఁడంటా నే నుంటిని
పయ్య దంటవచ్చీని పలుమారు నన్నుఁ జూచి
కొయ్యతనాలు నేరిచె గొంకఁ డేమిటికిని ॥ చెలు ॥

అడుగవే సుద్దులు ఆడ నుండి తా వచ్చె
నడుమఁ దనప్రియాలు నమ్మితిని
వాడివట్టి పెనఁగీని వానరి సంతోసాన
గడుసాయఁ జేఁతలను కరఁగఁ డెంతయినా ॥ చెలు ॥

మొక్కవే నామారు మించి నన్నిటు గూడె
యిక్కడ శ్రీ వేంకటేశు కిరవైతిని
అక్కరతో మన్నించీని అలమేలుమంగ నేను
తక్కక రతుల మించీ దంట తనమునను ॥ చెలు ॥ 21

### దేసాళం

ఇందరు నెఱిఁగినవే యీసుద్దులు
యెందాఁకా వట్టిమాయ లేమిసేసే నిపుడు ॥ పల్లవి ॥

తప్పులుదారులు నన్ని తానె తేరీఁగాని
చెప్పరాదా నీమాట చేరి వినేను
అప్పట నుండియు నీవు ఆఇత్తపదే విట్టె
నెప్పున నీనిజములు నెరపేవు సారెకు ॥ ఇంద ॥

ఈ క్రీగీతలుగల స్థలముల చిలుమెక్కువగ నున్నది. కొన్ని యక్షరము లరిగి యున్నవి.

తీపులుఁగారాలు నిట్టె తేటతెల్లమయ్యీఁ గాని
చూపరాదా నీమోవి చూచే నేను
పైపై నే మలసేవు పంతగారితనమున
వోపికఁ జెలుల నేమి నొడఁబరచేవు ॥ఇంద॥

పాడియునుఁ బంతమును బాయిటఁబడీఁ గాని
కూడరాదా నీవు నన్నుఁ గోరి మెచ్చేను
వేడుక నేలితివి శ్రీ వేంకటేశ ఇంతలోనే
యీడ నే నలమేల్మంగను ఇంపు నాకుఁ జేసేవు ॥ఇంద॥ 22

పాడి

బొంకనితప్పనియట్టి పురుషుఁడవు
మంకుదీర నీవెట్లా మాటలాడేవయ్యా ॥పల్లవి॥

చనవుచేసుక ఇంతి సారె సారె సొలయఁగా
ననుపుచేసుక నీవు నవ్వఁగాను
మొనసి సవతులెల్లా మోములు చూచుకొనేరు
పొనుగక వారినెట్టు బుజ్జగించేవయ్యా ॥బొంక॥

ప్రియము గూరిచి యాపె బెట్టియాన వెట్టఁగాను
క్రియగూడ నీవు నట్టె కెలయఁగాను
కయిపుగాఁ దోడివారు కనుసన్నలఁ జూపేరు
నయమున వారి నెట్టు నమ్మించేవయ్యా ॥బొంక॥

మక్కువ నిన్నలమేలుమంగ గాఁగిలించఁగాను
నిక్కి శ్రీ వేంకటేశుఁడ నీవు మెచ్చఁగా
తక్కినసతులెల్లా[1] నాసగించేరు
అక్కరతో వారినెట్టు ఆదరించేవయ్యా ॥బొంక॥ 23

1 'ఆసించు' సహజము. 'మోసగించు' వలెనా?
క్రీగీతలు గల స్థలముల చిలుమెక్కువగ నున్నది.

మధ్యమావతి

ఎటువంటివలపో యెవ్వరికొలఁది గాదు
ఘటనతోఁ దమకించీఁ గనుఁగొనవయ్యా ॥ పల్లవి ॥

తళుకున నిన్నుఁ జూచి తలవంచుకొని యింతి
తలపోసీ నీరూపు తనలోననె
నిలువుఁజెమటతోడ నిట్టూరుపులతోడ
చెలరేఁగి గుబ్బతిలీఁ జిత్తగించవయ్యా ॥ ఎటు ॥

కోరి నీపై నాసపడి గొబ్బునను సిగ్గువడి
పేరఁబెట్టి మాటలాడీఁ బెదవులనె
సారపుతమకముతోడ జవ్వనభారముతోడ
ఆరీతి నివ్వెరగందీ నాదరించవయ్యా ॥ ఎటు ॥

కాఁగిటికిఁ జెయ్యి చాఁచి కన్నులనే నీకు మొక్కి
మాఁగినమోవి యిచ్చీ మతకాననె
చేఁగదేర నిన్నుఁ గూడె శ్రీ వేంకటేశుఁడ
వీఁగ దలమేలుమంగ వినోదించవయ్యా ॥ ఎటు ॥ 24

రేకు 905 భల్లాటి

ఏమిటికి మాముందర యెమ్మెలెల్లాఁ జూపేవు
నేమూ నీవలె మేలు నెరపఁగఁగలమే ॥ పల్లవి ॥

చక్కనిదాన వౌదువే సణఁగులాఁడి వౌదువే
నిక్కి విభునిఁ గొసర నేరుతువే
దక్కినే నీపంతములు తరుణులలోనెల్లా
మక్కువ నాతని నింత మరిగించుకొంటివి ॥ ఏమి ॥

---

త్రిగీతలుగల స్థలముల చిలుమెక్కువగ నున్నది.

జవ్వని వౌదువే మంచి జాణకత్తె వౌదువే
రవ్వసేసి భ్రమయించ రాజవే నీవు
నవ్వు లీదేరెనే నీకు నడుమ నిందరిలోన
బువ్వాన సీతని నింత పొందుసేసుకొంటివి ॥ ఏమి ॥

మేటి వౌదువే అలమేలుమంగ వౌదువే
పాటించి శ్రీ వేంకటేశుఁ బనిగొంటివి
మాటలు చెల్లె నీకు మావంటివారిలోనెల్లా
చాటువ మమ్మేలితని చనవు గైకొంటివి ॥ ఏమి ॥ 25

## పాడి

ఎంతైనా నాతఁడు నీకు నెక్కుడుగాదా
కాంతుఁడు మన్నించఁగానే [1] ఘనురాల వైతివి ॥ పల్లవి ॥

వెక్కసములాడకువే విభునితో సారె సారె
మిక్కిలి నాతఁడు నీకు మేలువాఁడు
జక్కవపిట్టలవంటిచన్నులు విసికెనంటా
వుక్కవంటి గోరనేల వూఁదేవే నీవు ॥ ఎంతై ॥

ఆరితేరి యెంచకువే అండనుండి ఇంతలోనె
చేరి నీకుఁ బ్రియములు చెప్పీ నాతఁడు
తోరపుమొయిలువంటితురు మాతఁ డంటెనంటా
బీరానఁ జేతులు చాఁచి పెనఁగుదురటవే ॥ ఎంతై ॥

నీ వలమేలుమంగవు నిందలు వేయకువే
శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ జెందినవాఁడు
ఆవటించి నిన్నుఁగూడి యట్టె చెక్కంటెనంటా
కావరించి నీవప్పటి ఘాత సేయఁదగునా ॥ ఎంతై ॥ 26

---

1. ' ఘనురాలు ' వింతప్రయోగము.

శుద్ధవసంతం

సూటిగా నన్నేమి చూచేవు
నీటుతోడ నన్నీ నేరుపవయ్యా ॥పల్లవి॥

నవ్వుతా నిన్ను నాయము లడిగీ—
నెవ్వతో ఆనతి యియ్యవయ్యా
జవ్వని యప్పటి సరిజేసుకాడీ
పువ్విళ్లూరఁ బంతె లొగి వేయవయ్యా ॥సూటి॥

మచ్చికతోడుత మనవి చెప్పీ
విచ్చనవిడిని వినవయ్యా
వచ్చి యాపె నీతో వసంతమాడీ
పచ్చివలపులు పైఁ జల్లవయ్యా ॥సూటి॥

పలుమరు నీపైఁ బాటలు వాడీ
మెలుపున నిట్టె మెచ్చవయ్యా
అలమేలుమంగనై ననన్నేలితి—
వెలమి శ్రీ వేంకటేశ నేఁడయ్యా ॥సూటి॥ 27

దేవగాంధారి

మిక్కిలిమేలుది అలమేలుమంగ
అక్కరతో నిన్నుఁజూచీ నలమేలుమంగ ॥పల్లవి॥

కొచ్చి కొచ్చి యాళా(లా?)పించి కూరిమితోఁబాడఁగాను
మెచ్చీ నిన్నునిదె యలమేలుమంగ
నెచ్చెలులతోడనెల్లా నీగుణాలు సారెసారె
అచ్చలాన నాడుకొనీ నలమేలుమంగ ॥మిక్కి॥

వాడలవాడల నీవు వయ్యాళిఁ దోలఁగాను
మేడలెక్కిచూచీ నలమేలుమంగ
వీడెము చేతఁబట్టుక వెస నీవు పిలువఁగా
ఆడనుండి వచ్చె నీడ కలమేలుమంగ ॥ మిక్కి ॥

యీలీల శ్రీ వేంకటేశ ఇంతచన వియ్యఁగాను
మేలములాడీ నలమేలుమంగ
ఘేలిననీరతులను ఇదె తనవేరుపెల్లా
ఆలోచనలు సేసీ నలమేలుమంగా ॥ మిక్కి ॥ 28

శ్రీరాగం

ఎట్టు దరించఁగవచ్చు నిల్లాండ్లకు నూరిలోన
చుట్టమపై సిగ్గులెల్లా చూరలాడేవు ॥ పల్లవి ॥

మాయదారిమాట లాడి మనసులు మరిగించి
పాయపుగొల్లెతలను భ్రమయించేవు
చాయలుసన్నలుఁ జేసి చవులుగా మోవిచూపి
ఆయములు గరఁగించి ఆసరేఁచేవు ॥ ఎట్టు ॥

సెలవుల నవ్వునవ్వి చిట్టంటుచేఁతలు సేసి
కలికిజవరాండ్లఁ గాఁకరేఁచేవు
ప్రియముల నవ్వునవ్వి పెంపుగఁ గాఁకలపుంచి
నయగారితనమున నమ్మించేవు ॥ ఎట్టు ॥

కన్నులఁ దప్పక చూచి కాఁగిటను బిగియించి
కన్నెలనుఁ జొక్కించి కైకొనేవు
అన్నిటా శ్రీవేంకటేశ అలమేలుమంగను నేను
మన్నించి నన్ను నేలి మంతనమాడేవు ॥ ఎట్టు ॥ 29

రామక్రియ

వట్టిబాఁతిపడి నీపై వలపులు చల్లేముగాక
యిట్టయితే మరియిఁక నేమిచెప్పేదయ్యా ॥ పల్లవి ॥

కాంతను నాయెదుటనె కాఁగిలించుకొంటివి
పంతములాడఁగ నీకుఁ బనియేది
వింతలుగా సిగ్గులెల్లా విడిచినమీఁదట
యెంతకొసరినా నందు నేమిగలదయ్యా ॥ వట్టి ॥

నావద్దనుండి యాకెతో నవ్వులు నవ్వితివి
భావించి చూచిన నీకుఁ బనియేది
వేవేలకు మతిలోనివెరపు దీరినమీఁద
చేవమీరినసుద్దులు చెప్పఁ జోటేదయ్యా ॥ వట్టి ॥

చలివాసి యాకెతోనే సరసములాడితివి
పలుమారుఁ బచ్చినేయఁ బనియేది
అలమేల్మంగనైన నన్నట్టె యేలితివి
యెలమి శ్రీవేంకటేశ యెట్టు మెచ్చేదయ్యా ॥ వట్టి ॥ 30

రేకు 906 మనోహరి

అలమేలుమంగవు నీ వన్నిటా నేరుపరివి
చలములేఁటికి నిఁక సమ్మతించవే ॥ పల్లవి ॥

విడియము చేతికిచ్చి విభుఁడు వేడుకపడి
వాడిపట్టి పెనఁగగా నొద్దనకువే
వుడివోని వేడుకతో నుంగరము చేతికిచ్చి
యెడయక వేఁడుకొనఁగా నియ్యకొనవే ॥ అల ॥

చిప్పిలువలపుతోడ చెక్కులు నొక్కుచు మోవిఁ
గప్పుర మందియ్యఁగాను కాదనకువే
కొప్పు దువ్వి బుజ్జగించి కొసరి మాటలాడి
అప్పసము నవ్వఁగాను అట్టె కానిమ్మనవే ॥ అల ॥

యిచ్చగించి శ్రీ వేంకటేశ్వరుఁడు నిన్నుఁ గూడి
మచ్చికఁ గాఁగిలించఁగాను మారాడకువే
పచ్చడము మీఁదఁ గప్పి పట్టపుదేవులఁ జేసి
నిచ్చలాన నేలుకొనె నీవూఁ గైకొనవే ॥ అల ॥ 31

కురంజి

ఇంతకాకు గలదా యేమోయి చెలులను
చెంతల మందెమేళాలు సేసుకొంటి విట్లా ॥ పల్లవి ॥

యేకతాన నీవు నాకు నిట్టె కతలు చెప్పఁగా
దాకొని సతులెల్లాను తామూ వినేరు
జోకతో నీవు విడేలు సొరిది నా కందియ్యఁగా
చేకొని తామూ నట్టె చేతులు చాఁచేరు ॥ ఇంత ॥

సరసమాడుచు నా చన్నులు నీవంటఁగాను
సొరిదిఁ దమచన్నులు చూపేరు నీకు
తెరలో నాకు నీ మోవితేనె విందువెట్టఁగాను
గరిమఁ దామును నట్టె కడునోరూరేరు ॥ ఇంత ॥

పలుమారు నీవు నాకుఁ బచ్చడము గప్పఁగాను
కలికికాంతలు తమ్మూఁ గప్పుమనేరు
అలమేల్మంగనైన నన్నట్టె నీవు కూడితేను
నెలవై శ్రీవేంకటేశ నిన్నుఁ దామూ కూడేరు ॥ ఇంత ॥ 32

దేసాళం

కొలువులోపలనున్న కొమ్మలెల్లా నవ్వేరు
కొలఁదిమీరకువయ్య గోవిందరాజా ॥ పల్లవి ॥

పాంచములో తేత్తేయట్టిపడఁతికి నిదివో
ఆదిగొని చెమరించె నంగమెల్లాను
కాదనక పచ్చడము గప్పి మఱఁగుననె
పోదితో నాపెఁ దనివిబొందించవయ్యా ॥ కొలు ॥

సరుసఁ గూచుండినట్టిసకియకు నిదివో
సిరులుగాఁ బులకించె చెక్కులెల్లాను
తెరవేసుకొని సిగ్గుదేరిచి గుట్టుననె
గరిమతో లోలోనె కాఁగిలించవయ్యా ॥ కొలు ॥

శ్రీసతికి భూసతికిఁ జేరి కూడఁగ నిదివో
రాసి నిట్టూర్పులు మీఱెఁ రతులలోనా
ఆసతోడుత శ్రీవేంకటాద్రిగోవిందరాజ
లేసుగా నిద్దరిని లాలించఁగదవయ్యా ॥ కొలు ॥ 33

వరాళి

ఎంతలేదు నీయానోద మేమిచెప్పేది
బంతినుండి రతులకే బాఁతిపడేవు ॥ పల్లవి ॥

చెలులై తేఁజాలు నట్టె చేరి యెంతవడియైనా
మలసి మలసి నీవు మాటలాడేవు
కొలఁదిమీరినయట్టికుచములు గంటేఁజాలు
యెలమి నూరకయైనా యేఁకారేవు ॥ ఎంత ॥

తప్పకఁజూచితేఁజాలు తనియక మీఁదమీఁద
వుప్పతిలుఁదమకాన నోలలాడేవు
ఛిప్పిల నవ్వితేఁజాలు చెంతల నట్టెభ్రమసి
వొప్పగుమోవితేనెకు నొగి నోరూరేవు ॥ ఎంత ॥

కాఁగిలించుకొంటేఁజాలు కడుసంతోసముతోడ
చేఁగదేరి వలపుల చిమ్మిరేఁగేవు
వీఁగక శ్రీ వేంకటేశ వెస నన్నుఁ గూడితివి
పాఁగినతరితీపులఁ బచ్చిదేరేవు ॥ ఎంత ॥ 34

## ముఖారి

ఏమే విభునినేల యెలయించేవే నీ-
మోమున సింగారాలు మొలచున్నవి ॥ పల్లవి ॥

నెలవుల నొకమాటు చేరి నీవు నవ్వితేనే
వెలలేనిమహిమలవెన్నెల గాయు
తళుకున నీవటు తప్పక చూచితేనే
నిలువెల్లాఁ జీఁకటుల నిగ్గుదేరును ॥ ఏమే ॥

మరిపేన వాతెరమోవి నీవు చూపితేనే
సొరిదినే పగడాలసొంపు నిండును
మరుగుచు నీవిట్టె మాటలు సారె నాడితే
యిరవై కప్రపుపలుకు లిటు నిండును ॥ ఏమే ॥

సందడి నీపయ్యదలో చన్నులు చూపితేనే
కుందణం(నం?)పువన్నెలెల్లా గుడిగొనును
కందువ శ్రీవేంకటేశుఁ గాఁగిట నీవు గూడితే
యెందు నలమేల్మంగ నీయిరవు గాన్పించును ॥ ఏమే ॥ 35

సింధురామక్రియ

ఎంతవేడుకకాఁడవు ఇన్నిటా నీవు
సంతసించేవు మోహము చల్లినంతనె ॥ పల్లవి ॥

వన్నెవచ్చె మేనికిని వాడుదేరె మోమెల్ల
కన్నులను నాపె నీవు గాంచినంతనె
చెన్నుమీర సంతోసాన చెక్కులెల్లాఁ బులకించె
పన్నుగా నాకెమాటలు విన్నంతనె ॥ ఎంత ॥

ఆసవుట్టె మనసుకు అరిమురిఁ జెమరించె
సేసవెట్టి యాపె నిన్నుఁ జేరినంతనె
వాసిమీర పైపైనే వలపులు గడుమించె
చేసన్నలు నీయెడకుఁ జేసినంతనె ॥ ఎంత ॥

విట్టూరుపులు రేఁగె నిండుఁదమకము నిండె
గుట్టుతోడ నీవు రతిఁ గూడినంతనె
అట్టె శ్రీవేంకటేశ ఆనందము గడునుబ్బె
చుట్టి ఆకెఆయములు సోఁకినంతనె ॥ ఎంత ॥ 36

రేకు 907 ఆహిరి

ఎడసి కూడినపొందు ఇంపులాయను
తడవి మీభావములు తలపోసేమయ్యా ॥ పల్లవి ॥

చెక్కునఁ బెట్టినచెయ్యి నెలవిఁ బారేటినవ్వు
వొక్కమాటే చెలియకు నొనగూడెను
నిక్కపుహోరమణుఁడ నీమహిమలే ఇవి
మిక్కిలి మాలో నేమే మెచ్చుకొనేమయ్యా ॥ ఎడ ॥

మేరమీరు నిట్టూర్పులు మితిమీరు తమకము
యీరెండు నింతికి నిట్టె ఇరవాయను
ఆరయ వోరమణుఁడ అమరించితివి రీతి
యేరుపరచి మీసుద్దు లెంచుకొనేమయ్యా ॥ ఎడ ॥

పయ్యదలెడజారును పచ్చిదేరేరతిచొక్కు
నెయ్యపుఁగామిని కిట్టె నెలవాయను
యియ్యెడ శ్రీవేంకటేశ యెనసితి వింతలోనె
చయ్యన మిమ్ముఁ బొగడి సంతోసించేమయ్యా ॥ ఎడ ॥ 37

బౌళి

చెక్కునొక్కి ఇచ్చకము సేతురుగాక
వెక్కసపుసేఁతలను వింత సేతురా ॥ పల్లవి ॥

వలచినరమణుఁడు వాడికెఱు నీమీఁద
కలువల వేసితేను కాఁతాళింతురా
తలుపుదెరచి నీదండఁ గూచుండినవాని
చలపట్టి బొమ్మలను జంకింతురా ॥ చెక్కు ॥

పొందైనమగవాఁడు బుజముపైఁ జెయివేసి
కందువ లంటితేనే కాదందురా
విందులమోవి చూపి విడెమడిగేటివాని
మందెమేళములాడుచు మారుకొందురా ॥ చెక్కు ॥

శ్రీవేంకటేశుఁడు చేరి నిన్నుఁ గాఁగిలించి
ఆపటించి కూడితేనే అలయుదురా
దేవులవంటా నిన్నుఁ దెగడి నవ్వించేవాని
కావరపుఁజూపు చూచి కాతరింతురా ॥ చెక్కు ॥ 38

### లలిత

చిత్తగించవోయి నీవు శిరసువంచుకొనక
బిత్తరాన నీకె నీపై ప్రియము చవ్లీసి ॥ పల్లవి ॥

పలుచనిసిగ్గుతోడ బాసికము గట్టుకొని
చెలరేఁగి సతి నీపై నేసచల్లీని
చెలులమాటుననుండి చిప్పిలుఁ దమకమున
తళుకుఁజూపుల నిన్ను తప్పక చూచీని ॥ చిత్త ॥

చెంది మురిపెముతోడ సింగారించుకొని
కందువ లంటుచు నీకాలుదొక్కీని
సందడివేళలందు జాణతనాలాడి నీకు
ముందుముందుగాఁ దాను మోవి చూపీని ॥ చిత్త ॥

గాటఁపుటాసలతోడ కంకణము నీకుఁ గట్టి
పీఁటమీఁదఁ గూచుండి పెండ్లాడీని
యీటున శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
మేటివై యిందుకు నాపె మెచ్చు మెచ్చీసి ॥ చిత్త ॥ 39

### అమరసింధు

ఉచిత మెఱఁగవద్దా వువిదలకు
రచనల నీసరి రారా యెవ్వరును ॥ పల్లవి ॥

యింతులెల్లా నిలుచుండి యిట్టె కొలువుసేయఁగ
మంతనములాడేవు మగనితోను
జంతవై నీవాకతెవే జట్టిగొంటివా యేమి
వంతువరుసలు మరివలదా యెవ్వరికి ॥ ఉచి ।

సవతు లిందరును మీసరుసనే వుండఁగాను
పవళించే వీతనిపానుపుమీఁద
కవగూడఁగా నీకే కాణాచాయనా యేమి
తవిలి నీసాటికి రాఁదగదా యెవ్వరికి ॥ ఉచి ॥

తోడివారెల్లా నట్టె వూడిగాలు సేయఁగాను
వేడుకఁ గూడితివి శ్రీవేంకటేశువి
కూడిమాడి నీవే రతిఁ గొల్లగొంటివా యేమి
వోదక నీవంటియాస వుండదా యెవ్వరికి ॥ ఉచి ॥ 40

సౌరాష్ట్రం

చూడవయ్యా నీ సేఁతలు సూటిపదేను
ఆడరాదు నీతో మారు అవుఁగాదనుచును ॥ పల్లవి ॥

సరసములాడితివి చనవు లొసఁగితివి
తరుణితోడ నీవు తమకానను
యిరవై యీపె నేఁడు యేమిభాగ్యము సేసెనో
సిరులవలపులెల్లా చెక్కుల నిండెను ॥ చూడ ॥

సేవ సేయించుకొంటివి సిగ్గులు దేరిచితివి
భావించి వనిత నింత పనిగొంటివి
పావనమె తనజన్మఫల మదియెట్టిదో
చేవదేరినవలపు మోవిమీఁద నున్నది ॥ చూడ ॥

గక్కనఁ బెండ్లాడితివి కాఁగిటఁ గూడితివి
మిక్కిలివేడుక నలమేలుమంగను
యిక్కువ శ్రీవేంకటేశ యెటువంటితగులమో
చక్కనివలపులెల్లా చన్నులపై నున్నవి ॥ చూడ ॥ 41

సాళంగనాట

ఇదివో మావిన్నపము యిట్టె చిత్తగించవయ్యా
సుదతివున్నజాడలు చూతువు రావయ్యా ॥పల్లవి॥

యిప్పుడే వచ్చేవని యింటవాకిటను చెలి
కప్పురపుటారతెత్తఁ గాచుకున్నది
దప్పిదేర నీకునేల(నీయ?) తట్టిలోన బాగాలు
కుప్పలుగా మీఁదెత్తుకొని వున్నది ॥ఇది॥

ఆరగించవచ్చేవని అన్నిదెరఁగులనెల్లా
చేరి విందాయితముగాఁ జేసుకున్నది
గారవానఁ బాదాలుగడిగేనంటాఁ బన్నీరు
ఆరీతిఁ బైఁడిబిందెల నమరించకున్నది ॥ఇది॥

పవళించవచ్చేవని పట్టెమంచముమీఁదట
వివరించి పూఁబరపు వేసుకున్నది
నివిరి శ్రీవేంకటేశ నీవు విచ్చేసి కూడఁగ
తవిలి యలమేల్మంగ తనివితో మన్నది ॥ఇది॥ 42

రేకు 908. శుద్ధదేశి

ఇప్పటికి ఇనవరి యింతి నీకు
కొప్పుదువ్వి నన్నునేల కొంగువట్టే విభుడు ॥పల్లవి॥

మలసి నీవు నాతో మాటలాడితివంటాను
సొలసీ నాపె విన్నుఁ జుట్టిచుట్టి
కలికి యన్నిటా కడుఁగతలెల్ల నేరుచును
వెలలేని యాపెమాటే వినవయ్యా నీవు ॥ఇప్ప॥

ననుపున నాతో నవ్వులు నవ్వితివంటా
గునిసీ నాపె నిన్నుఁ గొచ్చి కొచ్చి
చనవరివినోదాల సరసురా లన్నిటాను
వొనర నాపెతో నవ్వి వుండవయ్యా నీవు ॥ ఇప్పు ॥

గక్కన నన్ను నీవు కాఁగిటఁ గూడితివంటా
కక్కసించీ నాపె నిన్నుఁ గమ్మి కమ్మి
నిక్కి శ్రీవేంకటేశుఁడ నే నలమేలుమంగను
తెక్కతోనే యాపెఁ గాగిలించవయ్యా నీవు ॥ ఇప్పు ॥ 43

తెలుఁగుఁగాంబోది

నీవే యెరఁగుదువు నానెయ్యము వోరమణి
భావములోపల నుండి భ్రమయించనేఁటికి ॥ పల్లవి ॥

చూపుటమ్ము బొమ్మవింట జోడై నిలిచెఁగాన
చేపట్టి మర్మవేదనఁ జేయుఁగాక
కోపులమంచితనపుఁగుచమండలము నేఁడు
యేపునఁ బ్రాణాలతోడ యేలాట మెట్లాడీనే ॥ నీవే ॥

తొడఁగి మబ్బుగవిసి దొడ్డకుటిలపుఁగొప్పు
కడుఁగామాంధకారముఁ గప్పుఁగాక
నడుమ మోముఁజంద్రుఁడు నవ్వువెన్నెల గాయుచు
చిదుముడి నామదినిఁ జీఁకటేల సేసీనే ॥ నీవే ॥

పచ్చిదొండపండు వంటిబాగుల రాగపుమోవి
రిచ్చవడ మోహము రేఁచుఁగాక
ఇచ్చకపు శ్రీవేంకటేశుఁడ రమ్మని నన్ను
ఇచ్చఁ గూడితివి రతి నిందాఁకా నెట్లుండెనే ॥ నీవే ॥ 44

పాడి

తరుణులతోడనా నీతరితీపులు
తొరలింపుఁగూరిముల దొరపాటివాఁడవు ॥ పల్లవి ॥

వలచినసతితోను వాసికిఁ బెనఁగుదురా
పలుకులునేరిచినపంతగాఁడవు
బలిమిఁ జెనకఁగాను పరాకుసేయుదురా
నెలకొన్నజవ్వనపునెరవాదివాఁడవు ॥ తరు ॥

ఆసగించివున్నయింతి నారఁడిఁ బెట్టుదురా
సేసవెట్టిపెండ్లాడినచెలువుఁడవు
నీసరిఁ గూచుండఁగాను నీటులు చూపుదురా
వేసటలేనిరతులవేడుకకాఁడవు ॥ తరు ॥

అలమేలుమంగఁ గూడి అలయించి నవ్వుదురా
తెలివి శ్రీవేంకటాద్రిదేవుఁడవు
కలసి మొక్కఁగా మోవి కడుపిప్పిసేతురా
తలపోఁత లెఱిఁగిన దయగలవాఁడవు ॥ తరు ॥ 45

వసంతవరాళి

నను జూడవే ఇఁకను నాసొమ్ము చేసుకొనేను
ఘనుఁ డీతనిచెయ్యి నేఁ గైదండ చేకొంటిని ॥ పల్లవి ॥

చనవరిదానవు చలమరిదానవు
యెనలే కాతనిఁ గూడ కేల మానేవే
మనసునమ్మినయట్టిమాటపట్టు వుచ్చుకొంటి—
వినుమడించె వలపు లిట్టుండవలదా ॥ ననుఁ ॥

ఇతవరిదానవు ఇయ్యకొన్నదానవు
రతుల నింటికి నేల రాకుండేవే
సతముగా నన్నిటా సమ్మతి చేసుకొంటివి
బలుతు నీవలె నిట్టె పచరించవలదా ॥ నను ॥

పాయరానదానవు పంతగారిదానవు
చాయల నేపొద్దూనేల టంటవా నేవే
రేయి వచ్చి శ్రీ వేంకటాద్రిగోవిందుడే నన్నేలె
యీయెడ నవ్వునవ్వితి వింతమెచ్చవలదా ॥ నను ॥ 46

సాళంగం

వలపేల దాచేవే వనిత నీవు
తిలకించి యెంతతరితీపు సేసేవే ॥ పల్లవి ॥

పలుమారు నాతడు బాతిపడి పిలువగా
వొలసినొల్లమి నేల వూకొనేవే
బలిమి నాతడు నీకు పచ్చడము గప్పగాను
అలరి వొయ్యారాన నట్టె లోనయ్యేవే ॥ వల ॥

చిమ్మిరేగి యాతడు చేసన్న నేయగాను
వుమ్మదిజాగుతోనేల వొద్దికయ్యేవే
నెమ్మితోడ నాతడు నీకు విడెమియ్యగాను
చిమ్ముల మెల్లనే యెట్టు చేయిచాచేవే ॥ వల ॥

అట్టె శ్రీవేంకటేశుడు అంకెగాగిలించుకోగా
గుట్టున గరగి యెంతసుబ్బితిల్లేవే
యిట్టె యాతడు నిన్ను వేలి నేడు మన్నించగా
దిట్టవై యలసి యేమి తేలించి చూచేవే ॥ వల ॥ 47

హిందోళవసంతం

మాకేల విన్నవించ మాపుదాఁకా నీతోను
దాకొని నీవే దయఁ దలఁచేవుగాని ॥ పల్లవి ॥

హత్తి రమణి విలిచీ నాడకు విచ్చేయరాదా
చిత్తము వచ్చినట్లాఁ జేసేవుగాని
మొత్తమి నిప్పుడే నీవు మొగము చూడఁగరాదా
యిత్తల నన్నియు నీవే యెఱిఁగేవు గాని ॥ మాకే ॥

మనసిచ్చి యేకతాన మాటలాడి చూడరాదా
పనివడి నీవే నిజపట్టేవుగాని
చెనకుచుఁ బానుపుపైఁ జేరి కూచుండఁగరాదా
ననిచి మానిజమెల్లా నమ్మేవుగాని ॥ మాకే ॥

కక్కసమేఁటికి యాకెఁ గాఁగిలించి కూడరాదా
మిక్కిలి శ్రీవేంకటేశ మెచ్చేవుగాని
యిక్కువ నిప్పటిపొందు యిట్టె యీడేరించరాదా
మక్కువలు సేసి నీవే మరిగేవు గాని ॥ మాకే ॥ 48

రేకు 909. నాగగాంధారి

ఇంకా నేమనేవయ్యా యెదుట నుందాన నేను
కుంకుమ నీకుఁ బూయనా గురుతుగా నేను ॥ పల్లవి ॥

సన్నలు నీవు సేయఁగా సమ్మతించి కాదనక
విన్నపము సేయనా వేడుకతోడ
వెన్నెలబాయిటఁ జేయివేయఁగా నప్పటి నీకు
కన్నుల నే మొక్కనా కడుఁదమకమున ॥ ఇంకా ॥

నాయెడకు వడలేని నవ్వులెల్లా నవ్వఁగాను
ఆయములు సోఁక నిన్ను నాడనా నేను
దాయక పాయక నీవు దండ నిట్టె కూచుండఁగా
సేయనా పూడిగములు చెప్పినట్టెల్లాను ॥ ఇంకా ॥

పంతమున కాఁగిటను బలిమి నీవు గూడఁగా
మంతనాన మెచ్చనా మచ్చికతోడ
చెంతనే మన్నించితివి శ్రీవేంకటేశ నన్ను
సంతోసించనా నీసరసములకును ॥ ఇంకా ॥ 49

మాళవి

వేగిరకాఁడవు నీవు వెసలఁ బెట్టుమనేవు
ఆగడము సేసి యేల అలయించేవు ॥ పల్లవి ॥

చలము పాదించరాదు జంకించి చూడఁగరాదు
యెలమి నింతలో నేరా యెగ్గుపట్టేవు
బలిమి చూపఁగరాదు పంతములాడఁగరాదు
తిలకించి యేమిరా తిట్టు దిట్టేవు ॥ వేగి ॥

బెట్టిమాటాడఁగరాదు బిగువు చూపఁగరాదు
అట్టు అదేరా ఇట్టె యేఁచేవు
గుట్టున నుండఁగరాదు కొసరి నవ్వఁగరాదు
వుట్టిపడి నీవేరా వుప్పతించేవు ॥ వేగి ॥

కదిసి పెనఁగరాదు కాఁగిలించుకొనరాదు
వుదుటున నౌరారా వొడివట్టేవు
ఇదివో శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
పొదిగి యేమిటికిరా బుజ్జగించేవు ॥ వేగి ॥ 50

సామంతం

మేలు మేలు నీగుణము మెచ్చితి నేను
నీలీల లోకమెల్లా నిండెఁగా నేఁడు ॥ పల్లవి ॥

వలపుగలుగువారు వద్దనే వుందురుగాక
తిలకించి వాడలకుఁ దిరుగుదురా
తెలిపి చెప్పఁగనేల తేటతెల్లమిగ నాపె-
కలువదండ నీమెడఁ గంటిగా నే నిపుడు ॥ మేలు ॥

ననుపుగలుగువారు నవ్వుతానుందురుగాక
తనివో కెవ్వతెనైనాఁ దలపోతురా
వెనకటి సుద్దులేల వేడుకతో నాపెచేతి-
కొనవేలివుంగరము గురుతాయఁగా ॥ మేలు ॥

కైవసమైనవారు కాఁగిట నుందురుగాక
ఆవలివారితో మేలాలాడుదురా
శ్రీవేంకటేశ నన్నుఁ జేరి యిట్టెకూడితివి
నీవే నన్ను మన్నించుట నిజమాయఁగా ॥ మేలు ॥ 51

కేదారగౌళ

ఇద్దరిఁ గూర్చఁగదవె యింతిరో నీవు
సుద్దులు చెప్పేనంటే చోటెంతైనాఁ గలదు ॥ పల్లవి ॥

పడఁతి కడకు నిట్టె పతిఁ దోడుకొనిరావె
యెడమాట లాడఁబోతే యెన్నిలేవు
వెడవెడ మాని యట్టె విడెము చేతి కియ్యవే
అడరి యాతనిప్రియా లవెన్నైనాఁ గలవు ॥ ఇద్ద ॥

ప్రతిలో స్థలము చిలుమెక్కి వగ నున్నది.

మిగులా నిద్దరిఁ బాన్పుమీఁదఁ గూచుండఁ బెట్టవే
తగవులఁ బెట్టేమంటే తనివిలేదు
బగి వాయకుండా నట్టె పచ్చడము గప్పవే
పగటు లాతనివి చెప్పఁగఁ గొత్త లిపుడు ॥ ఇద్ద ॥

శ్రీవేంకటేశ్వరుచేత సేసలు వెట్టించవే
వావులు దెలుపఁగాను వయిపాయను
దేవులకు దేవునికి తెరవేయఁగదవే
చేవదేరేమోహము చెప్పనరు దిఁకను ॥ ఇద్ద ॥ 52

గుండక్రియ

దేవరవు గావా యీతెఱఁగులకు
చేవదేరె నిఁక రట్టుసేయఁగవలెనా ॥ పల్లవి ॥

అఱిముఱి నూడిగాలు ఆపెచేతఁ జేయించేవు
యెఱఁగనా నీజాడ లెప్పుడు నేను
మఱి నీవు దొరవౌదు మనసున మెచ్చితివి
గుఱుతులు నాకిన్నిటాఁ గొచ్చి చూపవలెనా ॥ దేవ ॥

కానుకగా నాపెసొమ్ము గక్కన నాకిచ్చేవు
కాననా నీ సేఁతలు కలకాలము
పూని నిజమరి వౌదు పొంచి నిన్ను నమ్మితిమి
తానకమై ఆసుద్దులె తలపెట్టవలెనా ॥ దేవ ॥

అలమి నన్నుఁగూడి ఆపెపేరఁ బిలిచేవు
తెలియనా నీగుట్టు తెల్లమిగాను
యిల జాణఁడ వౌదువు యిన్నిటాఁ దనిసితిమి
యెలమి శ్రీవేంకటేశ యెచ్చరించవలెనా ॥ దేవ ॥ 53

---

త్రికీతఁగలది చిఱము దిని దుంతవదిన స లము.

సింధురామక్రియ

తొల్లె ఇన్నిటా నీవు దొడ్డవాఁడవు
చెల్లఁబెట్టి యిందరితోఁ జెప్పఁగ నేమిటికి ॥ పల్లవి ॥

పలుకులఁ గరఁగించి భావములఁ జొక్కించి
నెలఁతల వలపించ నేరవా నీవు
వెలయ గొల్లెతలెల్లా వెన్నతోఁ బెట్టిరి నీకు
పొలసి నీ మహిమలు పొగడ నేమిటికి ॥ తొల్లె ॥

ననుపులు గడుఁజేసి నయములట్టె చూపి
వొనరఁ బెండ్లిండ్లాడ నోపవా నీవు
చనవిచ్చి రుకుమిణి సాముసేయించెను నాఁడె
పెనఁగుచు మెచ్చి నిన్నుబ్బించఁగ నేమిటికి ॥ తొల్లె ॥

చెక్కులు వేమరు నొక్కి నేఁతలన్నియునుఁ జేసి
లెక్కలేనిరతి సేయలేవా నీవు
యిక్కువతో శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
తక్కననీపొందులెల్లాఁ దడవ నేమిటికి ॥ తొల్లె ॥ 54

రేకు 910 ఆహిరినాట

ఎంతలేదు నీపగటు యెందాఁకానే
కాంతుని కిచ్చకమాడి కలయఁగరాదా ॥ పల్లవి ॥

వేడుకకు రమణుఁడు వేమారు నవ్వితేను
జాడెఱఁగక బొమ్మల జంకించేవే
యీడువెట్టి వేరొక్కతె నింటికిఁ దెచ్చుకొంటే
పాడిదప్పి నీ పంతము పైవచ్చెనటే ॥ ఎంత ॥

చెలరేఁగి యాతఁడు చెనకి చన్నులంటితే
పెలుచవై సారెనేల పెనఁగేవే
కొలువులోపలనున్నకొమ్మలఁ గాఁగిలించితే
చలపట్టి నీవు మరి సాదించేవటే ॥ ఎంత ॥

శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ జేరి యిట్టె కూడితేను
ఆవటించి రతినెంత అలయించేవే
కావరించి పూడిగపుకాంతలతోఁ జెప్పితేను
తావుకొన్న నీవలపు దాఁచేవటే ॥ ఎంత ॥ 55

రామక్రియ

ఎంతటివాఁడవు నిన్ను నేమిచెప్పేది
కంతునితండ్రివౌట కంటిమి నేమెల్లాను ॥ పల్లవి ॥

తేనెలు(ల?)వంటిమాటలు తివిరి నీవాడఁగాను
అనుకొని వలచిరి యతివలెల్లాను
మోనముతోఁ బొరుగున మొక్కులు చేత మొక్కఁగ
మానలేక తగిలిరి మగనాండ్లెల్లను ॥ ఎంత ॥

జోడుగాఁ దరితీపుల చూపులు నీవు చూడఁగ
వేడుకతోఁ బైకొనిరి వెలయాండ్లు
వాడికెనవ్వులు నీవు వరుసతో నవ్వఁగాను
ఆడానీడాఁ బొందిరి పాయపుకన్నెలెల్లాను ॥ ఎంత ॥

సేయరానిమంతనపుసేఁతలెల్లాఁ జేయఁగాను
ఆయ మెఱిఁగి పెండ్లాడి రచ్చరలెల్లా
యీయెడ శ్రీవేంకటేశ యేలితివి మమ్ము నిట్టె
డాయఁ గొలిచేరు నీపట్టపుదేవుళ్లెల్లను ॥ ఎంత ॥ 56

క్రీగీతలు గల స్థలముల చిలుమెక్కువగ నున్నది.

శంకరాభరణం

ఆకెఁ బిలువవయ్యా యిచ్చటికిని
కాకరిపను లడుగఁగవలె నిఁకను ॥ పల్లవి ॥

ననుపులమాఁటలు నాతోనాడఁగ
కసుఁగొని నవ్వీఁ గడ నొకతె
యెనయఁగ నీగుణ మేమిదెలిసెనో
వెనకటిపను లవి వినవలె నిఁకను ॥ ఆకెఁ ॥

సరసముతో నాసరులు దిద్దఁగా
కెరలుచు నటు గొణఁగీ నొకతె
ధర నీసేఁతలు తానేమెఱుఁగునొ
గరిమ లన్నియునుఁ గనవలె నిఁకను ॥ ఆకెఁ ॥

కందువతో ననుఁ గాఁగిలించఁగా
చెంది సన్న సేసీ నొకతె
యిందునె శ్రీవేంకటేశ కూడితివి
చందము లిటు మెచ్చఁగవలె నిఁకను ॥ ఆకెఁ ॥ 57

దేశాక్షి

మంచివాఁడవయ్య నీవు మరిగి సిగ్గువడపు
యెంచరాని నీవలపు ఇటు చూపవలెనా ॥ పల్లవి ॥

నవ్వులకు నీతోను నాతియానడిమాటలు
రవ్వలేల సేసేవు రచ్చలోనను
పువ్వుల వేసే వప్పటి బుజ్జగించే వంతలోనె
ఇవ్వల నీగజరులు ఇటు చూపవలెనా ॥ మంచి ॥

విందువలె మోవితేనె వెలఁది యొసగితేను
అందరిలో నేలచెప్పే వంగడి నీవు
అందుకొనేవు పయ్యద అట్టె చన్నులు మూసేవు
ఇందులోనే తమకములు యిటు చూపవలెనా ॥ మంచి ॥

కలసిమెలసి యింతి కాఁగిలించి కూడితేను
వెలినేల నవ్వేవు వేడుకతోను
యెలమి శ్రీవేంకటేశ యేలి కమ్మటి నంటేవు
యిలపై నీయెమెల్లా నిటు చూపవలెనా ॥ మంచి ॥ 58

శ్రీరాగం

ఎఱఁగరా నీసుద్దులు యింతులెల్లాను
అఱిముఱి దొడ్డివారమని మమ్ము నవ్వేవు ॥ పల్లవి ॥

గొల్లవాఁడవై తిరిగి కోరి నీవు మరికదా
వెల్లవిరి మధురలో వెలవెట్టితి
పల్లదపుసేఁతలతో పసులఁ గాచికదా
యెల్లవారికిని మరి యేలికవైతివి ॥ ఎఱఁ ॥

బెరసి యశోదకు బిడ్డఁడవై వుండికదా
పొరలి దేవకినిజపుత్రుఁడవైతి
వరుసతో రేపల్లెవాడలఁ దిరిగికదా
నరపతివై ద్వారకానగర మెక్కితివి ॥ ఎఱఁ ॥

మందలోనిసతులను పొంది పొంది మరికదా
అంది పదారువేలఁ బెండ్లాడితివి
యిందునె శ్రీ వేంకటేశ యిటు నన్నుఁ గూడికదా
దిందుపడి శ్రీ వేంకటాద్రిపై నిలిచితివి ॥ ఎఱఁ ॥ 59

త్రికీలు గంవి చిందూరుటచే నే నూహించినవి.

వసంతవరాళి

పరగ నేఁ జేసినట్టి భాగ్యము గాక
సరస నీదేవుళ్లలో చక్కనిదాననా ॥ పల్లవి ॥

మన్నించి నీవు నను మాఁటలాడించేవుగాక
యెన్నిక నీసతులలో నేమిబాఁతి
అన్నిటా నేరుపరివై యాదరించేవుగాక
కన్నెలు పదారువేలకంటె దొడ్డదాననా ॥ పర ॥

యెల్లగా నాచే విడె మిప్పించుకొనేవుగాక
తొల్లిటికాంతలకంటె దొరనా నేను
మెల్లనె నాచన్నులమీఁదఁ జేయివేసేవుగాక
గొల్లెతలకంటె నే నెక్కుడుదాననా ॥ పర ॥

ననుపునఁ గూడి నన్ను నవ్వ నవ్వించేవుగాక
చనవరికాంతలసరివత్తునా
యెనసితివి శ్రీ వేంకటేశ నన్ను నింతలోనె
మనెడివారికంటె మలసేటిదాననా ॥ పర ॥ 60

కురే 911 శుద్ధవసంతం

ఇంతేసిమీగుట్టు లెవ్వఁ డెఱుఁగు
వింతలాయ నేఁడు వివరించఁగాను ॥ పల్లవి ॥

చల్లనిచూపుల నీవు సారెఁ దన్నుఁ జూడఁగాను
మెల్లనిమాటల నాపె మెచ్చనాడఁగా
యెల్లవారు నెరిఁగిరి యిద్దరిమీపొందులు
కల్లలంటా నుంటిమి యీకత లిన్నాళ్లదాఁకా ॥ ఇంతే ॥

చెలరేఁగి నీవు నట్టె చేసన్నలు సేయఁగాను
నలువంకలను నాపె నవ్వఁగాను
తెలిసి రిందరు నేఁడు తేటతెల్లమిగాను
బెళుకులంటా నుంటిమి ప్రియము లిందాఁకాను ॥ ఇంతే ॥

శ్రీవేంకటేశ నీవు చేకొని కూడఁగాను
కావరించి పయ్యదాపె గప్పఁగాను
యీవల మమ్మేలితిరి ఇంతులు సంతోసించిరి
ఆవలపులే సతమనుచు నేముంటిమి ॥ ఇంతే ॥ 61

సామంతం

మారుమాట లాడరాదు మరి నేరా లెంచరాదు
సారెకు నిదివో నీసంగాతాలు ॥ పల్లవి ॥

ఇచ్చకము లాడవలె ఇయ్యకొని యుండవలె
సిచ్చలు నేపొద్దు నాకు నీతో బదుకు
పచ్చిదేర నవ్వవలెఁ బనులన్నీఁ జేయవలె
గచ్చులను నీతోడికాఁపిరము నాకు ॥ మారు ॥

తప్పక చూడఁగవలె తమకము చూపవలె
నెప్పున నెప్పుడు నాకు నీపొందులు
ముప్పిరిఁ బొగడవలె మోహము చెప్పఁగవలె
కుప్పలుగ నీతోడిముక్కవనేస్తాలు ॥ మారు ॥

కలిసి వుండఁగవలె కాఁగిట బిగించవలె
తొలఁగరా దెంతైనా నీతో చెలిమి
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
అలమేల్మంగనే నేను అదె నీనాకూటమి ॥ మారు ॥ 62

ఆహిరి

అదివో నీచిత్తము ఆకెభాగ్యము
కదలిఁక లిందులోనే కనుకో నీవిఁకను ॥ పల్లవి ॥

పున్నమవెన్నెలలోనఁ బొద్దువోక జవరాలు
నిన్నుఁ దలఁచి రేయల్లా నిద్దురవోదు
విన్నవించితిమి నీకు వేవేలకు నొక్కమాటె
యెన్నికలెల్లా నీవే యెఱుఁగుదు విఁకను ॥ అది ॥

చేరి యారామములోనఁ జెక్కుచేతితోడఁ జెలి
నీరూపు భావించి నివ్వెరగందె
యీరీతిఁ గానుక నీకు నిచ్చి వొప్పగించితిమి
తారుకాణ లన్నియుఁ దలఁచుకో యిఁకను ॥ అది ॥

కనకపుమేడలోనఁ గామించి యలమేల్మంగ
తనివోనినీరతికిఁ దమకించెను
యెనసితివి శ్రీవేంకటేశ యింతలో విచ్చేసి
మన సొక్కటాయ నిట్టె మన్నించు మిఁకను ॥ అది ॥ 63

రీతిగౌళ

ఏమిటికి దూరేవు యెరవులవానివలె
యీమోహమే నిజమైతే వింటికి రారాదా ॥ పల్లవి ॥

మంతనము గాకుండఁగా మాటలాడదాయఁ గాని
పంతముగాదు నీతోఁ బదఁతికిని
సంతజాణతనమౌను సబలోన నాడితేను
ఇంత గలవాఁడవైతే నింటికి రారాదా ॥ ఏమి ॥

సిగ్గులు నిండుకొనఁగ చేరి మొక్కదాయఁగాని
వెగ్గళించి కాఁపుసుమ్మీ వెలఁది నీతో
అగ్గమై సందడిలోననైతే [1]గొల్లదోమటౌను
యెగ్గులేనివాఁడవైతే నింటికి రారాదా ॥ ఏమి ॥

కడుఁబరవశములుగాఁగా నవ్వదాయఁగాని
గడుసుగా దలమేల్మంగ నియ్యె[2]డను
అడరుచు శ్రీవేంకటాధిప కూడితి విట్టె
యెడయ కెప్పుడు నిట్టె ఇంటికి రారాదా ॥ ఏమి ॥ 64

ఆహిరి

చిత్తగించి నీవు దయ సేయఁగరాదా
బత్తిసేసి నీకుఁ గడుబాఁతిపడి వున్నది ॥ పల్లవి ॥

చెక్కు చేతఁబెట్టుకొని సెలవుల నవ్వుతాను
నెక్కొని యున్నది చెలి నీయెదుటను
వెక్కసపుఁదమకాన విడెము చేతఁ బట్టుక
యెక్కువైన యాసలతో నిచ్చగించి యున్నది ॥ చిత్త ॥

సారె జారుఁగొప్పుతోడ జవ్వనాన విఱ్ఱవీఁగి
నేరుపుతో మాటలాడీ నీ యెదుటను
బోరున నిన్నెచ్చరించి పువ్వుల వేసుకొంటా
కూరిములు గానరాఁగా గుట్టుతోడ నున్నది ॥ చిత్త ॥

అలరి కాఁగిటఁగూడి అలపుసొలపుతోడ
నిలిచె నలమేల్మంగ నీయెదుటను
యెలమి శ్రీవేంకటేశ ఇరవై పానుపుమీఁద
వెలసినసింగారాలవేడుకతో నున్నది ॥ చిత్త ॥ 65

---

ప్రతిగీతలు గలవి చిలుమూరినందున నేనూహించిన యక్షరములు.

1. గొల్లదోమటి = గొల్లవారి మర్దితనము ?

2. నీ + యెడను. హల్లులపైనున్న ప్రతికమునకూ ప్రతిసంధియే.

తెలుఁగుఁగాఁబోది

ఆనతియ్యవయ్యా అదేల దాఁచేవు
యీ నేర్పు లేకుండితే నింత సేతువా ॥ పల్లవి ॥

చెక్కులు నొక్కుచు సేదలు దేరిచి
పెక్కుప్రియాలు చెప్పేవు నాకు
యెక్కడ నెవ్వతె నెనసి వచ్చితో
యిక్కువ నూరకే యింత సేతువా ॥ ఆన ॥

కన్నుల మొక్కుచు కందువ లంటుచు
యెన్నెసివేసాలు పన్నే విందు
కన్నె నెవ్వతె నిక్కడకుఁ దెచ్చితివో
యెన్నఁడైన నీవు యింత సేతువా ॥ ఆన ॥

వావులు చెప్పుచు వరుసఁ గూడేవు
శ్రీవేంకటగిరి గోవిందుఁడా
దేవుళ్ళ నెందరిఁ దీపులఁ బెట్టితో
యీవేళ నన్నేలి యింత సేతువా ॥ ఆన ॥ 66

912-వ రేకులేదు.

రేకు 913. శంకరాభరణం

చెప్పదు యెంతైనఁ జెలులకును
చొప్పులెత్తుచును సోదించరాదా ॥ పల్లవి ॥

ననుపున నీవిటు నవ్వులు నవ్వఁగా
మునుకొనె సిగ్గులు ముద్దియకు
మనసునఁబారినమతక మేఁటిదో
అనువున నదియును నడుగఁగరాదా ॥ చెప్ప ॥

పలుమరు నీవిటు పైఁ జేయి 'యఁగా
పులకలు నిండెను పొలఁతికిని
యెలమినిఁ బొడమినయింపు లెట్టివో
తిలకించి అవియుఁ దెలియఁగరాదా ॥ చెప్ప ॥

గక్కన నీవిటు కాఁగిలించఁగా
చొక్కులు మించెను సుదతికిని
యిక్కువలు శ్రీవేంకటేశ యెట్టివో
మిక్కిలి మేలిఁక మెచ్చఁగరాదా ॥ చెప్ప ॥ 67

## కేదారగౌళ

నాతో నేలానవెట్టేరే నడుమ మీరు
యీతల నాతని సేఁత లెఱఁగనా నేను ॥ పల్లవి ॥

కడుబత్తిగలవాఁడు కడల కేలపోవునే
వొడయఁడై నావద్దనే వుండుఁగాక
వుడివోక మీరెంత వొడఁబరచేరే నన్ను
యెడనెడ తనగుట్టు యెరఁగనా నేను ॥ నాతో ॥

బాసలిచ్చినట్టివాఁడు పరుల నేల చూచునే
సేసవెట్టి కాఁపురము సేసుఁగాక
వేసరక మీరేల వేఁడుకొనేరే నన్ను
యీ సుద్దు లన్నియు ముందే యెరఁగనా నేను ॥ నాతో ॥

చేరి కూడినట్టివాఁడు సిగ్గులేల నెరపునే
వూరకే లోనై మరిగుండుఁ గాక
మీరెల్లా శ్రీవేంకటేశు మెచ్చి యేలపొగడేరే
యీరీతిజాణఁ డవుత యెఱఁగనా నేను ॥ నాతో ॥ 68

దేవగాంధారి

ఏమని వినెనో యిటు నీసరితలు
తామర విసురుచుఁ దాఁకించీని ॥ పల్లవి ॥

యీలాగున నీవింటికి రాఁగా
వాలుకచూపులు వంచీఁ జెలి
ఆలరివై మాటాడకమునుపే
కోలుముందుగాఁ గొసరీని ॥ ఏమ ॥

ననుపున నీవిటు నవ్వులు నవ్వఁగ
కినియుచుఁ గడుఁ జంకించీని
చనవునఁ బైఁ జేయి చాఁచకమునుపే
పెనఁగుచు నానలు వెట్టీని ॥ ఏమ ॥

గక్కన నీవిటు కాఁగిలించఁగా
అక్కజపురతుల నలసీని
యిక్కువ శ్రీవేంకటేశ మునుపనే
చెక్కులు నొక్కుచుఁ జెనకీని ॥ ఏమ ॥ 69

నాగవరాళి

నేనొకటి సేయఁగాను నీ వొకటి భావించేవు
ఆనతీవయ్యా యింక ననుమాన మేఁటికి ॥ పల్లవి ॥

చనవుగలదంటాను సారె నిన్నుఁ గొసరితి
ననుపుగలదంటాను నవ్వితి నేను
యెనసి యిందుకుఁగాను యేల సిగ్గులు వడేవు
చెనకి నీయందేమైనా నేఁత గలదొ ॥ నేనొ ॥

దేవుల నయితినంటా దిష్టించి నిన్నుఁ జూచితి
కైవసమైతివంటాను కాఁగిలించితి
చేవదేర నీవేల శిరసు వంచుకొనేవు
నీవాళ్ళ నేమైనా మరి నేరములు గలవో ॥ నేనా ॥

విన్నపము విందువంటా వేవేలు నాడితి
మన్నింతువంటా నిన్నే మరిగుంటిని
యిన్నిటా శ్రీవేంకటేశ యింతలో నన్నేలితివి
తిన్నఁగా నీవేమి బుద్ధిఁ దలఁచుకొంటివో ॥ నేనా ॥ 70

## కన్నడగౌళ

బాయిటఁ బడె వలవు పడఁతికి నీకును
యీయెడ నామోము చూచి యెంత నవ్వేవు ॥ పల్లవి ॥

అక్కర యంతో కాని అప్పటప్పటికి నిన్నుఁ
జెక్కు నొక్కి చెలి నీపై నేసవెట్టీని
పక్కన నాకెసేసేబత్తి చేకొనఁగరాదా
యిక్కువ నామోము చూచి యెంతనవ్వేవు ॥ బాయి ॥

యేకట లెట్టివో కాని యెదుటనే కాచుకుండి
మేకొని సన్నలుసేసి మేలమాడీని
నీకేమి యాపెసలిగె నెమ్మదిఁ జెల్లించరాదా
యీకడ నామోము చూచి యెంతనవ్వేవు ॥ బాయి ॥

వేడుక యెట్టిదోకాని వెలఁది కాఁగిటఁగూడి
జోడై శ్రీ వేంకటేశ చొక్కించీని
యీడుగా నన్నేలితివి యిట్టె యాపెఁ గూడరాదా
యీదేర నామోము చూచి యెంతనవ్వేవు ॥ బాయి ॥ 71

మలహరి

ఎఱిఁగినపనులకు నేల గుట్టు సేసేవు
గుఱిలేనికోరికలు గూఁటఁ బెట్టేవా ॥ పల్లవి ॥

చెలపచెమట గారీఁ జెక్కులను
సెలవుల నవ్వులూరీఁ జెలియకును
పిలిచి మాటాడరాదా ప్రియుఁడవు
వలపులు దాఁచుకొని వడ్డి కిచ్చేవా ॥ ఎఱిఁ ॥

పున్నమవెన్నెల చిందీఁ గన్నుచూపుల
చన్నులఁ బులక లుబ్బీ సకియకు
మన్నించి కూడఁగరాదా మగఁడవు
పిన్నవయసుఁదనము పెట్టేఁ బెట్టేవా ॥ ఎఱిఁ ॥

ముప్పిరిఁ దేనెలు జారీ మోవిమీఁదను
చిప్పిలీఁ గళలవివో చిన్నిమోమున
యిప్పుడె శ్రీ వేంకటేశ యేలితివి
తప్పకుండా రతుల వెదలు వెట్టేవా ॥ ఎఱిఁ ॥ 72

సామంతం

ఆయలేవయ్యా సుద్దులన్నియు నెరుఁగుదుము
చాయకాఁడ వౌదువు నీసట లేఁటికయ్యా ॥ పల్లవి ॥

మితిమీరినవలపు మిక్కుటమై వుండఁగాను
సతిమాటలెల్లా నీకుఁ జవులాయను
వెతదీర విన్నపాలు వేగినంతాఁ జేసినాను
ఇతరులయెడ కింత ఇతవయ్యీనా ॥ ఆయ॥

వుప్పతిల్లఁదమకము వువిదపై నుండఁగాను
  వొప్పి యాపెవిందులెల్లా నొద్దికాయను
  ఇప్పు డెవ్వరైనా బోనమింటికి నీకుఁదెచ్చితే
  చప్పనై తోఁచుఁగాక ఆసలు వుట్టీనా ॥ ఆయ ॥

పానుపుమీఁదిరతులు పచ్చిదోఁచి వుండఁగాను
  తేనెగారేఆపెమోవి తీపులాయను
  ఆనుక శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
  యేనెలఁతలందునైనా ఇటువలె మెచ్చేవా ॥ ఆయ ॥ 73

## వేళావళి

తగుతగు నీదొరతనము లిఁక
  వెగటులన్నియును వేడుకలాయ ॥ పల్లవి ॥

విరసపుతిట్లు వేవేలు దిట్టిన
  సరసపువేళల చవులాయ
  యెరవులచేఁత నీవేమిసేసినా
  సరి నాకాఁగిట చందములాయ ॥ తగు ॥

బొమ్మజంకెనలు పొరి నెన్నైనా
  సమ్మతించితే చవులాయ
  దిమ్మరివై యెందు దిరిగివచ్చినా
  నెమ్మి నన్నేలఁగా నేరుపులాయ ॥ తగు ॥

అంగము లలయఁగ నంటఁబెనఁగినా
  సంగడిరతులను చవులాయ
  రంగు శ్రీవేంకటరమణ నన్నేనసితి-
  వెంగిలిమోవుల కిచ్చకమాయ ॥ తగు ॥ 74

సాళంగనాట

ఎవ్వ రెట్టయినా నుండనీ ఇదివో నేను
సవ్వుతా నీసేవ సేతు నడుమ నేను ॥ పల్లవి ॥

మనసున నొకమాట మఱఁగున నొకమాఁట
యెనసి నే(న?)నయములు యెఱఁగ నేను (?)
వనితనై నీమీఁదివలపే గతియని
తనివోక బదికేటిదానను నేను ॥ ఎవ్వ ॥

పలిసితే నొకటియు నొల్లకుంటే నొకటియు
చలివేఁడివేసాలు జరప నేను
కలికితనాన నీతో కాఁపురమే గతియని
తలఁచి పొందులు నేసేదానను నేను ॥ ఎవ్వ ॥

వొక్కపరి యిచ్చకము వొక్కపరి మచ్చరము
యిక్కడా నక్కడ యెలయించను నేను
గక్కన శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
మక్కువ నిటువలెనే మరుగుదు నేను ॥ ఎవ్వ ॥ 75

గంభీరనాట

ఇంకా మమ్ముఁ జెనకేవు యేరా వోరి
కొంకులేక కొసరేవు కొమ్మల నందరిని ॥ పల్లవి ॥

గోవుల మరపినట్టు గొల్లెతల వలపించి
కావరించి తిరిగేవు కానీకానీరా
వేవేలు ఇండ్లు చొచ్చి వెన్నదినేనంటానే
మోవులు చవిగొంటివి ముద్దియల నెల్లను ॥ ఇంకా ॥

పిల్లఁగోవిరాగాలనె పెక్కుమంత్రాలు మంత్రించి
కల్లరివై తిరిగేవు కానీకానీరా
చల్లదుత్తలంటాను చన్నులపైఁ జేయి చాఁచి
కొల్లగొంటివి మానము కోమలులనెల్లను ॥ ఇంకా ॥

మడుగులఁ జొక్కచల్లి మచ్చిక సేయించుకొని
గడుసరివై తిరిగేవు కానీకానీరా
నడుమ శ్రీవేంకటేశ నన్ను నిట్టె యేలితివి
తొడిఁబడఁ గూడితివి తొయ్యలులనెల్లను ॥ ఇంకా ॥ 76

శ్రీరాగం

వలపేమి వెగటా వనితలకు
చిలుకుగోళ్ళనేల చెమట చిమ్మేవే ॥ పల్లవి ॥

అదనెరిఁగి పచ్చిమా టాతఁడు నిన్నాడితేను
వదనకమలమేల వంచేవే
సదరానఁ గప్పురము చన్నుదాఁక వేసితేను
వుదుటున లోలోన వుసురనేవేలే ॥ వల ॥

చవులుపుట్టిం చాతఁడు సన్న నీకుఁ జేసితేను
అవలివలై యేల అలసేవే
తివిరి యట్టె ముసుఁగు దీసి మోము చూచితే
జవళిఁ జొక్కుచు నేల జడిసేవే ॥ వల ॥

శ్రీ వేంకటేశుఁడు నిన్నుఁ జేరి కాఁగిలించితేను
భావము గరఁగి యెంత పదరేవే
కావరపునవ్వుతోడఁ గడుసరసమాడితే
చేవదేర నెంతకెంత చెలఁగేవే ॥ వల ॥ 77

హిందోళవసంతం

ఎంత కాకుసేసేవు యింతుల నింతేసి నీవు
వంతులు వెట్టుక యేమి వల్లెవేసేవు ॥ పల్లవి ॥

కందువ మర్మములంటి గజరుఁదనము చూపి
యెందరితో నవ్వునవ్వి యెలయిఁచేవు
చిందేటిమోవితేనెలు చిమ్మిరేఁచి చవిగొని
విందులవలపులెట్టి వెదచల్లేవు ॥ ఎంత ॥

చన్నులపైఁ జేయివేసి జాణతనములు చూపి
యెన్నికతలఁ గరపే విందరి నీవు
వెన్నెలనవ్వు నవ్వించి వేడుకలు చిత్తగించి
పన్నినమాయల నెట్టుభ్రమయించేవు ॥ ఎంత ॥

కాతరాలు పుట్టించి కాఁగిటను బిగియించి
యేతుల నెందరిఁ గుండే వింపుల నీవు
యీతల శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
జాతుల నెందరిపై నేసలు వెట్టేవు ॥ ఎంత ॥ 78

915-వ రేకు లేదు.

రేకు. 916 చాయానాట

నేఁడు గొత్తలా తనకు నెయ్యపుజాణతనాలు
నాఁడే కానవచ్చెను నమపులెల్లాను ॥ పల్లవి ॥

చెంతనుండి పలికీని చేయి మీఁదవేసీని
యెంతలేదు తనవల పెరుఁగనచే
వంతుతోఁ బువులెల్లాను వాసనలు చూపీని
ఇంతటితనతమక మేమిచెప్పేనే ॥ నేఁడు ॥

సెలవుల నవ్వీని చెక్కులు గడునొక్కీని
తెలిసితిఁగదే తనతెఱఁగెల్లాను
బలిమి నూరకే తాను పచ్చడము గప్పీని
కలిగెనె తనపొందు కాణాచి నాకు ॥ నేఁడు ॥

కన్నులఁ దప్పక చూచీ కాఁగిలించి కూడీని
నన్ను శ్రీవేంకటేశుఁడు మన్నించెఁ దానె
సన్నల నప్పుడే నాతో సరసములాడీని
పన్నినవేడుకతో; నాభాగ్యమాయనే ॥ నేఁడు ॥ 79

నట్టనారాయణి

ఈడనుండేచుట్టరిక మిది చాలదా
వాడికసుద్దులు నీవు వదలేటివాఁడవా ॥ పల్లవి ॥

పలుమారు నీతోను పంతములాడఁగరాదు
చలములు సారె సారె సాదిఁచరాదు
పొలుపుగ నీవు నన్నుఁ బొందులు నేయుమనేవు
వొలిసినట్టు మట్టున నుండేటివాఁడవా ॥ ఈడ ॥

యెక్కువ తక్కువ నీతో నెదురు మాటాడరాదు
కక్కసించి నిన్నెంతైనాఁ గాదనరాదు
ఇక్కువ లంటుచు నన్ను నియ్యకొలుపవచ్చేవు
తక్కినపనులు నీవు తలఁచనివాఁడవా ॥ ఈడ ॥

శ్రీ వేంకటేశ్వర నీ చిత్తము దెలియరాదు
వావితో నన్నేలితివి వద్దనరాదు
కావలె ననుచు నాకుఁ గంగణము గట్టితివి
చేవదేరఁ గూడితివి సిగ్గువదేవాఁడవా ॥ ఈడ ॥ 80

దేశాక్షి

రమ్మనవే చెలియా రమణుని నీడకు
యిమ్మనవే చనవులు యెలయింపు లేఁటికే ॥ పల్లవి ॥

కన్నులఁ జూచినదాకాఁ కడలేదు తమకము
సన్నల మొక్కినదాఁకా చల్లీఁ గూరిమి
మన్నన లడుగుదాఁకా మలసీఁ గోరికలు
యెన్నిలేవు యెడమాట లింకానేఁటికే ॥ రమ్మ ॥

సరసమాడినదాఁకా జడివట్టీఁ జెమటలు
వరసకు వచ్చుదాఁకా వంచీఁ జలము
గరిమఁ బైకొన్నదాఁకాఁ గమ్మీ నడియాసలు
ఇరవై నడుమఁ దెర యిఁక నేఁటికే ॥ రమ్మ ॥

కదిసి కూడినదాఁకా కడుఁ జన్ను లదరీని
పెదవి యానినదాఁకా నిదే నోరూరీ
అదన శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
యెదుటనే వొడఁబాటు లింకానేఁటికే ॥ రమ్మ ॥ 81

ఆహిరి

ఎవ్వతె[1]కో నేఁడు నిన్ను నింతసేసెను
పువ్వులైన వలపులే పూఁపలు నౌను ॥ పల్లవి ॥

చెవిలోఁ జెప్పినమాట చిత్తములోపల నాటీ
వివరింప వినుకలి విరహ మవును
తనివి యదే సారెఁ దలపోయ తలపోయ
కవిసి నివ్వెరగులై కమ్ముకొనును ॥ ఎవ్వ ॥

1. ఎవ్వతె + ఒకో.

కనుఁగవచూపులే కాయముమీఁదఁ బారీ
వెనుకొని కనుకలి విరహ మౌను
తనరి యాకాంతలఁ దగులఁగ దగులఁగ
యెననేటిరతులకు నేఁకట లౌను ॥ ఎవ్వ ॥

నెలవి నవ్వినవవ్వు నేసలై తలకెక్కి
వెలయుచు నేకళయ్యె విరహ మౌను
అలమి శ్రీవేంకటేశ అట్టె నన్నుఁ గూడితివి
యెలమి సంతోసాల కిరవులౌను ॥ ఎవ్వ ॥ 82

దేసాళం

వలపులలో నీకీవన్నె లివి ఇన్నియును
మలతురు సొలతురు మంకుల నుండుదురు ॥ పల్లవి ॥

చలపాదితనములు సహజము సతులకు
వెలఁది నేమీననక వేఁడుకోవయ్యా
పలుకదు రేమైనాఁ బక్కన జంకింతురు
పిలువఁ బిలువ నట్టె బిగుతు రెంతైనా ॥ వల ॥

కడుగట్టితనములు కలిగిన వెప్పుడును
పడఁతికి నీవిట్టే పంతమీవయ్యా
కొడిమెలు గట్టుదురు కోపములు చూపుదురు
తడవినంతటిలోనే తప్పులువట్టుదురు ॥ వల ॥

ఆసోదపుఁదనములె అంగములు కాంతలకు
యీ సుదతిఁ గూడితివి యేలుకోవయ్యా
బాస లడుగుదురు పైపై శ్రీవేంకటేశ్వర
నేసవెట్టి గర్వాన చెక్కులు నొక్కుదురు ॥ వల ॥ 83

మేచబౌళి

ఎవ్వతెతో మాటలాడే విప్పుడు నీవు
జవ్వని నిలుచున్నది చక్కఁజూడవయ్యా ॥ పల్లవి ॥

కలువకన్నుల నిన్నుఁ గసరి
కులుకుఁజన్నుల నిన్నుఁ గొసరి
చెలిఁ బయ్యెదకొంగు విసరి
చెలి నీసేవలు సేసీఁ జిత్తగించవయ్యా ॥ ఎవ్వ ॥

చిమ్ముల మోహరసము చిలికి
పమ్ముచు బ్రియములెల్లాఁ బలికి
అమ్ముదుసిగ్గులఁ గొంత యలికి
కొమ్మ నీకుఁ దమకించి కొసరీ మెచ్చవయ్యా ॥ ఎవ్వ ॥

చొక్కపుటాసల నిన్ను సొలసి
మక్కువలు చల్లి చల్లి మలసి
గక్కన శ్రీవేంకటేశ కలసి
మొక్కీ సంతోసాన నింత; ముదమందవయ్యా ॥ ఎవ్వ ॥ 84

రేకు 917. పళవంజరం

ఆఁటది యేమి యెఱుఁగు నన్నిటను మగవాని-
మాఁటలోని దింతమర్మము నీచే నున్నది ॥ పల్లవి ॥

నేయకుండవచ్చునా చెప్పినట్టెల్లా నేను
పాయఃపువాఁడవు నీవు బలువుఁడవు
యేయెడాఁ జెప్పఁగరానియెన్నికలు నీరతులు
తోయరాదు పాయరాదు దోసము నీది ॥ ఆఁట ॥

ఆడకుండవచ్చునా అనుకున్నట్టెల్లా నీతో
కోడెకాఁడవు నీవు గొంటరివి
పాడితో నూఁకొనరానిపచ్చివి నీసుద్దులు
వాడిక నా జవ్వనము వడి నీకె సెలవు ॥ ఆఁట

పూరకుండవచ్చునా వొద్దారమున నీతో
ధీరుఁడవు శ్రీ వేంకటాద్రినివాసుఁడ
యీరీతి మానఁగరావు యెన్నఁడు నీపొందు లివి
కేరడముగాఁ దెలినకీరీతి నీది ॥ ఆఁట ॥ 85

నాట

చిత్తాన నోరుపు లేదు సిగ్గు విడువఁజాలవు
హత్తి నిన్ను నేమందు నౌదువయ్యా జాణవు ॥ పల్లవి ॥

మోము చూచితే ముసిముసినవ్వులు నవ్వేవు
కామించి తలవంచితే కాతరించేవు
గోమునఁ జెనకితేను కొంకి సాములు సేసేవు
నేమమున నుండితేను నిక్కి పైకొనేవు ॥ చిత్తా ॥

అనుక మాటలాడితే నటు గుట్టు చూపేవు
మోనాన నుండితే చనుమొన లంటేవు
కానుక లిచ్చితేను నలుగడలనుఁ జూచేవు
మాని వూరకుండితేను మంతనమాడేవు ॥ చిత్తా ॥

సేవలు సేయవచ్చితే చేతు లొడ్డించుకొనేవు
వోవరిలోఁ బండుండితే నొడివట్టేవు
యీవేళ శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
వావులు చెప్పినంతనే వలపులఁ జిక్కేవు ॥ చిత్తా ॥ 86

కేదారగౌళ

ఎరవులే నీగుణాలు ఇన్నాళ్ళుదనకాను
సరివచ్చె నాడుకొనే జవరాండ్లమాటలు ॥ పల్లవి ॥

వెలవెట్టనివలపు వెలఁది నీపైఁ జల్లఁగా
నలువంకలా నీకు నవ్వులు గావా
మొలకచన్నులు మరి మోమున కెగరఁగాను
యెలమి సంతోసాలుగా నీకు నెన్నఁడయ్యా ॥ ఎర ॥

పోరచి దెచ్చి విడేలు పొరుగాపె యియ్యఁగాను
సారె కిందరిలోనా చవులు గావా
తీరనిమోవితేనెలతీపు నీమోవి సోఁకఁగ
యీరీతి నీభాగ్యమాయ నిన్నిటా మేలయ్యా ॥ ఎర ॥

పీఁటమీఁద నీకు నిచ్చె పెండ్లికూఁతు రుండఁగాను
పాటించి ఇన్నిటా నీరపములే కావా
యీటున శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
మీటాయ నీసుద్దులెల్లా మెచ్చాయనయ్యా ॥ ఎర ॥ 87

సాళంగం

నీచేఁతలే ఇవి నీవేల సిగ్గువడేవు
చేచేత వలపులు చిమ్మిరేఁచకుండునా ॥ పల్లవి ॥

తగ నీతనికి నీవు తతిగొని చెప్పఁగాను
చిగురుమోవికి వాడుచెందకుండునా
పగటుసరసమునఁ బైపైఁ బెనఁగఁగాను
వెగటుఁజన్నులు వెల్లవిరి గాకవుండునా ॥ నీచే ॥

నడుమ నూరకె నీవు నవ్వులు నవ్వఁగాను
జడియని నీకొప్పు జారకుండునా
వాడివట్టి తీసి పతి నొద్దికిఁ బిలువఁగాను
వెడవెడ పోఁకముడి వీడకుండునా ॥ నీచేఁ ॥

ముందె శ్రీవేంకటేశుమోవి చవిగొనఁగాను
కందువమర్మము కరఁగక వుండునా
సందులేక కాఁగిటిలో సతమువై వుండఁగాను
మందలించి వేడుకలు మరిగించకుండునా ॥ నీచేఁ ॥ 88

ఆహిరి

ఘనుఁడైనవాని నింతకాకు సేతురా
మనసునఁ బెట్టుకొని మంతనము లాడవే ॥ పల్లవి ॥

అంగనలు కొలువుసేయఁగ నుండేరమణుని
వెంగెములాడకువే వేమాఱును
సింగారించుక యద్దము చేతఁబట్టి చూడఁగాను
చెంగట నాతనిమై మచ్చములు చూపకువే ॥ ఘనుఁ ॥

చెప్పరానిబాసలెల్లాఁ జేసేటిమగవానిఁ
దప్పులెల్లా నెంచకువే తగవు గాదు
ముప్పిరివల్లెవాటుతో మురిపెముచూపేవాని
దుప్పటిపసపు చూపి దూరులు సేయకువే ॥ ఘనుఁ ॥

చేరి కాఁగిలించుకొన్న శ్రీవేంకటేశ్వరుని
నేరము లెంచకువే నీకుఁ దగదు
కూరిమితో నిను వేఁడుకొంటా నుండేటివాని—
తారుకాణచేఁతలెల్లాఁ దలఁపుసేయకువే ॥ ఘనుఁ ॥ 89

పాడి

ఇంకనేల కొంకను యిన్నియుఁ జెల్లుబడాయ
అంకెకు వచ్చినపని ఆపె దానే యెరుఁగు ॥పల్లవి॥

మోహముగలవాఁడవు మొక్కించుకో ఆపెచేత
పోహణించి నన్నేమి బుద్దెడిగేవు
సాహసివని పొగడి సాము సేయు మాపెతోడ
బాహుమూలములఁ గలపస తానే యెరుఁగు ॥ఇంక॥

పొందు సేసినవాఁడవు పొత్తున నాకెఁ బెట్టుకో
విందువలె నాతోనేల విచారించేవు
అందరిలో సంతోసించి ఆపెనే నీవడుగుము
మందలించి; నీ వాదేటిమాటలు దానెరుఁగు ॥ఇంక॥

పెండిలాడినవాఁడవు పిలువు నీవే యాపెను
అండనే నాతోనేమి ఆలోచించేవు
నిండుక శ్రీవేంకటేశ నీవు నన్ను నేలితివి
పండుమోవిగురుతులభావము దా నెరుఁగు ॥ఇంక॥ 90

రేకు 918. దన్నాసి

ఊడిగపునిబ్బరాన వొరపు లెరఁగరు
తాడుపడి గోళ్లేల తాఁకించేరే మీరు ॥పల్లవి॥

పన్నీట మజ్జనమార్చి పావడలఁ దడివొత్తి
చన్నులేల తాఁకించేరే సతులాలా
తిన్ననికప్పురధూళి తిరుమేననెల్లా మెత్తి
వున్నతపుఁ గొప్పులేల వూఁదేరే మీరు ॥ఊడి॥

తట్టుపుణుఁ గలది యెంతటా మెరుఁగులు వెట్టి
చుట్టుఁబయ్యెద లేఁటికి సోఁకించేరే
గట్టిగా సొమ్ములు వెట్టి కడుసింగారాలు సేసి
వట్టి మీ చెమటలేల వడియించేరే ॥ ఊడి ॥

అలమేలుమంగ నురమందు నెలవుకొలిపి
యెలమి శ్రీ వేంకటేశు నేలనవ్వేరే
బలిమి నానాజాతిపండ్లు నైవేద్య మిచ్చి
అలమి మోవిపండ్లవి యేమి చూపేరే ॥ ఊడి ॥ 91

రామక్రియ

ఏమి నెరపేవు మేకు లింతులెల్లాఁ జూడఁగాను
ఆమనివేడుకకాఁడ వౌదువయ్యా నీవు ॥ పల్లవి ॥

నీవద్దఁ గాచుకున్న నెలఁతుక వుండఁగాను
ఆవలా కెతో సరసమాడేవు
తోవలఁ బెళ్ళిచెట్లు మందుగాదనినమాటలు
నీవల్ల నే కానవచ్చె నెమ్మది నిందరికి ॥ ఏమి ॥

వరుసతోఁ బెండ్లాడినవనిత మాటాడఁగాను
పొరుగాపెతో నవ్వేవు పోరచిగాను
సరినున్న మేనవారు సరసగా రనుమాట
నిరతితోడుత నీవే నిజము సేసితివి ॥ ఏమి ॥

అలమేలుమంగ పురమందు నిట్టె వుండఁగాను
ఇల వీఁ పెక్కించుకొంటి వెన్నికగాను
భళి శ్రీవేంకటేశుఁడ పైకొసరు లాభమని
తెలిపితి విందరికి తేటతెల్లమిగాను ॥ ఏమి ॥ 92

### సామవరాళి

ఏమని విన్నవించేము యిట్టె కనుఁగొనవయ్య
మోమునఁ జేతులలోన మొక్కు లున్నవి ॥ పల్లవి ॥

నెలఁతమనసులోన సంతువలపు లున్నవి
సెలవినవ్వులలోన సిగ్గు లున్నవి
తలిరుమోవిమీఁద తరితీపు లున్నవి
కలువకన్నులలోన కాంక్ష లున్నవి ॥ ఏమ ॥

అంగనమాటలలోన నడియాస లున్నవి
రంగగుచన్నులపై కరఁగు లున్నవి
అంఁగపుసేవలలోఁ బ్రియములెల్లా నున్నవి
సింగారంపుఁగొప్పుమీఁద సేస లున్నవి ॥ ఏమ ॥

కప్పి యలమేలుమంగకాఁగిట నీమేనున్నది
చిప్పిలఁ జెక్కులమీఁద చిహ్న లున్నవి
యిప్పుడె శ్రీవేంకటేశ యిద్దరునుఁ గూడితిరి
నెప్పున నీకెవేల నీ వుంగర మున్నది ॥ ఏమ ॥ 93

### శంకరాభరణం

మాటలాడఁగదె మగనితో
ఆఁటదాని కింత యమరునా ॥ పల్లవి ॥

చెలులు బుద్ధులుచెప్పినా వినవు
చలము పతితో సాధింతురా
కలసి మెలసి కాఁపురాలు సేసి
అలుకలు మఱి యమరునా ॥ మాట ॥

నవ్వేవిభునితో నాలేల సేసేవు
రవ్వ లింతయేలే రామలకు
జవ్వనమదాన జడియుచు నుండి
అవ్వలిమోములు అమరునా ॥ మాట ॥

మచ్చికచుట్టాల మండాటు సేయవే
హెచ్చుఁగుందులేల యీవేళను
యిచ్చల శ్రీవేంకటేశుఁడు గూడెను
అచ్చమాయ సిగ్గు లమరునా ॥ మాట ॥ 94

నాదరామక్రియ

ఎంతగోస నాససేసేవేల మమ్ముఁ గొసరేవు
పంతము నీకిచ్చినదే పైకొంటగాదా ॥ పల్లవి ॥

యెదిరించి నీకుఁ జేతులెత్తి మొక్కినపుడే
కొదలేక నిన్ను వేఁడుకొంటగాదా
పొదిగి యేపొద్దు నీపొంత నున్నయపుడే
అదనఁ గూడుకొని నీయాల నౌటగాదా ॥ ఎంత ॥

కనుఁగొని కొలువులోఁ గాను కిచ్చినపుడే
చెనకి నీకుఁ బ్రియాలు చెప్పుటగాదా
ననుపుతో సెలవుల నవ్వునవ్వినప్పుడే
యెనసేననుచు నీతో నియ్యకొంటగాదా ॥ ఎంత ॥

మచ్చిక నీచెవిలోన మాటలాడినపుడే
కొచ్చికొచ్చి నీకాఁగిటఁ గూడుటగాదా
అచ్చపుశ్రీ వేంకటేశ అలమేల్మంగను నేను
మెచ్చి నీరతిఁ జొక్కితి మేలుదానఁ గాదా ॥ ఎంత ॥ 95

సామంతం

సారె వల పందరిపైఁ జల్లుచున్నాఁడు
తీరుగా సరసమాడి తిల్లగోవిందరాజు ॥పల్లవి॥

భరితమై మేడలోనఁ బవ్వళించి వున్నవాఁడు
తరుణులతో నవ్వుతా నున్నాఁడు
పరగ నందరిచేత పాట వింటానున్నవాఁడు
తెర దీసుకున్నవాఁడు తిల్లగోవిందరాజు ॥సారె॥

నేసపాలశిరసున సిగ్గుతోడ నున్నవాఁడు
ఆసపాటుచూపులచాయల నున్నాఁడు
బాసికపుసతులపై పాదాలు చాఁచుకున్నాఁడు
తీసిపెట్టుగానితమిఁ దిల్లగోవిందరాజు ॥సారె॥

భావపురతులఁ గూడి పంతముతో నున్నవాఁడు
శ్రీవనిత భూవనితఁ జేసుకున్నాఁడు
వావు లిందరికిఁ జెప్పి వన్నెకాఁడై పొందినాఁడు
దేవుఁడు శ్రీ వేంకటాద్రి తిల్లగోవిందరాజు ॥సారె॥ 96

రేకు 919 శంకరాభరణం

వింటిమయ్యా నేఁడు వీవేడికెలు
కంటిమయ్యా తోడుతనే కందువ వాడికెలు ॥పల్లవి॥

వలపుల తమ్మివిరివాటులు
సొలపులఁ బెనఁగినచోటులు
నెలకొని వున్న నీసీటులు
కొలువులో సుద్దులివి కొండలుఁ గోటులు ॥వింటి॥

వెల్లవిరిచూపుల నీవీదేలు
మెల్లనె తమకముల మేదేలు
కొల్లలు నీతమకపుగూడేలు
పెల్లురేఁగెఁ బుక్కిళ్ళ పెండ్లిపీదేలు ॥ వింటి ॥

పాలకూళ్ళలోననె పంతాలు
చాలా నమరె నీసంతాలు
యేలితివి శ్రీవేంకటేశ యలమేల్మంగను
యీలీల నాతో నాదేవు యేకాంతాలు ॥ వింటి ॥ 97

కాంబోది

ఏమిటికిఁ జేసేవే యెగసక్కేలు
కామించినరమణునిఁ గలయఁగరాదా ॥ పల్లవి ॥

కప్పి నిన్నాతఁడు తమిఁ గాఁగిలించుకొనఁగాను
యిప్పుడు నీవిన్నపము లేమిసేసేవే
ముప్పిరిదప్పికిని నీమోవితేనె లడుగఁగ
అప్పటిఁ బన్నీరేల అందియిచ్చేవే ॥ ఏమి ॥

సొలసి చక్కఁదనాలు చూచి యాతఁడు చొక్కఁగా
తల దువ్వి తురుము యెందాఁకాఁ బెట్టేవే
కలికి నీచన్నులకుఁ గడు చేయిచాఁచఁగాను
వెలయ నిప్పుడు యేల పీడె మందిచ్చేవే ॥ ఏమి ॥

శ్రీ వేంకటేశ్వరుఁడు చేరి రతిఁ గూడఁగాను
యీవేళనే పాదములు యేఁటి కొత్తేవే
కావిరి నేకతమునఁ గడు నీతో నవ్వఁగాను
చేవమీరి ఇఁకనేల సిగ్గువడేవే ॥ ఏమి ॥ 98

ముఖారి

నీవు మొదలు జాణవు నీకంటె నాకె జాణ
ఈవల నావల మిమ్ము నిద్దరి మెచ్చేము ॥ పల్లవి ॥

పయ్యద మాటుసేసుక పలుమారు నవ్వుకొంటా
వుయ్యాలమంచాన నిన్ను నూఁచీఁ జెలి
వొయ్యనె పాదాన నాపెవొడి నీవు దాఁకించఁగ —
నియ్యెడ సిగ్గువడీ నింతలో నీదేవులు ॥ నీవు ॥

పుక్కిటివిడెముతోడ పొంచి పొంచి చూచుకొంటా
వొక్కట నాకుమడిచి వొసగీఁ జెలి
చక్కనినీకొనగోరు చనుమొన నంటించఁగా
చెక్కు చేతమోపుకొని సిగ్గువడీ దేవులు ॥ నీవు ॥

తలివోనిగుట్టుతోడ తమకము రేఁచుకొంటా
యెనసి కాఁగిట మోవి యిచ్చీఁ జెలి
ఘనుఁడ శ్రీ వేంకటేశ కళలుమించఁ గూడఁగ
చెనకేచెలులఁ జూచి సిగ్గువడీదేవులు ॥ నీవు ॥ 99

మధ్యమావతి

ఏపాటిబత్తిగలఁదో యిటు నామీఁద
దాపుగా నాసుద్దులిట్టె తలపెట్టి చూడవే ॥ పల్లవి ॥

మనసు దెలియరాక మర్మము లడుగరాక
వొనగూడి గుట్టుతోడ నున్నదాననే
ఘనుఁడాతఁడన్నిటాను కాంతరో నీవై నాను
అనుమానించక మాటలాడించి చూడవే ॥ ఏపా ॥

కూరిమి గొసరరాక కొంగువట్టి తియ్యరాక
వోరుచుక సిగ్గుతోడ నున్నదాననే
నేరుపరి యీతఁడు నెట్టుకొని నీవైనా
చేరి వద్దివారిచేతఁ జెప్పించి చూడవే ॥ ఏపా ॥

బలిమి సేయఁగరాక పాసి వుండఁగరాక
వొలిసి కాఁగిటఁ గూడివున్నదాననే
యెలమి శ్రీ వేంకటేశుఁ దేలె నన్ను నీవయినా
సొలవక కోరికలు సోదించి చూడవే ॥ ఏపా ॥ 100

ముఖారి

ఏఁటికి నన్ను గుంపించే వేమే నీవు
చాటిచెప్పేవు నాకిది సఫలము గాదా ॥ పల్లవి ॥

కుప్పళించి నీవు నాకొంగువట్టి తీసేననే–
విప్పుడే లోకములెల్ల నేలనా నేను
పిప్పిగట్ట నీవు నాతో పెనఁగులాడవచ్చేవు
కప్పుచు నన్నైతే నాభాగ్యముగాదా ఇపుడు ॥ ఏఁటి ॥

చేరి చేరి నామీఁద చేతులు చాఁచవచ్చేవు
గారవించ నాకిది ఘనతగాదా
ఆరితేరి నామేన నటు గోరు సోఁకించేవు
నేరుపుతో నాకిది నిధానముగాదా ॥ ఏఁటి ॥

పిక్కటిల్లఁ గాఁగిట బిగియించవచ్చేవు
యెక్కువైనపదవి నా కిదేకాదా
చెక్కు నొక్కి కూడితివి శ్రీ వేంకటేశుఁడ నేను
చొక్కపురతు లివెల్లా సోబనముగాదా ॥ ఏఁటి ॥ 101

సింధురామక్రియ

ఒద్దనున్న కాంతలకు నుల్లములు గరఁగెను
సుద్దులేమి చెప్పేము చూతువురావయ్యా ॥ పల్లవి ॥

పట్టెమంచము మీఁదటఁ బవ్వళించీని చెలియ
నెట్టుకొన్న వేడుకతో నిన్నుఁ దలఁచి
గుట్టున మనోరథాలు గోరుకొంటా ముక్కుమీఁది-
జుట్టవేలితో నున్నది చూతువు రావయ్యా ॥ ఒద్ద ॥

వొక్కతె యేకతముననుండి యుల్లాసముతోడ
పక్కన నీమీఁదటిపదాలు వాడి
యిక్కువ నీమోవితేనె కేఁకట నోరూరుకొంటా
చొక్కి నిట్టూర్పులు నించీఁ జూతువు రావయ్యా ॥ ఒద్ద ॥

ఇట్టె నీవు రాఁగా శిరసెత్తి నీమొగము చూచి
గట్టిగా శ్రీవేంకటేశ కాఁగిట గూడిఁ
నెట్టుకొని రతులను నిన్ను మెప్పించీ దినముఁ
జుట్టి చుట్టి ఇట్లానే చూతువు రావయ్యా ॥ ఒద్ద ॥ 102

రేకు 920 సామంతం

ఏమిటికిఁ దలవంచే వేల సిగ్గులువడేవు
కామించి వచ్చేఁగాక గాతసేయవచ్చెనా ॥ పల్లవి ॥

మచ్చిక నీతోఁ జెలి మాటలాడ వచ్చేఁగాక
పచ్చిగాఁ జేఁకటితప్పు పట్టవచ్చెనా
ముచ్చటదీరఁగ నీమోము చూడవచ్చేఁగాక
తెచ్చుకొన్నయాకెతో వాదించవచ్చెనా ॥ ఏమి ॥

అట్టె నిన్ను వీడె మడుగఁగ వచ్చెఁగాక
　దిట్టయై నీచేఁతలు సోదించవచ్చెనా
నెట్టన నీసేవసేయ నెయ్యముతో వచ్చెఁగాక
　గట్టిగా నీచేస్తాలు కాకుసేయ వచ్చెనా ॥ఏమి॥

మిక్కిలి కాఁగిటఁ గూడి మెప్పించవచ్చెఁగాక
　కక్కసించి నీపై నధికము వచ్చెనా
మొక్కుచు శ్రీవేంకటేశ మోవి యానవచ్చెఁగాక
　పక్కన నాపెను నిన్నుఁ బచ్చిసేయవచ్చెనా ॥ఏమి॥ 103

మలహరి

ఇంతసేతురా యిటువలె రమణుని
　యింతివి నిను నెలయించె ననుచును ॥పల్లవి॥

సారెకు నేఁటికి జంకించేవే
　కేరుచు నతఁడు నగె ననుచును
జీరలుగా గోరఁ జిమ్ముదురటవే
　వూరకె పరాకై యుండె ననుచును ॥ఇంత॥

పెనుఁదురు మేఁటికిఁ బిడికిటఁ బట్టేవే
　ననుపున నీతోఁ బెనఁగె ననుచును
అనుగుకుచంబుల నదుముదు రటవే
　తనలో నొకతెను తలఁచె ననుచును ॥ఇంత॥

జంటల నింతేల చలములు మీరేవే
　నంటున నీతో నెనసె ననుచును
ఇంటిలో శ్రీవేంకటేశు జరతురటే
　అంటుచు సరసములాడె ననుచును ॥ఇంత॥ 104

శుద్ధవసంతం

వేడుకకు వెలలేదు విభుఁడ వాకెకును
జాడలెల్ల సరివచ్చె సమ్మతాయ మాకును ॥ పల్లవి ॥

తచ్చితచ్చి మాటలలోఁ దనవల పఁ(పం?)తయును
యెచ్చరించెఁగా నేఁడు యింతి నీకు
పచ్చిచేఁతలనే నీతోఁ బచరించవచ్చెఁగా నను
యిచ్చకముగాఁ బొంచి యిందరిలోన ॥ వేడు ॥

నెలవినవ్వులలోనే చేనేటివిన్నపాలెల్లా
తలఁపించెఁగా నేఁడు తరుణి నీకు
పిలిచేనేరుపులోనే బెరయించెఁగా పగటు
నలువై నీమెచ్చుగాను నడుమఁ దాను ॥ వేడు ॥

కూడినకాఁగిటిలోనే గురుతైనకాఁపురాలు
యీడేరఁ జేసెఁగా యీసతి నీకు
జోడై శ్రీవేంకటేశ చొక్కి నన్ను నేలితివి
వీడెమిచ్చెఁగా మఱియు వింతలేక యిపుడు ॥ వేడు ॥ 105

బౌళిరామక్రియ

ఏమాయనయా యింతటిలోనే
కామునికి నివి గలసహజములు ॥ పల్లవి ॥

చనవరికాంతలు సరసములాడఁగ
ననుపున విభుఁడవు నవ్వితివి
పెనఁగుచు రమ్మని పేరునఁ బిలువఁగ
పనివడి యట్టే పలికితివి ॥ ఏమా ॥

కొలువుకామినులు కుచములు చూపిన
సొలయుచుఁ దప్పక చూచితివి
కలువపువ్వులటు కానుక లిచ్చిన
అలరి కరంబుల నందితివి ॥ ఏమా ॥

వూడిగపుసతులు వొడివట్టుకొనిన
వేడుకతోఁ బెండ్లాడితివి
యీడనె శ్రీవేంకటేశ నన్నెనసి
తోడనె దోమటి దొడికితివి ॥ ఏమా ॥ 106

సాళంగనాట

వెక్కసపువలపుల విఱ్ఱవీఁగేవు
మక్కువలు మారుకొంటే మఱి యేమిసేసేవే ॥ పల్లవి ॥

యింతులెల్లా నుండగాను యేకతము నీవాదేవు
చెంతనుండి విభునికి సేవసేసేవు
యెంత కెత్తుకొంటివే నీ వించుకాఁ దగవెంచవు
యింతలో దొమ్మి సేసితే నేమిసేసేవే ॥ వెక్క ॥

సరివారిలోననెల్లా చనవులు నెరపేవు
గరిమ నాతనితోడఁ గడునవ్వేవు
దొరతన మెంతగద్దే తోడివారిఁ గైకోవు
నిరతి దొమ్మి గూడితే నీ వేమిసేసేవే ॥ వెక్క ॥

కావరించి చెనకేవు కాఁగిటనుఁ గూడేవు
శ్రీవేంకటేశ్వరునిఁ జెలఁగించేవు
దేవుల వౌదువే ఆ దేవుడే మమ్మును నేలె
యీవిధాన సంతమైతే నిఁక నేమిసేసేవే ॥ వెక్క ॥ 107

ద్రావిళభైరవి

ఆసపడ్డవారిని అలయింతురా
పోసరించి యేల జరపులఁబెట్టే విఁకను ॥ పల్లవి ॥

కన్నులనే మొక్కితి కైదండ నీకిచ్చితి
విన్నపములు సేసితి వేమారును
యెన్నిక యింతటనైనా యింటికి రారాదా
సన్నల నెందాఁకా రచ్చలుసేసే విచ్చట ॥ ఆస ॥

సేవలెల్లాఁ జేసితి చెక్కులు నే నొక్కితి
వేవేలకుఁ గొసరితి వేమారును
చేవదేర మంచముపైఁ జేరి కూచుండరాదా
తోవల చెలులతో సుద్దు లేమిటి కిపుడు ॥ ఆస ॥

కందువ లిట్టే యంటితి కాఁగిలించుకొంటిని
విందుగా శ్రీవేంకటేశ వేమారును
పందెము లేమాడేవు పవ్వళించరాదా
చెందితివి నన్ను నేఁడుఁ చింతలు మరేఁటికి ॥ ఆస ॥ 108

రేకు 921 ఆహిరి

ఎవ్వరేమిచెప్పేరు యిఁక నీకును
నివ్వటిల్ల నింకా నవే నేరుచుకోవయ్యా ॥ పల్లవి ॥

ఆసపడి రతులకు నండనుండి చిత్తమురా
సెనేఁగా ఆకె నీకు సేవలెల్లాను
పూసగుచ్చినట్టు చెప్పి బుద్ధులెల్లా నీకు నూరి–
పోసెఁగా చెవిలోనను పొద్దువొద్దు నీకును ॥ ఎవ్వ ॥

---

క్రీగీతలు గలవి చిలుము తిన్నవి.

వాడికగా నీమీఁద వలపులు చల్లిచల్లి[1]
వీడెమిచ్చెఁగా నీకు వేడుకతోను
యేడలేనిసుద్దులెల్లా నెచ్చరించి యింతేసి
తోడ సామునేయించెఁగా దొరతనమునను ॥ ఎవ్వ ॥

చెక్కునొక్కి నేసవెట్టి నేఁతలెల్లాఁ జేసి చూపి
చిక్కించెఁగా ఆపె నిన్ను శ్రీవేంకటేశ
మక్కువతో నీచేత మన్నింపించి నన్ను మెచ్చి
మిక్కిలి నవ్వునవ్వెఁగా మేరమీరి నిన్నును ॥ ఎవ్వ ॥ 109

మంగళకౌశిక

అన్నిసేవలునుఁ జేసీ అంగన నీకు
సన్నల నీతో నట్టె సరసమాడీని ॥ పల్లవి ॥

కామించి సిగ్గులతోడ కంకణాలు గదలఁగ
వేమారుఁ బాదము లొత్తీ వెలఁది
ఆమనివలపుతోడ నంగమెల్లాఁ జెమరించ
గోమున నప్పటి నీకుఁ గొప్పువెట్టీని ॥ అన్ని ॥

నెలవినవ్వులతోడ చెక్కిన పయ్యెద జార
మలయుచు వీడెమిచ్చీ మగువ
పులకచెక్కులతోడ పొందులు(ల?) తలఁపు రాఁగ
వెలయ సురటి నీకు విసరీని ॥ అన్ని ॥

నిట్టూరుపులతోడ నిండునివ్వెరగుతోడ
గుట్టున గుబ్బల నొత్తీఁ గోమలి
యిట్టె శ్రీవేంకటేశ యేలితివి నన్ను నేఁడు
జట్టిగొని యాపె యింకా చవులు చూపీని ॥ అన్ని ॥ 110

1. ఇక్కడ పాదవిభాగపుగురుతు లేదు.
ఁక్రిగీతలు గలవి చిఱుము తిన్నవి.

సింధురామక్రియ

[1]ఎంత నీవు పోతరించి యింపులఁ బెనఁగినాను
వంతుకుఁ గొంగువట్టితి వదలకు మనవే ॥పల్లవి॥

కాతరించి రమణునిఁ గలకాలమెల్లా నీవే
చేతఁ జొక్కించుకొంటివి చెప్పేదేమే
యీతల నాతఁడే మాయింటికి విచ్చేసె నేఁడు
నీతితోడ విలుపక నేనేల విడుతునే ॥ఎంత॥

బలిమితో మగవాని బాసలు చేయించుకొని
యెలయించి కైకొంటివి ఇంకానేమే
వలపించి యాతని నావద్దికి రప్పించుకొంటి
వెలయ భోగించక నీవెంట నేలంపుదునే ॥ఎంత॥

కందువ శ్రీవేంకటేశుఁ గాఁగిటిరతులఁ గూడి
అందరిలో మెరసితి వప్పటినేమే
ముందుముందె నే నాతనిమోవితేనె దక్కఁగొంటి
అందముగఁ బెండ్లాడక అదేల మానుదునే ॥ఎంత॥ 111

కేదారగౌళ

నీవైనా నానతీవయ్యా నెరజాణవు
తావుల నీదేవులైతే దాఁపిరము నేసెను ॥పల్లవి॥

పొలఁతి నీమాటలకు బొమ్మల జంకించి చూచి
తలవంచి సిగ్గుతోడఁ దడఁబడీని
అలరి చెలికత్తెలు ఆరహస్య మడిగితే
తెలియఁ జెప్పఁగరాక తెరవేసుకొనెను ॥నీవై॥

1. సవతుల సంవాదమిది.
త్రిగీతలున్నవి చిలుము బలిసినవి.

అప్పటి నీసేఁతలకు నాయములు సోఁకనాడి
కప్పుకొన్నపయ్యదతో కాఁతాళించీని
వొప్పుగ నూడిగములవువిద లడిగితేను
ముప్పిరి నొడుగరాక ముసుఁ గిడుకొనెను ॥ నీవై ॥

నీవు నవ్వినవ్వుకు నీతురుము వట్టి తీసి
వోవరిలోపలఁ గూడి వొగి మెచ్చీని
శ్రీ వేంకటేశ నీదేవు లలమేలుమంగ
వోవల నడిగితే నీవుర మెక్కకొనెను ॥ నీవై ॥ 112

ఆహిరినాట

ఏల గడించుకొనేవు యేడలేనికతలును
లోలోనే గుబ్బతిల్లక లోనికి రావయ్యా ॥ పల్లవి ॥

చిగురుమోవిమీఁద చిప్పిలుఁదేనె గారితే
వొగరుఁదిట్లనేవు వూరకే నీవు
మగువ నీమీఁదట మచ్చరించి పలుకఁగ
నిగిడి యింతటిలోన నీవేమి సేసితివి ॥ ఏల ॥

నలిఁ జంద్రవదనాన నవ్వువెన్నెల గాసితే
అలరుచు నెగసక్కెలనేవు నీవు
చెలియ నీమీఁదట చిట్టకము నెరపఁగ
నెలకొన్నయట్టితప్పు నీవేమి సేసితివి ॥ ఏల ॥

జక్కవ చనుముక్కలు సరివాఁడు లైతేను
వుక్కునఁ గాఁగిట నిన్ను నొత్తెననేవు
అక్కున శ్రీ వేంకటేశ అలమేల్మంగ జరయ
నిక్కి పానుపుమీఁదట నీవేమి సేసితివి ॥ ఏల ॥ 113

సాళంగనాట

వేడుకకాఁడ వౌదువు వింతమాసటీఁడ వౌదు—
వేడ చూచినా మెచ్చేరు యింతులెల్లా మిమ్మను ॥ పల్లవి ॥

తెలుపఁ బెండ్లియాడి తేరుమీఁద నేఁగిరాఁగా
చిఱుఁజెమటలు గారెఁ జెక్కులమీఁద
మెఱయుచు వీదులను మించి విఱ్ఱవీఁగఁగాను
నెఱవాదిసాముల నిట్టూర్పులు నిండెను ॥ వేడు ॥

బాసికము గట్టుకొని పడఁతితో మెఱయఁగ
నేసముత్తేలు చూపట్టె శిరసులపై
ఆసతో వాడలనెల్లా నారతులెత్తించుకోఁగా
పోసరించి మోముల గొబ్బున మించెఁగళలు ॥ వేడు ॥

అలమేలుమంగఁ గూడి అట్టె వసంతాలాడఁగ
చెలఁగెఁ బులకలు మెయి శ్రీవేంకటేశ
వెలయ నిండ్లనెల్లా విందు లారగించఁగాను
వలపులు మోవిమీఁద వన్నెచూపె నిపుడు ॥ వేడు ॥ 114

రేకు 922 అమరసింధు

ఎంతబత్తో నీమీఁద నీరమణుఁడు
చెంతనుండి ఇయ్యఁగదే చేతికి బాగాలు ॥ పల్లవి ॥

పయ్యదకొంగు వట్టి పతి నీతోఁ బెనఁగీని
ఇయ్యకొని రాఁగదవే ఇంటికి నేఁడు
చెయ్యార నప్పటి నీచెక్కు నొక్కి వేఁడుకొనీ
వుయ్యాలమంచముపైఁ గూచుండఁగదె సరుస ॥ ఎంత ॥

నెట్టుకొనఁ గాఁగిలించి నిన్ను నొడఁబరచీని
అట్టె కానిమ్మనఁగదె అతనితోను
వొట్టుకొని పాదము నీవొడిమీఁదఁ జాఁచీని
గుట్టుతో నానతిచ్చి నూఁకొనఁగదె మాట ॥ ఎంత ॥

చెలరేఁగి మంతనాన శ్రీ వేంకటేశుఁ డెనసె
అలమేలుమంగవు నీవలమఁగదె
పలుమారు నవ్వుతాను బాసికము గట్టీని
చలమెల్లా నీడేరె చల్లఁగదె నేస ॥ ఎంత ॥ 115

సాళంగం

ఆయనాయ నుండవయ్య అలసితివి
చేయిమీఁదుగా నన్నుఁ జెనకేవు ఇపుడు ॥ పల్లవి ॥

వెలి నింతలో నొక్క వెలఁదికాఁగిట నుండి
కలలోన నొకకాంతఁ గలతువు
యెలమి నీయానోద మేమిచెప్పే దప్పటిని
కొలఁదిమీరఁగ నాకొంగువట్టే విపుడు ॥ ఆయ ॥

శిర సీవలఁ బెట్టుక చెలితో మాటాడుతానే
తెరలో నొక్కతెఁ గూడి కెరలింతువు
గొరబులుగానీ నీగుణము లెట్టు గనేది
సరి నాపై నిదివో నేసలు చల్లే విపుడు ॥ ఆయ ॥

వెలయ భూకాంతను వీఁపునను మోచుకొని
అలమేలుమంగ నురమందు మోచేవు
తెలిసి శ్రీ వేంకటేశ దేవిగా నన్నేలితివి
వలెనని మువ్వంకలా వలచితి విపుడు ॥ ఆయ ॥ 116

భైరవి

ఆదరించవయ్యా అంగన నింతటనైనా
పోదివలపులు తలపోయుచున్నది || పల్లవి ||

చెప్పరానిప్రియములు చేరి నీకుఁ జెప్పఁగాను
దప్పిదేరీ మోవిమీఁద తరుణికిని
వుప్పతిల్లు నేవ నీకు వొద్దనుండి సేయఁగాను
చిప్పిలఁగఁ జెమరించె చెక్కులెల్లాను || ఆద ||

ననుపులు చేసుకొని నవ్వు నీతోనవ్వఁగాను
నినుపులై నిగిడీని నిట్టూర్పులు
తనియక వీడెమిచ్చి తగ నిన్ను వేఁడుకోఁగా
వొనరెను పులకలు వొళ్ల నెల్లాను || ఆద ||

కలికితనాలు చూపి కాఁగిలించు కొనఁగాను
మలసీని కోరికలు మనసునను
అలమేలుమంగ నేలి తట్టె శ్రీ వేంకటేశ
నెలకొనె వేడుకలు నిలువెల్లాను || ఆద || 117

శోకవరాళి

ఏమి విన్నవించేము యెందాఁకా నీకు
నీమనసునఁ గలట్టు నెలఁతను గావుము || పల్లవి ||

పంతగాఁడ వౌదువయ్య పడఁతి నింతసేసేవు
ఇంతకీర్తి గట్టుకొంటి విప్పుడు నీవు
మంతనానఁ జెలువెల్లా మంచివాఁడవని నిన్ను
వంతులకుఁ బొగడేరు వాడలవాడలను || ఏమి ||

బలువుఁడ వౌదువయ్య బయలీఁదించితి వింత
చల మీడేర్చుకొంటివి సాదువలెనె
సులభాననే నీకీసుకృతము చేరెను
నలుగడ నవ్వేరు నమ్మినట్టివారలు ॥ ఏమి ॥

నిరతపుజాణవయ్యా నేఁ డింటికి విచ్చేసి
గరిమఁ గూడితి వీకెఁ గరుణించి
సిరుల శ్రీవేంకటేశ చేఁతలు చందము లాయె
ఆ(అ?)రుదుగ మెచ్చేరు అందరు నీకతలు ॥ ఏమి ॥ 118

ఆహిరి

తెలవ మొక్కఁగాఁ బిరితియ్యఁ దగవుగాదు
గుఱిగా మన్నించవయ్య కొసరేల ఇఁకను ॥ పల్లవి ॥

పంతమాడనేరుతువు భావించనేరుతువు
యింతులను లాలించ నెఱఁగవా
అంత నీవు నేసినందు కాకె యలిగివున్నది
సంతము నేసుకోవయ్య చలమేల యిఁకను ॥ తెల ॥

పెనఁగనేరుతువు పెండ్లాడనేరుతువు
అనిశముఁ జనవియ్య నది నేరవా
యెనయ నిన్న రానందు కిటు మాటాడకున్నది
మనసు నమ్మించవయ్య మరఁగేల ఇకను ॥ తెల ॥

కలయఁగనేరుతువు కాఁగిలించనేరుతువు
అలరి యురమున మోయఁగనోపవా
కలికి శ్రీవేంకటేశ కైవశమై నీకున్నది
నెలవి నవ్వించవయ్య చెప్పనేల ఇఁకను ॥ తెల ॥ 119

ముఖారి

ఎంతగద్దో నీయాసోద మిప్పు డీకెకు
చింతదీర మనసులో చిక్కవాపరాదా ॥ పల్లవి ॥

నను పున నొకమాఁటు నాతో మాటాడితివంటా
గునిసీ తప్పకచూచి కోమలి నిన్ను
పనివడి నీవాపెతో పచ్చిమాటలెల్లా నాడి
వెనకటిగఁజరెల్లా విడిపించరాదా ॥ ఎంత ॥

సమ్మతి నామోము చూచి సరసమాడితివంటా
వుమ్మడిఁ జన్నుల నొత్తీ నువిద నిన్ను
చిమ్ముచు నీ కొనగోర జీరలు మేనెల్లాఁ జేసి
దిమ్మరేఁగినమదము తెలుపఁగరాదా ॥ ఎంత ॥

నవ్వుతా నప్పటి నీవు నన్నుఁ గూడితివంటా
రవ్వగా తాఁ గాఁగిలించీ రతికి నిన్ను
యివ్వల శ్రీవేంకటేశ యెదురుగా నాపెఁ బెట్టి
కువ్వలైనకూటముల గుదిగుచ్చరాదా ॥ ఎంత ॥ 120

రేకు 923 హిందోళం

ఇద్దరివసంతము లీడేరెను
వుద్దండాలు మాని ఇంక నూరకుండరాదా ॥ పల్లవి ॥

కామిను లిందరు నిన్నుఁ గాఁగిటఁ బెట్టుకుండఁగా
నీమీఁదఁ జె(జ?)ల్లెఁగా పన్నీరు చెలి
యేమరించి విడిపించు కేతెంచి నీవాకె—
కోమలపుఁజన్నులపై కుంకుమ చల్లితివి ॥ ఇద్ద ॥

పూడిగాలవారిచేత నొంటి నడెవెట్టించి
జాడతోఁ గప్పురధూళి చల్లేఁగా నీపై
వోడక నీవప్పటిని వొడ్డి తప్పించుక కొప్పు
పీడఁగా నాపెమీఁద విరుల వేసితివి ॥ఇద్ద॥

దొమ్మి నడపాలవారి దోమతెర వేయుమని
చిమ్మేఁగా గందము నీపై శ్రీవేంకటేశ
యెమ్మెతో నీకెఁ గూడి ఇంపులచెమటలకు
కమ్మరఁ గమ్మర నట్టె కస్తూరి నించితివి ॥ఇద్ద॥ 121

దేవగాంధారి

బడలెను పానుపు పరచరే
అడుగరే యిదియేమియని చెలులు ॥పల్లవి॥

చెలపచెమటలు మైఁ జిప్పిలీని
అలసి వచ్చినాఁడు నేఁ డదే విభుఁడు
చలువగాఁ గప్రము పైఁ జల్లఁగదరే
వెలయ సురటిఁగొని విసరరే ॥బడ॥

పొనుగు నిట్టూరుపుల బుసకొట్టీని
పనిసేసి వచ్చినాఁ డప్పటి విభుఁడు
తనివారఁ బల్లనిగందము మెత్తరే
నీనుపుగఁ బన్నీరు నించరే ॥బడ॥

డాఁగక దప్పి మోవులు దడిపీని
కాఁగి వచ్చినాఁడు శ్రీ వేంకటవిభుఁడు
పాఁగి వాసించినబాగా లియ్యరే
చేఁగదేర నన్ను నేలె సేవలెల్లాఁ జేయరే ॥బడ॥ 122

పళవంజరం

ఎంత వేడుకకాఁడవో యీపెకు నీవు
అంతరంగమెల్లా మాకు నానతీవయ్యా ॥ పల్లవి ॥

కాంతకానుక యెంత కనుపట్టి వుండెనో
అంతటిలోఁ జేయిచాఁచే వందరిలోన
బంతి నాపెసరస మేపాటి మేన నంటెనో
వింతయి మోముకళల విఱ్ఱవీఁగేవు ॥ ఎంత ॥

చెలియపలుకు లెంత చెవిసోఁకి వుండెనో
అలరి యప్పటి మాఁట లడిగేవు
మలసి యీపెచూపు మర్మము లెట్లంటెనో
తలపోసి రతులకుఁ దమకించేవు ॥ ఎంత ॥

మగువవలపు లెంత మనసునఁ బట్టెనో
నగి నగి సారెసారె నంటుచూపేవు
జిగి నన్నుఁ గూడితివి శ్రీవేంకటేశ నేఁడు
పొగడి యీపెను నాతోఁ బురుఁడు వెట్టేవు ॥ ఎంత ॥ 123

సోమరాగం

మాతో నేమి చెప్పేవు మాపుదాఁకాను
యీతరవాతనే నీవు యియ్యవయ్య చనవు ॥ పల్లవి ॥

అనరాదుగాక నిన్ను ఆపెయెదుటనే నీవు
ననిచి వేరొకతెతో నవ్వనేఁటికి
మనసిచ్చి యందుకుఁగా మాటలాడదాయ నేమో
పెనఁగి చేవట్టితీసి పెట్టవయ్య విడెము ॥ మాతో ॥

అట్టునేయరాదుగాక నెట్టన పతిచెలితో –
నట్టె నీవు జూజము లాడవచ్చునా
ఇట్టె యిందుకుఁగానే ఇంటిలోనే వున్నదేమో
గుట్టున వద్దఁ గూచుండి కూడవయ్య కాఁగిట ॥ మాతో ॥

తప్పు మోపరాదుగాక తరుణి నిట్టె కూడి
కప్పులు దేరఁగ మోవి గంటిసేతురా
చిప్పిలి యిందుకుఁగాను సిగ్గువడి వున్నదేమో
అప్పటి శ్రీవేంకటేశ చెప్పవయ్య ప్రియము ॥ మాతో ॥ 124

వరాళి

ఒక్కరు నోచిననోము వొకరికి ఫలియించె
నెక్కొని చూడ నిద్దరు నీదేవుళ్లేకారా ॥ పల్లవి ॥

మరిగి మీరిద్దరును మంచముపై నుండఁగాను
తరుణి తొంగిచూచి తలవంచెను
సరుసనున్నయాపెకే చాల నీవు వలతువు
నిరతి వెలినున్నాకె నీకే వలచును ॥ ఒక్క ॥

కందువ మీ రిద్దరును కాఁగిలించుకుండఁగాను
చెంది వేరొకతె చూచి సిగ్గువడెను
అంది ఆయాలంటినాపె కటు నీవు చిక్కితివి
విందువచ్చినాకె నీవేడుకకుఁ జె(జి,జొ?)క్కెను ॥ ఒక్క ॥

పొంచి మీ రిద్దరు మోవిబువ్వపుతేనె లానఁగా
పొంచుకున్నయాకె తాను పొత్తుగూడెను
యెంచఁగ శ్రీ వేంకటేశ ఇచ్చకుఁడ వొకతెకు
నించి వేరొక్కతెమైతే నీఇచ్చలోనిది ॥ ఒక్క ॥ 125

సామంతం

అంత మనసునఁ గద్దు ఆపెకు నీమీఁదిబత్తి
　సంతోస మప్పటిఁ జేసీ చనవియ్యవయ్యా ॥ పల్లవి ॥

ఘనమైననీదుచక్కనిరూపు చూచిచూచి
　తనివి దీర దెంతైనాఁ దరుణికిని
　పనివడి నీవలెనే బంగారుపతిమఁ జేసి
　వెనుకొ నాపెమోమున వేలఁగట్టవయ్యా ॥ అంత ॥

సరసములాడి నీతో సారెకు నవ్వులు నవ్వి
　మరిగియున్నది నీపై మచ్చికలెల్లా
　సరుసఁ గూచుండి నీవు చవులుగాఁ జెనకుచు
　కెరలించి కెరలించి గిలిగించవయ్యా ॥ అంత ॥

ముట్టి నీపాదము లురమున నిడుక వొత్తుచు
　యిట్టె పాయదు శ్రీవేంకటేశ విన్నను
　నెట్టన నన్నేలితివి నీవింకా సొమ్ములు సేసి
　మెట్టి నీపాదుక లాపెమెడఁ గట్టవయ్యా ॥ అంత ॥ 126

రేకు 924　　　　శుద్ధదేశి

ఏది నిజమని వుందు మెరుఁగించవయ్యా మాకు
　మేదించి వలపు లిరుమేలాఁ బూసేవు ॥ పల్లవి ॥

విన్నపము నేఁ జేయఁగ వీనులనే వింటివి
　కన్నుల నాపెఁ జూచేవు కమ్మటి నీవు
　చన్నుల నే నొత్తితేను సరిఁ బులకించేవు
　సన్న లాపెకుఁ జేసేవు సారెసారె నిపుడు ॥ ఏది ॥

మాటలు నే నాడఁగాను మచ్చిక నూఁకొంటివి
గాఁటాన మోవి చూపేవు కడు నాపెకు
యీటున నే నవ్వితేను యిచ్చగించే విందుకు
పాటించి మన సాపెపై నిలిపేవు ॥ ఏది ॥

పిలిచితే వచ్చితివి ప్రియాన మాయింటికి
యెలమి నాసపడేవు ఇంకా నాపెకు
కలసితి విటు శ్రీ వేంకటేశ్వర నన్నును
తొలుతటిపొందు లాపెతోఁ బొదిపేవు ॥ ఏది ॥ 127

పాడి

ఎట్టు నమ్మించేవో నీవే యెరుఁగుదువు
ఇట్టె అన్నిపనులు నెంచుకొని వున్నది ॥ పల్లవి ॥

మనసు రంజిల్ల నీతో మాటలాడెఁగాని చెలి
వెనకటిసుద్దులెల్లా వినియున్నది
యెనసి వేడుకతో నీకిచ్చకమాడీఁ గాని
అనుగు నీగుణములు అరసే [1]నన్నది ॥ ఎట్టు ॥

నెలవి నవ్వుదెచ్చుక చేరి నీతో నవ్వేఁగాని
కలికి నీచేఁతలెల్లాఁ గని వున్నది
వలచినదై నీతో వాదించఁజాలదు గాని
సొలసి నిన్నేకతాన సోదించే నన్నది ॥ ఎట్టు ॥

ఆసలు మానఁగలేక అట్టె నిన్నుఁ గూడెఁగాని
బాసలు నేయించుకొనఁ బరగున్నది
లాసి శ్రీ వేంకటేశ నీలాగు దెలిసెఁగాని
మూసినముత్యమై నీముంగిటనే వున్నది ॥ ఎట్టు ॥ 128

[1] అరసేను + అని

బౌళి

ఇంకానేల దాఁచేవు యెదుటగుదురుగాను
సొంకపునీగుణములు యీబూమెల్లా నెఱఁగదా ॥పల్లవి॥

వుంకించి నిన్నిందరిలో వొడివట్టి తీసితేను
జంకించి వద్దని యేల సన్న సేసేవు
కుంకుమచన్నులచొప్పు గురిగా నీమేన నంటె
లంకెల నీసుద్దులు యీలలన లెరఁగరా ॥ఇంకా॥

జలజాక్షులనుఁ గూడ జాణవని పొగడితే-
నెలమి నోరేల మూసే వింతలోనను
పలుసోఁకులమచ్చము పట్టిఇయ్యఁదొడఁగెను
వొళవైననీవోజ యీవొద్దివా రెరఁగరా ॥ఇంకా॥

సొరిది నీనాసందిచుట్టరికాలు చెప్పితే-
నెరవుసేయకుమని యేల మొక్కేవు
నిరతి శ్రీవేంకటేశ నిలువెల్లాఁ బచ్చిదేరె
పొరి నీపొందు లిరుగుపొరుగు లెఱఁగరా ॥ఇంకా॥ 129

ఆరిబి

ఒక్కరిఁ గాదనలేక వూరకున్నాఁడవు నీవు
మక్కువతో నెవ్వరిపై మనసున్నదయ్య ॥పల్లవి॥

ఇంతి నిన్నొకతె తమఇంటికిఁ బిలిచితేను
పంతాన వేరొకతె చెయివట్టి తీసీని
వంతులకు నిరుమేలా వలపులు దైవారి
పొంతల నెవ్వరితోడ పొందుసేసేవయ్య ॥ఒక్క॥

---

త్రిగీతయుగంల స్థలమున చిలుమెక్కువగ నున్నది.

కోమలి యొకతె నీకుఁ గొప్ప గడుదువ్వితేను
వేమారుఁ బాదాలొత్తి వేరొక్కతె
నేమాన నెదురుబడి నెయ్యము లాసలు చూపి
చేముంచి యెవ్వరిచేత సేవగొనేవయ్య ॥ఒక్క॥

కందువ నొకతె నిన్నుఁ గాఁగిలించి కూడితేను
సందడిఁ బెండ్లాడీని సరి నొక్కతె
ఇందులోనే కూడితివి యిద్దరి శ్రీవేంకటేశ
విందుచెప్పి యెవ్వతెకు వీడెమిచ్చేవయ్య ॥ఒక్క॥ 130

శంకరాభరణం

గుట్టున నుండవే కోమలి
జట్టిగొనుచు నిను జరసీ నిపుడు ॥పల్లవి॥

సముకాన నతఁడు సరసమాడఁగా
తమకించకువే తరుణీ
చెమటలు నీమేనఁ జిప్పిలఁగఁ జూచి
తిమురుచు రమణుఁడు తెగడీ నిపుడు ॥గుట్టు॥

చెలిమిసేసి పతి చేకొనఁగానే
బలిమిసేయకువె పడఁతీ
పులకలు చెక్కుల పొదిగొనఁ గనుఁగొని
నలుగడఁ దా నటు నవ్వీ నిపుడు ॥గుట్టు॥

సొరిది శ్రీవేంకటేశుఁడు గూడఁగానె
గరిసించ నేఁటికే కలికీ
నిరతి మోమునఁ గళ నిండఁగ దిష్టించి
కెరలుచు నీతఁడే కేరీ నిపుడు ॥గుట్టు॥ 131

సౌరాష్ట్రం

చెప్పరయ్య వూడిగాలు సేసేము నేము
చిప్పిలుమోవితేనెలు చిమ్మనేల సిగ్గులు ॥ పల్లవి ॥

మచ్చికలు దైవారె మదనకళలు దేరె
యిచ్చలో నిద్దరికిని యింపులు మీరె
తచ్చి సతు లాడుకొంటే తలవంచుకొననేల
పచ్చియైతి రిఁకనేల పలుమారు సిగ్గులు ॥ చెప్ప ॥

అంగాలఁ జెమట మించె ఆసలు లోలోఁ బొంచె
రంగుగా నిద్దరి సింగారములు ముంచె
ముంగిటిచెలులతోడ మూసి మంతనములేల
యింగిత మెఱఁగవచ్చె నిఁకనేల సిగ్గులు ॥ చెప్ప ॥

తలపోఁతలెల్లా దక్కె తనువులు కడుఁ జొక్కె
కలసితి రిద్దరిభోగములు నిక్కె
యెలమి శ్రీవేంకటేశ యిందరితో మఱఁగేల
యెలుఁగెత్తి నవ్వరాదా యిఁకనేల పిగ్గులు ॥ చెప్ప ॥ 132

రేకు 925 ఆహిరినాట

మాముందర నింత యాల మతకాలు నెరపేవు
గామిడివి గావోయి కడపరాయా ॥ పల్లవి ॥

కందువ సేవలు సేసి కడునవ్వులు నవ్వీని
పొందు గద్దా తొల్లి నీకుఁ బొలఁతితోను
విందు చెప్పవచ్చీని విడెము చేతి కిచ్చీని
అందెనో పొదఁబొట్లు ఆపెకు నీకు ॥ మాముం ॥

ఆసలచూపులు చూచి అంటి ముట్టి పెనఁగిని
బాస సేసితివో తొల్లి పడఁతికిని
సేసలు పైఁజల్లిని చెంగటఁ గొలువుసేసీ
ఆసుద్ది లోనగూడెనా ఆపెకు నీకు ॥ మాముం ॥

కాయము చన్నుల నొత్తి కాఁకదేరి మాటలాడీ
ఆయనా చుట్టరికము అంగనతోను
యీయెడ శ్రీవేంకటేశ ఇటు నన్ను నేలితివి
అయితమా పెండ్లికి ఆపెకు నీకు ॥ మాముం ॥ 133

రామక్రియ

[1]ఏమి జాణతనా లాదే వింకా నీవు
ఆమాటే నిక్కమౌనె ఆతని వలనను ॥ పల్లవి ॥

సుదతిరో నీవద్దఁ గూచున్న చుట్ట మెవ్వఁడే
మదనగురుఁడే వీఁడు మాయింటిలోన
అదియేమె నావిభుఁడౌట నీ వెఱఁగవా
కదిసి నన్నేలేనంటేఁ గాదనఁగవచ్చునా ॥ ఏమి ॥

యెవ్వరితో నవ్వితివే యిందాఁకా నీవు
నివ్వటిల్ల గిలిగించీనే కృష్ణుఁడు
యిప్పల నాకిచ్చినబాసెరఁగవా
చివ్వనఁ బొందుసేయఁగ సిగ్గులు వడుచునా ॥ ఏమి ॥

పీమంచముపై నెవ్వఁడు నీటు చూపీనే; నన్నుఁ
బ్రేమ శ్రీవేంకటేశుఁడు పెండ్లాడెనే
ఆముందే నన్నుఁ బెండ్లాడె నదెరఁగవా
నామగఁడ ననఁగా మానఁగవచ్చునా ॥ ఏమి ॥ 134

---

1. ఇది సవతుల సంవాదము

కన్నడగౌళ

అలసేవు సొలసేవు అప్పుడే నీవు
వలపు రేఁచుటగాక వట్టిసట లేఁటికే ॥ పల్లవి ॥

సరసమాడేవిభుఁడు చన్ను లెంతపిసికినా
కరఁగి కూడుటగాక కసరనేలే
గారబుగాఁ గూడేవాఁడు గోర నెంత వూఁదినాను
దొరసి మెచ్చుట గాక దూరనేఁటికే ॥ అల ॥

మగఁడైనవాఁడు రతి మచ్చరము చూపితేను
నగుట గాక మాఁటలవెగటులేలే
తగుల మోహించువాఁడు తమకించి పొదిగితే
సొగిసి లోనౌటగాక బిగియనేలే ॥ అల ॥

సందడిఁ బెండ్లాడేవాఁడు సారెఁ బువ్వులవేసితే
విందులఁ జొక్కుట గాక విసువులేలే
యిందరిలో శ్రీవేంకటేశుఁ డిట్టె నిన్ను నేలె
సందుకొనవలెఁగాక చలపట్టనేలే ॥ అల ॥ 135

దేశాక్షి

కంటిమయ్య నీచేఁతలు కన్నులపండుగగాను
పెంటలైనముచ్చటలే ప్రియము నీకు ॥ పల్లవి ॥

మంతనమాడేటివేళ మజ్జనమాడేటివేళ
ఇంతితోడి సరసము లింపులు నీకు
అంతలోఁ గప్పురకాపు అవధరించేటివేళ
సంతతపువసంతము చవులు నీకు ॥ కంటి ॥

పొందులవేళలఁ దట్టుపుణుఁగు పూసేటివేళ
ఇందుముఖితోడిమాట లితవు నీకు
చెందమ్మిపూవుదండలు సింగారించుకొనేవేళ
విందులమోవియీవులు వేడుక నీకు ॥ కంటి ॥

సొలసి నవ్వేటివేళ సొమ్ము లిడుకొనేవేళ
అలమేల్మంగకూటమి అమవు నీకు
యెలమి శ్రీ వేంకటేశ ఇద్దరుఁ బెండ్లాడేవేళ
కొలువులోనిమొక్కులు కొసరు నీకు ॥ కంటి ॥ 136

సౌరాష్ట్రం

అందులోనే వున్నవివె అన్నివిన్నపములును
కందువతోడఁ గలసీ కరుణించవయ్యా ॥ పల్లవి ॥

చెక్కులపై వెడజారుఁజెమట నీపచ్చడాన
గక్కనఁ దుడుచుకొనీఁ గామిని
వెక్కసపుఁగుచములవెట్ట దీర నీచేతుల
అక్కరతో నద్దుకొనీ నప్పటప్పటికిని ॥ అందు ॥

ఆలయికలెల్లాఁ దీర నండనున్ననీమీఁద
పలుమారు నొరగీని పడఁతి
నిలువుఁగొప్పు వీడితే నిన్నే ముడువుమనీ
తలఁపించి విరహపుతమకముతోడను ॥ అందు ॥

తెల్లమిగాఁ దనదప్పి దేరుచుకొని మోవి
మెల్లనే చేకొని నలమేలుమంగ
చెల్లుబడి నీకాఁగిట శ్రీవేంకటేశుఁడు (డ?) గూడి
యిల్లిదే నిన్నుఁ బొగడి యిచ్చకమాడీని ॥ అందు ॥ 137

శంకరాభరణం

ఇంకనేమి గద మిందరికి
పొంకముగా నిటు భోగించఁగలఁడు ॥పల్లవి॥

జగడములడిచినసవతులకెల్లా
తగవులు చెప్పఁగఁ దాఁ గలఁడు
వెగటునఁ దనతో వెంగెములాడిన
మగిడి వేఁడుకొన మఱి తాఁ గలఁడు ॥ఇంక॥

ప్రియపడి కాంతలు పెనఁగి యలసితే
దయలు దలంచఁగఁ దాఁ గలఁడు
రయమునఁ దనకై గాఁపుగ వలచిన
నయమున నవ్వుచు నమ్మించఁగలఁడు ॥ఇంక॥

సతమై వనితలు సరిఁ బెండ్లాడిన
తతిగొని కూడఁగ(గఁ?) దాఁ గలఁడు
యితవై శ్రీవేంకటేశుఁడు తానె
గతియై మమ్మేలెఁ(లఁ?)గమ్మటిఁ గలఁడు ॥ఇంక॥ 138

రేకు 926 ఆహిరి

వద్దనేమా మిమ్ము నేము వట్టిదూరు మాకేల
పొద్దువొద్దు దప్పకుండా భోగించరాదా ॥పల్లవి॥

మరిగినచెలి నీపై మచ్చికలు చల్లఁగాను
తొరలింపుఁదమకాన తోఁగి చూచేవు
ఇరవైనఅడియాస లింతగలవారు మీరు
గరిమలఁ [illegible]లివాయఁ గాఁగిలించరాదా ॥వద్ద॥

పొంచిపొంచి యాపె నిన్ను పూవులను వేయఁగాను
చంచలించి యట్టె నీవు సన్న సేసేవు
మంచితనముల నింతమఱిగినవారు మీరు
కొంచక పీఁటమీఁదటఁ గూచుండరాదా ॥ వద్ద ॥

వెనకనుండాపె నేఁడు విడెము నీకియ్యఁగాను
యెనసితివి శ్రీవేంకటేశ ఆపెను
మనసార నలమేలుమంగను నన్నేలితివి
పెనఁగేల ఇద్దరూఁ బెండ్లాడరాదా ॥ వద్ద ॥ 139

పాడి

పొద్దువోక నీవు వట్టిపొందులు సేసేవుగాక
వొద్ద నాపె వుండఁగాను వొరులితవయ్యేరా ॥ పల్లవి ॥

చెంగట నేపొద్దు నీకు సేవలు సేసీనాపె
వుంగిటి నెదుట నిలిచున్నది ఆపె
సంగతిగా నవ్వునవ్వి సరసమాడీ నాపె
సింగారపు సతులెల్లాఁ జిత్తానఁ బట్టేరా ॥ పొద్దు ॥

వేడుకతో సారె మోవివిందులువెట్టీ నాపె
యీడుజోడై నీకు విడేలిచ్చీ నాపె
యేడలేని విన్నపాలు ఇట్టె సేసీ నాపె
వాడవారి మీఁద నీకు వలపు వుట్టీనా ॥ పొద్దు ॥

సంచుకొని కాఁగిలించి చన్నుల నొత్తీ నాపె
మంచెమేళపుటలమేల్మంగే ఆపె
ఇందరిలో శ్రీవేంకటేశ నన్ను నేలితివి
సందిగొందులవారిని సరకు గొనేవా ॥ పొద్దు ॥ 140

భైరవి

గక్కన లాలించరాదా కాఁగిట నించఁగరాదా
చెక్కుచేతితో నిదెంత సిగ్గులువడేవు ॥ పల్లవి ॥

చలివాసి నీతోను సరసమాడీ నదె
మొలకచన్నులు నీపై మోపీ నదె
చెలఁగి చుట్టరికము చెప్పీ నింతలోన నదె
చెలిఁ జూచి నీవెంత సిగ్గులువడేవు ॥ గక్క ॥

కడువెల్లవిరిగాను కన్నుల మొక్కీ నదె
వొడిమీఁదఁ గూచుండి వొరసీ నదె
జడియుఁదమితో మోవిచవు లడిగీ నదె
చిడుముడి నీవెంత సిగ్గులువడేవు ॥ గక్క ॥

చెనకుచు నిను గూడి సేవలు సేసీ నదె
మనసిచ్చె నలమేలుమంగ నీ కదె
ఘనుఁడ మమ్మేలితివి కందువ శ్రీవేంకటేశ
చినుకుఁజెమట నెంత సిగ్గులువడేవు ॥ గక్క ॥ 141

శ్రీరాగం

నాఁడే పెవిచ్చినబాస నమ్మి వున్నారము నేము
పోఁడిమిఁ దలఁచవయ్య పొంతనే మాసేవలు ॥ నాఁడే ॥

పలుపుపైఁ బవళించి పడఁతి విడె మియ్యఁగ
నెరిసరసము గడునిండా నాడేవు
మెలుకతో సంతోసాల నెంతపరాకైనాఁ గద్దు
మఱవకురయ్య మాపై మన్నన లెప్పుడును ॥ నాఁడే ॥

గద్దెమీఁదఁ గూచుండి గందము నీకుఁ బూయఁగ
వొద్దిక నాపెతోడ నవ్వులు నవ్వేవు
కొద్దిలేనివలపులు కోటానఁగోటులు మీకు
సుద్దులు దలఁచి దయఁజూడవయ్య మమ్మును ॥ నాఁడే ॥

కొలువులో నిలుచుండి కూరిమి నీపైఁ జల్లఁగా
అలమేలుమంగ నురమందు నించేవు
తొలుతె శ్రీవేంకటేశ దొరసితి రిద్దరును
అలరి మమ్మేలి మాయంకల రాఁగదవయ్య ॥ నాఁడే ॥ 142

పాటి

కమ్మటి నెవ్వరినైనాఁ గాకుసేసీని
ఇమ్ముల నాసోదము యెంత గద్దో చూడరే ॥ పల్లవి ॥

కొలువై వున్నాఁడు వాఁడె గోవిందరాజు మించి
చెలు లిద్దరు పాదాలు చేరి యొత్తఁగా
చెలరేఁగి నవ్వుకొంటా శేషునిపైఁ బవళించి
పలుమారు వలపులు పచరించీఁ జూడరే ॥ కమ్మ ॥

తగవులు దిద్దీ వాఁడే తమితో గోవిందరాజు
మగువ [1]లందెంది యాకుమడిచియ్యఁగా
జిగి మర్మాలంటుకొంటా చిత్తరువుమేడలోన
వెగటులేనిమోహము వెదచల్లీఁ జూడరే ॥ కమ్మ ॥

కదిసీ నదివో శ్రీవేంకటాద్రి గోవిందరాజు
సుదతులు కాఁగిట మెచ్చులు మెచ్చఁగా
గుదిగొన మోవియిచ్చుకొంటా నేకతమున
పొదిగొన్నమచ్చికలు పోదిసేసీఁ జూడరే ॥ కమ్మ ॥ 143

---

అంది + అడి

మలహరి

ఏఁటికి గుంపెన లిఁకనేలే నీకు
కూటమిరతులకుఁ గొసరఁగరాదా ॥ పల్లవి ॥

వాడివట్టుచునుఁ బతి వొడఁబరచఁగాను
జడియుచుఁ బలికి కసరుదురటే
అదరి కెమ్మోవితేనియలు గురిసీ నదె
తొడరి నీవు బువ్వము దొడుకఁగరాదా ॥ ఏఁటి ॥

నమ్మిక లొసగుచు నవ్వులు నవ్వఁగాను
చిమ్ముచు నాఱడి యింతసేతురటే
వుమ్మడిఁ గుచము లాతఁ దొరసీ; వలపులు
నెమ్మి చుట్టరికములు నెఱపఁగరాదా ॥ ఏఁటి ॥

కలయుచుఁ గాఁగిట కందువ లంటగాను
కెలయుచుఁ గడును జంకింతురటే
యెలమిని శ్రీవేంకటేశుఁడు మన్నించీని
పలుకుఁబంతముల పై కొనరాదా ॥ ఏఁటి ॥ 144

రేకు 927. కన్నడగౌళ

ఇంత సేసినవాఁడవు యీడేరించుకొనరాదా
వింతలాయఁ జేఁతలెల్ల వెరపేల నీకును ॥ పల్లవి ॥

పొందులేనివాఁడవైతే పొంతఁ గూచుండఁగనేల
ఇందుముఖి నీతోడ నేల నవ్వీని
మందలించి నన్నునేల మాటల భ్రమఇంచేవు
సందుకొంటి విఁక వట్టిసటలేల నీకును ॥ ఇంత ॥

7

ఆసలేనివాఁడవైతే లాసి ఇట్టె చూడనేల
మోసదీర సతి నీకు మొక్కఁగనేల
బాసలిచ్చి నన్నునేల పైపై నొడఁబరచేవు
రాసికెక్కితివి విచారములేల నీకు ॥ ఇంత ॥

చుట్టమవు గాకుంటే సుద్దులు చెప్పఁగనేల
ఇట్టె ఆయింతి విడె మియ్యవచ్చునా
నెట్టన శ్రీవేంకటేశ నేఁడు నన్ను నేలితివి
గుట్టెల్లాఁ దెలిసితిమి కొంకనేల నీకు ॥ ఇంత ॥ 145

వరాళి

నీవొళ్ళఁ గల్లలేకుంటే నిండుక వుందువుగాక
చేవదేరి వుండఁగాను సిగ్గువడ నేఁటికి ॥ పల్లవి ॥

మొగము చూచి చెలి మొక్కులు నీకు మొక్కఁగా-
నెగసక్కేలంటా నేల యెంచుకొనేవు
నగుతా నాపె నిన్ను నాయము లడుగఁగాను
వెగటువెంగేలంటా వీఁగఁగ నేమిటికి ॥ నీవొ ॥

మక్కువతో నేడలేనిమాట లింతి యాడఁగాను
వెక్కసము లందులో భావించి చూచేవు
యిక్కువ నాపె నీకు నిచ్చకములు చూపఁగ
పక్కన నొరపు లట్టె పట్టఁగ నేమిటికి ॥ నీవొ ॥

మనసిచ్చినసతి నీమర్మములు ముట్టఁగాను
తనివోనిసిగ్గుతోడఁ దలవంచేవు
ఘనుఁడ శ్రీవేంకటేశ కందువ నన్నేలితివి
పెనఁగీఁ గాఁగిట నాపె బిగువు లేమిటికి ॥ నీవొ ॥ 146

నట్టనారాయణి

దేవరవు గావా తెలిసితి మల్లనాఁడె
చేవదేరినపనులు చెప్పనేల యిఁకను ॥ పల్లవి ॥

జఱసి జఱసి నీయాచారము లేమి చెప్పేవు
యెఱఁగనా నీసరిత లింతక తొల్లి
యెఱుకలు నేసి నీవు యెచ్చరించ నిపుడేల
మఱచేవా నీకతలు మాటికి మాటికిని ॥ దేవ ॥

వెంటనే పొగడుకొని విట్టువీఁగే వెంతేసి
కంటిగా నీగుణములు గరగరగా
పెంటలుగాఁ బచారించి పెనఁగులాడఁగనేల
జంటగాక విడిచేవా చలముతో నీవు ॥ దేవ ॥

పుక్కటివిడె మిచ్చి పొంచి వాదఁబరచేవు
దక్కెఁగా నీకాఁగిలి తతితోడను
గక్కన శ్రీవేంకటేశ కలసితి విదె నన్ను
తక్కువయినవా నీతగినమన్ననలు ॥ దేవ ॥ 147

దేసాళం

అన్నియుఁ దెలిసినవే అందరును
వెన్నలో నేతివంటిది వేడుక నీప్రియము ॥ పల్లవి ॥

మొక్కలాన నాకె నిన్ను మోత నొకమాటాడితే
వెక్కసములాడేవు వేమారును
మక్కువ మీ ఇద్దరికి మాటలే వాండ్లుగాని
లక్కవంటి వెంచిచూడ లవి మీ మనసులు ॥ అన్ని ॥

చిట్టకాన కాపె నీపైఁ జెనకి చేయిచాఁచితే
వొట్టుకొని పెనఁగుతా నొద్దుకొనేవు
గుట్టుతోడ నుండేవి మీ గుణము లింతేకాని
పట్టుజిగురువంటిది పాయనిమీవలపు ॥ అన్ని ॥

చెలిమిసేయుచు నాపె సెలవుల నగితేను
చెలరేఁగి నవ్వేవు శ్రీవేంకటేశ
బలిమి చూపేవి మీ పంతము లింతేకాని
తలిరులవంటివి చిత్తరపు మీమోవులు ॥ అన్ని ॥ 148

బౌళిరామక్రియ

నీదు నేఁతలకు నీవే దిష్టము
మేదిని నేమెల్లా మెచ్చితిమయ్యా ॥ పల్లవి ॥

యీడగుకాంతలు యింటనే వుండఁగ
వాడలసతులకు వలచితివి
వోడక క్షీరాబ్ధినుండి రేపల్లెను
తోడనే వెన్నలు దొంగిలినట్లు ॥ నీదు ॥

వుంగిటివాసన లొడలనే వుండఁగ
అంగడిగందము లడిగితివి
బంగారు పీతాంబరము నీకుండఁగ
చెంగటికోకలు చేకొన్నట్లు ॥ నీదు ॥

ఆసఁ గౌస్తుభము అక్కున నుండఁగ
శ్రీసతి నురమునఁ జేర్చితివి
నేస శ్రీవేంకటశిఖ(రీడ?)డు కుండఁగ
రాసికుచగిరుల రమించినట్లు ॥ నీదు ॥ 149

నాదరామక్రియ

అందుకేపో చింతించీ నప్పటనుండి
చెంది వేఁడుకొనవయ్యా చెలిని యీ వేళను ॥ పల్లవి ॥

గుట్టున నుండినదాని గోరు చంటిమీఁదఁ దీసి
నట్టనడుమ నూరకే నవ్వితివట
అట్టె అదియునుఁగాక అలయించి యేమిటికో
అట్టుగాఁ గేరడము లిట్టె యాడితివట ॥ అందు ॥

ముప్పిరిసిగ్గరిదానిముసుఁగు దీసి మోమెత్తి
తప్పక చూచితివట తత్తరానను
అప్పటి వేరొకతెతో నాపెరహస్యములెల్లా
చెప్పి మోవిమీఁద గంటిసేసితివట ॥ అందు ॥

చెలఁగి కూడినదానిచీర నీవు గట్టుకొని
యెలమిఁ బచ్చడ మాపె కిచ్చితివట
అలమేలుమంగపతివైనశ్రీ వేంకటేశుఁడ
నిలువుఁగల్కితగాలు నేర్పితివట ॥ అందు ॥ 150

రేకు 928 దేశాక్షి

చెల్లదా నీవేమేమి సేసినా నీకు
వెల్లవిరిగా నేల వింతలు సేసేవు ॥ పల్లవి ॥

చీటికిమాటికి నన్ని సేఁతలెల్లాఁ జేసివచ్చి
మాటలెన్ని యాడేవు మాతోడను
నాటకుఁడ విన్నుఁ జూచి నగితే నాముందరనే
యేఁటికి బాసలుసేసే వింకా నీవు ॥ చెల్ల ॥

వోపిక నీవాళ్ళనేరా లొక్కటొక్కటి యెంచితే
చూపు లేమిచూచేవు సోద్యముగాను
వైపెరిఁగి నేను నీవలపు సోదించితేను
పైపై నన్ను నెంత వాదఁబరచేవు నీవు ॥ చెల్ల ॥

మాఁగినమోవిమీఁద మణులెల్లా నించుకొని
కాఁగిట నెట్టు గూడితి కమ్మటి నన్ను
వీఁగకు శ్రీవేంకటేశ వేఁడుకొని మొక్కితేను
నాఁగువారఁ బొందులెల్లా నడపేవు నీవు ॥ చెల్ల ॥ 151

మాళవిగౌళ

కానుకకుఁ జేయిచాఁచీఁ గమ్మటిఁ దాను
నానినచెమటతో సన్నలుసేసీని ॥ పల్లవి ॥

ఆమనికాలము వచ్చె నంగనవలపు హెచ్చె
యేమని విన్నవింతమే యీతనితోను
కామునమ్ములు వాఁడెక్కె కమ్మటిఁ జిగురులు నిక్కె
నాములువారఁ దా నింక నవ్వులు నవ్వీని ॥ కాను ॥

చందురుఁడు నుదయించె జవ్వన మీకెకు మించె
కందు వేడఁ జూపుదమే కాంతునికి
మందమారుతము రేఁగె మలసి యలులు మూఁగె
చెంది మోము చూచితేనే సిగ్గులువడీని ॥ కాను ॥

కోకము లొద్దికిఁ జేరె గుబ్బచన్నుఁగవ మీరె
చేకూరిచే దెట్లానే శ్రీ వేంకటేశు
దాకొనె నిద్దరిసొంపు దైవారె రతులముంపు
కైకొని పొగడితేనే కళలుదేరీని ॥ కాను ॥ 152

కురంజి

మెచ్చవలదా నీవు మెలుఁత నేరుపులకు
హెచ్చుకుందు లెంచుకొని యెగ్గులువట్టుదురా ॥ పల్లవి ॥

పంతమాడి నీమోవిఁ బచ్చి సేఁత సేసితేను
కాంత నేల దూరేవు గద్దెనతోను
దొంతినున్న వలపులు దోమటిదొడికితేను
చింతతోడ నిపుడేల శిరసువంచేవు ॥ మెచ్చ ॥

ఇట్టె జవ్వనమదాన నెంగిలి నిన్నుఁ జేసితే
తిట్టులేల తిట్టేవు దీకొనుచు
గుట్టుతోడఁ దరితీపుగుణ మేరుపరచితే
వొట్టుకొని చింతలేల వొడిఁగట్టుకొనేవు ॥ మెచ్చ ॥

రావాడి కడపలోన రతి నలయించితేను
శ్రీవేంకటేశుఁడ యెంత చిమ్మిరేఁగేవు
వేవేలుతమకముల వీడుదోడు లాడితేను
చేవదేర నెంతేసి సెలవి నవ్వేవు ॥ మెచ్చ ॥ 153

శుద్ధదేశి

ఆతనినేల కొసరే వప్పటి నీవు నీ—
యేతులెల్లాఁ జూచెఁగదె ఇందాఁకాను ॥ పల్లవి ॥

నిన్నుఁ బేరుకొని పిల్చి నీతోనే మాటలాడి
యెన్నికలు సేసెఁగదె ఇందరిలోన
విన్నపాలెల్లా విని వీడెము చేతికిచ్చి
ఇన్నిటా లాలించెఁగదె ఇందాఁకాను ॥ ఆత ॥

సరసములెల్లా నాడి సంగడినే కూచుండి
అరుదుగా మొక్కెఁగదె అండనే వుండి
తెరవేసుకొని మోవితేనియలు నీకొసగి
ఇరవుగా నవ్వెఁగదె ఇందాఁకాను ॥ అత ॥

వాడివట్టి నినుఁ దీసి వొద్దిక జూజాలాడి
జడిగొనఁ గూడెఁగదె చవికెలోన
చిడుముడి నన్ను నేలె శ్రీవేంకటేశుఁడు నేఁడు
యెడయఁడుగదె నిన్ను నిందాఁకాను ॥ అత ॥ 154

ముఖారి

సొరిది నీసరితలు చూచితిఁగాక
సిరులనీసేవలు సేయక విడిచేనా ॥ పల్లవి ॥

కప్పురాన వేసేవు కడుసన్నలు సేసేవు
యెప్పుడు నీసుద్దులు నే నెఱఁగనిహ
దప్పిదేరఁ బలికేవు తమితో బుజ్జగించేవు
చెప్పినట్లు నే నీకు సేయకుండేనా ॥ సొరి ॥

విరులెల్లా ముడిచేవు వీడెము నాకిచ్చేవు
మరిగి నీమేలు నేను మఱచితినా
పొరిఁబొరిగుణములు పొగడేవు నావద్ద
తిరముగా నిట్టె సమ్మతించక మానుదునా ॥ సొరి ॥

కలకలనవ్వేవు కాఁగిట బిగించేవు
తొలుతనే నే నిన్ను సంతోసించనివా
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నెలవైననాకు నివి నేఁడు గొత్తలా ॥ సొరి ॥ 155

హిందోళవసంతం

జవ్వనపుదాన వింత చలమేఁటికే
చివ్వన వీడె మొసగి సేవసేయవే ॥ పల్లవి ॥

మక్కువతో రమణుఁడు మంచిమాట లాడఁగానే
వెక్కసములాడి యేల వేగిరించేవే
పక్కన నందుకుఁగాను పైఁ జేయివేసితేను
మొక్కలానఁ గాతాళించి మోమేల వంచేవే ॥ జవ్వ ॥

నయమిచ్చి యాతఁడు నవ్వు నీతో నవ్వఁగాను
రయమున నీవెంత రవ్వ సేసేవే
ప్రియమున నప్పటిని పెనఁగి పొందుసేయఁగ
నియమానఁ జలపట్టి నీవేల లోఁగేవే ॥ జవ్వ ॥

శ్రీ వేంకటేశ్వరుఁడు చేరి నిన్నుఁ గూడఁగానే
కావరించి నీవేల కక్కసించేవే
చేవదేర మీఁద మీఁదఁ జిమ్మిరేఁగ మన్నించఁగా
వేవేలువిధాల నెట్టు వెరగందేవే ॥ జవ్వ ॥ 156

రేకు. 929 ఛాయానాట

ఇట్టె రాఁగదరా యింటిలోనికి
వుట్టిపడి బిగియఁగ నొద్దురా ఇఁకను ॥ పల్లవి ॥

జవ్వనపాయమువారు చలమునఁ బెనఁగితే
రవ్వలై వలపులు మేరలు మీరును
పువ్వువంటిదాన నేను పొరుగున నుండి నీవు
వువ్విళ్లూర నింత సేయవొద్దురా నీవు ॥ ఇట్టె ॥

ప్రేమగలుగువారు బీరములు చూపితేను
దోమటితమకములు దూరు కెక్కను
కామించిసదాన నేను ఘనుఁడ విన్నిటా నీవు
వోముచు గుట్టున నవ్వనొద్దురా ఇపుడు ॥ ఇట్టె ॥

ఆలుమగఁడైనవారు అసల నూరకుండితే
చాలుకొన్నతరితీపు సందడించును
మేలిమి శ్రీవేంకటేశ మెచ్చి నన్ను నేలితివి
వోలవేసి కొసరఁగనొద్దురా ఇఁకను ॥ ఇట్టె ॥ 157

## బౌళి

కంటిమి వింటిమి నేఁడు కందువగాను
వొంటిఁ జిక్కించుక నిన్ను నొరసే దేమి ॥ పల్లవి ॥

నిక్క నీవు సేయించుకొనినగురుతులెల్లాను
చెక్కులనే వుండఁగాను చెప్పేదేమి
పిక్కటిల్లుఁజెమటలు పిచ్చిలి మేననుండఁగ
అక్కడి నీసుద్దులెల్లా నడిగేదేమి ॥ కంటి ॥

పెనఁగి యెక్కడనో తెప్పించుకొన్నవుంగరము
కొనవేల సుండఁగానే కొసరేదేమి
వెనకటి నీపొందులు వెంటనే వచ్చివుండఁగ
దినదినమును నీతోఁ దెలిపేదేమి ॥ కంటి ॥

కాముకళలెల్లా నొక్కగనియై నేఁ డింతలో నీ-
మోముననే వుండఁగాను మొరఁగేదేమి
ఆమని శ్రీవేంకటాద్రి అహోబల [1]నరసింహా
చేముంచి నన్నేలితివి సిగ్గువడేదేమి ॥ కంటి ॥ 158

---

1. 'నరసింహ్వ' అని రేకు వ్రాత.

పాడి

ఎవ్వరిముందరఁ జూపే వేడలేనినీగుట్టు
నవ్వులేమి నవ్వేవు నాలితనమునను ॥ పల్లవి ॥

విన్నవించీ నాపెమాట వినుకొనరాదా
యెన్నిపరాకులు నేసే వెఱఁగివుండే
సన్న నేసీ నివెల్లా జాడతోఁ జూడరాదా
కన్నులేల మూసేవు కడుసిగ్గుతోడను ॥ ఎవ్వ ॥

ఆపెయిచ్చేవిడెము అందుకొనరాదా
చూపులేమి చూచేవు సోరణగండ్ల
ఆపని కాసపడితే నట్టె కావిమ్మనరాదా
యేపున నేలకొంకేవు యిందరిలోపలను ॥ ఎవ్వ ॥

కూడినయాపెకూటమిఁ గోరి చెంగలించరాదా
వాడుమోముతో నెంత వాను లెంచేవు
యీడనే శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
యీడులేల పెట్టేవు యివ్వలా నవ్వలాను ॥ ఎవ్వ ॥ 159

సామంతం

మాయలేల సేసేవు మన్నించరాదా
బాయిటఁ బడె నీగుట్టు ప్ర[1]హ్లాదవరద ॥ పల్లవి ॥

వారసివలపు తొల్లే వాడిఁ గట్టుకొన్నందుకు
అరుదై నతొడపై తొయ్యలి సాకిరి
సరుసనే మాతోను జాణతనాలాడేవు
యిరవై సీయాసోద మేమిచెప్పే దిఁకను ॥ మాయ ॥

---

1. 'ప్రంహ్లాద' అని రేకుప్రాత.

మొనసి చుట్టరికము తొల్లి మోపు గట్టుకొన్నందుకు
యెనలేని వీఁపుమీఁది యింతి సాకిరి
ననుపు నాతోనే నవ్వులెల్లా నవ్వేవు
నినుపులై గజరెల్లా నిండె నీమై నిపుడు ॥ మాయ ॥

తమకమెల్లాఁ దవ్వి తలకెత్తుకున్నందుకు
కొమరైనశిరసుపై కొమ్మ సాకిరి
మమత శ్రీవేంకటేశ మరిగి నన్నేలితివి
జమళి నీపొందులు సతమాయ నేఁడు ॥ మాయ ॥ 160

ఆహిరి

ఎటువంటివలపులో యిద్దరికిని
చిటుకంటే మెచ్చేవు శ్రీనరసింహా ॥ పల్లవి ॥

గిరులెక్కి లకిమమ్మ కిన్నెర వాయించుకొంటా
పరగ నీమోము తప్పక చూడఁగా
సరుగన నీవు వచ్చి సంగడినే కూచుండి
సిరులతోఁ బొగడేవు శ్రీనరసింహా ॥ ఎటు ॥

యెదురుమేడపై నెక్కి యెలుఁగెత్తి పాడిపాడి
వుదుటునఁ దామరపూవుల వేయఁగా
పొదిగి నీవంతలోనే బుజముపైఁ జేయివేసి
చెదరక చెక్కు నొక్కేవు శ్రీనరసింహా ॥ ఎటు ॥

పఱపుపై నీకె నీపైపరాకునఁ జెలితోడ
అఱిముఱి నిన్నుఁ జూపేకాంత మాడఁగా
మెఱయ శ్రీవేంకటాద్రిమీఁద వచ్చి కూడితివి
చెఱఁగువట్టి చొక్కుతా శ్రీనరసింహా ॥ ఎటు ॥ 161

భైరవి

ఇచ్చలోనిదాన నేను ఇన్నిటా నీకు
గచ్చు లేమిటికిరా చేఁగలమట్టిచెన్నుఁడా ॥ పల్లవి ॥

అరితేరి కతలెల్లా నడుగుతా నన్ను నీవు
చేరి యానవెట్టకురా చెప్పేఁగాని
దూరుసేయ కిఁకనైనా దోసము లేదనరా
సారెసారె నీకు మొక్కి జట్టిగానే నేను ॥ ఇచ్చ ॥

వొగ్గి కొంగువట్టుకొని వొకటొకటే యడిగి
సిగ్గులువడకురా చెప్పేఁగాని
అగ్గలమై కిందుపడి ఆసుద్దులు మఱవరా
అగ్గమై నీవూడిగాలే అన్నీఁ జేసే నేను ॥ ఇచ్చ ॥

యెన్నఁగ శ్రీ వేంకటాద్రి నిరవై నన్నేలితివి
చిన్నిగోరు దియ్యకురా చెప్పేఁగాని
మన్నించితి వెప్పుడు నామచ్చిక దలఁచరా
సన్నల నీరతులకే సమ్మతించే నేను ॥ ఇచ్చ ॥ 162

రేకు 930 ధన్నాసి

చిత్తగింతువు రావయ్య చెలికడకు
హొత్తులతలపోఁతల భోగించీని ॥ పల్లవి ॥

మనసు నిలుపరాక మాటలనుఁ బొద్దువోక
వొనరి విరహమున నున్నది చెలి
కొనలుసాగినయాస కొప్పునఁ బెట్టేసేసఁ
దనివోక కూటమికిఁ దమకించీని ॥ చిత్త ॥

చెమటలఁ దొప్పఁదోఁగి సిగ్గులనే కదుమాఁగి
అమరినజవ్వనాన నలసీఁ జెలి
తిమురువలపులను తియ్యనిసొలపులను
జమళిపులకలతో జాజుకొనీని ॥ చిత్త ॥

యెదురుచూపులు చూచి యిట్టె కాఁగిటికి లాచి
ముదమునఁ జేతులెత్తి మొక్కీఁ జెలి
అదన శ్రీ వేంకటేశ అట్టె నీవు గూడఁగాను
వుదుటుఁగళలు రేఁగి వూరుపు లాఁగీని ॥ చిత్త ॥ 163

ఆహిరి

ఇన్నిటా నీచలములు యీడేరెనే
పన్ని నీనేరుపు లిట్టె పచరించవలెనా ॥ పల్లవి ॥

పెనఁగి యాతఁడు నీకుఁ బ్రియములెల్లాఁ జెప్పె
తనిసి ఇంతటా నీచిత్తము వచ్చెనా
యెనసి వలచేనంటా ఇందరిలోనా నీవు
ననిచినమగవాని నగుఁబాటుసేతురా ॥ ఇన్ని ॥

చెలరేఁగి సేయరానిచేఁతలెల్లా నీకుఁ జేసె
తలచిననీదుపంతము చెల్లెనా
మెలఁగి నీమాటలు మీరెనంటా నీవు
కిలకిలనగి యింత కిందుపరపింతురా ॥ ఇన్ని ॥

కూరిమి నీకాఁగిటను కూడినట్టెల్లాఁ గూడె
కోరిననీకోరికలు కొనసాగెనా
యీరీతి శ్రీవేంకటేశుఁ డిచ్చకుఁడంటా నీవు
రారాపు లిటుసేసి రతి నలయింతురా ॥ ఇన్ని ॥ 164

దేవగాంధారి

రాజవు నీకెదురేది రామచంద్ర
రాజీవనయనుఁడ రామచంద్ర ॥ పల్లవి ॥

వెట్టిగాదు నీవలపు వింటి నారికిఁ దెచ్చితివి
అట్టునేయఁ బనిలేదు యిట్టె రామచంద్ర
గుట్టుతోడ జలనిధిపై గొండలు ముడివేసితి-
వెట్టు మఱవఁగవచ్చు నివి రామచంద్ర ॥ రాజ ॥

బతిమితోడుతఁ బైఁడిపతిమెఁ గైకొంటివి
రతికెక్కె నీచలము రామచంద్ర
మితిమీరి జవ్వనము మీఁదుకట్టితివి నాకై
యితరు లేమనఁగల రిఁక రామచంద్ర ॥ రాజ ॥

నావంటిసీతను నాఁగేటికొనఁ దెచ్చితి
రావాడితమకముతో రామచంద్ర
యీవేళ శ్రీవేంకటాద్రి నిరవై నన్నుఁ గూడితి
చేవదేర గండికోట శ్రీరామచంద్ర ॥ రాజ ॥ 165

సాళంగం

ఏల కూరిమిగొసరే విప్పుడు నన్ను
వాలాయించి నీవాపెకు వసమై వున్నాఁడవు ॥ పల్లవి ॥

తమకించి నే నిన్ను దప్పులుదేరిచేనంటే
అమరునా నీవద్ద నాపె వుండఁగా
సముకాన నుండి మోవిచవులు చూపేనంటే
తెమలేవా ఆపె తరితీపుల నున్నాఁడవు ॥ ఏల ॥

వెస నాముచ్చటలెల్లా వేడుకఁ జెప్పేనంటే
బొసఁగునా ఆపె నీతోఁ బొందుసేయఁగా
రసికత నీతో సరసము లాడేనంటే
అస మిచ్చేవా ఆపె ఆసల నున్నాఁడవు ॥ఏల॥

సతమై నీకుఁ బచ్చడము గప్పేనంటే
ఇతవౌనా ఆపె నిన్ను నెనయఁగను
పతివై నన్నేలితివి బాగుగా శ్రీవేంకటేశ
తతిఁ గాదనేనా ఇందరిఁ గూడున్నాఁడవు ॥ఏల॥ 166

నాదరామక్రియ

కంటివిగా యెటువంటిగయ్యాళి యీపె
ఇంటికాడనే చూపి ఇచ్చీనట తాను ॥పల్లవి॥

యెలమి నీవట యాడోయింతిఁ బెండ్లాడితివట
వెలఁది యాడినమాట వింటివా వోయి
అలరి నీవేమైనా నటువంటివాఁడవా
కలవి లేనివి నీపై గడియించీఁ దాను ॥కంటి॥

మేరతో నీవేల నేడోమెట్టె లిడుకొంటివట
చేరి యాకెకోపము చూచితివా వోయి
నేరమి నీయందుఁ గద్దా నే మెన్నఁడూ నెఱఁగము
తారుకాణించేనంటాఁ దమకించీఁ దాను ॥కంటి॥

విందుల నెవ్వతెకో విడె మిచ్చి వచ్చితట
చెంది యీకెగుట్టు తెలిసితివా వోయి
పొందితివి నన్ను నిట్టె పొసఁగ శ్రీవేంకటేశ
నిందలివే యని మొక్కి నిన్ను మెచ్చీఁ దాను ॥కంటి॥ 167

---

క్రీగీతలు గలవి చిలుము తిన్నవి.

నాగవరాళి

ఎక్కడ గడించుకొంటి వీకెను నీవు
పక్కన సేవలు సేసి పాదా లొ_త్తీని ॥ పల్లవి ॥

సొంపుమీరి నీతోడ సుద్దులెల్లా విన్నవించి
చెంపల జారేకురులు చేత దువ్వీని
యింపుపుట్ట నేడలేని యిచ్చకములెల్లాఁ జేసి
జంపుల నవ్వులునవ్వి జట్టిగొనీని ॥ ఎక్క ॥

మచ్చిక మాఁటలాడించి మర్మములు సోఁకించి
మెచ్చి మెచ్చి గందము నీమేనఁ బూసీని
లచ్చెనగా గోరుదీసి లావులు చూపి పెనఁగి
ఇుచ్చి కాఁగిలించి నిన్నుఁ గోరికొానరీని ॥ ఎక్క ॥

బాగాలిచ్చి వేఁడుకొని పచ్చడము మీఁదఁ గప్పి
ఆగడాలు సేసి కూడె నాపె నిన్నును
చేగదేర నేలితివి శ్రీవేంకటేశ నన్ను
లాగుల నప్పటి మోవిలంచము దా నిచ్చీని ॥ ఎక్క ॥ 168

రేకు 931 మాళవిగౌళ

ఇందరు నెరిఁగినవే యీ సుద్దులు
యెందునుండినాను మాయింటికి రావలెను ॥ పల్లవి ॥

యెంతవాఁడవైనాను యెపుడును మాతోను
పంతములాడకురా పలుమారును
కాంతలమోవితేనెలు కై కొనేటివేళను
పొంతనుండి యెంగిలికి పొ_త్తుగూడవలెను ॥ ఇంద ॥

---

1 క్రీతలు గలవి చిలుము తిన్నవి.

ఘనుఁడవౌదువు నేఁడు గర్వము మాతో సరి—
పెనఁగకురా నీవు పెచ్చురేఁగుచు
వనితలైనవారు వడిఁ గాఁగిలించేవేళ
చనుఁగొండలసందిఁగి చనవియ్యవలెను ॥ ఇంద ॥

మగఁడవైతివి నాకు మక్కువ శ్రీవేంకటేశ
బిగియకురా ఇంత పెనఁగుతాను
మగువలైనవారి మరిగి కూడేవేళ
పొగరుఁబాదములు వీఁపున మోవవలెను ॥ ఇంద ॥ 169

బౌళి

ఎంతలేదు నీయాసోద మేమిచెప్పేది
చెంతనుండి నామీఁదఁ జేయిచాఁచేవు ॥ పల్లవి ॥

వొక్కతెతో మాటాడుతా నొక్కతెతో నవ్వేవు
అక్కర నొకతె వీడె మడిగేవు
వుక్కుమీరి వొక్కతెను వొడివట్టి తీసేవు
మక్కువ నప్పటిని నామర్మము లంటేవు ॥ ఎంత ॥

చెయివట్టే వీకెను చేసన్నసేసే వాకెను
పాయఁజాల కిల్లికెకుఁ బనిచెప్పేవు
చాయల నల్లాకెతోడ సరసము లాడేవు
సోయగాన నాకప్పటి సొమ్ము లిచ్చేవు ॥ ఎంత ॥

యెవ్వతెనో పేరఁ బిల్చి యెవ్వతెనో కూడేవు
దవ్వుల నదెవ్వతెనో తలపోసేవు
రవ్వగా శ్రీవేంకటేశ రతి నన్నుఁ జెలఁగించి
చివ్వన నప్పటి నన్నే చేరికూడేవు ॥ ఎంత ॥ 170

కన్నడగౌళ

ఎప్పుడూ నీయాల నేను ఇటు నాకు మగఁడవు
చిప్పిల నాచేత నీవు సేవగొనవయ్యా ॥ పల్లవి ॥

కన్నెనాటనుండి నాకుఁ గాచుకుండి యింతేసి-
చన్నులు రాఁగాను సేసవెట్టితివి
విన్నవించే దేమున్నది వేగినంతా నీవు నన్ను
మన్నించినమన్ననలు మఱవకుమయ్యా ॥ ఎప్పు ॥

మొలకవలపులే మొదలు సేసుకొని
తొలిసమరుతాడితే దొరసితివి
బలిమి చెప్పఁగనేల పలుమారు నీవు నాకు-
నెలమి నిచ్చినమాఁట యీడేరించవయ్యా ॥ ఎప్పు ॥

తమకపుఁజూపులనే దక్కి నాకాఁగిటిలోన
కొమరెపాయ మీఁదేరఁ గూడితివి
అమర నాడఁగనేల ఆసతో శ్రీవేంకటేశ
జమళి నావద్దనుండి చనవియ్యవయ్యా ॥ ఎప్పు ॥ 171

రామక్రియ

నేమూ నీవలెనే నేరుతుమే ఇన్నిటాను
నేమముతో మామీఁద నించవే మన్ననలు ॥ పల్లవి ॥

చెప్పినట్టు సేసేపతి చేతికి లోనై యుండఁగా-
నిప్పుడేకాక పంతము లిఁక నెన్నఁడే
ముప్పిరి నీవేలను ముద్దుటుంగర మదిగో
చిప్పిల నీకన్నిటాను చెల్లునే నీపగటు ॥ నేమూ ॥

వలచి యీ విభుఁడు నీవాఁడై నేఁ దుండఁగాను
యెలమి నవ్వునవ్వక యేలమానేవే
పలుసవతులలోన పట్టపుదేవులవట
చలమున నేలవే సవ(తుల?)[1] రాజ్యము ॥ నేమా ॥

శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ జెంది కాఁగిలించఁగాను
ఆ వేడుక లీ వేడుక లమరుఁ గదే
కైవశమై భోగములు కాణాచులాయ నిట్టె
యీవల నన్నేలె నితఁడిది నీమతకము ॥ నేమా ॥ 172

దేసాళం

వెల్లవిరాయఁ బనులు [2]విట్ఠలేశ్వరా
చల్లఁ జంపుసేఁతల సటకారివాఁడవు ॥ పల్లవి ॥

నను(జూచి కొలువులో నవ్వినదే చాలదా
వనితల యెడల గర్వపు వాఁడవు
చెనకి యప్పటి నన్నుఁ జేఁ(జే?)త నంటవలెనా
ఘొనుగనివలపులపొత్తులవాఁడవు ॥ వెల్ల ॥

మచ్చికల నాతోడ మాటాడుటే చాలదా
కుచ్చితపు బహుపరాకులవాఁడవు
విచ్చనవిడి నిప్పుడే విడెమియ్యవలెనా
మచ్చువేసితీ నేవెదమాయదారివాఁడవు ॥ వెల్ల ॥

సంగడి నాపై నేస చల్లుటే చాలదా
సంగ తెరిఁగి నె(న?) న(నె?) రజాణకాఁడవు
చెంగట నన్నేలితివి శ్రీవేంకటేశుఁడవై
యెంగిలి సేయవలెనా యిచ్చకపు వాఁడవు ॥ వెల్ల ॥ 173

1. సర్వరాజ్యము?
2. 'విఠ్ఠల' అని రేకు(వాత. ఈ పాటలోని భావము స్పష్టమగుట లేదు.

శంకరాభరణం

ఉద్దగిరి కృష్ణుఁడు పుబ్బరికాఁడు వీఁడు
ముద్దులు చూపుతానే మునుఁగులు దీసేనే ॥ పల్లవి ॥

చెంగట నిద్దిరించేటిచెలువంపుగొల్లెతల
దొంగిడుచు వచ్చి వచ్చి తొడ లంటీనే
ముంగిటఁ గూచుండఁగాను ముడిచినపోఁకముడి-
కొంగులు విడిచి యట్టె కొల్లున నవ్వీనే ॥ ఉద్ద ॥

వేడుకతో గొల్లెతలు వెన్నముద్దలు సేయఁగ
చాడెసంది వచ్చి తాను చన్నులంటీనే
జోడై యొకరొకరు సుద్దులుచెప్పేటివేళ
కోడెకాఁడై యందనుండి కొప్పులు వట్టీనే ॥ ఉద్ద ॥

అట్టె విడేలు సేయుచు నాకులు మడుచుకోఁగా
గట్టిగాఁ గళలురేఁగ కాఁగిలించీనే
యిట్టె మమ్మిందరిని యేలి శ్రీవేంకటేశుఁడై
దిట్టతనమున మోవితేనె లిచ్చీనే ॥ ఉద్ద ॥ 174

రేకు 932. శ్రీరాగం

ఏడలేనిసత్యాలు నేఁడేల చేసీనే
వీడె మందినాఁడు యీ విద్యకుఁ దా ననరే ॥ పల్లవి ॥

మంతనానఁ దాను నేను మాటలాడుకొన్నవెల్లా
ఇంతటిలోననే ఆపె యెట్టెరిఁగెనే
అంతటివిభుఁడు తానె ఆనతియ్యఁబోలుఁగాక
వంతులకు నాపె వచ్చి వద్ద నుండెనా ॥ ఏడ ॥

గుట్టునఁ దాను నేను కూడుకొన్నసుద్దులెల్లా
గట్టిగా వెలినుండాపె కనెనటవే
ఘట్టమువలెనే తాను చొప్పు చూపఁబోలుఁగాక
పొట్టపొరుగాపె వచ్చి పొందేయప్పు డుండెనా ॥ఏడ॥

చేరి తెరలోఁ దనకు సేసినసేవలెల్లా
తేరకే ఆపెమతిఁ దెలియుటెట్టే
మేరతో [1] భూపతిచెరువుమేటి శ్రీవేంకటేశుఁడు
యీరీతి నన్నుఁ గూడఁగా నీడ నాపె వుండెనా ॥ఏడ॥ 175

పాడి

చూతువుగా నీయామేలు సొంపులుగాను
కాతరాన లోనికి రాఁగదవయ్య ఇపుడు ॥పల్లవి॥

మొక్కలాన దవ్వులనే మోము చూచి నవ్వితేనే
చెక్కులెల్లాఁ బులకించె చెలియకును
చక్కనిచన్ను లంటితే చవులేమి వుట్టునో
గక్కనఁ బాన్పుపైకి రాఁగదవయ్య ఇపుడు ॥చూతు॥

పొలసి యల్లంతనుండి పూఁచి మాటలాడితేను
చెలపచెమట గారెఁ జెలిమేనను
యెలమిఁ గతచెప్పితే నింపు లెట్టు వొదమునో
కలికి సంగడికి రాఁగదవయ్య ఇపుడు ॥చూతు॥

తమకించి ఇంతనంతఁ దప్పక చూచితేను
అమరెఁ జెలిమోమున అట్టె కళలు
జమళి శ్రీవేంకటేశ సమరతిఁ గూడితివి
కమలాక్షియంకెకు రాఁగదవయ్య ఇపుడు ॥చూతు॥ 176

---

1 భూపతి చెరువు=కోనేరు అని యొకపండితుడు.
కోన్=ప్రభువు అని తమిళము. కోన్+ఏరు=కోనేరు=స్వామిపుష్కరిణి.

రామక్రియ

కంటిమి యీ భాగ్యము కన్నులపండుగగాను
జంటలై మీరుండఁగా సాదించేదేమే ॥పల్లవి॥

పీడెము నీచేతికిచ్చి విభుఁడు సెలవి నవ్వె
యీడేరె నీపంతము లిఁక నేఁటికే
వేడుకకు వెలలేదు వెక్కసములాడరాదు
యేడనున్నా సవతులు యేమిసేసేరే ॥కంటి॥

పేరున నిన్నుఁ బిలిచి ప్రియుఁడు సరసమాడె
కోరినకోరిక చెల్లెఁ గోఁ(గొం?)క నేఁటికే
నేరుపులెల్లా దక్కె నెయ్యములు దలకెక్కె
యీరసించి తోడివారు యేమిగట్టుకొనేరే ॥కంటి॥

యింటికి వచ్చి శ్రీవేంకటేశుఁడు నిన్నుఁ గూడె
దంటయై కాఁగిట నించెఁ దడవనేలే
పెంటలాయ సేసలు పెనగొనె నాసలు
వెంటనే వచ్చె మీమేలు వెదకేదెట్లనే ॥కంటి॥ 177

సాళంగనాట

ఏమి చెప్పేది తనయెమ్మెలు నేఁడు
ఆముకొని కాచుకున్నాఁ డత్తునా యేమైనా ॥పల్లవి॥

అలసినవారికేల అట్టె పనులు చెప్పీనే
కలసినవారికేల కాఁకరేఁచీనే
మొలకచన్నులు చూచి మొక్కీ నింతటిలోనే
తలఁచిసవరమియ్యఁ దనకు దేవరలా ॥ఏమి॥

సిగ్గువడ్డవారి నెంత చిమ్మిరేఁచవచ్చీనే
యెగ్గులేనివారినేల యెచ్చరించీనే
నిగ్గులనామోవి చూచి నిలువుఁగొలువు సేసీ
అగ్గలమై సేవగొన నది దనయేలికా ॥ ఏమి ॥

వూరకున్నవారినేల వొడివట్టి కూడీనే
యీరీతి శ్రీవేంకటేశుఁ డెంతసేసీనే
గారవించి నామేను కప్పిదాఁచీఁ బచ్చడాన
నేరుపున రక్షించునిధానమా ॥ ఏమి ॥ 178

సాళంగం

ఔనయ్యా మంచివాఁడ వన్నియు నెఱిఁగితిమి
మానలేము నిన్నాదక మనసులోఁ గలది ॥ పల్లవి ॥

దప్పిదేరె నీమోవికి తరుణులమోము చూచి
కప్పుర మిమ్మంటేనే కాఁతాళించేవు
తప్పు లెంచితినా నిన్ను దయదలఁచితిఁగాక
యెప్పుడూ నీయనుమానా లేఁతై (లెంతై?)నా విడువవు ॥ఔన॥

నిరతిఁ జెక్కులమీఁదినిండుఁజెమటలు వాయ
సురటి విసరుమంటేఁ జూచి తిట్టేవు
నెరసు లెంచితినా నెయ్యము చూచితిఁగాక
యెరవులే కలకాలమెల్లా నెరపేవు ॥ ఔన ॥

సారె జాఱుఁదురుమున జాజులు నిండాఁ బెట్టి
చేరి ముడువుమంటేనే సిగ్గువడేవు
అ(ఆ?)రయ శ్రీవేంకటేశ అంతలో నన్నేలితివి
కోరికెఁ దనివిలేక కొంగులు వట్టేవు ॥ ఔన ॥ 179

మాళవిగౌళ

కోరి నీపైఁ దొల్లి నాకుఁ గోప మున్నదా
ఆరీతి అట్టునేయఁగా నంటి నింతేకాక ॥ పల్లవి ॥

ఆనలేల పెట్టేవు అంత వేఁడుకొననేల
కానీవయ్యా నీమాఁటకుఁ గాదనేమా
నేనిట్టె మాటాడఁగాను నేరుపుతో నాపెచేతి—
కాను కందుకొనఁగాను కసరితిఁగాక ॥ కోరి ॥

కొప్పుదువ్వి యెంత నన్ను కొస రొదఁబరచేవు
చెప్పినట్టల్లా నీకుఁ జేయకుండేనా
యిప్పుడు నావద్ద నుండి యెలమి నాపెమట్టెల—
చప్పు డాలకించఁగాను జరసితిఁగాక ॥ కోరి ॥

పీడె మిచ్చి చేయి నాపై వేసేవు శ్రీ వేంకటేశ
కూడితి విందులకు నియ్యకొనవలదా
జాడతోడ నన్నేలి సంగడినున్నాపెమోము
చూడఁగా నందుకు నిట్టె సొలసితిఁగాక ॥ కోరి ॥ 180

రేకు 933 ముఖారి

కనుకొనరాదా కడమదొడములెల్లా
పనివడి నీముందరఁ బచారించీ నీఁకను ॥ పల్లవి ॥

బంతి నాపె మొక్కఁగాను పరాకులు నేసుకొంటే
పంతమాడఁదగదా పడఁతికిని
ఇంతలో నిందుకుఁగాను యెగ్గులేల పట్టేవు
దొంతరవలపులను తోడుచూపీ నీఁకను ॥ కను ॥

యెనసి కానుకియ్యఁగా నేమీననక వుండితే
పెనఁగఁగఁ దగదా ప్రియురాలికి
యెనలేనితలపోఁత విచ్చోట నేమిటికి
వెనకటిసేఁతలెల్లా వెలయించీ నిఁకను ॥ కను ॥

సారెఁ బాదా లొత్తఁగాను జడిసి నిద్దిరించితే
గోర గీరఁదగదా కోమలికిని
యీరీతి శ్రీ వేంకటేశ యేలి యింకాఁ గొసరేవు
కోరికరతులు నీకుఁ గుప్పసేసీ నిఁకను ॥ కను ॥ 181

లలిత

మూసి దాఁపిరములేల ముందరికి రాఁగదవే
సేసపాలవెంటనే చిమ్మిరేఁగె వలపు ॥ పల్లవి ॥

చిప్పిలుఁజెమటలివె చెక్కులపై నున్నవి
రెప్పల నిద్దురలు దేరీ నిదివో
ఇప్పు డాతఁడు నిన్నేలె నెఱఁగమా ఇదె నేఁడు
కుప్పలుఁదెప్పలునై గొనకొనె వలపు ॥ మూసి ॥

చెలపచెలపనవ్వు సెలవుల వడిసీని
పులకలు మేననెల్లాఁ బొదిగొనెనే
మలసి నీనాయకుఁడు మన్నించుట ఏసమా
కులుకుఁజన్నులమీఁద గుదిగొనె వలపు ॥ మూసి ॥

మిసమిసనికళలు మించీ నీమోమున నవె
పొసఁగినపొందు నిన్నుఁ బొదిగొన్నది
యెసఁగి శ్రీ వేంకటేశుఁ డేలె నన్ను నీతఁ డిట్టె
పస నీచిగురుమోవిఁ బాదుకొనె వలపు ॥ మూసి ॥ 182

భైరవి

అందరికి సిరితేకా అటమటా లేమిటికి
నిందలకుఁ జొర వీదే నేరుపింతేకాక ॥ పల్లవి ॥

పడఁతికి నిన్ననె బాసయిచ్చినవాఁడవు
తడఁబడి యింతలోనే తప్పవచ్చునా
నడుమ నన్నుఁ జూచి నాతో మొగమోటానకు
చిడుముడి నిచ్చకాలు సేసేవుగాక ॥ అంద ॥

ప్రేమముతో నిందాఁకాఁ బిలిపించినవాఁడవు
దోమటిదొడుక కిఁకఁ దోయవచ్చునా
నామనసు గన్నదాఁకా నాటకములు జరపి
గామిడివేసాలు సేసి కదిసేవుగాక ॥ అంద ॥

అండఁబెట్టు కాపెవిదే లందుకొన్నవాఁడవు
దండిగాఁ గూడ కిఁక దాఁచవచ్చునా
కొండవలె నన్నేలితి కోరి శ్రీవేంకటేశుఁడ
చండిసేసి వినోదాలు జరపేవుగాక ॥ అంద ॥ 183

కేదారగౌళ

విచ్చనవిడిని యిఁక వీడేలు సేసుఁగాని
రచ్చలఁ బెట్టక యిఁక రమ్మనవే లోనికి ॥ పల్లవి ॥

పంతగాఁడైనవాఁడు పరపుపై నుండుఁగాక
ఇంతలోనే నావద్దికి యెట్టు వచ్చెనే
యెంతలేదు తనసుద్దు లిన్నియు నెఱుఁగుదును
రంతులు సేయక ఇట్టె రమ్మనవే లోనికి ॥ విచ్చ ॥

యేతులు నెరపేవాఁడు యేమీ నవకుండుఁగాక
యీతల మాతో మాట లేలాడీనే
చూతము తననేరుపు చుట్టులఁ బెట్టఁగనేల
రాతిరాయ నిఁకనైనా రమ్మనవే లోనికి ॥ విచ్చ ॥

దిట్ట యెంతవాఁడు తాను దేవర శ్రీవేంకటేశుఁ–
డెట్టు గూడెనే నను నిందరిలోన
అట్టె కానీవే తనఅయము నేఁగన్నదే
రటునేయ కిఁకనైనా రమ్మనవే లోనికి ॥ విచ్చ ॥ 184

సౌరాష్ట్రం

ఎవ్వరు మంచివారమో ఇప్పుడు నీకు
పువ్వువలె నాకు నీవు బుద్దిచెప్పవయ్యా ॥ పల్లవి ॥

బత్తితోఁ బాదము లొత్తి బాగాలు చేతికిచ్చి
చిత్తమురా సేవలెల్లాఁ జేసీ నాపె
కొత్తకొత్తమాటలాడి కొంగువట్టి తీసి నిన్ను
గుత్తపుగుబ్బల నూఁది గునిసేము నేము ॥ ఎవ్వ ॥

అంగములు సోఁకించి అట్టె మోవి చవిచూపి
చెంగటనే కాఁపిరము నేసీ నాపె
జంగిలి దూరులు దూరి జంకెన బొమ్మలు చూపి
వెంగెములనే సడివేసేము నేము ॥ ఎవ్వ ॥

చనవునఁ గాఁగిలించి చాయలు సన్నలుఁ జేసి
యెనసీ శ్రీవేంకటేశ యెదుట నాపె
ననుపుల నిన్నుఁగూడి నవ్వుతానే గోర గీరి
చెనకి రతుల ఘాతసేసేము నేము ॥ ఎవ్వ ॥ 185

శుద్ధవసంతం

ఊరకే నన్నిటు దూరి వుప్పతించేవు
యేరీతి తక్కరియౌటా యెఱఁగవు నీవు ॥ పల్లవి ॥

ఆతఁడు వాసులెక్కించి ఆటకానకుఁ బెట్టితే
యేతులకుఁ గాఁతాళించి యేలచూచేవే
రాతిరిఁబగలుఁ దాను రచ్చ లెందోసేసి వచ్చి
యీతల సటలుసేసే దెఱఁగవు నీవు ॥ ఊర ॥

తానే సన్నలు సేసి తగవులఁ బెట్టితేను
పేనిపట్టుక నీవేల పెనఁగాడేవే
ఆనుకొని వాడవారి నందరిఁ బెండ్లాడివచ్చి
యీనేరుపులు చూపేది యెఱఁగవు నీవు ॥ ఊర ॥

శ్రీవేంకటేశ్వరుఁడు చేరి యిద్దరిఁ గూడితే
చేవమీర నీవేల సిగ్గువడేవే
వేవేలుసతులకు వేరేసేసపెట్టి వచ్చి
యీవిధాన మొఱఁగేది యెఱఁగవు నీవు ॥ ఊర ॥ 186

రేకు 934 కాంబోది

నాకేల వేగిరము నమ్మితి నేను
మేకాని నీవే నన్ను మెచ్చేవుగాని ॥ పల్లవి ॥

ప్రియురాలు విభునితో పెనఁగులాడఁగఁబోతే
నయమున వూరివారు నవ్వఁజూతురు
క్రియ గూడ నిట్టె చేతికిని లోనై వుండఁగాను
దయ నీచిత్తములోన తానే వుండీఁగాని ॥ నాకే ॥

పాయరానివారు నీతో పంతము లాడఁగఁబోతే
కాయకపుసవతులు కాకు సేతురు
వోయి నీవెంతసేసినా నోరుచుకవుండఁగాను
యీయెడ నీవే తగవు యెఱిఁగేవుగాని ॥ నాకే ॥

కందువ నే నిట్టె నిన్నుఁ గాఁగిలించి కూడఁబోతే
పొందైన నీసతులెల్లాఁ బొగడుదురు
ఇందులో శ్రీవేంకటేశ యేలితి విట్టె వుండఁగా
మందలించి నీవే యింకా మన్నించేవుగాని ॥ నాకే ॥ 187

బౌళి

ఇంక విచారములేల యిద్దరును నొక్కటే
సంకెలేక వుండితేను జరసేరా సతులు ॥ పల్లవి ॥

వనితకు నీకును వాడికమాటలవల్ల
మనసులు సరిదాఁకె మరి యేఁటికి
పెనఁగించుకొననేల ప్రియము తొల్లె కలదు
వొనగూడి వుండఁగాను వొద్దనేరా సతులు ॥ ఇంక ॥

సుదతికి నీకును సూటులచూపులవల్ల
కదిసెఁ జుట్టరికేలు కత లేఁటికి
పదర నింతేసి యేల పనులెల్లా నీదేరె
యెదురెదుర నవ్వగా [1]నేలనేరా సతులు ॥ ఇంక ॥

జలజాక్షికిని నీకు సారెఁ జెనకులవల్ల
కొలఁది మీరె రతులు కొంకనేఁటికి
వెలయఁ గోనేటిశ్రీవేంకటేశ నన్నేలితి
కొలువు సేయించుకొంటేఁ గొనరేరా సతులు ॥ ఇంక ॥ 188

---

[1] ఏల + అనేరా.

పాడి

ఎంతసేసినా నీవు ఇన్నిటికిఁ దగుదువు
బంతికిఁ బిలుతు సిగ్గువడేవనికాని ॥ పల్లవి ॥

బగివాయ కాపెమీఁదిపరాకునను న్నవేళ
నగినదే చాలదా నాతో నీవు
పొగడుదు నిందరిలో పొంచి నీసుద్దులు చెప్పి-
యగడు సేసితినంటా ననేవనికాని ॥ ఎంత ॥

చెలిఁ గాఁగిలించేవేళ చేరి నిన్నుఁ బిలిచితే
పలుకుటే చాలదా పైపై నీవు
సొలసిందుకు మొక్కుదు చూచినవా రేమని
తలఁతురో యని కొంకి దాఁగేవనికాని ॥ ఎంత ॥

వోదక మీరిద్దరును వుండఁగా నే వచ్చితే
కూడుటే చాలదా గొబ్బన నీవు
వీడె మిత్తు నిందుకు శ్రీవేంకటేశ వెంగెమని
వాడుమోముతోఁ దలవంచేవనికాని ॥ ఎంత ॥ 189

ఆహిరి

ఎగసక్కే లాడనేర యిచ్చకము లాడనోప
జగడాలు మాని యింక చక్కనుండుమనవే ॥ పల్లవి ॥

చెలిమిసేసేవాఁడైతే చేఁతకల్లా లోనౌఁగాక
మలకలమలకలమాట లేఁటికే
వలపెల్లా నాసొమ్ము వట్టిసట దనసొమ్ము
చలము లింకానేల చక్కనుండుమనవే ॥ ఎగ ॥

తప్పులేనివాఁడైతే తాలిమితో నుండుఁగాక
అప్పటిని యింతేసియాన లేఁటికే
యెప్పుడూ నేఁ దనదాన యెవ్వరివాఁడో తాను
చప్పుడు సేయక యిఁక చక్కనుండుమనవే ॥ ఎగ ॥

సమ్మతించినవాఁడైతే చనవిచ్చి కూడుఁగాక
కమ్మటి రేపుమాపని గడు వేఁటికే
తమ్మిపువ్వుకాంతను తా శ్రీవేంకటేశుఁడు
సమ్మదము లోనగూడె చక్కనుండుమనవే ॥ ఎగ ॥ 190

వరాళి

ఇంతకు వచ్చెనా నేఁడు యీపెవలపు
సంతసతులకు నేఁడు సన్నలు చూపేవు ॥ పల్లవి ॥

సేసకొప్పు వంచదా చేరి నీకు మొక్కదా
ఆసతో సేవలు సేయదా యింతి
వాసులెక్కించి యాడోవనితనుఁ బురికొల్పి
మాసటీనివలె నేఁడు మాటలాడించేవు ॥ ఇంత ॥

పెదరేఁచి వీడెమీదా ప్రియములు చెప్పదా
చిడుముడి చన్నులఁ బూజించదా యింతి
యెదమిచ్చి వేరొక్కతె నెఱఁగనటే తెచ్చి
కడవానివలె నేఁడు కాకుసేయించేవు ॥ ఇంత ॥

ఇటు నిన్నుఁ గూడదా యింపు నీకుఁ జేయదా
నటన శ్రీవేంకటేశ నవ్వదా ఇంతి
ఘటనఁ బరకాంతను కన్నులెదుట నిలిపి
విటునిచందాన నేఁడు విద్యలాడించేవు ॥ ఇంత ॥ 191

దేసాళం

ఏమి గట్టుకొంటివి యింతేసి మమ్ముఁ జేసి
దోమటి దొడికి మాకు దూరులు గట్టుమరా ॥ ఏమి ॥

పోహణించి నీవేల పూఁచి బాసనేసేవు నీ-
మోహమెల్లాఁ గంటిమి మొన్ననే నేము
వూహాపోహ లెరిఁగి వూరకున్నదాన నేను
సాహసించి చన్నులపైఁ జాఁతురా నీచేతులు ॥ ఏమి ॥

చేరి మమ్ము నేల నీవు చెనక వచ్చేవు నీ-
నేరుపెల్లాఁ గంటిమి నిన్ననే నేము
కూరిమి గొసరి నీగుట్టు దెలుసుకొంటిమి
మేరమీరి యింతలోనే మెట్టుమరా పాదము ॥ ఏమి ॥

కొయ్యతనాన నన్నుఁ గూడితి పానుపుపై నీ-
నెయ్యమెల్లాఁ గంటిమి నేఁడే నేము
యియ్యెడ శ్రీవేంకటేశ యిన్నియు నియ్యకొంటిమి
[1]నియ్యిచ్చలమోవిపయి నింతురా గుఱుతులు ॥ ఏమి ॥ 192

రేకు 935 శ్రీరాగం

ఇదివో మీసుద్దులు ఇందుకే వెరగయ్యీని
వుదుటుమీవయసులు వొక్కరతే కాదా ॥ పల్లవి ॥

వేడుకతో నిన్నుఁ గూడి వింతలై యుండి తనకు
వాడుమోమేల వచ్చె వనితకును
జాడతో నీమోమైతే సరిఁ జెంగలించినది
వోడక మీకిద్దరికీ వొక్కరతే కాదా ॥ ఇది ॥

1. నీ + ఇచ్చల. వింత్రితికసమాసము.

పువ్వువలె నీతోడ పొందుసేసె నిందాఁకా
నివ్వెరగేఁటికి వచ్చె నెలఁతకును
నవ్వులైతే నీసెలవి నారుకొన్నట్టున్నవి
వువ్విళ్లూర నిద్దరికీ నొక్కరతే కాదా ॥ ఇది ॥

కలిసె నీకాఁగిటను కడఁగి శ్రీ వేంకటేశ
అలపులేఁటికి వచ్చె నంగనకును
కొలఁదిలేవు నీకైతే గుఱుతైనచెనకులు
వొలిసి మీకిద్దరికీ నొక్కరతే కాదా ॥ ఇది ॥ 193

రామక్రియ

ఆపెకంటె నీవెక్కుడు ఆపె తొల్లె నీకెక్కుడు
చేపట్టి చెలి మొక్కఁగా చెనకేవు నీవు ॥ పల్లవి ॥

కన్నులనే సన్నసేసి కాఁకలు నీపైఁ టూసి
మిన్నక పరాకుసేసీ మెలుఁత
చన్నులపైఁ జేయి చాఁపి సంగతి నిట్టూర్పు లాఁపి
వున్నతి వలపు చల్లి వొరసేవు నీవు ॥ ఆపె ॥

మాటలనే పొద్దువుచ్చి మచ్చిక నీపైఁ గుచ్చి
కూటముల నవ్వు దచ్చీ కోమలి
నీటులనే మేనువెంచి నేరుపులనే మించి
పూఁటవూఁటకుఁ గొసరి పొదిగేవు నీవు ॥ ఆపె ॥

కడుఁదమకాన మొక్కి కాఁగిటిలోపలఁ జొక్కి
అడరి కాలుదొక్కీ నంగన
విడువక రతిఁ బొంది వెస మోవితేనె చింది
కడఁగి శ్రీ వేంకటేశ కైకొనేవు నీవు ॥ ఆపె ॥ 194

కొండమలహరి

ఎంతలేదు రమ్మనవే యేల వేసాలు సేసీని
పంతగాఁడై వూరకుంటే పచారించేరా ॥ పల్లవి ॥

అలయనేలే తాను ఆసురుసు రననేలే
నలినాక్షి తనతోఁ బెనఁగులాడితే
పలవఁగ నింతేసి వచ్చేఁగాక అటు తాను
తొలుతే సాజాన నుంటే దొమ్మి సేసేరా ॥ ఎంత ॥

సిగ్గులు వడఁగనేలే సెలవుల నవ్వనేలే
నిగ్గులను వసంతపునీరు చల్లితే
బగ్గన తా వచ్చి వొడివట్టి తియ్యఁగానేకాక
వొగ్గి గుట్టున నుండితే నొలవేసేరా ॥ ఎంత ॥

మేనిమురిపెములేలే మేకులు చూపఁగనేలే
ఆనుక తనకాఁగిట నాపె గూడఁగా
యీనెపము శ్రీవేంకటేశుఁడు తాఁ జేసెఁగాక
మోనాన వాసితో నుంటే మొరయవచ్చేరా ॥ ఎంత ॥ 195

సాళంగనాట

పొందు గలిగితే నన్నుఁ బొసఁగుఁగాక
చందముగానియప్పుడు సమ్మతులు గూడునా ॥ పల్లవి ॥

మనసురానిచోటికి మంతనము లేమిటికి
చనవులేనియడకు సరసాలేల
ననుపులేనిపట్ల నగవులు చవిగావు
అనుమానమైనచోట ఆసపడఁదగునా ॥ పొందు ॥

యితవుగానివేళ ఇచ్చకము లేలవచ్చు
సతముగానివారిసంగా లొద్దు
రతి కెక్కనివలపు రాయిడికి మూలము
తతిగానివయసుకు తమక మమరునా ॥ పొందు ॥

సిగ్గులు ముంచుకొనఁగా నేసలెట్టు వెట్టఁజెల్లు
యెగ్గుపట్టఁ బూనితేను యెనయరాదు
అగ్గమై శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
వెగ్గలించె సంతోసాలు వేగిరించఁ దగునా ॥ పొందు ॥ 196

సామవరాళి

ఏమి గట్టుకొంటివి నీ విందువంకను
సాము లిందులోనే చేసి సాదించవయ్యా ॥ పల్లవి ॥

అలిగి నేనే తిట్టితినంటా నాపెతోఁ జెప్పి
తెలిపి నీవే తగవు దిద్దవచ్చేవా
వెలయ నిద్దరికిని వేఁడికోపములు రేఁచి
చెలఁగి నడుమ నీవు సీతు గాయవయ్యా ॥ ఏమి ॥

పెనఁగి నే నాపె నొట్టు వెట్టితి నంటాఁ జెప్పి
పొనిగి యంతటిలోనే పొందు సేసేవా
వొనరఁగఁ దరితీపు లూరించి వూరించి
యెనలేని వేడుకల నీఁదులాడవయ్యా ॥ ఏమి ॥

నాలితో నాపె నేను నవ్వితినంటాఁ జెప్పి
తాలిమితోడుతనే సంతము సేసేవా
యీలీల శ్రీవేంకటేశ యేలితి విద్దరి మమ్ము
పోలిమి మావలపు మైఁ బూసుకొనవయ్యా ॥ ఏమి ॥ 197

దేవగాంధారి

మాతో నేమి చెప్పేవు మాపుదాఁకా సుద్దులు
నీతి విచారించుకొంటే నీవెఱఁగవా ॥ పల్లవి ॥

నమ్మిక గావలె నని నవ్వు దెచ్చుకొనేఁగాక
కొమ్మమనసులోపలికోప మారెనా
సమ్మతించవచ్చునా చల్లజంపు లివిగాక
నెమ్మి నీచేసినచేఁత నీ వెఱఁగవా ॥ మాతో ॥

మచ్చిక చూపవలసి మాటలాడె నింతెకాక
కచ్చుపెట్టుకున్నయలుకలు దీరెనా
మెచ్చఁదగునా యివి మిక్కిలి కాఁకలుగాక
నిచ్చలపు నీగుణాలు నీ వెఱఁగవా ॥ మాతో ॥

వలపు రేఁచేనని వంక చూచె నింతెకాక
తలఁపులో [1]నెంజెరి వింతటఁ బాసెనా
యెలమి శ్రీ వేంకటేశ యింతి నిట్టె కూడితివి
నెలకొన్న నీమహిమ నీవెఱఁగవా ॥ మాతో ॥ 198

రేకు 936 శ్రీరాగం

ఇప్పటనుంటీఁ గొసరనేమిటికి నింతలోనే
తప్పీనా తానే ఆసుద్ది దడవీఁగాని ॥ పల్లవి ॥

రయమున విరహాన రాఁగిననన్నుఁ జూచితే
దయ పుట్టకుండునా తనకైనాను
ప్రియములు చెప్పియైనాఁ బిలువవే యిక్కడికి
నియతానఁ దానే మన్నించీఁగాని ॥ ఇప్ప ॥

1. 'నెంజెరివి' 'నెంజలి' కి మారురూపమా? నెంజలి=మనోవ్యథ.

వెగటులేనినావిన్నపములెల్లా వింటే
చిగిరించకుండునా చిత్తమైనాను
మొగము చూడుమనవే ముచ్చటయ్యీనివే నేఁడు
జగమెల్లా మెచ్చఁగాను చనవిచ్చీఁగాని ॥ ఇప్ప ॥

గుఱుతుగా నన్ను నిట్టె కూడినాఁడు ఇటులైతే
చిఱునవ్వు రాకుండునా నెలవినైనా
యెఱిఁగి శ్రీ వేంకటేశుఁ డేలె నన్ను విడెమీవే
జఱయుచుఁ దనమోవి చవిచూపీఁగాని ॥ ఇప్ప ॥ 199

శుద్ధవసంతం

కాంతలనెల్లా నొక్కగాడిఁ గట్టే వింతేకాక
మంతనమాడితేనే మర్మము గరఁగునా ॥ పల్లవి ॥

తలఁపే కలిగితే దండనుండవా నీవు
వలచినవాఁడవైతే వాసులెంతువా
నెల కొాకమాటు వచ్చి నిద్రతెంకి నుండఁగాను
తెలిసెనా నాగుణము తేటతెల్లమిగను ॥ కాంత ॥

చుట్టరిక మెఱిఁగితే సులభాన నవ్వవా
గుట్టుగన్నవాఁడవైతే కొంచివుందువా
యెట్టకేల కిటు మాతో యేలాటా లాడితేనే
పట్టెనా నీమనసున పంతపునా సేవలు ॥ కాంత ॥

కరుణించవలసితే కప్పురవిడె మియ్యవా
సరసానకు లోనైతే సమ్మతించవా
యిరవై శ్రీవేంకటేశ యిట్టె నన్ను నేలితివి
సరివచ్చెనా తొల్లిటి సంగాతపురతులు ॥ కాంత ॥ 200

పూర్వగౌళ

కానవచ్చీ నందులోనే కడమదొడమలెల్లా
నీనేరుపు లాపెమీఁద నెరపుమా చూతము ॥ పల్లవి ॥

చేపట్టుఁగుంచమనంటా సిగ్గు లీడఁ బలికేవు
ఆపెతోడ నీమాటే ఆడుమా నీవు
వోపుదునంటా నాకు పూడిగాలు చెప్పేవు
యేపున నాపెచేత చేయించుకొమ్మా చూతము ॥ కాన ॥

గోలదాననంటా నన్నుఁ గొనగోరఁ జెనకేవు
నాలి నాపెతోడ నిట్టె నవ్వుమా నీవు
మేలుగలదాననంటా మెట్టేవు నాపాదము
గేలి నాపెపాదానఁ దాఁకించుమా చూతము ॥ కాన ॥

సేసుకొన్నదాననంటా చేరి నన్నుఁ గూడితివి
ఆసల నాపెఁ గాఁగిట నంటుమా నీవు
శ్రీసతినంటా నన్ను శ్రీవేంకటేశ యేలితి
భూసతి ఆపెను నిట్టె పొందుమా చూతము ॥ కాన ॥ 201

మధ్యమావతి

అందుకుఁగా మమ్మేల ఆఁడిఁబెట్టీఁ దాను
సందడిఁ గాలుదొక్కితే సాదించవలదా ॥ పల్లవి ॥

అద్దుకొని యెడమాట లాడించకుండితే నేమి
వద్దికి రాఁగాను నే వద్దనేనా
ముద్దుముద్దువలె నేను మొక్కి నిలుచుండితేను
అద్దో పరాకు సేసితే నలుగఁగవలదా ॥ అందు ॥

చప్పుడు గాకుండా వచ్చి సన్నసేయకుంటేనేమి
కప్పురవీడె మియ్యఁగాఁ గాదనేనా
దుప్పటికొంగు వట్టితి తొలుతఁ దా రానందుకు
కొప్పువట్టి తీసి నేను కోపగించవలదా ॥ అందు ॥

సేనలుగాఁ బ్రియములు చెప్పకుండితే నేమి
తేనెమోవిచ్చితే సమ్మతించననేనా
తానె శ్రీవేంకటేశుఁడు తగిలి నేఁ గూడితేను
పూని యలసినందుకు పోదిసేయవలదా ॥ అందు ॥ 202

గౌళ

నివ్వెరగుతోడ నేము నిలుచున్నార మిదివో
దవ్వులనుండి నీకెట్టు తమిరేఁచేమయ్యా ॥ పల్లవి ॥

మనసులోపలిమాట మగువ కాదఁగరాదు
తనువుమీఁదటికాఁక ధరించరాదు
వనితఁ బాసి వాడలవారితో జూజమాడేవు
వినయాన నీకేమని విన్నవించేమయ్యా ॥ నివ్వె ॥

కన్నులఁజూచేయాసలు గక్కున నాపఁగరావు
పన్ని పాయపుసిగ్గులు పట్టఁగరావు
సన్నల నింతులతోడ సాముసేసే విందు
అన్నిటా నిన్నెట్లాఁ జాయకుఁ దెచ్చేమయ్యా ॥ నివ్వె ॥

కూడినట్టి నీరతులు కొలఁదివెట్టఁగరావు
వాడుమోవిగుఱుతులు వంచించరావు
యీడనె శ్రీవేంకటేశ యేలితి వింతలో వచ్చి
తోడనే నీకీరితిఁ బోదులు సేసేమయ్యా ॥ నివ్వె ॥ 203

పాడి

ఎంత దక్కరీఁడే వీఁడు యేమి సేతునే
మంతనపుచెలులాల మనసియ్యఁ డిదివో ॥ పల్లవి ॥

చేసన్న చేసినవాఁడు చేరి మాటలాడరాదా
ఆసల నవ్వల నెత్తమాడ నేఁటికి
యీసుద్దు లెఱుఁగ నేను యీతనివేళ గాచుక
సేసవట్టుకున్నదాన చిత్తగించఁ డిదివో ॥ ఎంత ॥

తప్పక చూచినవాఁడు దండనే కూచుండరాదా
కప్పురపువసంతాలు కడనేఁటికి
తప్పు విచారించనైతి తనకే వొడిగట్టుక
అప్పటనుంటిఁ జూచేను అవుఁగాదనఁ డిదివో ॥ ఎంత ॥

పీడె మిచ్చి కూదేవాఁడు పేరులేక చొక్కరాదా
వాడికసతులకళవళమేఁటికి
యీడనె శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁ గూడె
పాడితో సేవలుసేసేఁ బాయలేఁ డిదివో ॥ ఎంత ॥ 204

రేకు 937 భైరవి

సిగ్గువడ నిఁకనేల శిరసు వంచఁగనేల
తగ్గులేని సరసాల తమిరేఁచరాదా ॥ పల్లవి ॥

పలుమారు నీచేఁతలు పచ్చిగా నాడఁగరాక
చెలియ చెక్కిటిమీఁదిచేత నున్నది
మొలకచన్నులమీఁద మొనగోర సోఁకింపించి
నెలవుల నవ్వింపించి చెంగలించరాదా ॥ సిగ్గు ॥

కొచ్చి కొచ్చి నీమేన గుఱుతులు చూపలేక
ముచ్చటతో సారె నీకు మొక్కుచున్నది
కచ్చుపెట్టి యాపెను నీకాఁగిటను బిగియించి
ఇచ్చకపువలపుల నీఁదింపించరాదా ॥ సిగ్గు ॥

రతికెక్కినట్టినిన్ను రవ్వసేయఁ జాలక
మితిమీరి నిన్నుఁ గూడి మెచ్చుచున్నది
సతమై శ్రీవేంకటేశ చనవిచ్చి మన్నించి
యితవుగా మోవి ఇచ్చి ఇటు మెప్పించరాదా ॥ సిగ్గు ॥ 205

వరాళి

ఇందుకు నే నేమిసేతు ఇది నీకే తెలుసును
విందువలె లోలో వట్టివిచారాలు సేసేవు ॥ పల్లవి ॥

యెన్నఁడైనా నే నిన్ను యెగసక్కె మాడుదునా
కొన్నేసి నీవే గడించుకొందువుగాక
పన్ని నిన్ను నేఁ దప్పులు పట్టితినా యిటు తొల్లి
వున్నట్టేవుండి నీవే వులికిపడేవు ॥ ఇందు ॥

యెచ్చరించి నే నేమైనా యేతువ లెత్తితినా
పచ్చిదేర నీవే సిగ్గుపడేవు గాక
నెచ్చెలులముందరను నీపై నింద మోపితినా
బచ్చెనమాటల నీవే బాసలు సేసేవు ॥ ఇందు ॥

పూనిపట్టి యెప్పుడైనా బొమ్మల జంకించితినా
ఆనుక నీవే వెరగందేవు గాక
వీనుల నీ సుద్దులెల్లా విననా శ్రీవేంకటేశ
నానాటికి నన్నునేలి నవ్వులు నవ్వేవు ॥ ఇందు ॥ 206

కన్నడగౌళ

తేటతెల్లమిగ నన్నుఁ దెలిసితిమి
ఆఁటదాననంటా నన్ను నాఱడిఁబెట్టేవు ॥ పల్లవి ॥

చెఁత నాపె నీకు నిట్టె సేవసేయఁగాఁ జూచి
యింత నీవు వేఁడుకొన్నా నితవయ్యీనా
యెంతలేదు నీవేసాలు యెఱఁగనా నేఁ దొల్లి
సంతకూటములు చూపి సటలఁబెట్టేవు ॥ తేట ॥

సన్నల నాపె నీతో సరసాలాడఁగాఁ జూచి
మన్నన లెన్నిచ్చినాను మనసొగ్గీనా
పన్నిన నీమాయ లివి భావించి తెలియనా
తిన్ననిమోవితేనెల తీపులఁబెట్టేవు ॥ తేట ॥

గరిమెతో నాపె నీకాఁగిట నుండఁగాఁ జూచి
సరి నెంతలాలించినా చవు లయ్యీనా
యిరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
శిరసువంచి నవ్వి నేసలువెట్టేవు ॥ తేట ॥ 207

రామక్రియ

ఆఱడిఁబెట్టఁగనేల ఆతని నింతేసి నీవు
మీఱక బంగారుపీఁటమీఁదఁ గూచుండవే ॥ పల్లవి ॥

కొంగువట్టి తియ్యనేలే కొసర నేమిటికే
సంగతెఱిఁగిననెరజాణవిభుని
ముంగిట నున్నాఁ డతఁడు మొక్కి_తే నెఱుకగాదా
రంగుగాఁ దానే వచ్చీ రావే లోపలికి ॥ ఆఱ ॥

విన్నపము సేయనేలే వేఁడుకొన నింత యేలే
సన్న దెలిసినయట్టిసరసునికి
కన్నాఁడు నీగుట్టు వేళగాచుటే తగులుగాదా
పన్ని నిన్ను నేలీఁగాని పలువవే పానుపు ॥ అల ॥

చనవునఁ దిట్టనేలే చవులు చూపఁగనేలే
యెనసినశ్రీ వేంకటేశునెదుట
ననిచి వున్నాఁ డితఁడు నగుటే వుంకువగాదా
తనివి నొందించి యింకాఁ దడవవే కాఁగిట ॥ అల ॥ 208

కాంబోది

తలఁచుకొమ్మనవే తనగుణాలెల్లా నేఁడు
కొలనిలోసతులను కోరఁడా తాను ॥ పల్లవి ॥

పంతములేలాడీనే పడఁతులుగలవాఁడు
యింతలోనే మరుబాణా లిటు గెల్చెనా
అంతటాను తనసుద్దు లల్లనాఁడే వింటిమి
వింతగా సీతాదేవి వెదకఁడా తాను ॥ తలఁ ॥

నవ్వులేల నవ్వీనే నను పైనకోదెకాఁడు
ఇవ్వలఁ దనపాయము ఇట్టె గెల్చెనా
చివ్వనఁ దనయెమ్మెలు చెప్పీనేలే మాముందర
దవ్వుల రుక్మిణికిఁగా తగులఁడా తాను ॥ తలఁ ॥

చెప్పుకోనేలే మాటలు శ్రీ వేంకటేశ్వరుఁడు
యిప్పుడే తనమనసు యిట్టె గెల్చెనా
వొప్పుగా నన్నిటు గూడె నొరయనేలే చన్నులు
నెప్పున నురాన లక్ష్మి నిలుపఁడా తాను ॥ తలఁ ॥ 209

సౌరాష్ట్రం

ఏమి సేయవచ్చు నిఁక నెవ్వరితో నాదేము
నీమన సెఱఁగనిది నేము చెప్పేమా ॥ పల్లవి ॥

సెలవుల నగనా చెప్పినట్టు సేయనా
కొలఁదిమీర నన్నేల కొసరేవు
తలుపుమాఁటుననున్న తరుణి నడుగరాదా
యెలమి నీయంత నీవు యెఱఁగకుండితేను ॥ ఏమి ॥

సేస నీపైఁ బెట్టనా చేతికి విడెమియ్యనా
వేసాలకు నన్ను నేల వేఁడుకొనేవు
యీసుద్ది నీవెనకదిక్కాంతిని నడుగరాదా
దోసము పుణ్యము నీకుఁ దోఁచకుండితేను ॥ ఏమి ॥

కైవసమై కూడనా కాఁగిలించుకొననా
శ్రీవేంకటేశుఁడ నాచెక్కు నొక్కేవు
భావము నీదాఁపిరముపడఁతి నడుగరాదా
చేవమీఱినసిగ్గునఁ జెప్పరాకుండితేను ॥ ఏమి ॥ 210

రేకు 938 శుద్ధవసంతం

మంచివాఁడవే నీవు మావాఁడవు
అంచెలనేల గుక్కే వాడవయ్య మాట ॥ పల్లవి ॥

ఆగడాలేల నేస్సే వటువంటివాఁడవా
మీగుణా లేమైనాను మే మెఱఁగమా
నీగుఱు తెఱఁగలేక నిందలాడిరి చెలులు
యీగతి నేఁటికి వంచే వెత్తవయ్య శిరసు ॥ మంచి ॥

నేరము లీకున్నవా నీయందు నేమి గడమ
గారనపునీచేఁతలు కన్నవే కావా
దూరిరింతే నిన్నిందరు తుదమొద లెఱఁగక
నారుకొన్నచింత యేల నవ్వవయ్య సెలవి ॥ మంచి ॥

బొంకనేరుతువా నీవు పొందుగా మమ్మేలితివి
కొంకేల శ్రీవేంకటేశ కొస రున్నదా
సంకించక నిన్ను నిట్టె సాదించిరింతేకాక
బింకపుగుట్టేమిటికి పెట్టువయ్య నేస ॥ మంచి ॥ 211

మఖారి

ఏమి సేయవచ్చు నిఁక నియ్యకొనవలెఁగాక
దీమసపుటాసలేకా దిష్మరిఁ జేసినవి ॥ పల్లవి ॥

చెలరేఁ గాపెసుద్దులే చెప్పేవు పలుమారు
చెలులతోనెల్లా నీవు సిగ్గువడక
నలువంక సవతులు నవ్వే రిందుకు నిన్ను
వలపుగా నిన్ను నింత వాఁటము సేసినది ॥ ఏమి ॥

సూటిగా నాపెమెట్టెలు చూపేవు నీవేలఁ బెట్టి
చీటికిమాటికి నీవు సిగ్గువడక
చాటువగా నందవారు సన్న సేసే రెఱఁగవు
పాటించి మననేకా పచ్చిగాఁ జేసినది ॥ ఏమి ॥

వది నాపెకుఁ బూనుక వచ్చేవు శ్రీవేంకటేశ
చికుముడి నన్నేలితి సిగ్గువడక
పదఁతులు నీచేఁతలు పట్టిఇచ్చేది యెంచవు
కదఁగి నీవయనేకా కళలు నించినది ॥ ఏమి ॥ 212

దేశాక్షి

మాపుదాఁకా నేమిచెప్పే మఱియును నేనిఁక
అపనికి లోనై వుండు టదిమేలు నాకు ॥ పల్లవి ॥

ప్రియపడి నీతో నింత పెనఁగ నే మున్నది
నయగారిమాటలకు నగుతగాక
నియతాన నడవఁగా నీకు బుద్ధి చెప్పేనా
అయినట్టయిన నీవుండు టదిమేలు నాకు ॥ మాపు ॥

సారెసారె నే నిన్ను సాదించఁగా నేమివచ్చీ
మేరతో నీచేఁతలెల్లా మెచ్చుటగాక
వోరలేక వుండఁగాను వొడఁబరచవచ్చేనా
ఆరతి నీయిచ్చనుండు టదిమేలు నాకు ॥ మాపు ॥

శ్రీవేంకటేశ నీతోడ సిగ్గువడఁ బనియేమి
భావించి నిన్నుఁ గూడుటే పంతముగాక
నీవాళ్ళ లేనిగుణము నేఁ జేసిపెట్టేనా
ఆవటించి నమ్మివుండు టదిమేలు నాకు ॥ మాపు ॥ 213

మాళవిగౌళ

చెప్పవద్దా బుద్ధులు నీచెలువునికి
వుప్పతించ కేలుంటివే వొడివట్టఁగాను ॥ పల్లవి ॥

విందువలె నాఁకనిచే విడెము నే నందుకోఁగా
సందుసుడి నీవేల జరసేవే
పొందుసేసి నీవింతేసి పూనుక వచ్చేదానవు
యెందుంటివే నన్నతఁడు యేలుకొనఁగాను ॥ చెప్ప ॥

వొద్దనుండి నేనాతని కూడిగాలు సేయఁగాను
గద్దించి నీవేఁటికిఁ గాఁతాళించేవే
సుద్దులే చెప్పుచు వట్టిసూడువట్టేదానవు
తిద్దుకోవద్దటవే యీతెరువు రాఁగాను ॥ చెప్ప ॥

గక్కన శ్రీవేంకటేశుకాఁగిట నేఁ గూడఁగాను
వెక్కసాన నేమిటికి వెరగందేవే
అక్కరతో నెడచొచ్చి ఆయాలంటేదానవు
మొక్కి వేఁడుకొనవదా ముందుముందుగా ॥ చెప్ప ॥ 214

బౌళి

దొడ్డవాఁడ వవుదువు దొరతనములు చెల్లు
వెడ్డువెట్టి వేఁడుకొని విచారించరాదా ॥ పల్లవి ॥

యేమిటికిఁ దలవంచే వెక్కడిపరాకు నీకు
కామిని నీచేతికిఁ గానుకియ్యఁగా
వాములుగా నీమీఁద వలపులు దొంతివెట్టి
మోము చూచీఁ జిత్తగించి ముచ్చటాడరాదా ॥ దొడ్డ ॥

సిగ్గులేల నెరపేవు చిరునవ్వు లేలవచ్చె
వెగ్గళించి యాపె నీకు తమకము వద్దికిచ్చి
తగ్గుమొగ్గులేక నీకు విందుచెప్పఁగా
యెగ్గులేనిముచ్చ టాడీ నిచ్చగించరాదా ॥ దొడ్డ ॥

నీటులేల చూపేవు నీకునీకే అలసేవు
గాఁటపురతులఁ గూడి కాఁగిలించఁగా
పాటించి శ్రీవేంకటేశ పాయము తరపువెట్టి
మేటిపంతములు చూపీ మేల మాడరాదా ॥ దొడ్డ ॥ 215

పాడి

ఇద్దరము నున్నారము యిరుదిక్కులా నీకు
పెద్దరికముతోడనే పెనఁగఁగవలెను ॥ పల్లవి ॥

ఆకె నొడఁబరమకో అంకెకు వచ్చినదాఁకా
నాకేమి చెప్పేవు నమ్మినదాన
[1] శేకరమాయ వలపు సిగ్గులు వడితేఁ బోదు
చేకొలఁదిఁ బ్రియములు చెప్పవలె నిఁకను ॥ ఇద్ద ॥

పూని యాకెనే నీవు బుజ్జగించి పిలుచుకో
నేనెప్పుడుఁ దొలుతనే నీదానను
నానాఁడే పెండ్లాడి నవ్వులు నవ్వితేఁ బోదు
తేనెమోవి యిచ్చి తరితీపు చూపవలెను ॥ ఇద్ద ॥

యింటిలో నాకెఁ గూడితి విందాఁకాఁ గాఁగిట నించు(కో?)
జంటయి నేఁ గూడితి నిచ్చకపుదాన
వెంటనే శ్రీవేంకటేశ వేసాలు నేసితేఁ బోదు
అంటువాయ కిట్లానే ఆదరించరాదా ॥ ఇద్ద ॥ 216

రేకు 939. దేసాళం

పాయపుమదములేల పచారించేవు
చాయలా సన్నలా నిట్టె జట్టిగొనరాదా ॥ పల్లవి ॥

చలము సాదింతురా సతులపై విభుఁడవు
వలచి ప్రియము చెప్పవలెఁగాక
తొలుతే నమ్మించి తెచ్చి దోసము గట్టుకోనేల
చెలియచనవు నేఁడు చెల్లించరాదా ॥ పాయ ॥

---

1, శేకరము :- శేఖరశబ్దభవమా ? 'శే' వ్యావహారికము.

అట్టుగాఁ జేయుదురా గుట్టున రామల నీవు
చుట్టరికమై నయము చూపుట గాక
వట్టియాసలనుఁ బెట్టి వలవంత సేఁచనేల
ఇట్టె కాంతకోరిక యీడేర్చరాదా ॥పాయ॥

తగవులఁ బెట్టుదురా తరుణుల నింతేసి
తగినరతులఁ గూడి దక్కుట గాక
మిగులా శ్రీవేంకటేశ మెచ్చి గుట్టుసేయనేల
మగువఁ గూడితి విట్టె మన్నించరాదా ॥పాయ॥ 217

అమరసింధు

సిగ్గులువడితేఁ బోదు చెప్పేము నీకుఁ బ్రియము
తగ్గక నీమాట జవదాఁటకున్నాఁ డతఁడు ॥పల్లవి॥

మన్నించి నన్ను నిట్టె మచ్చికతో నేలుమని
విన్నవించవమ్మా విభునికిని
పన్ని ఇన్నిటా నీవు పట్టపుదేవులవు
కన్నెరో నీయప్పణకుఁ గాచుకున్నాఁ డతఁడు ॥సిగ్గు॥

దట్టముగా నేఁడు మమ్ము దయతో రక్షించుమని
కట్టడ సేయవమ్మా కాంతునికి
అట్టె నీవు మొదల మోహపుఁబెండ్లికూఁతురవు
యెట్టైనా నీపంపుసేయ నెంచుకున్నాఁ డతఁడు ॥సిగ్గు॥

చేకొంటి వతని నీవు చేరి నన్నుఁ గూడుమని
కైకొలుపవమ్మా శ్రీవేంకటపతికి
నీకరుణవారము నీవేలికసానివి
యీకడ నాయింటిలో నీయింపు చూపీ నతఁడు ॥సిగ్గు॥ 218

పాడి

సాదుఁగొయ్య వైనాఁడవు సరికిబేసికి నీవు
యేది నిజ మేది గల్ల యేమిసేతునయ్యా ॥ పల్లవి ॥

బిగియరాదు నీకుఁ బ్రియము చెప్పఁగరాదు
నగరాదు చూపులు నాటించరాదు
సగము మంచితనము సగము బింకము చూపే-
వెగసక్కెవువిభుఁడ వేమిసేతువయ్యా ॥ సాదుఁ ॥

బొమ్మల జంకించరాదు పొందులు చూపఁగరాదు
కెమ్మోవి యడుగరాదు కినియరాదు
దిమ్మరితనము గొంత దిట్టరాజసము గొంత
యెమ్మెకాఁడ వైనాఁడ వేమిసేతునయ్యా ॥ సాదుఁ ॥

మచ్చిక మానరాదు మనసు సోదించరాదు
కొచ్చి శ్రీవేంకటేశుఁడ కూడితి నన్ను
పచ్చిసేఁతలు బాసలు నీవాకునను
యిచ్చకుఁడ వైనాఁడ వేమిసేతునయ్యా ॥ సాదుఁ ॥ 219

ఆహిరి

చెప్పఁగదవయ్యా చెవులుచల్లఁగా వినే
దెప్పరపుఁదలపోఁతే దిష్టమాయనో ॥ పల్లవి ॥

తిలకించి యాపె నీదిక్కు చూచితే నీవు
నెలవి నవ్వితి విట్టె సిగ్గుతోడను
యెలమిఁ దనమాటున నేమైనాఁ జేసితివో
చలివేఁడివలపులు సరివచ్చెనో ॥ చెప్పఁ ॥

విన్నపము లేకతాన వెలఁది నీకుఁ జేయఁగా
సన్నల జంకించితివి సరసానను
కన్నె యెవ్వతైనా వచ్చి కాచుకున్నదనెనో
నున్ననినీచెక్కు దననోరు సోఁకింపించెనో ॥ చెప్పఁ ॥

జవ్వని నీకాఁగిటను చన్నుల నొత్తితే నీవు
పువ్వుల వేసితివి నీపొందు చూపుచు
రవ్వగా శ్రీవేంకటేశ రతి నలయించెనో
నివ్వటిల్లఁ జక్కఁగాను నిన్ను నెచ్చరించెనో ॥ చెప్ప ॥ 220

## హిందోళవసంతం

అడుగరే చెలులాల ఆసలేల పెట్టీని
యెడయక పెనఁగితే నిచ్చగించీనా ॥ పల్లవి ॥

నాలిసేసి నాతోను నమ్మికమాట లాడి
యేల బేరిజోకొట్టీనే యిప్పుడు తాను
వాలాయించి నేఁగనక వలెనని పైకొంటేను
వోలి నన్నిటికీఁ దాను వొడఁబడీనా ॥ అడు ॥

చాయలా సన్నలాఁ జూపి సారె నాతో నవ్వీని
ఆయి గిలిగించనేలే అట్టుతోఁ దాను
పాయక నేనందుకును బాఁతిపడి కొసరితే
నాయము దప్పక తాను నడఁపఁగఁగలఁడా ॥ అడు ॥

గారవించి నన్నుఁ గూడె కడునిచ్చకము చేసి
యేరు నిద్రవుత్తురటే యింతలోఁ దాను
యీరీతి శ్రీవేంకటేశుఁ డిందుకు నే వేడుకొంటే
వూరట నారతులకు నొడిగట్టీనా ॥ అడు ॥ 221

కుంతలవరాళి

ఇందులోనే వున్నది మీయిద్దరిజాణతనము
అందరము నేమనియాడేము నిన్నును ॥ పల్లవి ॥

బాగాలిచ్చేయాఁటదానిపయ్యదకొం గెడలించి
చేఁగదేరేచన్నులు పిసికే వేమయ్యా
ఆగడీఁడవని నిన్ను నొఁగాదనఁగలేక
సోగకన్నులఁ దప్పక చూచె నాపె నిన్నును ॥ ఇందు ॥

కుంచెవేసేమగువను కొప్పువట్టి తీసి మోవి –
యంచు గంటిసేసితి వౌనయ్యా
వంచకుఁడ వనుచు రవ్వలుగాఁ జేయఁగలేక
ముంచినమొగమోటాన మొక్కీనవ్వీ నిన్నును ॥ ఇందు ॥

సురటివిసరేయింతిఁ జొక్కించి కాఁగిటఁ గూడి
కెరలించేవు సిగ్గు చెక్కిట నేమయ్యా
పొరపొచ్చెగాఁడవని పోరక శ్రీవేంకటేశ
సరి నిక్కి పైనొరగి యాసలఁబెట్టీ నిన్నును ॥ ఇందు ॥ 222

రేకు 940 సామంతం

సందుసుడిదానఁ గాను సతమైనదాన నీకు
అందరివలెనే నన్ను నలయించ కిఁకను ॥ పల్లవి ॥

వార్తి నీకు విన్నవించే పూఁకొని విను నామాట
చిత్తమువచ్చినప్పుడు నేతువుగాని
బత్తిగల వెరుఁగుదు పఱమారు నారతులు
చిత్తగించి యాపెతోడఁ జెప్పకు నీవిఁకను ॥ సందు ॥

---

త్రిగీతలున్నది చిలుము బలిసినది.

కనుఁగొన నీకు మొక్కే కానుకగాఁ జేకొను
పనిగలప్పుడు చేపట్టేవుగాని
చనవిచ్చితివి తొల్లె సరసపునాచేఁతలు
సొరిది నాపెముందరఁ జూపకు నీవిఁకను ॥ సందు ॥

తతి నాచన్నులనొత్తేతనివొంది కాఁగిలించు
యితవై నప్పు డింకా నేలేవుగాని
పతివి శ్రీవేంకటేశ పచ్చయిననాసుద్దులు
సతమాయ నాపెతో పచారించకు మిఁకను ॥ సందు ॥ 223

వరాళి

ఇన్నాళ్ళవలెఁ గాదు ఇప్పుడు నీవు
తిన్ననిమోమునఁ గళదేరుచుకున్నాఁడవు ॥ పల్లవి ॥

గద్దరికన్నుల నిన్ను గద్దించి గద్దించి
సుద్దులు చెప్పుతానుండె సుదతి నీతో
పొద్దువొద్దుకేమైనా బుద్దులు నీకుఁ జెప్పనో
తిద్దువడె నీగుణాలు తేటతెల్లమిగను ॥ ఇన్నా ॥

జవ్వనపుచనుఁగవ సరిఁ గులికి కులికి
నవ్వులు నవ్వుతానుండె నాతి నీతోను
అవ్వల దొక్కకుండా నిన్నలవరచుకొనెనో
రవ్వలాయ నీవలపు రాతిరిఁబగలును ॥ ఇన్నా ॥

వుట్టిపడ మోవితేనె లూరఁబెట్టి పూరఁబెట్టి
పట్టిపెనఁగుతానుండె పడఁతి నీతో
నెట్టన శ్రీవేంకటేశ నిన్ను సిగ్గుదేర్చెనో
యిట్టె నన్నుఁ గూడితివి యిచ్చకముతోడను ॥ ఇన్నా ॥ 224

గౌళ

ఎందు వోయీ మాపొందు లెప్పుడు మీవారమే
ఇందరిలో నాపె నీపై యేఁకటతో నున్నది ॥ పల్లవి ॥

ఆడరాదా మాటలు ఆపెతోడఁ గొంతవడి
వేడుకతో నున్నది వినేనంటాను
చూడరాదా నెమ్మోము సూటిగా నీయెదుటను
పీడెము చేతఁబట్టుక వేళగాచుకున్నది ॥ ఎందు ॥

చుట్టరికమైనాఁ గొంత చూపరాదా నీమీఁద
రెట్టించినరతులకోరిక నున్నది
ముట్టరాదా చనుఁగవ ముచ్చటైనతమితోడ
యెట్టయెదుట నీకే మీఁదెత్తుక తానున్నది ॥ ఎందు ॥

కూచుండరాదా దండ గొబ్బున మంచముమీఁద
లాచి కూడినమందెమేళాన నున్నది
యేచి యిట్టె శ్రీవేంకటేశ నన్ను నేలితివి
చేచేత నిద్దరిఁ జూచి చేరి నవ్వుచున్నది ॥ ఎందు ॥ 225

కేదారగౌళ

ఏఁటికిఁ బరాకుసేసే విప్పుడు నీవు
మాఁటలాడి ఇఁకనైనా మన్నించరాదా ॥ పల్లవి ॥

చిమ్ముఁజూపులనుఁ జూచి చేతికిచ్చీ పూబంతి
కొమ్మ నీకు నిదె యందుకొనరాదా
వుమ్మగిలఁ జెమరించి వూరకే నీవుండఁగాను
ఇమ్మిచ్చి తొడమీఁదట నిడుకొనరాదా ॥ ఏఁటి ॥

వినయాన నీకు మొక్కి విందుచెప్పవచ్చేఁ జెలి
గునియక యిట్టె ఇయ్యకొనరాదా
నినుపునిట్టూర్పు నించీ నీవు గుట్టుతో నుండఁగా
చనవిచ్చి చెక్కునొక్కి సమ్మతించరాదా ॥ ఏఁటి ॥

కొంగువట్టి పానుపుపై కూచుండఁబెట్టీ నిన్ను
ఇంగిత మెరిఁగి మోవి ఇయ్యరాదా
చెంగలించి రతిఁగూడి శ్రీ వేంకటేశ మెప్పించె-
నంగన నెప్పుడు నిట్టె ఆదరించరాదా ॥ ఏఁటి ॥ 226

ఆహిరి

విచారించుకో నీవే వింతలు నాతోనేల
ప్రచారపునీచేఁతలు పట్టిచూపఁగలనా ॥ పల్లవి ॥

మొగమునఁ గళలెల్లా ముంచుకొని వుండఁగాను
నగరాదా నిన్నుఁజూచి నాకు నీవేళ
నిగిడి సింగారమే నీకు వెంగెమైతేను
మగువ నింత నేను మానుపఁగలనా ॥ విచా ॥

చిడుముడితో నీచెక్కుల వడియఁగాను
తుడువరాదా చెమట తొడఁగి నాకు
వుడిబడి నీసుద్దులు వూరెల్లా నాడుకొంటే
తడయక నే నందు కుత్తర మియ్యఁగలనా ॥ విచా ॥

వుప్పతిల్ల నీమేననున్న పులకలు చూచి
కప్పరాదా పచ్చడము కడఁగి[1] నాకు
యిప్పుడే శ్రీ వేంకటేశ యేలితివి నన్ను నిట్టె
చిప్పిల సిగ్గువడఁగా చిమ్మిరేఁచఁగలనా ॥ విచా ॥ 227

---

[1] క్రీగీతలు గలవి చిలుము తిన్నవి.

ధాయానాట

కిందు మీఁదు నెఱఁగఁదు కెలసీఁ గాతరమున
చందము సేయఁగదరే సతులాల ॥ పల్లవి ॥

పొద్దువోదా తనకేమి పొలఁతులెల్లా నవ్వఁగా
వుద్దండపునవ్వు నవ్వి వొడిపట్టీ
పెద్దరికమా యిదేమి ప్రియురాండ్ల నింతసేయ
బుద్దులుచెప్పరే మీరు పూఁచి చెలులాల ॥ కిందు ॥

వుండఁబట్టదా తనకు నూడిగము సేయఁగాను
చండిపెట్టి వాఁతవాశి(వ్రాఁతవ్రాసీ?)చన్నులమీఁద
బండారము గూదెనా పడఁతులఁ తక్కించఁగా
అందనుండి వేఁడుకోరే అతివలాల ॥ కిందు ॥

పాయపుమదమా యిది పంతానఁ దెరలోన
ఆయమంటి నన్నుఁగూడె నచ్చలానను
చేయి మీఁదాయఁగా నేఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
పాయకున్నాఁడు మెచ్చరే భామలాల ॥ కిందు ॥ 228

రేకు 941 ఆహిరి

ఇంత అట్టు గాఁదగునా ఇంతులకును
మంతనాన నీవే నన్ను మన్నించరాదా ॥ పల్లవి ॥

పచ్చిమాటలేలాదేవు పరాకులేల సేసేవు
తచ్చి నే నీకుఁ బాదము లొత్తఁగా
యెచ్చరికతోఁ జెలు లిరువంకా నున్నవారు
బచ్చెనసిగ్గు విడిచి పైకొందునా నేను ॥ ఇంత ॥

---

1. కీగీతయుగం స్థలమున చిలుమెక్కువగ నున్నది.

కొనగోరే లంటించేవు గుట్టులేల సేసేవు
యెనయ నీకు వింజామ రిట్టె వేయఁగా
మనికై వూడిగాలభామలు గొలువుసేసేరు
మనసుమఱఁగు లేక మర్మాలు ముట్టుదునా ॥ ఇంత ॥

దుప్పటేల కప్పేవు తూరి యేమి భావించేవు
చెప్పి శ్రీవేంకటేశుఁడ చేరి కూడఁగా
చొప్పుగా సవతులెల్లా చుట్టిరానున్నవారు
యిప్పటలయిక మాన కింకాఁగూడుదునా ॥ ఇంత ॥ 229

## లలిత

తరుణిచెనకులు నీతనువెల్లా నిండినవి
యిరుమేలాఁ జూడరాదా యెంత నీకీమరపు ॥ పల్లవి ॥

నివ్వటిల్ల నీపె నేఁడు నిన్నుఁ బేరుకొని పిల్చీ
యెవ్వతెతో మాటలాడే వేమిసేసేవు
పువ్వుల వేసీఁ గమ్మటి పూఁచి పూఁచి యిందుకుఁగా
ఇవ్వల చూడఁగరాదా యేల నీకీమఱపు ॥ తరు ॥

సముకాన నుండి యీకె సారె నిన్నుఁ జూడఁగాను
తమక మెచ్చట నుండీ తలఁ పెచ్చోటఁ
గుమితాన నెరుకగా కొంగువట్టి తీసీని
అమరఁ బెండ్లాడరాదా అంతయేల మఱపు ॥ తరు ॥

ననుపున నీకె నీతో నవ్వులెల్లా నవ్వఁగాను
పెనఁగులాట లేవంక ప్రియ మేవంక
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసి నిన్నెచ్చరించీ
చనవు లియ్యఁగరాదా సరినేల మఱపు ॥ తరు ॥ 230

పాడి

తెలియఁ జెప్పఁగవలె తెలుసునో తెలియదో
మెలుపున నీకు నమ్మినదాన నేను ॥ పల్లవి ॥

మచ్చరించ నేరఁగాని మనసిచ్చి నీతోడ—
నిచ్చకమాడనేరుతు నిందరికంటె
కుచ్చితురాలఁ గాను గుణము తెలుసుకొంటే
హెచ్చుఁగుందులేనట్టిహితవరి నేను ॥ తెలి ॥

గద్దించనోపఁ గాని కలకాలము నీకు
బుద్దులు చెప్పనోపుదు పొందులుగాను
వుద్దండపుదానఁ గాను వొద్దికై యెప్పుడు నీ—
తిద్దుతీరుకు వచ్చినదేవుల నేను ॥ తెలి ॥

వేసరించఁజాలఁ గాని, వేడుక శ్రీవేంకటేశ
ఆస వుట్టించఁ జాలుదు నన్నిరతుల
రేసులదానఁగాను రేపును మాపును నీకు
నేసవెట్టి పెండ్లాడినచిన్నదాన నేను ॥ తెలి ॥ 231

శుద్ధవసంతం

మగవాని కేడ సిగ్గు మగువల కింతేకాక
యెగసక్కెలాడేనంటా యేలనవ్వే విపుడు ॥ పల్లవి ॥

మంతనాన నిద్దరము మాటలాడుకొన్నవెల్లా
యింతలోనే ఆపె నేఁడు యెట్టెరిఁగెను
చెంతల నీవెమ్మెలకు చెప్పితివేమోకాక
వింతగా నీచెవులనే వినవయ్యా సుద్దులు ॥ మగ ॥

చేరి యింటిలో మనముచేసుకొన్న బాసలు
వారించి యాపెకు నేఁ డెవ్వరు చూపిరి
మేరమీరి మురిపెము మెరసితి వేమోకాక
ఆరీతి నీవే యడుగవయ్యా యీసుద్దులు ॥ మగ ॥

పానుపుపై నిద్దరము పైకొన్నకూటములెల్లా
తానకమై యేరీతిగాఁ దలఁచినది
కానీలే నీవే పెద్దరికము చూపేవేమోకాక
మేన శ్రీవేంకటేశుఁడ మెచ్చవయ్యా సుద్దులు ॥ మగ ॥ 232

బౌళి

నామోము చూచి చూచి నడుమనేల కొంకేవు
ఆముకొని మెచ్చఁగా నే నడ్డమాడేనా ॥ పల్లవి ॥

బత్తిగలవాఁడవు పడఁతిపాట వింటివి
చిత్తము రంజించి నీకు చెవిఁబట్టెనా
యిత్తల మే చెమరించె నెంతగరఁగెనో మతి
పొత్తుల వాకుచ్చి యాకెఁ బొగడఁగరాదా ॥ నామో ॥

సరి నిడుకొంటివి చదివించితి వాపెను
తిరమైనయాయర్థము తెలిసితివా
నిరతిఁ బులకలెల్లా నిండెను సంతోసమెంతో
అరుదైనవుడుగర లట్టె ఇయ్యరాదా ॥ నామో ॥

శ్రీవేంకటేశుఁడవు చెలియాట చూచితివి
భావించి నీకుఁ గన్నులపండుగాయనా
యీవల నన్నేలితివి ఇదెంతజాణతనమో
నేవనేసే మిద్దరము నేసచల్లరాదా ॥ నామో ॥ 233

నాదరామక్రియ

ఓపుదు వెంతకైనాను వువిదలఁ గంటేఁజాలు
పూపవలపు లెన్నైనాఁ బోదిసేయఁగలవు ॥పల్లవి॥

బాసచేసినాపె వచ్చి పానుపుపై నున్నది
ఆసవెట్టినాపె నీయండ నున్నది
గోస నాసతోడ మరి కొప్పుదువ్వనేల నన్ను
లాసి యెన్నిచోట్లను లాగవేగా లాదేవు ॥ఓపు॥

రిత్త వచ్చి నాపె కూరిమిఁ దెరలో నున్నది
కొత్తగా వచ్చినయాపె కూచున్నది
హత్తి సరసములాడే వప్పటి నాతో నీవు
సత్తుగా నెన్నిచోట్ల చవులుచూపేవు ॥ఓపు॥

పూనుక వచ్చినయాపె పొరుగున నున్నది
కానుక యిచ్చినయాపె కాచుకున్నది
ఆనుక శ్రీవేంకటేశ అట్టె నన్ను నేలితివి
నేనగా నెన్నిచోటుల నేసవెట్టేవు ॥ఓపు॥ 234

రేకు 942. ముఖారి

కంటిమి నీలాగులు కతలుగాను
పెంటలుగాఁ గొసరేవు పెనఁగఁగఁగలవా ॥పల్లవి॥

చూపులకే వలచేవు సుద్దులకే భ్రమసేవు
ఆపడఁతినేరుపు లెన్నని చెప్పేము
చాపలాన బొమ్మలను జంకించితేఁగనక
పైపై నీచేసినభాగ్యఫల మిది గాదా ॥కంటి॥

మొక్కులకే తగిలేవు ముచ్చటకే లాచేవు
యెక్కువ నీకెపంతము లెంతమెచ్చేము
పక్కన నంతలోనే గుబ్బల నొత్తితేఁగనక
యిక్కువ నీమనోరథ మీడేరుట గాదా ॥ కంటి ॥

నవ్వులకే పొదిగేవు నమ్మికలకె కూడేవు
జవ్వనిభావము యెందు సరిచూపేము
యివ్వల శ్రీవేంకటేశ యెనసె నీకెగనక
రవ్వల నీకు మదనసామ్రాజ్యము గాదా ॥ కంటి ॥ 235

లలిత

ఏమి చెప్పేము నీసుద్దు లెంతవడియైనాను
చేముంచి నాతురుముపైఁ జేయివేయవలెనా ॥ పల్లవి ॥

పోఁడిమి నందరితోడాఁ బొందుసేయనేర్తువట
నేఁడు నన్ను నమ్మించ నేరవా నీవు
ఆఁడువారము గనక అలసి నిన్ను దూరితే
వాఁడికొనగోర చంద్రవంక లొత్తవలెనా ॥ ఏమి ॥

ననిచినవారితోడ నవ్వునవ్వ నేర్తువట
పెనఁగి నన్ను సమ్మతింపించనేరవా
వనితలముగనక వడి నిన్ను సొలసితే
ఘనమైనచన్నులు విసుకఁగ నింతవలెనా ॥ ఏమి ॥

శ్రీవేంకటేశ కొల్వులో సిగ్గువడనేర్తువట
యీవల నన్నుఁ గూడితి వింతనేరవా
కైవసపుటింతులముగనక నిన్ను మెచ్చితే
చేవదేరేమోవితేనె చిప్పిలించవలెనా ॥ ఏమి ॥ 236

భైరవి

ఇంతసేసినవాఁడవు యిద్దరికి నీవేకావా
దొంతివిడేలు వెట్టేవు తొడిఁబడ నేఁడు ॥ పల్లవి ॥

జగడించేసవతుల సంగడికి నీవు వచ్చి
తగవులు చెప్పేవు తమకానను
నిగిడి వొండొక రట్టె నీమీఁద వొట్టువెట్టఁగా
నగవులు నవ్వేవు నడుమ నేఁడు ॥ ఇంత ॥

కొద్దిమీరఁ బంతాలాడేకొమ్మలవద్దికి వచ్చి
బుద్దులెల్లాఁ జెప్పేవు పొసఁగఁగను
చద్దికి వేఁడికిఁ దమలో సాకిరి నిన్నుఁ గోరఁగా
పెద్దరికాన మించేవు పీఁటమీఁద నేఁడు ॥ ఇంత ॥

రాఁగతనాన జరసేరమణులఁ జేరవచ్చి
కాఁగిలింపించి కూడేవు కందువ లంటి
అఁగుచు శ్రీవేంకటేశ అన్నిటె నీమో వెడుగఁగా
మాఁగి రతిఁ జొక్కించేవు మగువల నేఁడు ॥ ఇంత ॥ 237

బౌళి

ఇంతటా నీసుద్దులే యేఁటికి సిగ్గువడేవు
యెంత లేదు నాకు నిట్టె ఇయ్యవయ్య విడెము ॥ పల్లవి ॥

వినరాదా ఆపెమాట వేడుకలు దైవార
యెనలేనిపరాకులు యేలసేసేవు
మునుపే యెరుఁగుదురు ముదితలు నీపొందులు
తనివోక నీవేల దాఁచేవో కాని ॥ ఇంత ॥

చూడరాదా ఆపెదిక్కు సూటులు దప్పకుండా
తాడుపడి నీవేల తలవంచేవు
వాడలెల్లా నిండె నీవు వలచినవలపులు
గాడిఁగట్టి నీవేల కప్పేవో కాని ॥ ఇంత ॥

వేయరాదా నీచేయి వెక్కసపుఁజన్నులపై
యీ యెడ శ్రీవేంకటేశ యేల నవ్వేవు
చాయల నన్నేలితివి సమరతి నాకెవద్ద
నీయలపు లేమిటికి నెరపేవోకాని ॥ ఇంత ॥ 238

నాగవరాళి

తారుకాణ సేసుకొంటే తానే నేను
యీరీతినే నవ్వుఁగానీ ఇంటికి రమ్మనవే ॥ పల్లవి ॥

చెక్కులివె చెమరించె చిత్తమెల్లాఁ జిగిరించె
కుక్కినట్టు కోరికలు కొనసాగెను
తొక్కినాఁడు నాపాదము తొలుతే సందడిలోన
యెక్కడ పరాకుసేసీ నింటికి రమ్మనవే ॥ తారు ॥

దప్పిదేరె పెదవుల తమకము దైవారె
కొప్పు వీడి చన్నులపై కుప్పలాయను
ముప్పిరిగాఁ గట్టినాఁడు ముంజేత కంకణము
యిప్పుదేల నించీ సిగ్గులు యింటికి రమ్మనవే ॥ తారు ॥

అయాలంటి నన్నుఁ గూడె అంగమెల్లాఁ బులకించె
చేయి చేయి సోఁకి యాస చిమ్మిరేఁగెను
చాయలా సన్నలా సేస చల్లె శ్రీవేంకటేశుఁడు
యీయెడ నన్ను మన్నించీ యింటికి రమ్మనవే ॥ తారు ॥ 239

రామక్రియ

నవ్వేవారి నెఱఁగవు నయమున నిన్నుఁజూచి
నివ్వటిల్లినదొరవు నీ వింతేసి సేతురా ॥ పల్లవి ॥

పువ్వులనేల వేసేవు బుజమేల గీరేవు
యెవ్వతె నీకు నేరిపె నిటువంటివి
చివ్వనసూడిగాలు నాచేతఁ జేయింతురుగాక
అవ్వలివిడెము నీవే అంది నాకు నిత్తురా ॥ నవ్వే ॥

చన్నులేల పిసికేవు సారెనేల పెనఁగేవు
యిన్నేసి నీగజరుల కేమందును
వున్నతినీపాదాలు నావొడిపై వేతురుగాక
మిన్నక నీవుంగరము మెట్టిగాఁ బెట్టుదురా ॥ నవ్వే ॥

చెక్కులేల నొక్కేవు సిగ్గులేల తడవేవు
దిక్కుల నీవోజలెల్లాఁ దెలిసె నాకు
గక్కన శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
మొక్కించుకొందురుగాక మోము నాకు వంతురా ॥నవ్వే॥ 240

రేకు 943 రీతిగౌళ

బలిమిసేయఁగనేల పరపుపై నున్నదాన
నలువంకలుఁ జూచితే నవ్వరాదా నాకు ॥ పల్లవి ॥

మునుకొన్ననాగుణములు పొగడేవుగాని
వినరాదా నామాట వింతగాను
చనవిచ్చి సతులతో జాణతనాలాడుతానే
ననుపు నాతోఁ జేసితే నమ్మికౌనా నాకు ॥ బలి ॥

జాడ దప్పకుండా నాతో సరసాలాదేవుగాని
చూడరాదా నాదిక్కు సూటితోడను
కోడెకాడవై సందడికొలువులో నుండుతానే
వోడక నన్ను మెచ్చితే నొద్దికౌనా నాకు ॥ బలి ॥

యీరీతి శ్రీవేంకటేశ యిట్టె మన్నింతువుగాని
రారాదా యింటిలోనికి రాపుసేయక
సారె జెలికత్తెల కానలెల్లా జూపుతానే
వోరలేక కూడితేనే వొడబాటా నాకు ॥ బలి ॥ 241

హిందోళం

చూడవే యీతఁ డప్పటి సొలసీ నన్ను
యేడ నేరిచినాఁడో యేమందునే ॥ పల్లవి ॥

చెక్కులు నొక్కుటయెల్లా సేసవెట్టుటకే కాదా
గక్కన విభునిచేఁత కంటివా చెలి
అక్కరతో మాటాడిన దాసపడుటే(టకే?)కాదా
ఇక్కడ నేమారుమాట లేమందునే ॥ చూడ ॥

కప్పుర మిచ్చుటయెల్లా కదియవలసే కాదా
చిప్పిలీ నీతఁడు తెలిశితివా చెలి
దప్పిదేర నవ్వుటెల్లా తమకించుటకే కాదా
ఇప్పుడిట్టె వేగిరించీ నేమందునే ॥ చూడ ॥

కనుసన్న సేయుటెల్లా కాఁగిలించుటకే కాదా
వినయము సేసీఁ దాను వింటివా చెలి
చెనకుచు మన్నించి శ్రీవేంకటేశ్వరుఁడు
యెనసినాఁ డిదె నన్ను నేమందునే ॥ చూడ ॥ 242

భైరవి

సవతుల మిందరము సంగడినుంటే నేమాయ
యివల నీవెట్టుండినా యెవ్వ రేమనేరే ॥ పల్లవి ॥

ఆతనిమోము చూచేవు అంతలోన భ్రమసేవు
చేతిమీఁదిచెక్కుతోడ చెమరించేవే
కాతర మింతగలితే కడుసిగ్గువడనేల
యేతులఁ గాఁగిలించితే నెవ్వ రేమనేరే ॥ సవ ॥

సైకొని మాటలాడేవు భావములో నలసేవు
దాకొన్నయాసలతోడ తడఁబడేవు
నీకింతయాఁకటయితే నివ్వెరగు లిపుడేల
యీకడ నెంతసేసినా యెవ్వ రేమనేరే ॥ సవ ॥

అడియాలములు చూపేవు ఆయములు సోఁకించేవు
తడవి శ్రీవేంకటేశుదండ వాయవు
బడి నాతఁడు నన్నేలె పచ్చిగా నవ్వనేల
యెడయక నీవెంతన్నా యెవ్వ రేమనేరే ॥ సవ ॥ 243

పాడి

ఏల పంతాలాడేవు ఇంతేసి మాతోను
నోలగిలి యాపెదిక్కు చూడకుండఁగలవా ॥ పల్లవి ॥

చెలియ చూచినచూపు చీఁకటిలోవెన్నెల
అలవోక మాట బయలువందిలి
తళుకుమోవితీపు తంగెటఁబెట్టినజున్ను
తలఁచుకో ఆపెఁబాసి దరిఇంచఁగలవా ॥ ఏల ॥

ముదితచక్కఁదనము ముంగిటినిధానము
వెదచల్లేనవ్వు చలివెన్నెలతేట
పొదలుఁజన్నులు కడివోనిపూగుత్తులు
సదరాన నీచలము సాదించఁగలవా ॥ ఏల ॥

పడఁతిమేనిచాయ బంగారులోనినిగ్గు
జడియనికాఁగిలి జాజులశయ్య
అడరి శ్రీవేంకటేశ అట్టె యీపెఁ గూడితివి
మెడఁగట్టుకొందుగాక మితిమీరఁగలవా ॥ ఏల ॥ 244

## మధ్యమావతి

ఎంతమేలువాఁడో తాను యీసతికి
పంతగాఁ డింతేసి యేల పచ్చిసేసుకొనీనే ॥ పల్లవి ॥

నెలవి నవ్వినయింతి చేతికి విడెమియ్యదా
తలపోసి తానేల తమకించీనే
కొలువుకువచ్చినాపె కోరి మొక్కక మానీనా
చలివాసి తానేల సాదించీనే ॥ ఎంత ॥

మాటలాడినట్టికాంత మరిగి పైకొనదా
చీటికిమాటికినేల చేయిచాఁచీనే
గాఁటమై పిలిచినాపె కాఁగిలించక మానీనా
కూటమికిఁ బెనఁగేల కొంగువట్టీనే ॥ ఎంత ॥

ముచ్చట గలట్టిరామ మోవితేనె లొసఁగదా
విచ్చనవి డెంతేసి వేఁడుకొనీనే
తచ్చి శ్రీవేఁకటేశుఁడు తా నప్పటి నన్నుఁగూడె
యిచ్చకము లిపుడెంత యిట్టె నాకుఁ జేసీనే ॥ ఎంత ॥ 245

నాగగాంధారి

ఇదివో నీమహిమలు యేమని పొగడేమయ్యా
కదిసితేనే యినుము కనకమై మించెను ॥పల్లవి॥

నెలవి నీవు నవ్వితే చిత్తము చీఁకటివానె
వెలసెను నాలోనివేడుకలెల్లా
చెలిమిసేసి నాపైఁ జేయి నీవు వేసితేను
బలిమితో వలపులపంటలెల్లాఁ బండెను ॥ఇది॥

తప్పక నీవు చూచితే తనువుపై కాఁక మాని
వుప్పతిల్లె జవ్వనము వుదుటునను
కొప్పుదువ్వి నీవు నన్నుఁ గొనగోరు నోఁకించితే
కుప్పళించి తమకపుకొటారులు నిండెను ॥ఇది॥

చేరి నీవు పలికితే సిగ్గులు మూల కొదిగి
కారుకమ్మె నెమ్మోమునఁ గళలన్నియు
యీరీతి శ్రీవేంకటేశ ఇన్నిటా నన్నేలితివి
సారె నాకిట్టె మదనసామ్రాజ్యము హెచ్చెను ॥ఇది॥ 246

రేకు 944. వేళావళి

ఇన్నిటా సిగ్గులుదేరె నిఁకనేలే
కన్నుల నాపెసొబగు కప్పించుకొమ్మనవే ॥పల్లవి॥

కోపించఁజాలక నేను గుట్టుతో నుండఁగాను
యేపురేఁగి తనచేఁత లేల చెప్పీనే
ఆపాటిగలవాఁడు ఆపెనే యీడకుఁ దెచ్చి
యేపొద్దూ మెడఁగట్టుక యెమ్మెచూపమనవే ॥ఇన్ని॥

కోరి వెంగెమాడక గుక్కితా నే నుండఁగాను
యీరీతిఁ దనవలపు లెంతచెప్పీనే
మేరమీర వేడుకైతే మేడమీఁద నిద్దరూ నుండి
వూరివారెల్లాఁ బొగడ నొద్దికగమ్మనవే ॥ ఇన్ని ॥

యెడయక శ్రీవేంకటేశుఁడు నేఁ గూడఁగా
వాడలిపై రేకలేల వాగిఁ జెప్పీనే
అడరి శ్రీకాంత నేను అవ్వలిపొందు గలితే
వాడిఁగట్టుక మాయింట నుండి నవ్వుమనవే ॥ ఇన్ని ॥ 247

గుజ్జరి

అన్నిటా మీవారమే అనుమానించఁగవద్దు
యెన్నికలు సరివచ్చె నీవయ్య చనవు ॥ పల్లవి ॥

పచ్చిసేసేదాననా బాఁతితోడ నీవలపు
తచ్చి తచ్చి దాఁచుకొనేదానఁగాక
మచ్చములుగ నేనంటా మరి నాకేల లోఁగేవు
రచ్చవేయఁ జేఁత లిట్టె రావయ్య నావద్దికి ( ? ) ॥ అన్ని ॥

నవ్వేటిదాననా ననిచి నీసుద్దులెల్లా
దవ్వుల వంకలుదిద్దేదానఁ గాక
యెవ్వరు నెరఁగకుండా నేకాంతమేలాదేవు
వువ్విళ్లూరఁ గాఁతాళించ నుండవయ్య యీడను ॥ అన్ని ॥

సిగ్గువరచేదానా చేరి నీకాఁగిటఁ గూడి
తగ్గనిరతుల మెచ్చేదానఁ గాక
నిగ్గుల శ్రీవేంకటేశ నీవేల వేఁడుకొనేవు
యెగ్గుపట్ట నన్ను నిట్టె యేలవయ్య యిపుడు ॥ అన్ని ॥ 248

శ్రీరాగం

చిగురుఁబెదవి నిండె సింగారములు నేఁడు
నగితివి మేలుమేలు నల్లఁబల్లిచెన్నుఁడా ॥ పల్లవి ॥

చెక్కులఁ జెమట గారీ సిగ్గులు మోమున నూరీ
యెక్కడనుండి వచ్చితి వింకాఁకాను
మొక్కేము నీకిదివో మొనగోరు కదువాఁడి
మొక్కలము లేఁకనేల మోహించితి నీకును ॥ చిగు ॥

తురు మించుక చెదరె తోడనే సందులదరె
చిరుతపను లేమేమి సేసితివి
గురుతై సేవసేసేము కుచములు [1]గట్లు
జరపులఁ బెట్ట కిఁక సతినైతి నీకును ॥ చిగు ॥

కాయమెల్లాఁ బులకించీ కళలు నీయందు మించీ
చేయిచ్చి నన్నేలితివి శ్రీవేంకటేశ
నీ యిచ్చ రతిసేసితి నిండునాపిఱుఁదు వేఁగు
పాయకు నన్నిఁక నిట్టె బత్తిసేసే నీకును ॥ చిగు ॥ 249

ఆహిరి

ఎరవులదానఁ గాను యెంతైనా నే నీకును
సురతవిద్యలకెల్లా చుట్టమను సుమ్మీ ॥ పల్లవి ॥

సరసములాడి నీచనవు చేకొందుఁగాక
సరికి బేసికి నిన్ను సాదించేనా
విరసాన నీవు నన్ను వెంగెముగాఁ జూడకు
నిరతపు నీసేఁతకు నే లోనుసుమ్మీ ॥ ఎర ॥

---

1. గట్టి+లు.

ఇచ్చకములాడి నిన్ను యిట్టె దక్కఁగొందుఁగాక
తచ్చనలు నేసి నిన్ను దక్కించేనా
ఇచ్చట సిగ్గువడకు యేమిటా విచారించకు
మచ్చిక నీమాటకు సమ్మతిదానఁజుమ్మీ ॥ ఎర ॥

చేరి నిన్నుఁ గాఁగిలించి నెలవి నవ్వుదుఁగాక
మారుకొని నే నిన్ను మందలించేనా
కూరిమి శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
గారవముతోడి వూడిగపుదానఁజుమ్మీ ॥ ఎర ॥ 250

సామంతం

[1]ఏమనీనే రమణుఁడు ఇంకా నన్ను
కామించి నేరిచినాఁడు కతకారాలు ॥ పల్లవి ॥

తగవులఁ బెట్టినవే తన్ను నదె చూడవే
చిగురుఁబెదవిమీఁదిసింగారాలు
అగడు నేఁ జేసితినా అందరు నాడుకొనేరు
నగవుఁజూపులలోనినయగారాలు ॥ ఏమ ॥

యెదుటనే వున్నవవే యెన్నికగాఁ జూడవే
వుదుటుఁజెక్కులమీఁదివొయ్యారాలు
వెదకితేఁ దనమేలు వెల్లావిరులాయ నేఁడు
పదిమారులునేఁటికే బయకారాలు ॥ ఏమ ॥

చెంగటనే నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁ జూడవే
అంగడిఁబెట్టీ [2]పులకలంభారాలు
యెంగిలిపుక్కిటివిడే లిప్పుడే కానఁగవచ్చె
పంగెనరతులలోనిపచారాలు ॥ ఏమ ॥ 251

---

1. ఈ పాటలోని భావము అంతగ స్పష్టమగుటలేదు. 2. పులకలరానులా?

సింధురామక్రియ

నేరిచినాఁ డన్నిటాను నెరతనాలు
తారుకాణ లన్నియును తనవల్లఁ గంటిమే ॥ పల్లవి ॥

నెలవి నవ్వినవాఁడు చెక్కునఁ జెయ్యిడనేల
నెలకొన్నరాజసమె నెరపుఁగాక
నిలువుఁజెమటతోడ నీతితో నేకతమాడీ
చెలియరో వీనిజాడ చెప్ప నెట్టువచ్చునే ॥ నేరి ॥

తప్పక చూచినవాఁడు తలవూఁచి మెచ్చనేల
నెప్పునఁ గైవశమై మన్నించుఁ గాక
చిప్పిలుసిగ్గులతోడఁ జెప్పీ నీకుఁ బ్రియములు
యిప్పు డీతనివిద్య లేమని నే నెంతునే ॥ నేరి ॥

కాఁగిట నించినవాఁడు కడుబుసకొట్టనేల
చేఁగదేరేగుట్టుతోడఁ జెలఁగుఁగాక
ఆఁగుచు కడపరాయఁడై శ్రీవేంకటేశుఁడు
వీఁగఁడు యీవేసా లెట్టు వెలయించవచ్చునే ॥ నేరి ॥ 252

రేకు 945. దేశాక్షి

నేమేయంటా నుండుదుము నిక్కపు నీ (ఈ?) విద్యలకు
కామించి నీవొక్కతెవూఁ గలిగితివే ॥ పల్లవి ॥

చెలరేఁగి చెలరేఁగి చేసేవు విన్నపాలు
చలివాయ నాతఁ డింతచన విచ్చెనా
వలచి కాచుకుండినవనితలెల్లాఁ జూడఁగా
తలఁచినట్టెల్లా నీపెద్దరిక మీదేరెనే ॥ నేమే ॥

యింటిలో నిడుక పన్నులెన్నియైనాఁ జెప్పేవు
బంటువలె నాతఁ డింతపంపు చేసేసునా
దంటలై సవతులెల్లా తమలో నేఁకారఁగాను
పంట వండినట్టు నీభాగ్యము సిద్ధించెనే ॥ నేమే ॥

శ్రీవేంకటేశ్వరునఁ జేరి కాఁగిలించేవు
వావితో నాతఁడు నీకై వసమాయనా
యీవేళ మమ్మేలెఁ దానె ఇందరము నున్నారము
చేవదేరి నీమేలు సేసపాలై నిండెనే ॥ నేమే ॥ 253

ధన్నాశి

ఎంత కెంత సేసేవే ఇందుకుఁ గాను
పంతము లాడితేనే పైకొని మన్నించఁడా ॥ పల్లవి ॥

పిలిచి యాతఁడు నీకుఁ బ్రియములు చెప్పఁగాను
చలము లేమిటికి జన్వనివి
మొలకచన్నులనీమొన లురమునఁ బెట్టి
బలిమి చూపితే నీకుఁ బంపుసేయఁడా ॥ ఎంత ॥

నగుతా నీతఁడు నీలో ననుపు నటించఁగాను
బిగియనేమిటికి పిన్నదానవు
వొగరుమోవితేనె లొద్దికఁ జవులు నించి
తగవులు చూపితే చెంత నిన్ను మెప్పించఁడా ॥ ఎంత ॥

అంకెల శ్రీవేంకటేశుఁ డట్టె నిన్నుఁ గూడఁగాను
మంకులేఁటికి పట్టపుమగువవు
పొంకపుఁగాఁగిటిలో నీపొందులు సతముచేసి
వుంకువఁ జొక్కించితివి వొరపు మరుగఁడా ॥ ఎంత ॥ 254

పాడి

చిత్తగించు తమకమే చిమ్మిరేఁచె లోలోన
మత్తగజగమనను మన్నించవయ్యా ॥ పల్లవి ॥

వలపు నిలుపలేక వనిత నిన్నుఁ జూచి
పలుకులఁ గొసరీని పలుమారును
చలివాసి యప్పటిని సరసములాడీని
నిలుచుండి చేయిచాఁచీ నీమీఁదను ॥ చిత్త ॥

విరహ మోఁపఁగలేక వెలఁది నీయెదుటను
నిరతిఁ గొలువు సేసీ నెయ్యమునను
వొరసి వొరసి మరి వూడిగాలు సేసీని
పరిపరివిధముల బాఁతిపడీ నిపుడు ॥ చిత్త ॥

ఆసలు విడువలేక అలమేలుమంగ నిన్ను
సేసవెట్టి కూడీని శ్రీవేంకటేశ
తాసువలెఁ బెనఁగిని తరితీపు సేసీని
మూసినముత్యమువలె మొక్కి మొక్కీ నీకును ॥ చిత్త ॥ 255

మాళవిగౌళ

అదె నీపెద్దరికమే అన్నిటాను
పొదిగి నీకాఁగిటిలో బుజ్జగించవయ్యా ॥ పల్లవి ॥

బలిమిగలకాంతకు పట్టినదే పంతము
కలసి నీచెల్లుబడి గలిగి తేను
యెలమి మందెమేళాన యేమి నిన్నుఁ జేసీనో
వలచినాపెకును గర్వము దగునయ్యా ॥ అదె ॥

నేసవెట్టినచెలికి నేసినదెల్లాఁ జేఁత
ఆనయిచ్చి నీవుగన ఆదరించితే
వాసితో నీచనవున వడి నేమేమాడెనో
నీసరినున్నాపెకు నిన్నేసి దగునయ్యా ॥ అదె ॥

నెమ్మి నలమేల్మంగకు నిల్చినదే నిలుకడ
ఇమ్ముల నీవు శ్రీవేంకటేశ కూడితే
వుమ్మడి నీరతి నెంతవొద్దిక నొరసెనో
తమ్మివిరిపై యాపె కింతయుఁ దగునయ్యా ॥ అదె ॥ 256

సాళంగనాట

[1]మంతనాన నాదేరమ్మ మధురలో యీసుద్దులు
వింతలాయ వినరమ్మ వీనులపండుగలు ॥ పల్లవి ॥

గక్కనఁ గృష్ణుఁడు వుట్టెఁ గంసునిమద మడఁగె
మొక్కిరి దేవతలెల్లా ముదమందుచు
చక్కఁగా జయంతి నేఁడు శ్రావణబహుళాష్టమి
తక్కక దేవకి తల్లి, తండ్రి వసుదేవుఁడు ॥ మంత ॥

యమున దాఁటి యట్టె యశోదయింటఁ బెరిగి
జమళితో బలభద్రసమేతుఁడై
సమమై చంద్రోదయము సమకూడె తోడఁదోడ
రమణఁ బువ్వులవాన రాసులుగాఁ గురిసె ॥ మంత ॥

పనులెల్లా సిద్ధేరె బ్రదికె లోకములెల్లా
నినుపులై ధర్మములు నెలకొనెను
వొనర నలమేల్మంగ నురమున నిడుకొని
ఘనశ్రీవేంకటేశుఁడై కందువ నిలిచెను ॥ మంత ॥ 257

---

1. ఇది అధ్యాత్మకీర్తనంలోనిది

శంకరాభరణం

ఏమమ్మ యశోద యిదె నీబిడ్డఁడు
గామిడితనాలఁ గదిసీ వీఁడే ॥ పల్లవి ॥

గొల్లలుఁ దానును గోపికలిండ్ల
కొల్లగా నుట్లు గొట్టీ వీఁడే
పల్లదాన వారిపాలిండ్లమీఁదట
చిల్లరచేఁతలు చేసీ వీఁడే ॥ ఏమ ॥

పాలువెన్నలును బానలతోడుత
కేలు చాఁచి యారగించీ వీఁడే
మేలిమిసతుల మేనబావనంటా
కోలుముందుగాఁ గూడీ వీఁడే ॥ ఏమ ॥

అట్టుఁ జక్కిలా లడుకులు వేలఁ-
గట్టినఁ గోలలఁ గొట్టీ వీఁడే
దిట్టయి శ్రీవేంకటాద్రి నలమేల్మంగఁ-
గట్టుక దేవుఁడై కదఁగీ వీఁడే ॥ ఏమ ॥ 258

రేకు 946, శంకరాభరణం

తగవులు చెప్పుమనీ దండనే సీరమణుఁడు
మొగము చూపరాదా మునికొని (నీఁనఁ?) వలపు ॥ పల్లవి ॥

నీవాతని వెంగెమాడ నేరిచినదానవు
యీవేళ నిట్టె పంతమియ్య నేరవా
చేవదేర బుద్ధులెల్లాఁ జెప్పేరు నీకుఁ జెలులు
హోవరిలోఁ దలవంచు కూరకుండనేఁటికే ॥ తగ ॥

సంగడినే బొమ్మల జంకించినదానవు
ముంగిటి కాత(డు వస్తే మొక్క(గవద్దా
చెంగట నుండి నీతులు ఁలుకలు చదివీని
సంగతి దెలుసుక యిచ్చకమాడ(దగదా ॥ తగ ॥

శ్రీవేంకటేశ్వరు( జేరి కూడినదానవు
సేవ అలమేల్మంగవు సేయ(గవద్దా
కావరపు(బావురాలు గక్కున రతులు చూపీ
నీవు నాత(డును నిట్టె నెలకొన( జెల్లునే ॥ తగ ॥ 259

దేవగాంధారి

అంగనజవ్వన మామనికాలము
సంగడినె నీకు జడిగొనె వలపు ॥ పల్లవి ॥

తీగెమెఱు(గులు తెఱవచూపులు
బాగైనమేఘమ్ము బలుకొప్పు
చేగదేర రతిచెమట వానలు
యీగతి( గురిసె నింతాయ వలపు ॥ అంగ ॥

యింతిమోవికెంపు లింద్రగోపములు
చెంత( గోరికలు నెలయేరులు
పొంతనున్ననీరుబుగ్గలు పులకలు
అంతటా( దొరుగ(గా నసలాయ వలపు ॥ అంగ ॥

అలమేలుమంగమోహము నిగిడినసోన
నెలకొన్న చెరువు నీమనసు
వలనై శ్రీవేంకటేశ్వర నీవు గూడ(గ
ఫలమై జగములోన( బదనాయ వలపు ॥ అంగ ॥ 260

సామంతం

కుందణ(న?)పుదట్టి గట్టి గోవిందరాజు సంది—
గొందులసతులఁ గూడె గోవిందరాజు ॥ పల్లవి ॥

గోవులఁ గాచిననాఁటిగోవిందరాజు । నేఁడు
కోవిదుఁడై వున్నవాఁడు గోవిందరాజు
కూవలు చేసీ వలపు గోవిందరాజు । పిల్లఁ—
గోవిలోనే మాటలాడీ గోవిందరాజు ॥ కుంద ॥

కుండలతోఁబాయదాగేగోవిందరాజు । నేఁడు
కొండంతదొరైనాఁడు గోవిందరాజు
కొండుకబాలులతోడ గోవిందరాజు । వుట్లు
కొండాటముగఁ గొట్టె గోవిందరాజు ॥ కుంద ॥

కొలనిలో ఆగడీఁడు గోవిందరాజు । నేఁడు
కొలువు సేయించుకొనీ గోవిందరాజు
కొలఁదిమీర మమ్మేలె గోవిందరాజు । మా—
కొలమే శ్రీవేంకటాద్రి గోవిందరాజు ॥ కుంద ॥ 261

గుజ్జరి

ఓపినంత తొల్లె వింటి నూరిలోన నీసుద్దులు
నీపాటివారమా నెలఁతల మిపుడు ॥ పల్లవి ॥

చెలరేఁగి చెలరేఁగి చెప్పేవు మాటలు
కొలఁదివెట్టరావు వూఁకొనే నంటేను
బలిమికాఁడవు తొల్లె పదారువేలసతుల—
వలపెల్లాఁ జెప్పేనంటే వసమా వినఁగను ॥ ఓపి ॥

సారెసారె నాముందరఁ జదివేవు నీతులు
మేర మితి లేదు నిన్ను మెచ్చేనంటేను
అరితేరినవాఁడవు అట్టె గొల్లెతలకథా-
భారతము చెప్పఁగానే భట్టనా పొగడను ॥ ఓపి ॥

కొసరి కొసరి నన్నుఁ గూడేవు శ్రీవేంకటేశ
సుసరమా నీసేరుపు చూచేనంటేను
అసమానుఁడవు నీవు ఇష్టమహిష (షు?)ల రతి-
పస లెంచితే మనసు పట్టునా సంతోసము ॥ ఓపి ॥ 262

కుంతలవరాళి

మొక్కేవే పాదాలకు మొనసి నీవు
మిక్కిలి నీనాయకుఁడు మేలువాఁడే నీకు ॥ పల్లవి ॥

చెక్కునఁబెట్టినచెయ్యి సెలవుల నీనవ్వు
నిక్కి చూచి మోహించెనే నీరమణుఁడు
ముక్కుపైఁ బెట్టినవేలు ముంచిననీనివ్వెరగు
తక్కక పొగడీ నిదే తమితోడ నిపుడు ॥ మొక్క ॥

పడఁతులపై వొరగుపాదముపై పాదము
చిడుముడితోఁ దలపోసెఁ జిత్తములోన
అడియాసమాటలు అట్టె పైకొనేజోకలు
తడయక సంతోసించె తన్నుఁదానె యిపుడు ॥ మొక్క ॥

సారెకుఁ జెమటసోన జారినపయ్యదకొంగు
చేరి వేరులేక యెంచీ శ్రీవేంకటేశుఁ-
డీరీతిఁ దా నినుఁగూడె యితవరి నీప్రియాలు
తారుకాణై తేఁ బొదిగి దైవార నిపుడు ॥ మొక్క ॥ 263

ధన్నాసి

ఇంత నాపై బత్తిగలు[1] తెరుఁగుదునే
మంతనాన నన్నుఁ దాను మన్నించుటే చాలదా ॥ పల్లవి ॥

మొక్కకుమనవే తాను మునుపనే దొడ్డదొర
తక్క కడపము వట్టేతరుణి నేను
దిక్కులఁ దనపట్టపుదేవుళ్లు విని యట్టె
వెక్కసాన నవ్వితేను విననోప నేను ॥ ఇంత ॥

కిందుపడకుమనవే క్రియగలపంతగాఁడు
కందువ కాళాఁజివట్టేకామిని నేను
గొందిఁ దనకొత్తపెండ్లికూఁతులు యీసుద్దెరిఁగి
చెంది తన్నుఁ బంగించితే సిగ్గువడఁజాలను ॥ ఇంత ॥

తమకించకుమనవే తాను శ్రీవేంకటేశుఁడు
అమర బోనమువెట్టేయంగన నేను
సముకానఁ దా నన్నేలె చనవరులెల్లాఁ జూచి
క్రమముతోఁ బెనఁగితే కాదనఁగనేరను ॥ ఇంత ॥ 264

రేకు 947. దేసాళం

ప్రియముచెప్పేవేళ బిగియనేల
నయగారితనముల నవ్వు లిట్టె వలెనా ॥ పల్లవి ॥

కూటమికి నాతఁడు కొంగువట్టుకుండఁగాను
యేఁటికిఁ బెనఁగులాడే వెందాఁకాను
నీటున జోలిసేసేవు నేరుపరి విన్నిటాను
మాట లేమిగలిగినా మరి యాడరాదా ॥ ప్రియ ॥

---

1 బత్తిగలుత + ఎరుఁగుదునే.

ఆసపడి మోవితేనె లాతఁ డిట్టె యడుగఁగా
వాసులేల నెరపేవు వట్టిబీరాన
వోసరించి యేడలేనివూడిగా లొనరించేవు
చేసేటిసిబ త్తి మరి చెల్లించరాదా ॥ ప్రియ ॥

యిప్పుడే శ్రీవేంకటేశుఁ డిటు నిన్నుఁ గూడఁగాను
తప్పక యేమి చూచేవు తమకించేవు
అప్పటిని మెచ్చి మెచ్చి యట్టె బుజ్జగించేవు
కొప్పుదువ్వి మరి వేఁడుకొని మొక్కరాదా ॥ ప్రియ ॥ 265

నీలాంబరి

చూచితివో చూడవో సుదతులవంక నీవు
కాచుకొని నే నిన్నియుఁ గనుఁగొంటి నిపుడు ॥ పల్లవి ॥

పానుపుపైఁ బవళించి పడఁతిఁ బేరఁ బిలిచి
పానిపట్టి పాదాలు పైఁ జాఁచితివి
దానికేపో కొలువులో తరుణులు సిగ్గువడి
మోనముతోడుత మునిమునినవ్వు నగిరి ॥ చూచి ॥

గుట్టుననే తమకించి కొమ్మఁ గొంగువట్టి తీసి
ముట్టి చన్నులపై గోరు మోపితివి
చుట్టిరానున్న సతులు చూచి తమలో లోఁగి
అట్టుమీచేఁతకు శిర సట్టె వూఁచుకొనిరి ॥ చూచి ॥

కావరపువలపుతో కాంతఁ గాఁగిట నునిచి
శ్రీవేంకటేశ నన్నుఁ బచ్చిగా నేలితి
వీవేళ నందరు నన్ను నెనసిరి కాతరించి
వేవేలురతులు భావింపుచుఁ బొగడిరి ॥ చూచి ॥ 266

సామంతం

కామినిభావము నేఁడు కంటివా నీవు
కోమలపుకొత్తపెండ్లికొడుక వైనాఁడవు ॥ పల్లవి ॥

నిలిచి యేకతమున నీపై గీతాలు వాడి
చెలి నీ వంతలో రాఁగా సిగ్గువడెను
నలిరేఁగి నీవందుకు నవ్వినవ్వి మెచ్చఁగాను
కులికి కులికి మేనఁ గురిసీఁ జెమట ॥ కామి ॥

చతురత నీదట్టి చన్నులపై గప్పుకొని
తతి నట్టె నిన్నుఁ జూచి తలవంచెను
కతలుగా నీవందుకు కరుణతోఁ బొఁ(బొ?)గడఁగా
కుతుకపుతమకాన గుప్పీఁ బులకలు ॥ కామి ॥

నెట్టన శ్రీవేంకటేశ నీపానుపుపైఁ బండి
అట్టె నీవు కూడఁగా నరుదందెను
వొట్టి నీవందుకు నన్ను నొనరి బుజ్జగించఁగా
ముట్టిననీరతులలో ముంచీ వలపులు ॥ కామి ॥ 267

నారాయణి

కందువుగాని యప్పుడే కలిగినవలపులు
సందడి జాగు లేఁటికి సంగడి నున్నారము ॥ పల్లవి ॥

పొంచి మాయిద్దరినేరుపులుఁ జూడవలసితే
మంచముపైకి రారాదా మందలించేము
యెంచనేల పెండ్లాడితి విద్దరిని నొకమాటె
పంచుక పైఁజాచరాదా పాదా లొత్తేము ॥ కందు ॥

దండిమాచన్నులగొప్పతన మెరఁగవలస్తే
నిండఁగాఁ గాఁగిలించరాదా నీటుచూపేము
అండనే మాతో నవ్వేవు అట్టే మానదుమ నీవు
పండి చూడరాదా నిన్నుఁ బచారించేము ॥ కందు ॥

మించినమారతిబలిమి యెరఁగ వలసితే
కంచపుమో వియ్యరాదా కళరేఁచేము
అంచల శ్రీవేంకటేశ అట్టె మమ్ము నేలితివి
నించరాదా పై రెంటెము నిన్ను మెప్పించేము ॥ కందు ॥ 268

## ముఖారి

నడుమనే కంటిమి నీనయగారాలు
వుడివోనికోరికల నున్నారు సతులు ॥ పల్లవి ॥

చేరి వాకతెతొడపై శిరసుమోపుకవుండి
యేరా పాదా లొకతెపై యిటు చాఁచేవు
యేరీతి నుండెనోకాని ఇద్దరిఅడియాసలు
సారెకుఁ జెమటలతో జడిసేరు సతులు ॥ నడు ॥

మొక్కుచు మాటలాదేవు మునుపటియాకెతోడ
నిక్కపుఁజూపు లీపెపై నివాళించేవు
నిక్కుఁదమకము లెట్టు నెరపుకొన్నారోకాని
మిక్కిలి నిట్టూరుపుల మెరసేరు సతులు ॥ నడు ॥

బలిమి శ్రీవేంకటేశ పట్టపుదేవుల నేలి
చెలఁగి కూడితి వి'ట్టై' చిన్నదానిని
నిలిచినరతుల నెట్టు నిన్ను మెప్పించిరోకాని
పులకమొలకలతోఁ బొదలేరు సతులు ॥ నడు ॥ 269

'ట్టై' తట్టినారు.

రేవగుప్తి

తెలియరాదు నీమది దిమ్మరివాఁడవు గాన
చెలరేఁగి యడిగేము చెప్పరాదా మాకు ॥ పల్లవి ॥

అగ్గమై యందరిలో నానతీవఁ గాఁగిలించఁగా (?)
సిగ్గువడి సన్న సేసీఁ జేతనే నీకు
కగ్గి నీకు యీపె నింత కాకుసేయవలశో
నిగ్గులవలపు నీకు నిక్కమును గలదో ॥ తెలి ॥

సకులెల్లాఁ జూడఁగాను చవులమో వెడిగితే
మోకము వంచి కన్నుల మొక్కు మొక్కీని
ప్రకటించి యీపె నింత పచ్చిసేసేనంటానో
వొకట మేలువాఁడవై వొనరినచందమో ॥ తెలి ॥

పూడిగపువారుండఁగా నొద్దికై పెనఁగితేను
యీడనె శ్రీవేంకటేశ యీకె నవ్వీని
జాడతో నీపె నింత సమ(వ?)తుసేయవలశో
వేడుకకాఁడవై నవిధ మిటువంటిదో ॥ తెలి ॥ 270

రేకు 948 వసంతవరాళి

నలినాక్షి ఇందరిలో నగుఁబాటులాయ నేఁడు
యెలమి నీకే తెలుసు నేమిచెప్పే మిఁకను ॥ పల్లవి ॥

ఇచ్చగించి యాపె నీఇంటికి తానే వచ్చి
ముచ్చట మాటలాడి మొక్కు మొక్కెను
పచ్చిగా నాపెచెక్కుపై గోరుదీసి నీవు
రచ్చలఁ బెట్టితి విదె రమణివలపులు ॥ నలి ॥

చెంతలఁ గొలువుసేసి చిత్తమురా విన్నవించి
పంతములెల్లా నిచ్చి పాదా లొత్తెను
వింతలుగా చన్నులపై వెలయ నచ్చువా(వ్రా?)సి
సంతలఁ బెట్టితివి సకియవలపులు ॥ నలి ॥

కడుసిగ్గులు విడిచి కాఁగిట నిన్నుఁ గలసి
బడిబడి నీవెంటఁ బాయదాయను
అడరి శ్రీవేంకటేశ ఆపెమోవి గంటిసేసి
వడి నంగడివేసితి వనితవలపులు ॥ నలి ॥ 271

కన్నడగౌళ

నే మిందాఁకాఁ జెప్పితిమి నెలతకు బుద్దులెల్లా
కామించి మీఁదట నీఁక కందము నీనేరుపు ॥ పల్లవి ॥

చింతతోడ నాకె నేఁడు చెక్కుచేతితో నున్నది
పంతమాడియైన నీవు పరికించేవా
వింతనీసుద్దులు విని వెరగుతో నున్నది
యింతలో వంచినశిర సెత్తించేవా ॥ నేమిం ॥

నియమపుఁజలముతో నిట్లు చేసుక వున్నది
నయగారితనమున నవ్వించేవా
ప్రియముతోఁ బరపుపై బిగియుచుఁ దానున్నది
రయమున నీవద్దికి రప్పించేవా ॥ నేమిం ॥

కడలేనియాసలతోఁ గాఁతాళాన నున్నది
తడఁబడక రతులఁ దనియించేవా
యెడయక శ్రీవేంకటేశ నిన్నుఁ గూడున్నది
వుడివోనినీసత్యాల నొడఁబరచేవా ॥ నేమిం ॥ 272

ఆహిరి

వింటే దయవుట్టి యిట్టె విచ్చేసీ నీడకు
యింటికిఁ దోడితేరమ్మా యీకెప్రాణేశ్వరుని ॥ పల్లవి ॥

చిత్తరుపటము చూచి సెలవుల నవ్వు నవ్వీ
తత్తరానఁ బాన్పుచూచి తలవంచీని
పొత్తులడపము చూచి పులకించీ మేనెల్లా
హత్తి విన్నవించరమ్మా అంగనవిభునికి ॥ వింటే ॥

చేరి కేళాకూళి చూచి చింతతోడఁ దలపోసీ
పొరువపుగుంపుఁ జూచి భ్రమసీని
కోరి పువ్వుటిల్లు చూచి కుప్పళించీఁ బెంజెమట
సారె నెరిఁగించరమ్మా సతినాయకునికి ॥ వింటే ॥

నిలువుటద్దము చూచి నివ్వెరగుతో నున్నది
చెలికత్తెలనుఁ జూచి సిగ్గువడీని
కలసీఁ గాఁగిటఁ దానె గక్కన నేతించి నేఁడు
చెలఁగి కానుకీరమ్మా శ్రీవేంకటేశునికి ॥ వింటే ॥ 273

సాళంగం

గుట్టుగలవాఁడుగాఁగా గుంపించకున్నాఁడుగాక
వొట్టుక నేమెల్లాఁ జూచి వోర్వఁగఁగలమా ॥ పల్లవి ॥

ఆతనినేల దూరేవే అంగడికెక్కె వలపు
యేతులఁ బెండ్లాడినవా రెందరు లేరు
యీతలఁ జెలుల నంపి ఇంటికి రప్పించీని
చేతికి లోనాయనంటే చిమ్మిరేఁచవలెనా ॥ గుట్టు ॥

పంతము లేలాదేవే పట్టరాదు పాయము
వంతులకు నెందరైనా వద్దమున్నారు
వింతలుగా నవ్వుతానే విందారగించఁ బెట్టి
బంతిఁ గూచుండి విభునిఁ బంగించవలెనా ॥గుట్టు॥

సిగ్గులే లలమేల్మంగ శ్రీవేంకటేశుఁడు గూడె
కగ్గులేనిసవతులు గాచుకున్నారు
యెగ్గులేక నన్నునేలె నితనిఁ బానుపుమీఁద
అగ్గలపురతుల నీ వలయిఁచవలెనా ॥గుట్టు॥ 274

పళవంజరం

ఏఁటిమతకములో యీపెకు నాతనికి
నాఁటకము లివి గొన్ని నడచీఁ జూడరే ॥పల్లవి॥

కొలువు సేసేయాఁటది గుట్టుతోడ నుండుఁగాక
కలకల నగనేలే కాఁతాళానను
చెలఁగి విభుఁడు లోలో నేఁత లేమిసేసెనో
తలఁపునఁ బుట్టుకొని తమకించీఁ దాను ॥ఏఁటి॥

విందుచెప్పవచ్చినాపె వినయాలు సేసుఁగాక
పందేలాడఁ దనకేలే పలుమారును
కందువ నాతనివల్ల కపటాలేమిగనెనో
మందలించవలసిట్టె మాట దీసీఁ దాను ॥ఏఁటి॥

పీఁటపై పెండ్లికూఁతురు ప్రియముతోఁ గూడుఁగాక
నీటున జంకించనేలే నేరుపుతోడ
సూటి శ్రీవేంకటేశుఁడు చూ చెలమేల్మంగను
కూటములు నేర్చుకొని గురిసేసీఁ దాను ॥ఏఁటి॥ 275

సౌరాష్ట్రం

ఔనయ్యా మంచివాఁడ వందుకెల్లా నేనా గురి
నానఁబెట్టి సెలవుల నవ్వులు నవ్వేవు ॥ పల్లవి ॥

చెలియచేసినసేఁత చెప్పేవానివలెనే
కలపుకోలుగ నన్నుఁ గాఁగిలించేవు
పొలసి గోరనూఁదుట చూపేవానివలెనే
కెలయుచు నాబుజము గీరేవు నీవు ॥ ఔన ॥

యెచ్చుగుందుమాటలు యెంచేవానివలెనే
పచ్చిదేరేవొట్టు నాపైఁ బచారించేవు
దిచ్చరిసాకిరు లిట్టె తెలిపేవానివలెనే
ముచ్చటఁ జేతులు నామోముపైఁ జాఁచేవు ॥ ఔన ॥

పెనఁగులాటలు తలపించేవానివలెనే
గొనకొని నాపెద్దకొప్పు వట్టేవు
యెనసి శ్రీవేంకటేశ యింతిఁ గూడినట్లానే
అనువైనఅలమేల్మంగనైన నన్నుఁ గూడేవు ॥ ఔన ॥ 276

రేకు 949 నట్టనారాయణి

ఇన్నాళ్లు నేడ నుండెనో యెవ్వరు నెఱఁగరు
కన్నులయెదుట నేఁడు గానబడెఁగాని ॥ పల్లవి ॥

యేమి గావలెనో కాని యీపె నీకు నెదురై
మోముకళలుదేరఁగ మొక్కె నిపుడు
చేముట్టి యీసతినిఁ జేరి కాఁగిలించితివి
మీమీచుట్టరికము మేమిదివో కంటిమి ॥ ఇన్నా ॥

యేపూరోకాని తాను నీయింటికే వచ్చి బత్తితో
 సేవలెల్లాఁ జేసితేను చెలఁగితివి
 భావమెరిఁగి గందము పైఁబూసి నవ్వితివి
 [1]దోమటి(వన?)మీయిద్దరిపొందులు నేఁడు గంటిమి ॥ఇన్నా॥

తనపే రేఁటిదోకాని తగిలి శ్రీవేంకటేశ
 చెనకుచు నీపైఁ దాను నేసవెట్టెను
 యెనసితి విటు నన్ను యే నలమేలుమంగను
 నినుపులమీఇంపులు నేఁడు నేము గంటిమి ॥ఇన్నా॥ 277

ఆహిరి

ఏమని విన్నవించేము ఇంతి నీపైఁ గలప్రేమ
 కోమలపుఁగలికి చెక్కునఁ జేయిచేర్చెను ॥పల్లవి॥

యేకతాన నుండి సతి ఇట్టె నిన్నుఁ దలఁపైతే
 చేకొని నిట్టూర్పు నించి చెలులఁ జూచె
 పైకొని వారందరు కోపాన నిన్ను దూరితేను
 దాకొని యేమీ ననక తలవంచుకొనెను ॥ఏమ॥

మంచముపై నుండి కాంత మనసు నీపైఁ బారితే
 పొంచి మాటాడేచిలుకఁ బొక్కుచుఁ దిట్టె
 ముంచి యందుకు నది నీముఁ(ముం?)జేత వాలితేను
 దించనిచలమున నీదిక్కు చూచెను ॥ఏమ॥

పురమెక్కెలమేల్మంగ వొగి చన్నులు నాఁటితే
 వొరటుజక్కవలపై నొలవేసెను
 మొరసి శ్రీవేంకటేశ ముక్కుల[2]న వెంటించితే
 తెరవేసి నినుఁగూడి తెప్పలనుఁ దేలెను ॥ఏమ॥ 278

---

1. ప్రాసభంగము. 2. ముక్కులన్+అవి+అంటించితే.

శ్రీరాగం

విన్నవించరే యీమాట విభునికిని
తన్నుఁ దానె యెఱుఁగును తలఁచుకొమ్మనవే ॥ పల్లవి ॥

మనసు లేకములైతే మాటలు సమ్మతులౌను
ననుపు గలిగితేను నవ్వు గలుగు
తనువులు సోఁకితేనే తమకములు రేఁగును
చనవు సతమైతేనే సరసము చెల్లును ॥ విన్న ॥

పాడితో నడచితేనే పంతము లీడేరును
జోడుగూడి వుండితేనే సొంపైవుండును
వేడుక లొనగూడితే పీడుదోడు లితవౌను
వాడికలు దొరకితే వలపు లమరును ॥ విన్న ॥

యేకతములైతేనే ఇక్కువలు గరఁగును
కైకొని కాఁగిలించితే కళ లుబ్బును
యీకడ నలమేల్మంగ నేలె శ్రీ వేంకటేశుఁడు
చేకొని నన్నుఁ గూడెను చిత్తగించుమనవే ॥ విన్న ॥ 279

భైరవి

కానీవయ్యా అందరికీఁ గలిగిన సంసారమే
వీనులార నన్నియును వినేము నే మిఁకను ॥ పల్లవి ॥

చెప్పుదురు పతులతో చెలులు తమనేర్పులు
వొప్పి యెంతవడియైనా నూఁకొంటేను
నెప్పున నాకెమాటలు నీకు బాఁతై నేఁడున్నవి
వుప్పతించ మాకేల వొడఁబడే మిపుడు ॥ కానీ ॥

చూపుదురు తమయెమ్మె సుదతు లెంతవడైనా
ఆపనులకు నాయకుఁ డాసపడితే
పైపయి నాపెకు నీవు భ్రమసి వున్నాఁడవు
కోపగించ మాకేల కూడి సంతసించేము ॥ కానీ ॥

నవ్వుదు రెంతవడైనా సనుపుతో వనితలు
రవ్వగా వలచినట్టిరమణునితో
యివ్వల శ్రీవేంకటేశ యేనలమేలుమంగను
చివ్వన మమ్మేలితివి చేరె మాకు రతులు ॥ కానీ ॥ 280

## పాడి

మచ్చికతో నేలవయ్య మదనసామ్రాజ్యలక్ష్మి
పచ్చిసింగారాలచేత బండారాలు నిండెను ॥ పల్లవి ॥

కామరెతురుమునను గొప్పమేఘ ముదయించి
చెమటవాన గురిసెఁ జెక్కులవెంట
అమరఁ బులకలపైరు లంతటానుఁ జెలువొంది
ప్రమదాలవలపులపంట లివె పండెను ॥ మచ్చి ॥

మించులచూపుల తీగెమెఱుఁగు లిట్టె [1] మెరిచి
అంచెఁ గోరికలజళ్ళవె పట్టెను
సంచితపుకుచముల జవ్వనరాసులు మించె
పొంచి నవ్వుల యామని పోదిగొనె నిదిగో ॥ మచ్చి ॥

అలమేలుమంగమోవియమృతము కొలుకమ్మి
నలుసంక మోహపుసోనలు ముంచెను
యెలమి శ్రీవేంకటేశ ఇంతి నిట్టె కూడితివి
కొలఁదిమీరి రతులకొటార్లు గూడెను ॥ మచ్చి ॥ 281

1. 'మెరుచు' ధాతువుండెనా? 'మెరసి'కి 'మెరిచి' వ్యావహారికమా ?

లలిత

నేనే బుద్ధిచెప్పుకొనే నేరుపున( బతికిని
దానికేమి యింతలోనె తానే నన్నునేలెను ॥ పల్లవి ॥

మగవా(డు మేరమీరి మగువల( జెనకితే
తగవుల( బెట్టనేల తడవకువే
మొగమోటయినచోట మోనాన నుండుటమేలు
పగటున మిగులాను బలిమిసేయకువే ॥ నేనే ॥

పాయపువా(డు మిక్కిలి పరచై తిరిగితేను
బాయిట వేయ(గనేల పదరకువే
తోయరానిచుట్టముతో చాయసేసుకొంటే మేలు
రాయడించి సారెసారె రచ్చల(బెట్టకువే ॥ నేనే ॥

శ్రీవేంకటేశ్వరు(డు సిగ్గులు విడిచితేను
కావరించి నవ్వనేల కదుమకువే
వావులెనసినచోట వదలకుండుట మేలు
నీవలమేల్మంగ కూడి నెలవైపాయకువే ॥ నేనే ॥ 282

రేకు 950 లలిత

అందులోనె కానరాదా అతివ యీతనిసుద్ది
కందువ లన్నియు నీవె కను(గొన(గదవె ॥ పల్లవి ॥

నెలవినేల నవ్వీనే చేరి నే మోము చూచితే
లలి( దనవంకను కల్లలేనివా(డు
ములువా(డిగోర నేను మోపితేనే లలికీనే
వెలుపల లోనాను వెరపులేనివా(డు ॥ అందు ॥

సిగ్గులేల పెంచీనే చెయ్యివట్టి తీసితేను
యెగ్గులుఁదప్పులులేక యేచినవాఁడు
దిగ్గనఁ గాఁగిలించితే దిక్కులేల చూచీనే
బగ్గన నెవ్వతెకైనా బాసియ్యనివాఁడు ॥ అందు ॥

శిరసేల వంచీనే చెంత మోవి నే నంటితే
విరసమెరఁగని శ్రీవేంకటేశుఁడు
అరిది నలమేల్మంగనై కూడితే మెచ్చనేలే
గొరబై యెవ్వరికిని గుట్టియ్యనివాఁడు ॥ అందు ॥ 283

మంగళకౌశిక

చూడఁ బిన్నవు నేఁతలు చూపి చెప్పఁగఁ గొత్తలు
జాడల నిన్నిటా నేఁడు జాణవైతివే ॥ పల్లవి ॥

ఆయములుసోఁక మాటలాడ నేర్చుకొంటివే
కాయజుదీమవై నీవు గలగితివే
చాయలాను సన్నలాను సాదించ దొరకొంటివే
పాయపువిభుని నింత భ్రమలఁ బెట్టితివే ॥ చూడఁ ॥

నీటునెలవినవ్వులు నీవలనఁ గంటిమే
పాటలఁ జొక్కించ నీపాలాయనే
జూటుఁదనాలకు నీవే సూటియై నిలిచితివే
తాటించి ఆతని నిట్టె దక్కఁగొంటివే ॥ చూడఁ ॥

అలమేలుమంగవు నీ వట భూకాంతను నేను
యెలమి శ్రీవేంకటేశు నెనసితివే
పొలసి నాకత నీతో పొందు లీడేరించితివే
తెలిపి నీవే పట్టపుదేవులవైతివే ॥ చూడఁ ॥ 284

రామక్రియ

ఊరకేల దాఁచేవు వుదుటునీచేఁతలు
యేరీతి నీవుండినాను యెవ్వరేమనేరు ॥ పల్లవి ॥

వింతచెలు లుండఁగాను వెలఁదితోఁ జెవిలోన
మంతనాన నీ వప్పుడు మాటలాడవా
ఇంతలో నేఁటికి బొంకనేమాయ నేమిసేసినా
చెంతలమగవాఁడవు చెల్లదా నీకిపుడు ॥ ఊర ॥

కాకుసేసిరంటాను కడవా రెఱఁగకుండా
ఆకెయిచ్చినవుంగర మందుకొనవా
నీకేల సిగ్గువడ నేఁడు గొత్తలా యివి
యీకడ నీయిచ్చరాజ వేల లోఁగే విపుడు ॥ ఊర॥

వలచి శ్రీవేంకటేశ వనితల మందలించి
అలమేలుమంగ నురమందు నుంచవా
కలసితి విటు నన్నుఁ గపటము లిఁకనేల
బలిమికాఁడ వౌదువు పదరకు మిపుడు ॥ ఊర ॥ 285

రామక్రియ

మంచివాఁడవువలెనే మతకములు సేసేవు
అంచెలనే పైకొనే వవునయ్యా నీవు ॥ పల్లవి ॥

చీర లెస్సాయనంటాను చెరఁగువట్టి తీసేవు
హారములు చూచేనంటా నంటేవు చన్నులు
తీరాయఁ గమ్మలనుచు గోర గీరేవు చెక్కులు
ఆరీతి నింతసేతురా అంగనలను ॥ మంచ ॥

వుంగరాలు మంచివంటా నూరకే వేలువట్టేవు
సింగారమాయఁ గొప్పంటా జేయిచాఁచేవు
సంగతాయఁ [1]గుచ్చలంటా సరుగ నొడివట్టేవు
చెంగటఁ గాకుసేతురా చెలువలను ॥ మంచి ॥

మోవిపండు తీపులంటా ముంచి చపులు రేఁచేవు
శ్రీవేంకటేశుఁడ నన్నుఁ జేరి కూడేవు
ఆవల నలమేల్మంగనని నన్నుఁ బొగడేవు
భావించి సచ్చిసేతురా పడఁతులను ॥ మంచి ॥ 286

పాడి

వలచినదానికేలే వాసులెంచను
సెలవుల నవ్వుతాను చేకొనఁగవలదా ॥ పల్లవి ॥

పిలువఁగా నీవేల బిగిసేవే పతితోను
చలము లెందాఁకాను సాదించేవే
బలిమి నాతఁడు నిన్ను పైకొని చెనకఁగాను
కలువకన్నులఁ జూచి కాఁగిలించవలదా ॥ వల ॥

వొడివట్టి తియ్యఁగాను వొరటు లింకానేలే
బడివాయకుండఁగాను పంతమేఁటికే
అడియాలముగ మోవి యాతఁడు నీకియ్యఁగాను
తడవి మోవి యొసఁగి దప్పిదేర్చవలదా ॥ వల ॥

ముందుముందె మాటాడఁగా మోనము నీకిపుడేలే
కందువ నిన్నుఁ గూడఁగ కాఁతాళమేలే
చెంది యలమేల్మంగవు శ్రీవేంకటేశుఁ డతఁడు
పొందైతి రిట్లానే భోగించవలదా ॥ వల ॥ 287

1. కుచ్చెల=పావడ. 'కుచ్చల' వ్యావహారికము.

నాట

నీచేతనౌనె నేర్పులివి యెల్లాను
కాచుకుండి మనసెల్లఁ గరఁగించఁగలవె ॥ పల్లవి ॥

కడువలచితినంటా కాంతుని కిచ్చకమాడి
తొడిఁబడఁ గాఁగిలించి దొమ్మి సేసేవు
అదరి చొక్కులఁబెట్టి అంత సేసినదానవు
బడిఁ దిప్పి యాతని భ్రమయించఁగలవే ॥ నీచే ॥

పాసియుండ నోపనంటా పక్కననుబ్బించి పతి—
కానచూపి ఇంటఁబెట్టు కలయించేవు
బేసబెల్లిపై ఇట్లాఁ బెడరేఁచినదానవు
బాసనేయించు కేపొద్దూఁ బనిగొనఁగలవే ॥ నీచే ॥

పట్టపుదేవులనంటా పైకొని శ్రీవేంకటేశు—
నట్టు నిట్టుఁ గూడితివి అలమేల్మంగా
గుట్టున నన్నితఁదేలెఁ గుచ్చితపుదానవు
వొట్టుక వురముమీఁద నుండఁగఁగలవే ॥ నీచే ॥ 288

రేకు 951 వరాళి

ఇప్పుడే విన్నవించితి మెగ్గులువట్టేవుగన
వుప్పతించి మామీఁద నొలవేసేవుసుమ్మీ ॥ పల్లవి ॥

కొప్పేల దువ్వేవు నీవు కొంగేల పట్టేవు నన్ను
యిప్పుడే నీవద్దిచెలులెల్లా నవ్వఁగా
కప్పి నీపై నామేఁకస్తురిబేంట్లు రాలీ
అప్పుడు మమ్మేమైనా నాడుకొనేవుసుమ్మీ ॥ ఇప్పు ॥

చెక్కులేల నొక్కేవు చెయ్యేల వేసేవు నాపై
గుక్కక సవతులెల్లా గొణఁగఁగాను
చిక్కనినాగుబ్బలపై చెమట [1]నామేననంటే
చొక్కుచు మామీఁద నీవు సొలసేవుసుమ్మీ ॥ ఇప్పు ॥

కాయమేల నిమిరేవు కాఁగిటనేల నించేవు
పాయపుపెండ్లికూఁతులు పంగించఁగా
యీయెడ శ్రీవేంకటేశ యేనలమేలుమంగను
చాయలకే కూడితివి జంకించేవుసుమ్మీ ॥ ఇప్పు ॥ 289

## తోండి

కంటిమే నీవల్ల నిట్టికతలెల్లాను
వెంటవెంట వచ్చి కడువేసాలు చూపేవు ॥ పల్లవి ॥

కాటుకకన్నులతోడ కసరుచు రమణుని
సూటిదప్పకుండా నేమిచూచేవే నీవు
నే(నేఁ?)టనే కడమాయనా నీయాసోద మెంతలేదు
మేటివై యిందరిలోనా మేకులుసేసేవు ॥ కంటి ॥

కానుకగా మోవిమీఁద కప్పుచుఁ దమ్ములమ్మున
నానఁబెట్టి యిప్పుడేమి నవ్వునవ్వేవే
కానరాదా నీవలపు కలయవేసేవు పొందు
పూని నీపెద్దరిక మిప్పుడే నెరపేవు ॥ కంటి ॥

కంకణాలచేతులను కాఁగిటను బిగియించి
మంకవై యీవేళనేల మాటలాడేవే
కొంకక యలమేల్మంగ కూడె శ్రీవేంకటేశుఁడు
జంకెనరతుల నెంత జాగులఁబెట్టేవే ॥ కంటి ॥ 290

1. నామేను + అని + అంటే

పళవంజరం

ఏమే యింతటిదాన వెఱ(గవచే
నామాట సరివచ్చెనా నే(డు నీకు ॥ పల్లవి ॥

యెగసక్కెపుమాటలు యెన్నైనా నాడ(గవచ్చు
అగపడి ప్రియమాడే దరుదుగాని
మగవానితోడనేల మారుకొన(గ( జెలికి
మొగమోట ప్రియముతో మొక్కవలె(గాక ॥ ఏమే ॥

బచ్చెనపంతములను బయలీ(దించ(గవచ్చు
నిచ్చ( బొందు ఁరపేది నేరుపుగాని
యిచ్చకపు( బతితోడ నెమ్మెలేల మగువకు
యెచ్చు(గుందులేక కా(గి లియ్యవలె(గాక ॥ ఏమే ॥

నలిరే(గి కేరడపునవ్వులు నవ్వ(గవచ్చు
యెలమి సరసమాడే దెక్కుడుగాని
అలమేలుమంగవు నిన్నత(డు శ్రీవేంకటేశు(—
డలమె నిట్టె ముదమందవలె(గాక ॥ ఏమే ॥ 291

దేవగాంధారి

జోడుగూడితి రిద్దరు సొంపగుజాణలె మీరు
తోడ నీళ్లాడరయ్య దొరకె మీకిపుడు ॥ పల్లవి ॥

చెలియగుబ్బలమీ(దిచెమట పన్నీరుకాపు
కలకలమనునవ్వు కప్పురకాపు
మలసేటివినయపుమాటలు వేదమంత్రాలు
వెలసె మజ్జనవేళ వింతలాయ మీకు ॥ జోడు ॥

కాంతమేనితావి యటకటి(లి?)చందనపుకాపు
పొంతఁ గడకుంటే చూపు పునుగుకాపు
సంతసపుసరసాలు జరపేటివూడిగాలు
యింతటా మజ్జనవేళ యితవాయ మీకు ॥ జోడు ॥

ఇయ్యలమేల్మంగ కాంతులె త్తేతిరుపండికాపు
గయ్యాళిమదరాగము కస్తూరికాపు
ఇయ్యెడ శ్రీవేంకటేశ యెనసితి రిద్దరును
వొయ్యనే మజ్జనవేళ వొరపాయ మీకు ॥ జోడు ॥ 292

బౌళి

ఏల యెడతాఁకించే వీడకాడకు నింతుల
మేలములాడుచునే నమ్మించవలెఁగాక ॥ పల్లవి ॥

చాయపాటుమాటలకు సమ్మతించీనా చెలి
ఆయెడకు నీవుంగర మంపినఁగాక
చేయరానిసేఁతలెల్లాఁ జేసితివి తొలుతనె
చేయిపట్టి ప్రియమెల్లాఁ జెప్పవలెఁగాక ॥ ఏల ॥

అడియాస కానికల కాపె యీడకు వచ్చీనా
యెడయక నీవు వచ్చి యేలినఁగాక
తొడిఁబడ నీపై మోచె తోడనే ఆపెవలపు
గొడవదీరఁగ వేఁడుకొనవలెఁ గాక ॥ ఏల ॥

చుట్టి రాయబారాలకు చొక్కీనా అలమేల్మంగ
గుట్టున శ్రీవేంకటేశ కూడినఁగాక
చుట్టమవై వచ్చితివి సొరిది నీకెయింటికి
నెట్టన నిట్లానే మన్నించవలెఁగాక ॥ ఏల ॥ 293

కూరిమిఁ బాడినది నీకు_త్తికో వేరొకతో
మేరతోడఁ దెలుపరాదా మెచ్చేఁగాని
చేరి నేఁ బొగడితేను చెలరేఁగితి వప్పుడు
టీరాన గుట్టుసేసేవు పెరదానివలెను ॥ ఏల ॥

చెంది కాఁగిలించేవి నీచేతులో చెల్లెలివో
మందలించరాదా సమ్మతించేఁగాని
అంది శ్రీవేంకటేశుఁడ నని కూడితి విప్పుడు
యెందుకైనా నొనగూడే వింటిదానివలెను ॥ ఏల ॥ 295

దేశి

నాకుఁ దెలుసు నీతనినాటకములు
కైకొనీనా ఇంతలోనే కతకారిగాక ॥ పల్లవి ॥

యెఱఁగక చేఁత చేసి యెదిటికి రాఁడ నేవు
వెఱపు వాని కేడదే వేసాలుగాక
వొఱపు నీమాటలకే వొడఁబడి తనమతి
కఱకరిఁ గరఁగీనా గామిడిగాక ॥ నాకుఁ ॥

అగడుగాఁ దిరిగాడి యందుకు లోఁగీ ననేవు
తగ వాతఁ దెఱిఁగునా తక్కులుగాక
తగిలి తనబాసలు తలఁపించితే నేఁడు
మొగమోడీనా కడుమొక్కలీఁడుగాక ॥ నాకుఁ ॥

వలపు లంతటాఁ జూపి వచ్చి నన్నేలీ ననేవు
సులభుఁడా ఇవిగొన్ని సుద్దులుగాక
బలిమి లోనికి వచ్చి పైకొని శ్రీవేంకటేశుఁ—
డలమె నన్నుఁ గాఁగిట నాగడీఁడు గాక ॥ నాకుఁ ॥ 296

ఆహిరి

ననుఁ జూచి యిప్పు డెంతనవ్వు నవ్వేవు నీ-
వనితనై వున్నదాన వలదనేనా ॥ పల్లవి ॥

చెలిమికాఁడ నీవేల సిగ్గువడేవు యేమో
వెలఁది విన్నవించీని వినరాదా
యెలమి నామోము చూచి యేల లోఁగేవు మీకుఁ-
గలసాఁమే యిది కాదనేనా ॥ ననుఁ ॥

కోడెకాఁడ నీవేల గుట్టుసేసేవు ఆపె
తోడనే కానుకిచ్చీ నందుకొనరాదా
వేడుక నేఁ జూచేఁగాక వెఱవనేలా మీ-
వాడికమోహము లివి వారించేనా ॥ ననుఁ ॥

శ్రీవేంకటేశుఁడ యెంతచెలరేఁగేవు నీ-
దేవులు సన్నలుసేసీఁ దెలియరాదా
గోవిందరాజవు నీపే గుఱుతుగంటి యిదే
యీవల నన్నేలితివి యీకె [1]యేలనేనా ॥ ననుఁ ॥ 294

రేకు 952 సోమరాగం

ఏల తమకముసేసే వింతలోను
లాలించినానుఁ జెప్పవు లాఁతిదానివలెను ॥ పల్లవి ॥

నిక్కి చూచినదానవు నీవో మరొకతో
యిక్కువతోఁ జెప్పరాదా యెరిఁగేఁగాని
వుక్కున నీవప్పుడైతే వూఁకొంటివి నేఁ జెప్పితే
వెక్కసాన నుందానవు వింతదానివలెను ॥ ఏల ॥

1. ఏల+అనేనా

ఆసలఁ గూడినప్పుడే ఆయాలు గరఁగుఁగాక
పాసివున్నప్పుడు తడఁబాటులేకావా
బేసబెల్లివలపుల పిరివీకై రాఁబోలు
నేస నేఁ బెట్టఁగాను సిగ్గువడి వుండునా ॥ అదు ॥

సరసమాడినప్పుడే చవులెల్లాఁ బుట్టుఁగాక
గొరబైనయప్పుడు కొఱతలేకావా
యిరవై శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
వరుస నిందాఁకా నిటువలెఁ జొక్కకుండునా ॥ అదు ॥ 298

పాడి

కంటిమయ్యా నీసుద్దులు కతలుగాను
ఇంటిపొరుగువారిపై నింపులు చల్లేవు ॥ పల్లవి ॥

మలసి కొంగువట్టేవు మగువ దండ నుండఁగా
మొలకచన్నులు నిన్ను మోచెనంటాను
యెలమిఁ బెండ్లాడినాపె నేమిసేతువో యిఁక
చెలిమికత్తెలమీఁద చేతులు చాఁచేవు ॥ కంటి ॥

బడినే కానుకిచ్చితే పచ్చడము గప్పేవు
పడఁతికొనగోరు నీపై సోఁకెనంటా
అడరి వుంకువవెట్టినాపె నెంత చిక్కింతువో
నడుమచుట్టాలమీఁద ననుపు చూపేవు ॥ కంటి ॥

కలసితివి సతిని గక్కన శ్రీవేంకటేశ
అలివేణిచూపులు నిన్నంటెనంటాను
యెలమి మేనవారైతే యెంత దక్కఁగొందువో
కలగొన పేరటాండ్లఁ గాఁగిలించేవు ॥ కంటి ॥ 299

లలిత

చెప్పుదుమాటలు గావు చెలువుఁడ నీసేఁతలు
చొప్పుదప్పకుండా నేనే చూచితినయ్యా ॥ పల్లవి ॥

యెలమి నాకెయు నీవు నెదురుబడి నుండి
నెలవుల నవ్వితివి సిగ్గులతోను
తలుపుమాటున నుండి తారుకాణగా నేఁడు
నొలవక నేనే ఇట్టె చూచితినయ్యా ॥ చెప్ప ॥

వోడక మీరిద్దరును వొక్కమంచముపైనుండి
వీడేలు నేసుకొంటిరి వేడుకతోను
నీడలోనే పొంచివుండి నెట్టన మీసరితలు
జోడనగా నేనే చక్కఁ జూచితినయ్యా ॥ చెప్ప ॥

శ్రీవేంకటేశ కాఁగిటఁ జెంది నీ వాకెయు నిట్టె
మోవితేనె లానితిరి ముచ్చటతోను
యీవలికిఁ దీసి నిన్ను నిదే నేనూఁ గూడితి
నోవలుగా నేనే మిమ్ముఁ జూచితినయ్యా ॥ చెప్ప ॥ 297

దేశాక్షి

అడుగరే చెలులాల ఆతనినే యీమాట
వుడివోనితమకాన నుండఁబోలు తాను ॥ పల్లవి ॥

వేడుకగలప్పుడే వెస నవ్వు వచ్చుఁగాక
వాడి వున్నప్పుడు తలవంపులే కావా
యేడనో సతులచేత యేఁపులఁబడి రాఁబోలు
యీడ నేఁ జెనకఁగాను యిటులా నుండునా ॥ అడు ॥

శుద్ధవసంతం

కందము నీసంతలు గట్టిగా నిఁక
సందడిఁ బెండ్లాడేవేళ చాయ కెట్టు వచ్చేవో ॥ పల్లవి ॥

కుంచెవేసేయట్టియాపె కొప్పు దాఁకించెనంటాను
అంచలఁ బంతములెల్లా నాడుకొనేవు
మించినరతివేళను మేనెల్లాఁ దాఁకేయపుడు
వంచనలేక యెటువలె నోర్చేవో ॥ కంద ॥

జూదమాడి వోడినాపె సొలసి తిట్టెనంటాను
తీదీపుల చలము సాదించఁ జూచేవు
పాదుకొని యేకశానఁ బచ్చిమాట లాడేవేళ
సాదవై నీవెట్లాను సమ్మతించేవో ॥ కంద ॥

సేసలు వెట్టినయాపె సిగ్గువడె నంటాను
వాసితోఁ జన్నులమీఁద వాఁ(వ్రాఁ?)త వా(వ్రా?) సేవు
యీసరినే శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
తాసువలె నిద్దరిని దయతో మన్నించేవో ॥ కంద ॥ 300

రేకు 953 మేఘరంజి

ఇదివో నీతోడిపొందు [1] ఇంతేశేయా
యెదుట నున్నది చెలి యెఱుఁగుకోవయ్యా ॥ పల్లవి ॥

కొమ్మచిత్తములోనిచింత కొప్పునెరులై నిండె
ముమ్మడితరితీపల్లా మోవిపండాయ
నెమ్మది నడియాసలు నివ్వెరగుచూపులాయ
పమ్మి పరాకులేల తప్పక చూడవయ్యా ॥ ఇది ॥

1. ఇంతేశి + అయా

జలజాక్షికోరికలు చనుఁగవరాసులాయ
వలపులు రోమరాజివరుసలాయ
వెలలేనితమకము వేఁకమై పిఱుఁదాయ
తలపోఁత లీడేర్చి దయసేయవయ్యా ॥ఇది॥

కోమలిరతిభావాలు కొనగోరివాండ్లాయ
భూమిఁగల ఇంపులెల్లాఁ బులకలాయ
యీమేర శ్రీవేంకటేశ యీకె నట్టె కూడితివి
దోమటిసంతోసాలు తుదిపదములయ్యా ॥ఇది॥ 301

## కురంజి

ఇటువంటిపనులైతే నిందరు నిన్నేమందురు
కటకటా ఇఁకనైనాఁ గరుణించు మిపుడు ॥పల్లవి॥

మొల్లమిగా నాకె నీకు మోహించు టెఱఁగవా
చెల్లఁబో నీవేల జోలిసేసేవో కాక
తొల్లె నీరాకకు నెదురుచూచే దెఱఁగవా
వొల్లనే నవ్వుకొంటా నున్నాఁడవు గాక ॥ఇటు॥

వద్దనుండి నీకాపె సేవసేసే దెఱఁగవా
అద్దిరా నీవేల పరాకైతివో కాక
ముద్దు ముద్దువలె నీకు మొక్కే దెఱఁగవా
సుద్దుల నీగుణా లేమి చూపేవో కాక ॥ఇటు॥

తాలిమితో నిన్నునాపె దక్కఁగొన్న దెఱఁగవా
మేలుమేలు ఇంతయేల మీరేవో కాక
యీలీల శ్రీవేంకటేశ ఇంతి నట్టె కూడితివి
వేళ నీవెఱఁగవా నీవేడుకలు గాక ॥ఇటు॥ 302

బౌళి

ఏమిసేసినాఁ జెల్లును యిదివేళ
చేముట్టి యాతనికే సేవలెల్లాఁ జేయవే ॥ పల్లవి ॥

నాటుకొనె చూపులు నడుమఁ గొలువులోన
గాఁటపురమణునికి కానికియ్యవే
వాఁటమాయ చెమటలు వలపు లినుమడాయ
మాటలాడి యీతని మర్మము లంటించవే ॥ ఏమి ॥

తలకొనె నగవులు దండనుండి చెవిలోన
వెలయ రమణునికే విన్నవించవే
చలివాసె మనసుకు చనవులు తుదముట్టె
తెలిపి యీతనికి నీ తేనెమో వొసగవే ॥ ఏమి ॥

నెట్టుకొనె వేడుకలు నేఁడు శ్రీవేంకటేశుకు
గట్టిగాఁ బెండ్లాడితివి కాఁగిలియ్యవే
దట్టమాయ తమకము తగులాయ నిద్దరికి
చుట్టమవై యీతనికి సొమ్ములెల్లా నించవే ॥ఏమి॥ 303

రీతిగౌళ

చెప్పుమనేవు తగవు చెప్పకుండరాదు నాకు
వొప్పుగ వినవలెఁ గాదా వువిద లిద్దరును ॥ పల్లవి ॥

పాయపుదానవు గాన పతిని సొలసి నీవు
ఆయములు సోఁక మాటలాడఁజెల్లునే
చాయలాను సన్నలాను సవతులఁ జూపి చూపి
రాయిడించి పలుకఁగరాదే నీకిపుడు ॥ చెప్పు ॥

చేసుకొన్నయప్పుడే చెలువునికాఁగిటికి
ఆసపడి బలిమిసేయఁగఁ దగునే
వాసితోడ నీతోడివనితలమీఁదట
రాసికెక్క చేయిచాఁచరాదు గాని నేఁడు ॥ చెప్ప ॥

చెలిమిగలఁడు నీకు శ్రీవేంకటేశ్వరు
కలయుట సహజమే కాఁగిట నీకు
పలుమారు నీతోడిభామినులముంగిటను
చలపట్టి మురియుచు సందడించ నేఁటికే ॥ చెప్ప ॥ 304

రామక్రియ

నవ్వేవారి నెఱఁగదు నడుమఁ దాను
నివ్వటిల నీ వెన్నినేర్పితివో చేఁతలు ॥ పల్లవి ॥

చెలరేఁగి చెలరేఁగి చేసీ నీకు విన్నపాలు
నలనాక్షి నీకెంతచనవోకాని
చలివాసి నీయెదుట సన్నలెల్లాఁ జేసీని
యెలమి నీవెంతసలి గిచ్చితివో యిపుడు ॥ నవ్వే ॥

కొసరి కొసరి నీకుఁ గొలువులు సేసీని
సుసరాన నీకె యెంత చుట్టమోకాని
యెసగి నీకప్పటిని యిచ్చకములే సేసీని
వసమై యెంతవలచి వచ్చితివో యిపుడు ॥ నవ్వే ॥

చిమ్మరేఁగి చిమ్మరేఁగి సేసవెట్టీ నిన్నుఁ గూడి
యెమ్మెలఁ దానెంత నీకు నింపుదోకాని
నెమ్మది శ్రీవేంకటేశ నీవు నను నేలితివి
చిమ్ముల నాపె కెట్లాఁ జెప్పితివో యిపుడు ॥ నవ్వే ॥ 305

సాళంగనాట

కానీలే అందుకేమాయ ఘనుఁడవు నీవిన్నిటా
దానికేమి యిది నీపెద్దతికమే కాదా ॥పల్లవి॥

పంతమాడరాదుగాక పలుమారు నీచేఁతలు
కొంతగొంతైనా నీతోడఁ గొనాడరాదా
అంతటివాఁడవుగావా అడఁతురా నీగుణాలు
చెంతల నామోము చూచి సిగ్గులువడుదురా ॥కానీ॥

జంకించఁగరాదు గాక చక్కనినీమోము చూచి
కంకణాలచేయెత్తి మొక్కఁగరాదా
అంకె లింతనేరవా సేయఁగవద్దా వినయాలు
కొంకుదేరి నాయెదుట కొల్లున నవ్వుదురా ॥కానీ॥

అలుగఁగరాదుగాక అట్టె నీకాఁగిటను
సొలవక మోవి యాని చొక్కించరాదా
యెలమి శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
నెలకొనె నీపొందులు నివ్వెర గందుదురా ॥కానీ॥ 306

రేకు 954 ఆరిబి

తెలిపి చెప్పఁగవలె తెల్లమిగా ముందుముందే
వలపించి నన్ను నింత వలలఁబెట్టేవు ॥పల్లవి॥

మొలకలచన్నులమొనలు దాఁకీఁజుమ్మీ
చెలరేఁగి పయ్యదపైఁ జేయివేసేవు
కలువకనులచూపులు కడువాండ్లుసుమీ
నెలవై నాయెదుటనే నిలిచివున్నాఁడవు ॥తెలి॥

మంచిగాలపుమాటలు మతిఁ దగిలించీఁజుమ్మీ
అంచెలనే నన్ను సుద్దు లడిగేవు
కొంచక నాకొనవేలిగోరు జీరవారీఁజుమ్మీ
ముంచి సిపాదాలకు మొక్కించుకొనేవు ॥ తెలి ॥

చీఁకటికొప్పునెరులు చేరి నిన్నుఁ గప్పీఁజుమ్మీ
తాఁకించినచేతుల ముందలవట్టేవు
యేఁకటతో శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
తూఁకువసుమ్మీ పిఱుఁదు తొడ లెక్కమనేవు ॥ తెలి ॥ 307

పూరిబి

కానీవయ్య ఇఁకనేల కడు నిన్ను సొలయఁగ
మోనముతో నుండఁగాను మొక్కఁజెల్లునా ॥ పల్లవి ॥

తలఁపు నిలుపలేక తమితో మాటాడేఁగాక
పిలిచితే రానప్పుడే ప్రియమున్నదా
కొలమునాలఁగనక కోరి సేవసేసేఁగాక
అలపు చూపితినప్పుడే ఆయా లంటఁదగవా ॥ కానీ ॥

చుట్టపువరుస లెంచి చూచి నీతో నవ్వేఁగాక
అట్టు నిట్టు జునిగేవు ఆసగలదా
పట్టినవ్రతముతోడ పైకొని చెనకేఁగాక
నట్టుకొట్టినపుడే విన్నపములు గలవా ॥ కానీ ॥

ఇదె నన్నుఁ గూడఁగాను ఇచ్చకము సేసేఁగాక
వదలితేఁ గాఁగిలి·వహి కెక్కీనా
పొదిగి శ్రీవేంకటేశ పొందులు నమ్మితిఁగాక
కదిసి నీవున్నప్పుడే కాదనఁగ వచ్చునా ॥ కానీ ॥ 308

హిందోళం

ఇంకానేల దాఁచేవు ఇంతకువచ్చెఁ బనులు
సంకలే కానతీరాదా సమ్మతించేఁగాని ॥ పల్లవి ॥

చక్కెరవంటిమాటలు సతి నీతో నాడికాదా
చొక్కించెను నిన్ను నిట్టె సులభానను
చక్కనిమొగము చూచి సన్నలుసేసే కాదా
నెక్కొనుతమకమెల్లా నీకు రేఁగెను ॥ ఇంకా ॥

గాలాలవంటిచూపు లొక్కటఁ దగిలించికాదా
తాలిమి నీమనసెల్లాఁ దక్కఁగొనెను
మేలిమిచన్నులు నీమే నిట్టె తాఁకించికాదా
కీలుకొన్నవలపులు కెరలించెను ॥ ఇంకా ॥

లతలవంటిచేతుల లలి గాఁగిలించికాదా
రతిరహస్యములఁ గరఁగఁజేసెను
యితవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
కతకారియాపెకాదా కళ లెసఁగించెను ॥ ఇంకా ॥ 309

మాళవిగౌళ

ఏమని విన్నవించేము యెందాఁకాను
నీమనసే యెఱుఁగును నేఁడెంత సేసేవు ॥ పల్లవి ॥

వలపెల్లా నొక్కటే వారివారిలోపల
కొలఁదిమీరినయట్టిగుణాలు వేరు
చెలిమీ నటువంటిదే చెప్పి చూపఁబోఇతేను
వెలలేనినేర్పులు వేవేలు గాని ॥ ఏమ ॥

మన సందరివంటిదే మరిగివుండేయపుడు
నసుపులసరసాలే నానాగతులు
తనువు లొద్దికైనవేళ తరితీపు లెంచితేను
చెనకులో సన్నలే చిత్రములుగాని ॥ ఏమ ॥

పొందులు నెప్పటివే భోగించేయప్పుడు
మందలించి కరఁగించేమర్మాలు వింత
చెందితివి నన్ను నిట్టె శ్రీవేంకటేశ్వర
విందులమోవియీవులే వేడుకలు గాని ॥ ఏమ ॥ 310

నాదరామక్రియ

ఇంత[1]వని కోపుదుమా యిదివో నేమొ
మంతనానకు వచ్చితే మరిగించుకొంటివి ॥ పల్లవి ॥

పొద్దువోనివాఁడవు పొలఁతులఁ గంటేను
చద్దికి వేఁడి కాదేవు జాణతనాలు
వుద్దండీఁడవట మీఁద నొడఁబరచవచ్చితే
కొద్దిమీరి చెలిమేన గోరు దాఁకించితివి ॥ ఇంత ॥

జూటరివాఁడవు నీవు సుదతు లిచ్చితేఁజాలు
చీటికిమాటి కంటేవు చేకానికలు
నీటుదొరవు గనక నీకు విందుచెప్ప వచ్చి-
నాఁటదానికొంగువట్టి యాఁబడిఁబెట్టేవు ॥ ఇంత ॥

నిరతి శ్రీవేంకటేశ నెలఁత లెదుట నుంటే
సరికి బేసి కంటేవు చనుమొనలు
సరసుఁడవని నిన్ను సంగడి నే మెచ్చితేను
సొరిది నన్నేలితివి చుట్టమైనదానిని ॥ ఇంత ॥ 311

---

1. ఇంత + పని

తెలుఁగుఁగాంబోది

కోరిక లీడేరె నీకుఁ గూచుండవయ్యా
సారె సారె నందుకుఁగా జలపట్టనేఁటికి ॥ పల్లవి ॥

యింతలోనే విభుఁడ నీవింటికి విచ్చేసితివి
పంతపుమాఁటల కిఁకఁ బనిలేదు
వంతుకు వచ్చినయాపె వద్దనే నిలుచున్నది
సంతోసించవలెఁగాని సాదించనేఁటికి ॥ కోరి ॥

దప్పిదేర చెక్కునొక్కి తమ్ముల మిడితివి
తప్పులు నీపయి నెంచఁదగవుగాదు
చెప్పరానిగుట్టుతోడ చేసన్నచేసీ నాపె
వొప్పనాయ నీవలపు వుప్పతించనేఁటికి ॥ కోరి ॥

కన్నులనే నవ్వి నన్నుఁ గాఁగిట నించితివి
విన్నపాలుసేయ నిది వేళ గాదు
వున్నతి శ్రీవేంకటేశ వూరకే మొక్కీ నాకె
మన్ననలు దయివారె మతకములేఁటికి ॥ కోరి ॥ 312

రేకు 955. శంకరాభరణం

నా మొగము చూచి నగరాదా
దోమటి గలసే నిందుకు నగరాదా ॥ పల్లవి ॥

చెనకు లాకైచేఁ జేయించకుండితే
నను నీ వప్పుడు నగరాదా
పెనఁగుల జంకింపించకుండితే
యినుమడిగా నీవిటు నగరాదా ॥ నామొ ॥

పిలి చటు కొసరింపించకుండితే
నలువంకల మరి నగరాదా
చెలరేఁగి ప్రియము చెప్పించకుండితే
కొలఁదిమీరి గక్కున నగరాదా ॥ నామొ ॥

వొట్టి పంతానఁ జెయ్యొగ్గించకుండితే
నట్టనడుమనే నగరాదా
యిట్టె శ్రీవేంకటేశ కూడితివి
చుట్టమవై మెచ్చుగ నగరాదా ॥ నామొ ॥ 313

కన్నడగౌళ

ఏల తలవంచీనే యెగ్గులేల పెంచీనే
తాలిమి నెంచి చూచితే తానే నేననవే ॥ పల్లవి ॥

ాడివట్టి పెనఁగవే వొట్టువెట్టుకున్నవాఁడు
నుడిగి దోసము లేదనుచుఁ బల్కవే
అడియాలమైనట్టియాన నా పైఁ బెట్టవే
ాదయఁడు తాను నాకు వోరుచుకొమ్మనవే ॥ ఏల ॥

పలుమారు మొక్కవే పంతముతో నున్నవాఁడు
వెలయ సిగ్గు లొల్లనే విడిపించమనవే
నెలవుల నవ్వింపించి చేరి యాసపుట్టించవే
అలుగరానిచుట్టరిక మన్నిటాఁ దెలుపవే ॥ ఏల ॥

గక్కనఁ దెరవేయవే కరుణతో నున్నవాఁడు
అక్కడిక్కడివా రేమీ ననకనవే
యిక్కువ శ్రీవేంకటేశుఁ డీడ విచ్చె నన్నుఁ గూడె
దక్కినాఁడు తా నాకు తా నెఱుఁగుననవే ॥ ఏల ॥ 314

బౌళి

తమ్ముఁదామే యెఱిఁగేరు తగవులెల్లా
రమ్మంటె వత్తముగానీ రావే వాకిటికి ॥ పల్లవి ॥

సతికినిఁ బతికిని సాకిరి చెప్పుదురా
తతిగొని పెనఁగఁగా దండనుండుదురా
యితవరి చెలులము యెవ్వరి నేమనవచ్చు
రతికెక్కఁ బనులెల్లా రావే వాకిటికి ॥ తమ్ముఁ ॥

పవ్వళించి వుండఁగాను పాదము లొత్తుదురా
పువ్వులవేట్లాడఁగాఁ బొదుగుదురా
నవ్వించేవారము నాలి యెట్టు సేయవచ్చు
రవ్వలాయఁ జేతలెల్లా రావే వాకిటికి ॥ తమ్ముఁ ॥

బాసలు చేసుకోఁగా పైపై గురియపుదురా
ఆసల మోవులానఁగా నట్టె చూతురా
సేసవెట్టి యేలినాఁడు శ్రీవేంకటేశ్వరుఁడు
రాసులాయ వేడుకలు రావే వాకిటికి ॥ తమ్ముఁ ॥ 315

సాళంగం

ఆనతియ్యవయ్యా నీవాతరవాతిమాట
కానుకలు వట్టుకొని కాచుకున్నారింతులు ॥ పల్లవి ॥

చట్టువంటినీమనసు సాదించరా దెవ్వరికి
గట్టికొండలవంటివి కాంతచన్నులు
గుట్టుతో మీరుండఁగా మీగుణము దెలియలేక
చుట్టుక మొగమొగాలు చూచుకొనే రింతులు ॥ ఆన ॥

కాటుకవంటిది నీచక్కనితిరుమణిచాయ
కోటిచీఁకట్లగుంపు కొమ్మతురుము
సీటుతో మీరుండఁగా మీనెపము లెరుఁగరాక
తేటపడ లోలోఁ జింతించుకొనే రింతులు ॥ ఆన ॥

కొత్తచిగురువంటిది కోరినట్టినీవలపు
చిత్తరువ్రాఁతవంటివి చెలిరతులు
ఇత్తల శ్రీవేంకటేశ ఇద్దరుఁ గూడితిరి
పొత్తులసంతోసాలఁ బొదలేరు ఇంతులు ॥ ఆన ॥ 316

నాట

ఈకెకు నప్పుడుగాని యేకచిత్తము గాదు
చేకొని మచ్చిక చూపి చెప్పవయ్య ప్రియము ॥ పల్లవి ॥

కళలు దొలఁకఁగాను గక్కన నీమోము చూచి
మలసి యెందో కొడిమలుగట్టీని
తలకొని నీవెంత తారుకాణించవచ్చినా
చెలియ నమ్మదు ఇఁకఁ జేయవయ్య బాస ॥ ఈకె ॥

పంకంపుఁజెమట మేనిపై నీకు నుండఁగాను
తెంకి నేదదోయని సందేహించీని
అంకెల నొడఁబరచి అతివ కెంతచెప్పినా
కొంకక మానదు పెట్టుకొనవయ్య అనలు ॥ ఈకె ॥

సతమై నిట్టూర్పులు సారె నీకు రేఁగితేను
సతులఁ బొందితివని జరసీ నిన్ను
ఇతవుగా శ్రీవేంకటేశ యీకెఁ గూడితివి
రతిలోనే సోదించి నేరపవయ్య నిజము ॥ ఈకె ॥ 317

వరాళి

ఇంతదొడ్డవాఁడవౌత ఇంతులెల్లా నెరఁగరా
పంతము లిప్పుడే నీవు పచారించవలెనా ॥ పల్లవి ॥

తరుణి నీవూడిగాలు తఱచుగఁ జేయఁగాను
సిరులఁజెమట మేనఁ జిప్పిలీని
సురటి విసరరాదా సుద్దులేమి చెప్పేవు
యిరవైనదొరతన మిప్పుడే చూపేవా ॥ ఇంత ॥

కొమ్మ నిలుచుండి నీకుఁ గొలువులు సేయఁగాను
చిమ్ముల యలపుతోడ సిగ్గువడీని
పమ్మి కూచుండఁబెట్టుక పన్నీరు చల్లఁగరాదా
యెమ్మెలునేతులు నీవు యిప్పుడే చూపేవా ॥ ఇంత ॥

పడఁతి వేగినంతాను పాదాలు నీ కొత్తఁగాను
కడఁగి కళలురేఁగి కాఁతాళించీని
అదరి శ్రీవేంకటేశ అంతలోనే కూడితివి
యెడయనినీనేరుపు లిప్పుడే చూపేవా ॥ ఇంత ॥ 318

రేకు 956 శ్రీరాగం

కానవచ్చె నాపెమీఁది కందువైనవలపులు
నానఁబెట్టి యివి యేమి నాకుఁ జూపేవయ్యా ॥పల్లవి ॥

నీమనసు వచ్చితేను నేరములు నేరుపులే
వేమారు విన్నవించినా వినఁ జవులే
గామిడిసేఁతలైనాను కడుఁదరితీపులే
యేమేమి నవ్వులైనాను ఇచ్చకములే ॥ కాన ॥

కూటములు గలిగితే కొసరులెల్లా నింపులే
    జూటరిగుంపెనలైనా చుట్టరికమే
నీటుతోడిజంకెనలు నిండినసంతోసాలే
    చాటున గర్వములైనా సమ్మతింపులే ॥ కాన ॥

కైవసములై తేను కాఁగిలే నిధానము
    వేవేలుపంతములు వినయములే
శ్రీవేంకటేశ నన్నుఁ జిత్తగించి యేలితివి
    చేవదేరేచెనకులు సింగారాలే ॥ కాన ॥ 319

## పాడి

చెప్పరయ్యా మీరిద్దరు చేకొని బుద్దులు మాకు
    యిప్పుడే చెలులమెల్లా నిఁక మెచ్చవచ్చునా ॥ పల్లవి ॥

మంతనాన మీరిద్దరు మాటలాడుకొంటిరట
    చెంతల మా కవేమైనాఁ జెప్పవచ్చునా
కాంతులతో మీమొగాలు కళలురేఁగి వున్నవి
    అంతరంగ మదేమైనా నడుగఁగవచ్చునా ॥ చెప్ప ॥

చెమ్మరేఁగి మీరుమీరే సింగారించుకొంటిరట
    సొమ్ములు మా కవేమైనాఁ జూడఁగవచ్చునా
చిమ్ముఁజెమటలు మీకుఁ జెక్కులు నిండుకున్నవి
    సమ్మతించి మా కిఁక సంతోసించవచ్చునా ॥ చెప్ప ॥

వావులు చెప్పక మీరు వరుసఁ గూడితిరట
    కావించి మీగుణాలు పొగడవచ్చునా
యీవేళ శ్రీవేంకటేశ ఇట్టె మమ్ము నేలితిరి
    వేవేలు మీకీర్తులెల్లా వెలఇంచవచ్చునా ॥ చెప్ప ॥ 320

ఆహిరి

సంతోసించుకొనుటే చాలదా సారెసారెకు
చింతించి తలఁచుకొనేసిగ్గరికానికి ॥ పల్లవి ॥

చూపునఁ దప్పక నీవు చూచినదే చాలదా
పూఁపుదెలిసినయట్టిపురుషునికి
కాఁపురాలు నీవు తారుకాణించవలెనా
యేపున నీగుణమెల్లా నెఱిఁగినవానికి ॥ సంతో ॥

నలువున కెలవుల నవ్వినదే చాలదా
చెలరేఁగి వాసిగలచెలువునికి
మలసి యేతువులెత్తి మాటలాడవలెనా
వలచి నిన్నుఁ బాయక వసమైనవానికి ॥ సంతో ॥

మునుకొని చేతులెత్తి మొక్కినదే చాలదా
నిను నింతసేసినట్టినేరుపరికి
పెనఁగవలెనా ప్రియానఁ గాఁగిట నీతో
యెనసిన శ్రీవేంకటేశ్వరునికి ॥ సంతో ॥ 321

గౌళ

వద్దే మామాట విన వచ్చేవో రావో
యిద్దరి మీపొందులకు నింత చెల్లునా ॥ పల్లవి ॥

పట్టినదే వ్రతమా పదఁతి నీ వతనితో
వొట్టువెట్టుకొంటివట వొక్కటి గాదు
వట్టినేరా లెవ్వరికి వచ్చుఁ బోవు నొకవేళ
యిట్టె పాయపువారి కంత చెల్లునా ॥ వద్దే ॥

అత్తి సేసినదే చేఁతా అంగన నిన్ను నతఁడు
పొత్తుకు రమ్మనఁగాను పోఁ నసేవు
వొత్తి విన్నవించనేల వోడలు బండ్ల వచ్చు
యెత్తయినదొరలకు నింత చెల్లునా ॥ వద్దే ॥

ఆడినదే మాటా అదె శ్రీవేంకటపతి
కూడే నే ననఁగాను గొణఁగేవు
యీడుజోడై యింతలోనే యిద్దరూ నొకపైతిరి
యేడనైనా నీదేకాక యింత చెల్లునా ॥ వద్దే ॥ 322

శంకరాభరణం

ఆడకే వచ్చెఁ బోవే అంతేచాలు
యీడుజోడుఁ జెప్పకువే ఇంతే చాలు ॥ పల్లవి ॥

కన్నులనే చూచితివి కాఁకలు చల్లితివి
అన్నిటా నేమీ ననకు మంతే చాలు
సన్నల నవ్వితివి చాయల మొక్కితివి
యెన్నికలు నరివచ్చె నింతే చాలు ॥ ఆడ ॥

బొమ్మల జంకించితివి పొద్దూఁ గడపితివి
అమ్మకువే వావులు నేఁ డంతే చాలు
చిమ్మితివి మాఁటలు సేసితివి సీఁటులు
యెమ్మె లింకఁ గొలుపవు యింతే చాలు ॥ ఆడ ॥

దగ్గరికి వచ్చితి దవ్వుల మెచ్చితివి
అగ్గలమాయఁ జెమట అంతే చాలు
బగ్గన శ్రీవేంకటాద్రిపతి నేఁడు కూడె నిన్ను
యెగ్గుసిగ్గు లిఁకనేలే యింతే చాలు ॥ ఆడ ॥ 323

నాదరామక్రియ

ఈరు దియ్యఁ బేను వచ్చు నేమనఁగా నెట్లవునో
వూరకుండుటే చాలు వొద్దుసుమ్మీ బాసలు ॥ పల్లవి ॥

అడ్డమాడలేకపో అట్టె నేను నుస్సురంటి
వొడ్డారించఁగలేకే వొగి నవ్వితి
వెడ్డువెట్టి నన్నునేల వెడనిష్ఠూరిఁ జేసేవు
వొడ్డుకున్నాఁ బోనీవు వోపఁజుమ్మీ యింతకు ॥ ఈరు ॥

కోపగించఁ జాలకేపో కోరి వద్ద నిలుచుంటి
రాపుసేయఁ జాలకేపో రమ్మంటిని
యీపనికిఁగానే నీవు యేల పచ్చిసేసేవు
దాఁపినా విచ్చివేసేవు తప్పఁజుమ్మీ నీకు ॥ ఈరు ॥

వేసరించఁజాలకేపో వేగమే కూడితి నిన్ను
ఆస చెరుచఁగలేకే అంకె నుంటిని
యీసరికి శ్రీవేంకటేశ నన్ను నేలితివి
వాసికెక్క రతులెల్లా వలెఁజుమ్మీ యిందుకు ॥ ఈరు ॥ 324

రేకు 957 ఆహిరి

గోరఁబొయ్యేపనికిఁగా గొడ్డలేఁటికి
అరయ నాతఁడే చెప్పీ నతివకు బుద్ధులు ॥ పల్లవి ॥

చిత్తములోపలిచింత చెక్కుచేతఁ గానవచ్చె
అత్తి మాటాడించకురే అంగన నంత-
బత్తిగలవారమైతే పతిఁ దోడితెత్త మిట్టె
వొత్తి యాకె నేమన్న వొప్పగించీఁ దనువు ॥ గోరఁ ॥

నిండినమైవిరహము నిట్టూర్పులను మించె—
నండనే నవ్వించకురే ఆయాలు రేఁగీ
వుండరే చుట్టాలమైతే నొక్కటిసేత మిద్దరి
చండిపెట్టి పిలిచితే చలపట్టీ నలుక ॥ గోరఁ ॥

కూదేటితమకములు కొనచూపులందుఁ దేరె
తోడనే యడుగకువే తొలఁగీ సిగ్గు
యీడకే శ్రీవేంకటేశుఁ దేతెంచి కలసె నేఁడు
వాడికతో సతి మీరవలపించె నతని ॥ గోరఁ ॥ 325

## శుద్ధవసంతం

వడి నీజవ్వనానకు వసంతకాలము వచ్చె
అడియాస లిద్దరికి నాయములు సోఁకెనే ॥ పల్లవి ॥

ముదితచెమటలనే ముంగారులవె ముంచె
పెదవులఁ జిగిరించెఁ బెక్కులాగుల
పొడలుఁగుచములనే పూఁపలాయఁ బిందెలాయ
యెదుటనే పతి వున్నాఁ డిఁకనేమే చెలియా ॥ వడి ॥

కోమలి నీచూపులనే కొడినా (సాఁ?)గెఁ గోరికలు
వాములాయఁ బులకలే. వలపు పండి
వాముదేరీ మేనిమీఁదినవిరివాసనలు
ఆమనివిభుఁడు చేరె నలుక లింకేలే ॥ వడి ॥

సతి నీమోహానఁ దీగెసాగె బాహులతలు
సతమాయ నిట్టూర్పు చల్లగాలి
ఇతవై శ్రీవేంకటేశుఁ డిన్నిటాను నిన్నుఁ గూడె
మతిలోఁ బాయకున్నాఁడు మంచిదాయఁ గదవే ॥ వడి ॥ 326

శ్రీరాగం

అన్నియుఁ జేసినఫల మదియె మాకు
విన్నపము లిందుమీఁద వేవేలు నేఁటికి ॥పల్లవి॥

కప్పుర మంపఁగనేలే కడమా నాకిది తొల్లి
కప్పురగందినపుట కానఁడా తాను
కప్పురముపేర నుండి కాఁకసేసె వెరబొమ్మఁ
జిప్పిలి మమ్మేమ్రపకుండాఁ జేయుమనవే ॥అన్ని॥

చందన మేలంపెనే సహజాన నేఁ దొల్లి
చందనగందినపుట చాటువే కాదా
చందనపుఁగొండఁ బుట్టి చల్లజంపు దిప్పకాయ
అంది పచ్చిరేఁచకుండా నడ్డపెట్టు మనవే ॥అన్ని॥

కమలము లేలంపెఁ గానుకగా నేఁ దొల్లి
కమలగందినపుట కలదేకదే
కమలాక్షుఁడైన శ్రీవేంకటపతి దానె నేఁడు
అమరఁగఁ గూడె నన్ను నంద నుండుమనవే ॥అన్ని॥ 327

మేఁచబౌళి

నాకొరకు నిన్ను నింత నలఁగించవలెనా
నీకు నితవైనంతే నే నొడఁబడితిరా ॥పల్లవి॥

వాలసీనొల్లనిచోట నొరసితే విసుపౌను
బలిమిసేయఁగఁ బోతే పసురౌను
తలఁచితే నీవు నా తలఁపులో నుండుదువు
చెలి నీకూటమి నింతవేసరించనోపరా ॥నాకొ॥

సారె సారెఁ బెనఁగితేఁ జప్పనౌను వుప్పనౌను
కూరిమిఁ గొనరఁబోతే కోపమౌను
చేరువ నీ రూపము నా చిత్తరువులో నున్నది
కోరి నీ వెంటఁ దగిలి కోసి రాచనోపరా ॥ నాకొ ॥

తనిసినరతివేళ తగుమోవే మొగచాటు
అనఁగి పెనఁగఁబోతే నలపౌను
ఘనుఁడ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
మనసు లొక్కటాయ మారుమాట లోపరా ॥ నాకొ ॥ 328

తెలుఁగుఁగాంబోది

ఇంక నెంతగాఁగలదో ఇఁతట నీవు రాకుంటే
లంకెఁబెట్టె ప్రాణములు లలన నీతోను ॥ పల్లవి ॥

మాఁటలు నాతో నాడు మనసు నీపై నుండు
చీటికిమాటికి నాతోఁ జెప్పినవే చెప్పను
కాటుకకన్నులు నీ రాకకే యెదురుకోనుండు
కోటికిఁ బడగయెత్తెఁ గొమ్మ నీపై మోహము ॥ ఇంక ॥

వెలఁది నన్నీడ కంపి వెంటనే తానూ వచ్చు
యెలమిఁ గానుక నీకు నిచ్చినవే ఇచ్చును
సొలసి నీవే నేఁగాఁజూచి భ్రమసి వెదకు
వలపు వెదలువెట్టీ వాడవాడఁ జెలియ ॥ ఇంక ॥

నెలవినే నవ్వు నవ్వు శిరసున నీకు మొక్కు
పొలయు నీ ముంగిటనే పొద్దువోకకు
అలరి శ్రీవేంకటేశ అంగనఁ గూడితి విట్టె
చలిమి బలిమిఁ జూపె జవ్వని నీయెడను ॥ ఇంక ॥ 329

హిందోళం

సరసములాడఁగానే సరి, వయసు వోయీని
తెరమరఁ గిఁకనేల దిష్టించరాదా ॥పల్లవి॥

చిత్తరున వ్రాసినట్టు సిగ్గువడున్నది చెలి
యెత్తి కాఁగిలించుకోవు యింతగలదా
కొత్తమెరుఁగువలెను కొంకుదేరదు వెరచి
పొత్తుకుఁ బిలుచుకొని బుజ్జగించరాదా ॥సర॥

అంచవలెఁ బొలసీని అంగన నీయెదుటను
మంచముమీఁదికిఁ దీసి మన్నించరాదా
అంచల పూఁగొమ్మవలె నాడనుండే జడసీని
మంచితనములు సేసి మాటలాడరాదా ॥సర॥

మూసినముత్యమువలె మోనముతో నవ్వీని
సేసవెట్టి రతివిందు సేయఁగరాదా
ఆసల శ్రీవేంకటేశ అంగన నిన్నిటుగూడె
వాసికెక్కె మీ వలపు వద్దనుండరాదా ॥సర॥ 330

రేకు 958. ఆహిరి

ఇటమీఁద నీచిత్త మిదివో నా విన్నపము
కుటిలకుంత లీదెస గుఱుతుగాఁ జూడుమా ॥పల్లవి॥

కలసి మెలఁగుదాఁకాఁ గన్నులనే వుండు నాస
సెలవినే వుండు నవ్వు చెనకుదాఁకా
పిలి చాదరించుదాఁకా పెదవిపై నుండు మాట
చెలియకు నీమీఁదఁ జెప్పరాదు ప్రియము ॥ఇట॥

పానుపు చేరినదాఁకా పాదాలనే వుండుఁ దమి
నాని సిగ్గుచేత నుండు ననుపుదాఁకా
మోనాన[1] మోవేనుదాఁకా మొకాన నున్నది దప్పి
పూనినమోహ మెట్టిదో పొలఁతి నీమీఁదను ॥ ఇట ॥

కూడి రతిసేయుదాఁకాఁ గుచాల నుండుఁ గోరిక
జోడించి మైఁగాఁక యింద చొక్కుదాఁకాను
యీడుగాను శ్రీవేంకటేశ ఇంతిఁ గూడితివి
తోడునీడవలె నుండుఁ దొయ్యలి నీవలపు ॥ ఇట ॥ 331

([2] జక్కిణి) బౌళి

దేవ వాసుదేవ
భావయ తాం పాలయ ॥ పల్లవి ॥

నరహరే అహో నారాయణ రే
మురహర నగధర ముకుంద
తరుణీయం తు తవ విరహేణ
భరితవిచిత్రప్రతిమా జాతా ॥ దేవ ॥

దివిజవందిత దేవోత్తమ అహో
నవనీతప్రియ నందసుత
తవ సంగమసంతతకామనయా
యువతి ర్జాతా యోగిణీవ ॥ దేవ ॥

జితదానవ అహో శ్రీవేంకటపతే
సతత మాధవ కృష్ణ సర్వేశ
రతిసంగమేన రమణీ[3]యం తు
బత తే విహితాభరణా జాతా ॥ దేవ ॥ 332

1. మోవి+అనుదాఁకా, 2. నాట్యవిశేషము, 3. రమణీ+ఇయమ్.

సాళంగం

నీకుఁ దెలియదు గాని నిండిననాలోనికాఁక
కాకుసేయకుండరాదా కమ్మరాఁ గొంతవడి ॥ పల్లవి ॥

నాకంటే మునుప నీవు నన్ను మాఁటాడించఁగాను
పైకొన్న మొగమోట నేఁ బలికేఁగాని
చేకొని నీవాడానీడాఁ జేసినచేఁతలు విని
కూఁకలు వత్తులునాయ కొలఁపదు మనసు ॥ నీకుఁ ॥

మొగమిచ్చి సారెసారె మోహము చల్లుచు నాతో
నగఁగా నేనూ నట్టె నవ్వేఁగాని
యెగసక్కెలకు నీమై [1]నెవ్వతోచేఁతలు చూచి
సగమై లోలో నిట్టె ఁడిసీ నాదేహము ॥ నీకుఁ ॥

దగ్గరఁగ వచ్చి నీవు తగఁ గాఁగిలించఁగాను
ఁగ్గి నేనూఁ గూడి వూరకుండితిఁ గాని
యెగ్గులేక శ్రీవేంకటేశ నన్నుఁ గూడఁగాను
సిగ్గుచేత నాచెక్కు చేతిమీఁద మోఁచేను ॥ నీకుఁ ॥ 333

శంకరాభరణం

ఆదరానిమా టది గుఱుతు
వేడుకతోనే విచ్చేయుమనవే ॥ పల్లవి ॥

కాయజకేలికిఁ గడుఁ దమకించఁగ
ఆయము లంటిన దది గుఱుతు
పాయపుఁబతికినిఁ బరిణాము చెప్పి
మోయుచుఁ దన కిటు మొక్కితిననవే ॥ ఆద ॥

---

[1] ఎవ్వతెయొక్కచేఁతలో.

దప్పిమోవితో తా ననుఁ దిట్టఁగ—
నప్పుడు నవ్విన దది గుఱుతు
యిప్పుడు దనరూపిటు దలఁచి బయలు
చిప్పిలఁ గాఁగిటఁ జేర్చితిననవే ॥ అద ॥

పరిపరివిధములఁ బలుకులు గులుకఁగ
అరమరచి చొక్కి-న(ద)ది గుఱుతు
పరగ శ్రీవేంకటపతి కడపలోన
సరవిఁగూడె నిఁక సమ్మతియనవే ॥ అద ॥ 334

రామక్రియ

[1] పదియుఁ బదియుఁగాను పరమాత్ముఁ డితనికి
వెదకి చవులు దెచ్చి విందు లిట్టె సేయరే ॥ పల్లవి ॥

పొలసు పైఁబారెనట బురుద మేనంటెనట
యిల మన్ను మోఁచెనట యీదేవుఁడు
నెలవై నరాకాసినెత్తుటఁ దోఁగినాఁడట
కలపన్నీ రెల్లఁ బోసి కడుగరే దేహము ॥ పది ॥

బాఁపనజి డ్డంటెనట పట్టెనట ముమ్మరము
కై పగునల్లనికోక గట్టినాఁడట
చాపలానఁ జెంచుదానిసంగడిఁ దిరిగెనట
కోపులఁ గప్పురధూళి గుప్పరే యీతనికి ॥ పది ॥

కాంతలనే కూడెనట కడగడ దొక్కెనట
పొంతలఁ దట్టుపుణుఁగు పూయరేనేఁడు
యింతట శ్రీవేంకటేశునెద నలమేలుమంగఁ
గాంతునికి మెడఁగుచ్చి కట్టరే మొక్కు-దము ॥ పది ॥ 335

1. ఇది అధ్యాత్మకీర్తనలఛాయలోనిది. ఇందు దశావతార సమన్వయము గలదు.

ద్రావిళభైరవి

ఎట్టు వలపించితివి యేమీ నెఱఁగనినన్ను
పట్టరాదు ప్రాయమిది పైపై నున్నదిరా ॥ పల్లవి ॥

వినుకలివిరహమే వేడుకలై తోఁచెఁగాని
కనుఁగొంటేఁ దమకము కడుబెట్టురా
మనసునఁ దలఁచుటే మంచిదయి వుండీఁగాని
తనువు గాఁగిలించితే తతిగొనీ మఱపు ॥ ఎట్టు ॥

తెమ్మలై తొంటికూటమి దిష్టమై వుండీఁగాని
కమ్మి మీఁదటికోరిక గాసిఁబెట్టీరా
చిమ్ముచు నీకెదురుచూచినదే యింపాయఁగాని
కమ్మర నంటితే గోరు కడువాఁడిరా ॥ ఎట్టు ॥

మంచిదూతికలయెడ మాటలే చవాయఁగాని
కంచముపొత్తిచ్చితేనే కళదాఁకెరా
అంచల శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
యెంచి కూడితివి యిన్ని నియ్యకోలే యిఁకను ॥ ఎట్టు ॥ 336

రేకు 959 ముఖారి

అందుకేమి పదరాదా ఆనలేల సతివద్ద
కందువ మగవానికిఁ గలదేకాదా ॥ పల్లవి ॥

చెప్పకుండునా బుద్ధి చేరకుండా నెవ్వరిని
యెప్పుడూ నాకెవద్దికి నేఁగినవేళ
అప్పుడే యందుకు నిచ్చలాడక నీవుందువా
చప్పఁజేసి యవి నేను సాగనీఁగాక ॥ అందు ॥

చేయకుండునా ఆకె చెల్లినట్టెల్లా, నీవు
చేయారఁ గాఁగిటిలోనఁ జిక్కినవేళ
యీయకుండువా బాస యిందరి విడుతునని
పోయినట్టెల్లా నిన్నుఁ బోనీఁగాక ॥ అందు ॥

అనకుండునా తానె ఆకె దొడ్డదాననని
వినకుండువా నీవు వేళావేళ
అనుఁగు శ్రీవేంకటేశ అలమేలుమంగ నేను
తనియ నే నిన్నుఁ గూడి దక్కఁగొంటిఁగాక ॥ అందు ॥ 337

ముఖారి

వెలఁది నింక లేపవెఱతుము నేమైతే
చెలువుఁడవు నీవే విచ్చేయవయ్య లోనికి ॥ పల్లవి ॥

కాంత, నీవు రాఁగానే కన్నులుమూసుక యిట్టె
పంతమున నిద్దిరించీఁ బానుపుమీఁద
చెంతల నేము దగ్గరి చేముట్టి లేపితేను
వింతలుగా విదిలించివేసీఁ గోపానను ॥ వెలఁ ॥

అంద నీరాక చెప్పితే నప్పటి నీపచ్చడము
నిండా ముసుఁగువెట్టి నిద్దిరించీని
వుండలేక పాదమువట్టీఁచి పేరఁబిలిచితే
దిండుకట్టఁ జెప్పరానితిట్లు తిట్టీని ॥ వెలఁ ॥

సతి యలమేల్మంగ సారెకు గురుకవెట్టీ
తతి నీవు పైఁబడఁగాఁ దా నీలిగీని
కతగా శ్రీవేంకటేశ కాఁగిలించి కూడితివి
రతిలో మేల్కనెఁ దాను రవ్వాయ మాపనులు ॥ వెలఁ ॥ 338

పాడి

కొత్తసింగారాలు సేసెఁ గొమ్మ దనమేనిలోనె
చిత్తగించి రారాదా చెలిఁ జూతుగానీ ॥ పల్లవి ॥

కుప్పలుసేసె వలపు కుచములనె యిట్టె
చిప్పిలఁ గరఁగె మతి చెమటలను
కప్పుకొనెఁ జీకట్లు కడుజారిననెరుల
యిప్పుడే విచ్చేయరాదా యింతిఁ జూతుగానీ ॥ కొత్త ॥

నిండఁజేసెఁ దమకము నిట్టూర్పుగములను
పండఁజేసె పులకలపైరులు మేన
యెండించెఁ గాఁకలచేత యింపుమోవి, తీపువుట్ట
అండకు విచ్చేయరాదా ఆకెఁ జూతుగానీ ॥ కొత్త ॥

వెదచల్లెఁ జూపులనె వేవేలు ఆసలెల్లా
నిదురవోయీ నీపై నివ్వెరగుల
అదె శ్రీవేంకటేశ నీ వలమేలుమంగఁ గూడి—
తిదె దినము రారాదా యిఁకనైనాఁగానీ ॥ కొత్త ॥ 339

ఆహిరి

తనువిందుఁ దలఁపందు తమకము నడుమను
పెనగొనీఁ దాను పిలిపించఁడొకొ అతఁడు ॥ పల్లవి ॥

ఇంతక పతికడకు నేఁగునొకొ చెలియ
వంతుల నిందు మరలి వచ్చునొకొ
చింతదీర నామాట చెప్పెనొకొ ఆడను
ఇంతితో మారుమాటలు యేమనెనో అతఁడు ॥ తను ॥

రమ్మని పిలుచునొకో రమణి యాతనిని
నెమ్మది మనవాకిట నిలుచునొకో
తమ్మిరేకులేకలైనాఁ దలఁపించకుండునొకో
సమ్మతిఁ గరుణ నాపైఁ జల్లఁడొకో యతఁడు ॥ తను ॥

వీఁడె విచ్చేసెననఁగా విందునొకో నేను
వోఁడిమిఁగాఁగిట వానిఁ బొందుదునొకో
నేఁడె శ్రీవేంకటపతి నే నలమేల్మంగనని
వాఁడె వచ్చి నన్నుఁగూడె వద్దనున్నాఁ డతఁడు ॥ తను ॥ 340

వరాళి

ఇంతలోనె నీతో నే నేమందురా
వొంతనుండి నీవే నాకు బుద్ధిచెప్పఁగదరా ॥ పల్లవి ॥

చెక్కుమీఁదటఁ జేయి చిత్తములోపల నూయి
ఇక్కువమాటలు నీతో నే మందురా
చక్కనే నీనేరుపులు చల్లి నావూరుపులు
అక్కడిసుద్దు లేమైనా నానతియ్యరా ॥ ఇంత ॥

వంచినది నాశిరసు వలపూఁ గడుబిరుసు
ఇంచుకా మొగమోడక యేమందురా
మంచిదే నీలోనిగుట్టు మాకే ఇన్నిటా అట్టు
కంచపుఁబొత్తుకు నీవే కైకొలుపఁగదరా ॥ ఇంత ॥

ముందుఁ దొక్కితి ముంగిలి మోవిమీఁదనె యెంగిలి
యిందరిలోపల నిన్ను నేమందురా
అంది శ్రీవేంకటపతి వలమేలుమంగ నేను
యిందె కూడితివి నన్ను నిఁక నానతియ్యరా ॥ ఇంత ॥ 341

ఆహిరి

విచ్చేయుమనఁగదే విభునిఁ జెలికడకు
పచ్చిసిగ్గు నెన్నఁడుమ బట్టబయలాయను ॥ పల్లవి ॥

కోరికలు కొనసాగి కోమలికిఁ గొప్పగూడె
మేరతోఁ గళలె ముంచె మించుఁబాయము
పేరడై నవలపెల్లాఁ బెదవులఁ జిగిరించె
ఆరయ నంగన నేఁటి కాఁగిఁబెట్టినె ॥ విచ్చే ॥

సతితమకములెల్లా చనుఁగొండలై పెరిగె
రతికాంక్ష పిఱుఁదున రాసికెక్కెను
మతిలోనివిరహము మంచినిట్టూర్పుల రేఁగె
మతకమేఁటికిఁ జేసీ మానినితోఁ దాను ॥ విచ్చే ॥

కూడేటిసంతసములు కొనగోళ్ళై వాండ్లెక్కె
పాడితోఁ గోమలికము పాదాల నిండె
యీడ నలమేలుమంగ నెనసె శ్రీవేంకటేశుఁ-
డాడినట్టే సేసె నింతి నట్టె దినదినము ॥ విచ్చే ॥ 342

రేకు 960 బౌళిరామక్రియ

వాఁడే వాఁడే అల్లరివాఁ డదివో
నాఁడునాఁడు యమునానదిలోన ॥ పల్లవి ॥

కాంతలు వలయపుకంకణరవముల-
నంతంతఁ గోలాటమాడఁగను
చెంతల నడుమను శ్రీరమణుఁ డమరె
సంతతపుఁజుక్కలలో చంద్రునివలెను ॥ వాఁడే ॥

మగువలు ముఖపద్మములు దిరిగిరా—
నగపడి కోలాటమాడఁగను
నిగిడీ నడుమ నదె నీలవర్ణుఁడు
పగటుతోఁ గమలబంధునివలెను ॥ వాఁడే ॥

గోపిక లీరీతిఁ గోలాటమాడఁగ
యేపున శ్రీవేంకటేశ్వరుఁడు
వోపెలమేల్మంగ నురమున నిడుకొని
దీపించె మణులలో తేజమువలెను ॥ వాఁడే ॥ 343

శంకరాభరణం

మొగమూ నోడితిమి మొన్ననే కూడితిమి
సగముజాణతనాలు చల్ల నింతవలెనా ॥ పల్లవి ॥

కానుక లిచ్చితిమి కన్నుల మెచ్చితిమి
పోనీరాదా యిఁకనైనాఁ బోయినపొద్దు
నానె నాకు వలపూ నవ్వులాయఁ దలఁపూ
మానరాదా యిఁకనైనా మామీఁదిఆనలు ॥ మొగ ॥

చేతుల మొక్కితిమీ చేఁతకుఁ జిక్కితిమీ
తోతో ఇంకానేల తొల్లిటివావి
రాతి రన్నిఁ గంటిమీ రచ్చలనే వింటిమీ
కాతర మింతేనేల కమ్మటి మాతోను ॥ మొగ ॥

దగ్గరి కూచుంటిమీ తప్పులు లేవంటిమీ
సిగ్గులు నీకిఁకనేల చెల్లు నన్నియు
నిగ్గుల శ్రీవేంకటేశ నే నలమేలుమంగను
అగ్గమై కూడితి మింకా నసురుసురేలా ॥ మొగ ॥ 344

పాడి

అల్లవాఁడె భావించరె అంగన లిందరుఁ గూడి
వుల్లములో తనమాయ లుబ్బెనో శ్రీహరికి ॥ పల్లవి ॥

నేలా మిన్నుఁ గొలవఁగ నిక్కి మిన్నేటినురుగు
అలరి యీహరిమేన నంటుకొనెనో
పాలవెల్లి తచ్చఁబోఁగాఁ బైఁబడెనో తుంపురులు
మేలిమి కప్పురకాపు మెత్తిరో యీహరికి ॥ అల్ల ॥

చిత్తగించి రేపల్లెఁ జీఁకటితప్పు సేయఁగా
అత్తల చీఁకటినలు పంటుకొనెనేమో
వొత్తి కరిఁ గావఁబోఁగా నొలికెనో పైమదము
మొత్తమిఁ బుణుగుకాపు ముంచిరో శ్రీహరికి ॥ అల్ల ॥

అలమేలుమంగఁ దెచ్చి అఱుతఁ గట్టుకొనఁగా
పొలసి నవరసాలుఁ బొడచూపెనో
నెలవైనసొమ్ములెల్లా నిండుకొనె మేననెల్లా
అలరి శ్రీవేంకటాద్రి నందమైనహరికి ॥ అల్ల ॥ 345

లలిత

[1]అంగన లీరే యారతులు
అంగజగురునకు నారతులూ ॥ పల్లవి ॥

శ్రీదేవితోడుతఁ జెలఁగుచు నవ్వే-
ఆదిమపురుషుని కారతులూ
మేదినీరమణి మేలములాడేటి-
ఆదిత్యతేజున కారతులూ ॥ అంగ ॥

1. ఇది అధ్యాత్మకీర్తనల చాయలోనిది. 345 గూడ కొంచె మట్టిదే.

సురలకు నమృతము సొరిది నొసంగిన-
హరి కిదివో పసిఁడారతులూ
తరమిది దుష్టుల దనుజుల నడఁచిన-
అరిభయంకరున కారతులూ ॥ అంగ ॥

నిచ్చలుఁ గల్యాణనిధియై యేఁగేటి-
అచ్చుతునకు నివె యారతులూ
చొచ్చి శ్రీవేంకటేశుఁడు నలమేల్మంగ
యచ్చుగ నిలిచిరి యారతులూ ॥ అంగ ॥ 346

## సామంతం

ఎవ్వరు వద్ద నున్నారో యేమిసేసీనే
దవ్వుల నెదురురాక తా నేమిసేసీనే ॥ పల్లవి ॥

పచ్చనిచిగురువంటిపాదాల నడచివచ్చె-
నిచ్చకపుఁబతి లోన నేమిసేసీనే
నెచ్చెలిమే నింతలోన నిండాఁ గడుఁజెమరించె
యెచ్చటఁ బరాకైనాఁ డేమిసేసీనే ॥ ఎవ్వ ॥

మంచిమాణికాలుగాలేమాట లాడీఁ జెలి యీడ
ఇంచుకంతా నెఱఁగడు యేమిసేసీనే
మంచముపైఁ బవ్వళించె మగుళ యలసి వచ్చి
యెంచినయెన్నికలాయ నేమిసేసీనే ॥ ఎవ్వ ॥

కలువరేకులవంటి కన్నులఁ జూచె చెలి-
నెలమిఁ దాఁ దేరిచూచీ నేమిసేసీనే
బలిమి శ్రీవేంకటాద్రిపతి యింతి నిటు గూడె
యిలఁ దనభాగ్యమాయ నేమిసేసీనే ॥ ఎవ్వ ॥ 347

వరాళి

ఏమన్నా హితవేకాక యెగ్గు నాకేలే
కామించి తనుఁజూడఁగఁ గలిగితేఁజాలు ॥ పల్లవి ॥

తలఁపులో నున్నవాఁడు తలఁచే నే నెప్పుడైనా
యెలమిఁ దా నేడ నున్నా నేమాయనే
వలపు నాకే కద్దు వడి నేఁ దన్ను విడువ
చెలఁగి యేపనులైనాఁ జేయనీవే తాను ॥ ఏమ ॥

పెదవిపై నున్నవాఁడు పిలిచే నే నెప్పుడైనా
పొదలి యాకెయింటికిఁ బోయిరానీవే
పదరక నాకుఁబోదు పయికొనేఁగాని నేను
అదనాయ తనతోడిఅలుకేల నాకు ॥ ఏమ ॥

చేతికి లోనయినాఁడు చెనకే నే నెప్పుడైనా
రాతిరేమి పగలేమి రానియ్యరే
యీతల శ్రీవేంకటేశుఁ డింతలో విచ్చేసి కూడె
కాతరాన వెనకటికడమేల యిఁకను ॥ ఏమ ॥ 348

రేకు 961 వసంతం

వేడుక వసంతము వేళ నిదే
వాడలవాడలవెంట వనిత లాడేరు ॥ పల్లవి ॥

కేలుఁగేలుఁ జుట్టిపట్టి కెందామర మోములెత్తి
కోలఁగోలఁ దాఁకఁజేసి గుంపువాయక
చాలుకొని యిద్దరేసి జంటలై సతులు గూడి
వోలి వేరొకతెకోల నొద్దుతా నాడేరు ॥ వేదు ॥

పాలిండ్లు గదలఁగ బరువైనతురుముల
చీలుచు సోలుచుఁ గొంతవెనకకును
మేలిమిపిఱుఁదులతో మెరయిచు మురియుచు
కోలలఁ బెడమరలి కోలాటమాడేరు ॥ వేడు ॥

కది శొండురుమోములు కన్నులఁ దేలించి చూచి
పదతాళగతులకు పదఁతులెల్లా
అదివో శ్రీవేంకటేశుఁ దలమేలుమంగతోడ
ముదమంది చూడఁగాను ముందట నాడేడు ॥ వేడు ॥ 349

పాడి

అప్పటి మానవు వెంగే లదేమే నీవు
కుప్పలైనవలపుల గురిగాఁ జూచేవు ॥ పల్లవి ॥

వద్దే నాతో నింకా వట్టిసటజంకెనలు
గద్దించి తీసిన లోనుగాక మానేవా
కద్దే నావంకఁ దప్పు కప్రవిదె మిచ్చినది
వొద్దిక మదనమెత్తి వొకటొక టాడేవు ॥ అప్ప ॥

పోపో నాతోనేల పొద్దువోనియానలు
చూపుల నాయమంటితే చొక్కకుందేవా
కాపాడి గుబ్బలఁ గొంగుగప్పినది నేరమీ(మా?)
తీపులపెదవి వంచి తిట్టేవు లోలోనే ॥ అప్ప ॥

రావే నాయెడనేలే రతిలో సీగుట్లు
మోవి నిన్నుఁ జెనకితే మొక్కకుందేవా
యీవేళనే శ్రీవేంకటేశుఁడ నేఁ గలసితి
తోవ నలమేల్మంగవు తొక్కేవు పాదములు ॥ అప్ప ॥ 350

సామంతం

గొల్లెతల నింతసేసీ గోవిందుఁడు
కొల్లకాఁడు రేపల్లెగోవిందుఁడు ॥ పల్లవి ॥

పలుకుల భ్రమయించె భావములఁ గరఁగించె
కొలనికరత నవ్వె గోవిందుఁడు
యెలయించి యప్పటి మాయింటిలోనే పవ్వళించె
కొలఁదిమీరినవాఁడు గోవిందుఁడు ॥ గొల్లె ॥

పూరక పువ్వుల వేసె నొకటొకటే సేసె
కూరిమిఁ దప్పకచూచె గోవిందుఁడు
చేరి మావారుండ వారు చెప్పరాదు తనదూరు
కోరి యశోద నీబిడ్డ గోవిందుఁడు ॥ గొల్లె ॥

సమ్మతించఁ జేయివేసె చన్నులతోనే రాసె
కుమ్మరించె వలపులు గోవిందుఁడు
దొమ్మిసేసి మమ్ముఁగూడె దొరవలె నదె వాఁడె
కొమ్మరో శ్రీవేంకటాద్రి గోవిందుఁడు ॥ గొల్లె ॥ 351

లలిత

నిజము చెప్పఁబోతే నెలఁతలు నవ్వేరు
భజన నెందరికని బాస లిచ్చేవయ్యా ॥ పల్లవి ॥

చెప్పరాదు చెలులు పదారువేలు
నెప్పున నీవాడుకొంటే నిజమందురా
పిప్పిగట్ట నాసలేల పెదవు లెండీఁ జాలు
కప్పుర మిచ్చేఁగానీ కాఁగిలించవయ్యా ॥ నిజ ॥

నమ్మిరి గొల్లెతలు నీనయగారితనములు
కమ్మరాఁ జేయఁగఁబోతేఁ గై కొందురా
చిమ్మ చెక్కునొక్కనేల చేతులు నొచ్చీఁ జాలు
వుమ్మడిఁ గుచాల నొత్తే నొద్దికి రావయ్యా ॥ నిజ ॥

కంటిమి నీనేరుపులు కాఁగిటిలోనే నేఁడు
అంటి కూడితే భ్రమయక వుందురా
వొంటినే శ్రీవేంకటేశ వొడఁబరచి పొందితి-
వింటిలోఁ బానుపు మీఁది కిఁక రావయ్యా ॥ నిజ ॥ 352

సామంతం

అతఁడు నాకుఁగలఁడనేదే చాలు
చతురుని దూరకురే సారెసారె నిఁకను ॥ పల్లవి ॥

మలసి వేరొకతెకు మనసిచ్చునా అతఁడు
అలరి మాఁటలాడితే నాడుఁగాక
తలఁపు నామీఁద నుండు తను వెక్కడ నుండినా
వలసినప్పుడు తానే వచ్చి నాకడకు ॥ అతఁ ॥

అటువలెఁ బరసతి కాసపడునా అతఁడు
సటనల నవ్వితేను నవ్వీఁగాక
యెపైనా నేనే యతఁడు యెవ్వ రేమిచెప్పినాను
తటుకనఁ దనమాఁట తప్పనివాఁ డతఁడు ॥ అతఁ ॥

పక్కన నెవ్వరికైనా భ్రమసునా నేఁ డతఁడు
చొక్కుఁగన్నులఁ జూచితేఁ జూచుఁగాక
యిక్కడ శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
దక్కె నామతికే మతి తారుకాణ అతఁడు ॥ అతఁ ॥ 353

రామక్రియ

సిగ్గున మునిఁగెను చింతలఁ బొరలెను
యెగ్గులెంతురా యిఁకనేలే ॥పల్లవి॥

శిరసును వంచెను సెలవుల నవ్వెను
మరిగెనుఁ బతి నీమాఁటలకే
నిరతితో నలసెను నిట్టూర్పులు నించెను
యెరపరికములఁ జల మిఁకనేలే ॥సిగ్గు॥

నిన్నిటు చూచెను నేలలు వ్రాసెను
సన్నల నీలో సణఁగులకే
యిన్నిటి కొడఁబడె నిటు చేయివేసెను
యెన్నిక కొసరులు యిఁకనేలే ॥సిగ్గు॥

పంతము నించెను పానుపు చేరెను
కొంత గొంత నీకూటమికే
యింతట శ్రీవేంకటేశ్వరుఁ గలసితి-
వెంతని మెచ్చే విఁకనేలే ॥సిగ్గు॥ 354

రేకు 962 సాళంగం

మెఱుఁగువంటిది యలమేలుమంగ
అఱిముఱి నవ్వీని అలమేలుమంగ ॥పల్లవి॥

పలచనియెఱఁగునఁ బాకీ నీమీఁదిపాట
మెలుపుఁగూరిమి నలమేలుమంగ
చెలులతో నీసుద్ది చెప్పిచెప్పి కరఁగీని
అలయుచు సొలయుచు నలమేలుమంగ ॥మెఱుఁ॥

యీడుగా నీరాకకు నెదురెదురు చూచీ
మేడమీఁద నుండి యలమేలుమంగ
వాడుమోముతో నీపై వలపు చల్లిచల్లి
ఆడీ నాట్యము సారె నలమేలుమంగ ॥ మెఱుఁ ॥

పేరుకొని పిలిచీని ప్రియములు చెప్పిచెప్పి
మేరమీర విన్ను నలమేలుమంగ
యీరీతి శ్రీవేంకటేశ నిన్నుఁ గూడె నేఁడు
ఆరితేరె నన్నిటాను అలమేలుమంగ ॥ మెఱుఁ ॥ 355

సామంతం

మూసి మంతనాలతోడి మోహమేలే
వేసరించనేలే మరి వేఁడుకొననేలే ॥ పల్లవి ॥

పిలిచినప్పుడు రాక బిగిసి వెనక నాతో
అలరి యెంతనన్వినా నదియేలే
వలపుకాఁకలచేత వాదఁజేయనేలే మరి
చలువగాఁ బన్నీరు చల్లనేలే ॥ మూసి ॥

యింటికి వచ్చినపని యియ్యకోక మరి నా–
వెంటవెంటఁ దిరిగేటివేసాలేలే
తుంటతనమున నన్ను దూరనాడనేలే మరి
గెంటి యంతలోనే తాను కిందుపడనేలే ॥ మూసి ॥

చెక్కునొక్కి యప్పుడే చిడుముడిపడి మరి
అక్కరతోఁ గాఁగిలించే దదియేలే
తెక్కుల శ్రీవేంకటాద్రిదేవుఁ డిట్టె నన్నుఁగూడె
చక్కటిసిగ్గులవేలే చవిదాయనేలే ॥ మూసి ॥ 356

నాగవరాళి

తలపోసి తలపోసి తనువెల్లాఁ గాఁకరేఁగె
వలపు దరించరాదు వాములాయ నిపుడు ॥ పల్లవి ॥

యిట్టె విచ్చేయఁడాకా యింతలో మరచెనాకా
అట్టె పతి నఁనై(ననై్ఞ?)నా రమ్మనఁడాకా
గుట్టున నుందురునాకా కొమ్మల నంపుదునాకా
యెట్టు వేగించవచ్చు నింతవొద్దువోయను ॥ తల ॥

యింటిలో నున్నాఁడాకా యెఱఁగలేనైతినాకా
నంటునఁ దా నింతసేసె నవ్వులకాకా
అంటి చెలిచేతఁ గానుకైనా నంపుదునాకా
వొంటి నెట్టు దరియించే నోయమ్మ నేను ॥ తల ॥

మోము చూచి నవ్వఁడాకా మొగి సన్నసేయఁడాకా
కామించి తానే కాఁగిటఁ గలయఁడాకా
యేమరించి శ్రీవేంకటేశుఁడు నన్నుఁ గలసె
నామన సొకటే యాయ నమ్మితిఁబో ఇపుడు ॥ తల ॥ 357

సామంతం

కంటిఁ గంటి నీగుట్టు కానీలేరా
కంటగించీ నీగుణాలు కానీలేరా ॥ పల్లవి ॥

అదరి నావద్ద నుండి యట్టె వుస్సురనేవు
కడ నేమిదలఁచితో కానీలేరా
అడియాలపుమచ్చము లంగమునఁ జూచితేను
కదుఁదేలించి చూచేవు కానీలేరా ॥ కంటిఁ ॥

నెమ్మి నన్ను వలపించేనెలఁతపే రడిగితే
కమ్మర నాతో నవ్వేవు కానీలేరా
రమ్మని యాకెయింటికి రతి నానవెట్టితేను
కమ్మి నానోరు మూసేవు కానీలేరా ॥ కంటిఁ ॥

వక్కణించి నీమోవి వాడుదేరీ నేలంటే
గక్కనఁ గాఁగిలించేవు కానీలేరా
యెక్కువ శ్రీవేంకటేశ యిట్టె నన్నుఁ గూడితివి
కక్కసించనోప నీకుఁ గానీలేరా ॥ కంటిఁ ॥ 358

## వసంతం

వచ్చేవో రావో నీవు వాదు లేఁటికే
పచ్చిదేరె వలపులు పగటేలే ఇఁకను ॥ పల్లవి ॥

నగవు వెన్నెలగాసె నంటుసఁ జన్నులు రాసె
యెగసక్కెములు నాతో నీఁకనేఁటికే
గుగురుగాఁ బులకించె కొప్పువిరు లటు చిందె
సొగిసి బిగియ నీకుఁ జోటేదే యిఁకను ॥ వచ్చే ॥

మాటలఁ దేనెలు చిందె మనసులో నిండె
యీటువెట్టి గుట్టుసేయ నీఁకనేఁటికే
వూటురేఁగెఁ జెమటలు వుసురసురులు రేఁగె
బూటకపుఁజల మింతే బొంకనేలే యిఁకను ॥ వచ్చే ॥

ఆయములు సరివచ్చె నాసలెల్లా గడుహెచ్చె
యేయెడఁ జూచినఁ బంతా లీఁకనేఁటికే
యీయెడ నే శ్రీవేంకటేశుఁడఁ గూడితి నిన్ను
మాయదారితనముల మఱఁగేలే ఇఁకను ॥ వచ్చే ॥ 359

పాడి

మఱి తనుఁబాసినమముబోఁటికిఁగా—
కెఱఁగెఱఁ గివి తను నెలయించీనా ॥ పల్లవి ॥

చిత్తజుగురుఁడట జిగిఁ బూబాణపు—
కత్తులు తను మరి కాఁడీనా
పొత్తులచంద్రుఁడు భువిఁ దనమఱఁదెట
వత్తిగఁ దనపై వడ చల్లీనా ॥ మఱి ॥

వంచినకోవిల వాకట్టువాఁడట
ముంచి కోవిలలు మొఱసీనా
పెంచి గాలిదినుపెనుఁబాము పరపట
పంచలఁ దను నవి భ్రమయించీనా ॥ మఱి ॥

మతిఁ దా వసంతమాధవుఁడట మరి
తతి నామని తనుఁ దడవీనా
యితవుగ శ్రీ వేంకటేశుఁడు తాఁ గూడె
రతి నిద్దరికిని రారాఁపయ్యీనా ॥ మఱి ॥ 360

రేకు 963 వరాళి

ఇదివో నీ మహిమ నేనేమని పొగడుదును
కదిసి నీవుండఁగాను కపటాలూఁ బాసె ॥ పల్లవి ॥

వేడుకతో నీనవ్వు వెన్నెలలుగాయఁగాను
యీడనే చిత్తముచీఁకటంతాఁ బాసె
నీడవలె రమణుఁడ నీవు వెంట రాఁగాను
యేడలేనిమేనికాఁకయెండలెల్లాఁ బాసె ॥ ఇది ॥

కలసి నీపలుకుల కప్పురాలు చల్లఁగాను
తలపోఁత విరహపుదప్పులు వాసె
చలువై నీకరుణారసపువాన గురియఁగా
కలిగిననామనసుకఱవెల్లాఁ బాసె ॥ ఇది ॥

కరకమలము నీవు కమ్మరఁ బై వేయఁగాను
మరునిబాణాలపగ మాలోఁ బాసె
ఇరవై శ్రీవేంకటేశ ఇద్దరముఁ గూడఁగాను
శిరసులువంచినట్టిసిగ్గులెల్లాఁ బాసె ॥ ఇది ॥ 361

## బౌళి

ఏల నన్ను రమ్మనీనే ఇంతే చాలు
యేలినాఁడు తొల్లె నన్ను నింతే చాలు ॥ పల్లవి ॥

కూడి తనచేఁతలకుఁ గోపగింతునో యేమో
యీడనుండి మొక్కితి నాకింతేచాలు
వోడక సారెకు రాఁగా నొగరానో తీపానో
యేడకేడ [1] తననా కింతేచాలు ॥ ఏల ॥

కామిను లెందరు లేరు కాఁకలు చల్లఁ దనకు
యేమిగారణము నే మింతేచాలు
నేమము దప్పకుమంటే నేరుపానో నేరమానో
యీమాటు వోయిరావే యింతేచాలు ॥ ఏల ॥

బెట్టి నవ్వ నీరుదియ్యఁ బేనువచ్చు నిఁకనేల
యెట్టైనా వచ్చేఁ దా నీడ కింతే చాలు
పట్టుక శ్రీవేంకటేశుఁ డౌనగూడె నిప్పు డిట్టె
యెట్టుసేసినాఁ జెల్లె నింతేచాలు ॥ ఏల ॥ 362

1. తనకు — నాకు

కాంబోది

ఇందరముఁ గంటిమి నీ విదిగానవా
వొందిలి పానుపుమీఁద నున్నది గానవా ॥పల్లవి॥

బంగారుపావాలు మెట్టి పడఁతి యెవ్వతోకాని
ముంగిటఁ బొలసె నీ విమ్ములఁ గానవా
పొంగేటిజవ్వనముతో పొదరిల్లు దూరి నీతో-
నంగవించి సన్న సేసె నదిగానవా ॥ఇంద॥

వల్లెవాటుఁబయ్యదతో వనితలపై నొరగి
యిల్లిదె యేకతమాడీ నిది గానవా
కొల్లలుగా నాడనాడ కొప్పుపూవు లటు జార
చెల్లఁబో కులికినవ్వేచేఁతఁ గానవా ॥ఇంద॥

జవ్వాదివాసనలతో సతి నీవెనక నదె
యెవ్వరంటా నున్నవాఁడ విది గానవా
రవ్వగా శ్రీవేంకటేశ రమణిఁ గూడితి విదె
యివ్వలనే బొంకేవు యిప్పుడైనాఁ గానవా ॥ఇంద॥ 363

రామక్రియ

నిచ్చనిచ్చ వాదులేల నీచిత్తము
యెచ్చుకుందు లాడనేల యింకా నీచిత్తము ॥పల్లవి॥

మిక్కిలిదొరవు నీతో మేలమాడ వెఱతుము
నిక్కి నీవేమిసేసినా నీచిత్తము
యెక్కువతక్కువ నీతో నేమంటే నేమవునో
మొక్కితిమి నీకు నేము ముందర నీచిత్తము ॥నిచ్చ॥

కమ్మరఁ గమ్మర నీపైఁ గల్లమోప నోపము
    నిమ్మపండు గానుకిదే నీచిత్తము
సమ్మతిగా నీవలపు చల్లఁబోతే చవిగాదు
    వుమ్మడి నుండే మింక నున్నది నీచిత్తము ॥ నిచ్చ ॥

చేవదేర నీయెడకు సిగ్గువడ నిఁకనేల
    నీవే నేనైతి నిఁక నీచిత్తము
శ్రీవేంకటేశ నన్నుఁ జేకొని కూడితి విట్టె
    కైవశమైతి మిఁకఁ గలది నీచిత్తము ॥ నిచ్చ ॥ 364

సాళంగం

ఆతనిపై నలిగేనా ఆతఁడు నాకలిగీనా
    కాతరాన మీరేల కక్కసపెట్టేరే ॥ పల్లవి ॥

మాటలలోనా నతఁడే మనసులోనా నతఁడే
    యేఁటికి విభుని దూరే రింకా మీరు
కూటమికిఁ దాఁ జిత్తముకొలఁదినే వచ్చీఁగాక
    పాటించి యింతేసి యేల బలిమిసేసేరే ॥ ఆత ॥

కలలో విచ్చేసినాఁడు కరఁగించి కూడినాఁడు
    యెలయించేల పిలిచే రింకా మీరు
తలఁపుఁదలఁపు నొక్కటారుకాణ లిద్దరికి
    చెలఁ గెప్పుడు వచ్చినాఁ జింతించనేఁటికే ॥ ఆత ॥

మెట్టిననే లొక్కటే మీఁదఁ బారేగా లొక్కటే
    యెట్టివారు గలిగితిరే యింకా మీరు
యిట్టె శ్రీవేంకటేశుఁ డిచ్చగించి నన్నుఁ గూడె
    గట్టిగా నితనిమతి కంటిరటే యిఁకను ॥ ఆత ॥ 365

కన్నడగౌళ

ఇటువంటిదాన నా కేఁటియలుకే
కటకట తా రాఁగాఁ గాదనేనా నేను ॥ పల్లవి ॥

మాటలాడకుండుఁగాని, మనసులోపలనైతే
నాటినది తనమీఁద నాచిత్తము
కాటుకకన్నులఁ జూచి కసరుదుఁగాని నేను
వాఁటపువలపు మీఁద వంతుఁబో లోలోనే ॥ ఇటు ॥

దగ్గరి రాకుండుఁగాని, తా నన్ను నంటినప్పుడే
వెగ్గళించి సిగ్గులెల్లా వీడఁగలవే
యెగ్గువట్టివుండుఁగాని, యేపాటి నవ్వించినాను
అగ్గలపుసరసము లాఁగుదుఁబో నేను ॥ ఇటు ॥

నివ్వెర గందితిఁ గాని, నేఁడు నన్నుఁ గూడఁగాను
పవ్వళించినప్పుడేపో పరవశము
యివ్వల శ్రీవేంకటేశుఁ డేకతమాయ నాతోను
జవ్వనభారముచేత జడిసీఁబో తనువు ॥ ఇటు ॥ 366

రేకు 964 ఆహిరి

విరహంబు వేఁడాయ విరులమొన వాఁడాయ
తరవాతిపనుల కిటు తడవేల ఇఁకను ॥ పల్లవి ॥

పిలువరే నాయకునిఁ బ్రేమంపుచెలిమీఁద —
నలఁదరే శ్రీగంధ మందాఁకాను
నిలువరే కొంతవడి నిండురొద లిటు మాని
కలికిమై చెమరించెఁ గంద మిఁకఁ బనులు ॥ విర ॥

చెరుగరే తురుములోఁ జెదరిజారిననెరులు
కరఁగెనే చెలినుదుటికస్తూరిబొట్టు
మరుపరే కప్పురము మగువదప్పులు దీర
నెరపుదము నేరుపులు నిమిషంబుమీఁద ॥ విర ॥

అంపరే యెదురుగా నతనికిఁ గానుకలు
చెంపలనుఁ బన్నీరు చిలుకఁగదరే
యింపులను శ్రీవేంకటేశుఁ డిదె వచ్చి సతి
సొంపులనుఁ గూడె నిఁక సొలయ నేమిటికే ॥ విర ॥ 367

నాట

ఈఁతకు మిక్కిలిలోఁతా ఇంకా నేలే
చేఁతలెల్లాఁ జెల్లె నీకు చిరునవ్వుగాదా ॥పల్లవి॥

కాయ మతనిపై వేసి ఘనకుచముల రాసి
మాయలు సేతువుగాక మాతో నేలే
చాయలనే యెకపోసి సన్నల నింత సేసి
యేమెడకుఁ బోనీవు ఇంతకంటె నేమే ॥ ఈఁత ॥

మాటలనే కరఁగించి మంతనాలు మరిగించి
నాటక మక్కడఁ జేసి నాతో నీకేలే
కాటుకకన్నులఁ జూచి కాఁకలఁ జేతులు చాఁచి
వాఁటమై వుండుదుగాక వాదు లీడనేలే ॥ ఈఁత ॥

కాఁగిట నాతనిఁ గుచ్చి కమ్మి మాయింటికిఁ దెచ్చి
ఆఁగితి నాకాఁగిటిలో నాయనాయనే
పేఁగక శ్రీవేంకటాద్రివిభుఁ డిట్టె నన్నుఁ గూడె
పాఁగి యింతలోనే నన్నుఁ బంగించనేలే ॥ ఈఁత ॥ 368

తెలుఁగుఁ గాంబోది

చాలు నింతకోపాలు చలమని
పాలించఁ దనకేమి పంతమని ॥పల్లవి॥

అంటిరా మీరు ఆమాఁట పతితో
యింటికి విచ్చేయుఁ డిప్పుడని
నంటునా(న?) తాను నాఁటఁగఁ జూచిన(ఁ)
గంటివేదనలు ఘనమని ॥చాలు॥

అంపెనా మిమ్ము నాతఁడు నావద్ది-
కింపుల నామోహ మెక్కెనని
ముంపునఁ జేసినమొన్నటిచేఁతలు
మంపున నెన్నఁడు మఱవనని ॥చాలు॥

వచ్చెనా తాను వాకిటి కిప్పుడె
యిచ్చల నేఁపఁగ నేఁటికని
యిచ్చట శ్రీవేంకటేశుఁడు గూడెను
నిచ్చలుఁ దానే నేనని ॥చాలు॥ 369

వరాళి

చిత్తజునిమోహపుశృంగారవనమో యీకె
వొత్తుల వసంతమాడే పురుషునితోడను ॥పల్లవి॥

పాయము మోసులువారెఁ బడఁతికుచములను
చాయవలపు కన్నుల జాజుకొనెను
చేయివాలెఁ గోరికలు చిగురులకొనగోళ్ళ
యీయెడ విభునివద్ద నింతిఁ జూడరమ్మా ॥చిత్త॥

కొప్పునఁ గొనలుసాగెఁ గోమలితమకములో
కప్పురపుమాటలను గర్వము వూచె
పుప్పొడి రాలె నెలవిఁ బొలఁతికి సిగ్గులనె
చెప్పరాదు పానుపుపై చెలియభావములు ॥ చిత్త ॥

భావరతి పంటవండె భామినిబింబపుమోవి
కైవశమై రాసికెక్కెఁ గళలెల్లాను
యీవేళ శ్రీవేంకటేశుఁ డింతియుఁ గూడఁగాను
దేవిదేవరవలె దిష్టమాయ నిదివో ॥ చిత్త ॥ 370

శంకరాభరణం

పోవలె మాయింటికి పొద్దున మాకు
ఆవటించివొక్కసారె అడుగరే మాట ॥ పల్లవి ॥

పిలిపించెనేఁటికి ప్రియము చెప్పఁగనేర
చెలువుఁడు నన్నునేమి సేయుమనీనే
చలమొక్కటేకాని సాదించ నేనేర
అలరి యింకా నేమి అడుగరే మాట ॥ పోవ ॥

తానె వచ్చెనేఁటికి తలపోఁత నే నెఱఁగ
పూనిపట్టి నాకు నేమి బుద్ధిచెప్పీనే
మోన మొక్కటేకాని మొఱఁగులు నేనేర
అనవెట్టి మీరైనా అడుగరే మాఁట ॥ పోవ ॥

కాఁగిలించీనేఁటికే కాఁకసేయ నేనేర
యేఁగివచ్చి నామన సేమిచూచీనే
రాఁగయై శ్రీవేంకటాద్రిరాయఁ డిట్టె నన్నుఁ గూడె
ఆఁగినతనగుట్టేమో అడుగరేమాట ॥ పోవ ॥ 371

మంగళకౌశిక

వలసినట్టాడవయ్య వన్నెలెల్లాఁ జూపవయ్య
నిలువెల్లా మెఱుఁగులే నీకు మొక్కఁజాలదు ॥ పల్లవి ॥

మగువ మాటాడఁబోతే మాణికేలు రాలీని
జగడాలు నీతోను సారె నోపదు
మొగమెత్తి చూడఁబోతే మొల్లలే మిక్కుటమయ్యీ
నగవు లంతేసి నీతో నవ్వఁగనోపదు ॥ వల ॥

అంగన నడవఁగానే అందెలెల్లా మొరసీని
వెంగలినీవినయాలు వినఁగూడదు
కుంగక కాఁగిటిలోన కుచములే పెరిగీని
చెంగటఁ జేయివట్టినాఁ జెలియ మొగియదు ॥ వల ॥

పొలఁతి నిన్నొరసితే పులకలు రాసివడీ
వొలిసియు నిందుకేపో వూరకున్నది
అలరి శ్రీవేంకటేశ అంగన నీవు గూడఁగా
నిలిచినపరవశాన నివ్వెరగుఁ బొందెను ॥ వల ॥ 372

రేకు 965 సాళంగం

చెప్పితే నిష్ఠూరము చెలియ నీవారము
[1] రెప్పలనీలోనిచూపే రేసుదెచ్చుఁ జుమ్మీ ॥ పల్లవి ॥

కామించి యతఁడు గారవించి పిలువఁగ
యేమన్నాఁ బలుకవు యేలే ఇంత
దీమస మెంత నీకుఁ దీర దెంతైనాఁ బరాకు
వాములై నవలపులు వడ్డివారుఁజుమ్మీ ॥ చెప్పి ॥

---

1. 'నీ రెప్పలలోనిచూపు' అనుట సహజము.

అదన నీయింటికి నాతఁడే రాఁగా నీ—
పెదురయి మొక్కవు యేలే ఇంత
పెదవు లెత్తవు నీవు ప్రేమైనాఁ గైకోవు
కదలుఁగుచాలు నీకే కడువాండౌఁ జుమ్మీ ॥ చెప్పి ॥

చెంత నిట్టె కూడెను శ్రీవేంకటేశుఁడు
యింతలో మేమఱచేవు యేలే యింత
చింతలెల్లాఁ దీరెను సేసకొప్పు జారెను
పంతములాడఁగఁబోతే పైవచ్చుఁజుమ్మీ ॥ చెప్పి ॥ 373

## అహిరి

నీకే తెలుసు నిఁక నే మేమీ నెఱఁగము
ఆకెకు నీకే తగును అదివో విన్నపము ॥ పల్లవి ॥

యెక్కడి పరాకో యెంత నేము విలిచిన
చెక్కుమీఁదిచేయికాని చిత్తగించదు
నిక్కి నీవు చూచితివి నిన్న మాపటంతనే
అక్కట నేఁ డిట్లాయ నదివో విన్నపము ॥ నీకే ॥

మందో మంత్రమోకాని మరి బుద్ధిచెప్పినాను
చందము తనదేకాని చాయకు రాదు
అంది విడె మిచ్చితివి అల్లపు డింతికి నీవే
అందువంక నిట్లాయ నదివో విన్నపము ॥ నీకే ॥

యెంతసంతోసమోకాని యెదిరిఁ దన్నెరఁగదు
కాంతలు కాను కిచ్చినాఁ గైకొనదు
వింతగా శ్రీవేంకటేశ వెలఁదిఁ గూడితి విట్టె
అంతలోనే చొక్కఁబోలు నదివో విన్నపము ॥ నీకే ॥ 374

మాళవి

అల్లదె జవ్వని హరియురమున నదె
మెల్లనె యిటు వుపమించరే మీరు ॥ పల్లవి ॥

ముత్తెపుజిప్పలో ముంచినకలువలో
వొత్తిలి కనుఁగవ లొకమాటాడరే
గుత్తపుఁగుండలో కొండలో కుచములో
హత్తి యేర్పడఁగ ననరే మీరు ॥ అల్ల ॥

తామెరతూండ్లో తతియగు తీగెలో
భామచేతు లేర్పరచరే యిపుడు
దోమటిసింహమో తొడఁగినబయలో
ఆమాటాడరే అందులో నొకటి ॥ అల్ల ॥

నీలపుమణిలో నిండినమేఘమో
బాలకితురు మొకపలుకునఁ జెప్పరే
యీలీల శ్రీవేంకటేశ్వరుఁ గూడెను
మేలిమిమెఱుఁగో మెలుఁతో యనరే ॥ అల్ల ॥ 375

సామంతం

ఎడసితే నొకగుణ మెదుట నొకగుణము
అడియాలాలెల్లఁ గంటి మౌలేరా మాఁటలు ॥ పల్లవి ॥

నిచ్చలు వద్దనుండేటినెలఁతలపొందుకంటే
వచ్చీరానివనితలవలపు చవి
పెచ్చుపెరిగే వౌలేరా పెళ్ళిచెట్టు మందుగాదు
యిచ్చకము సేయవచ్చే విఁకనేల మాటలు ॥ ఎడ ॥

భావించి నాలుకమీఁదిపంచదారకంటెను
ఆవలిచేఁదే తరితీపై యుండును
కావించి యరచేతిమాణికమైనా సరకు గాదు
యీవేళఁ గొసరేదా యిఁకనేల మాటలు ॥ ఎద ॥

కాఁగిటఁ గూడినయట్టికమ్మనిరతులకంటె
మూఁగినభావరతులమోహము బెట్టు
యేఁగివచ్చి శ్రీ వేంకటేశ నన్నుఁ గూడితివి
మాఁగినపండు చవౌను మరియేల మాఁటలు ॥ ఎద ॥ 376

దేవగాంధారి

తెలిసినపనులకుఁ దెగ నిన్ను
సొలపుఁ జూపులనె చూచితి నిన్ను ॥ పల్లవి ॥

నామతిలో నున్నవి నీవాడఁగ
యేమని కొసరే నిఁక నిన్ను
మోము చూచితే మొగి నిటు నవ్వఁగ
కామించి యలుగఁగఁ గలనా నిన్ను ॥ తెలి ॥

పిలువకతొల్లే ప్రియమున రాఁగా
వలెనా రమ్మన వడి నిన్ను
పలికినంతనే పంతము లియ్యఁగ
చలములు సాదించఁ జాలము నిన్ను ॥ తెలి ॥

అంటకతొల్లే అంగము గరఁగఁగ
కంటకమేల యిక్కడ నిన్ను
యింటనె శ్రీ వేంకటేశ కూడితివి
వెంటవెంట నిఁక విడువను నిన్ను ॥ తెలి ॥ 377

సాళంగనాట

నిన్ను దూరఁబనిలేదు నీవు మేలే సేసితివి
కన్నెకుఁ గాఁకలు మించెఁ గర్మఫల మిట్టిది ॥ పల్లవి ॥

కాంతపైఁ జల్లనిచూపు కడు నీవు చల్లఁగాను
యింతికిఁ జింతలత లిగిరించెను
కొంత నీకృపారసము కొలఁగులై ముంచఁగాను
వింతగాఁ గలువ లట్టె వికసించెను ॥ నిన్ను ॥

నెలఁతకుఁ బలుకుఁదేనెలు నీవు చిందఁగాను
అలులు చిందరవందరై మూఁగెను
కలికిపై నీవూర్పుగాలి నేఁడు విసరఁగ
బలిమి జక్కవలకు పంజరము లూడెను ॥ నిన్ను ॥

పైపైఁ జెమటయేరు పడఁతిపైఁ బరపఁగ
మోపులై ముత్తెపుసరులు మొలకలొత్తె
యేపున శ్రీవేంకటేశ యీసతి నీవు గూడఁగ
నీపొందుల భ్రమసి నివ్వెరగై నిలిచె ॥ నిన్ను ॥ 378

రేకు 966 సామంతం

చాలుఁజాలు నున్నవెల్లాఁ జాలదా యిది
జాలెలా నింకనే పాసెఁ జాలదా యిది ॥ పల్లవి ॥

గొరబుగా నవ్వితేను కోపగించుకొనక
సరిగా నీవు నవ్వితి చాలదా ఇది
తరవై కొంగువట్టితేఁ దప్పించుకొనక
సరవి నూరకుండితి చాలదా ఇది ॥ చాలుఁ ॥

కన్నుల నేఁ బిలిచితే కమ్మర జంకించక
సన్నలకే వచ్చితివి చాలదా ఇది
నిన్నుఁ దప్పకచూచితే నిలిచి వామకు రాక
జన్నెవలపు చల్లితి చాలదా ఇది ॥ చాలుఁ ॥

తమితో నిన్నుఁ గూడఁగా దప్పలనుఁ బొరలక
సమరతిఁ జొక్కితివి చాలదా ఇది
అమర శ్రీవేంకటేశ అనుమాన మెంచక
జమళిఁ గూచుంటి విట్టె చాలదా యిది ॥ చాలుఁ ॥ 379

లలిత

ఇదె వచ్చె రమణుఁడు యెంచినయెన్నికలాయ
మదనమంత్రాలతోడ మాటాడవే ॥ పల్లవి ॥

చెక్కటఁబెట్టినచేయి చిత్తములోనికి నూయి
తక్కినసిగ్గులకెల్లా దండదాయి
చక్కనినీవదనము చందురునిసదనము
మక్కువతోఁ జిన్నఁబోక మాఁటాడవే ॥ ఇదె ॥

ఆరీతి పయ్యదకొంగు యౌవ్వనపాయపుకంగు
పోరచి కోరికలెల్లాఁ బొంగేటిపొంగు
సారపు నీకెమోవి చల్లగప్రపుదీవి వే-
మారు దడుపక ఇట్టె మాటాడవే ॥ ఇదె ॥

సగమువీడినకొప్పు సరసమాడేవొప్పు
పగటుభావరతులు పట్టిచ్చేచొప్పు
తగు శ్రీవేంకటపతి దగ్గరి నిన్నిటు గూడె
మగఁటిమెల్లా మెరసి మాఁటాడవే ॥ ఇదె ॥ 380

కేదారగౌళ

ఎట్టై(ట్ట?)యినా మేలే ఇన్నిటికిఁ దానె గురి
ముట్టినది నాకుఁ దనమోహ మొకటే ॥పల్లవి॥

కోపగించి చూచేవి కూరిమి పైఁజల్లేవి
కైపుగా నీతనిరెండుకన్నులే కదే
తీపు గడుఁ బూసేవి తెగి చేఁదు నెరపేవి
మాపుదాఁకా తనతోడిమాటలే కదే ॥ఎట్టై॥

అంగపుఁగాఁక రేఁచేవి ఆయములు గరఁచేవి
పొంగారి తాఁ జేసేపొందులే కదే
ముంగిటఁ గడు నవ్వించేవి మోము గడువంపించేవి
చెంగటఁ దాఁజేసినట్టిచేఁతలేకదే ॥ఎట్టై॥

మొక్కులు దా మొక్కేవి మొనగోరు మోపేవి
చిక్కనికాఁగిటి తనచేతులేకదే
యిక్కడ శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁ గూడె
దక్క మాకు నిద్దరికి తలపోఁతేకదే ॥ఎట్టై॥ 381

సాళంగం

కామునిబలములెల్ల కాంతమైఁ బొత్తుగలసె
కామినులాల మనకుఁ గతలాయను ॥పల్లవి॥

పున్నమచంద్రుఁడు యీపొలఁతినెమ్మోమైతే
కన్నులే కలువలై కదిసీ నందే
వున్నతంపుఁజిలుకలు వువిదపలుకులైతే
పన్నినకెమ్మోవి బింబఫలమాయను ॥కాము॥

నెలఁతనడపులివి నెమలిభావములైతే
మెలుపున నెరిఁదురుము మేఘమాయను
అలరి నునుఁదొడలె అరఁటికంబములైతే
చెలరేఁగి నెన్నడుము సింహమాయను ॥ కాము ॥

మగువకంఠము నేఁడు మదనునిశంఖమైతే
జగడించుఁజన్నులే చక్రవాకములాయ
తగు శ్రీవేంకటపతి ధరియించి కూడఁగాను
మిగుల నింతికి మేలుమీఁద మేలే ఆయను ॥ కాము ॥ 382

పాడి

నీరు వట్టుక నేయి వోయ నేరనే నేను
సారె నావలపునీరు చల్లుటింతేకాని ॥ పల్లవి ॥

ఇట్టె నాలుకలోన బెల్లాలు యెదలోనఁ గత్తులు
నెట్టుకొని నీవలె నేరనే నేను
వట్టిమాటలిగిరించ వంచితేఁ దేనెలుగార
గట్టిగా నాపెదవులఁ గలదింతేకాని ॥ నీరు ॥

కని యింటికాడ నిడి గానుగకాడా గసి (?)
నినుఁజూచి నేరుచుకొనేరనే నేను
మనసు గరఁగించేది మర్మము భేదించేది
కనుచూపులు నాయందుఁ గల దింతేకాని ॥ నీరు ॥

అమ్మేది వొకటి అసిమలో దొకటి
నెమ్మది నీయంతేసి నేరనే నేను
కమ్మి శ్రీవేంకటపతిఁ గలసితి వెలసితి
కమ్మరఁ గమ్మర నిదే కలదింతేకాని ॥ నీరు ॥ 383

సాళంగం

వాన గురియక తొల్లె వరదలేల
నానఁబెట్టి కొంతగొంత నంటునేయరాదా ॥పల్లవి॥

మనసులో నేమిగల్లా మాపటంతఁ జేతుగాక
చెనకి నవ్వు నవ్వితేఁ జెల్లదనేవా
అనువై పంతముగానేయప్పుడే కానేవుగాక
మనికిగా నందాఁకా మాటలాడరాదా ॥వాన॥

వేడుక నేమేనికాఁక వెనకఁ జెప్పేవుగాక
వీడె మందుకొన్నంతనే వెలితయ్యీనా
కూడినరతులవేళఁ గొసరే వింతేకాక
పాడితో మంచముమీఁదఁ బవ్వళించరాదా ॥వాన॥

తారుకాణించినప్పుడు తలవంచుకొందు గాని
చేరి నీవు కాఁగిలించితే దోసమా
మేరతో శ్రీవేంకటేశ మెచ్చి నన్నుఁ గూడితివి
కారణములేని సిగ్గు కట్టిపెట్టరాదా ॥వాన॥ 384

రేకు 967 సింధురామక్రియ

ఎచ్చుకుందు లాడకురే యేమీననకురే
కచ్చుపెట్టి యాతనికిఁ గడు నే వలతును ॥పల్లవి॥

చేసినంతఁ జేయనీరే చెప్పకురే యాసుద్ది
ఆసయి చ్చాతఁ దొకమా టాడితేఁ జాలు
వాసికిఁ బెనఁగఁబోతే వడిఁబడుఁ జేసునిఁక
నాసరివారెల్లాఁ జూడ నవ్వినంతే చాలును ॥ఎచ్చు॥

కూడినట్టె కూడనీరే కోపించకురే యాతని-
సీడ కాతఁడు విచ్చేసేయెమ్మెలే చాలు
పాడిపంతా లాడఁబోతే పదను దప్పునో యేమో
మేడెపు సరసవేళ మెచ్చినంతే చాలును ॥ ఎచ్చు ॥

వుండినట్టె వుండనీరే వారయకురే యాతని-
నండఁ దా నిక్కిచూచిన నదియే చాలు
పండా శ్రీవేంకటాద్రి నిలయుఁడు నన్నుఁ గూడె
కొండుక మేనఁజేసినగురుతే చాలును ॥ ఎచ్చు ॥ 385

శంకరాభరణం

కర్కశ మిపుడే కావలెనా
వొక్కించుక వడి వుండఁగరాదా ॥ పల్లవి ॥

నేరుపుమాటలు నీకే యమరును
కూరిమిఁ గొసరఁగ గుఱి లేదు
తేరినయప్పుడె తెలిసేఁ(పేఁ?) గానీ
పోరక లోనికిఁ బోరాదా ॥ కర్క ॥

సెలవులనవ్వులు చెల్లును నీకే
తలపెట్టఁ జలము తతిగాదు
వలసినయప్పుడె వచ్చేఁ గానీ
పలుమరుఁ బిలువక పదరాదా ॥ కర్క ॥

తమకించి కలయఁ దగవవు నీకే
జమళి నలుక లిఁకఁ జవిగావు
చెమరించె మేను శ్రీవేంకటేశ్వర
సమముగఁ గూడితి చనవీరాదా ॥ కర్క ॥ 386

నాదరామక్రియ

వాడిక నీమతికిని వలపు వేఁగా
పీడెమిచ్చి యాతనితో వేసరుకోనేలే ॥ పల్లవి ॥

కలికికన్నులకును కాఁకలచూపులు వేఁగా
వొలిసీనొల్లక యాల వూరకుండేవే
పలువన్నెనీమోవికి పచ్చిమాటలు వేఁగా
మలసి పతితోనేల మాఁటాడవే ॥ వాడి ॥

చేతిమీఁదిచెక్కులకు నెలవినవ్వులు వేఁగా
యీతలఁ జింతఁ బొరలనేలే నీకు
కాతరపుమేనికిని కమ్మఁబులకలు వేఁగా
ఘాతలఁ బయ్యదనేల కప్పేవే నీవు ॥ వాడి ॥

కొండలకుచములకు గోరిచందురులు వేఁగా
బెండుగాఁ జెలువునితోఁ బెనఁగనేలే
అండనె శ్రీవేంకటేశుఁ డాతఁడె నిన్నుఁగూడెను
నిండుఁగళలతో నీకు నివ్వెరగులేలే ॥ వాడి ॥ 387

సౌరాష్ట్రం

గక్కన నిద్దురఁ గలయు టివి
మక్కువ మాయెడమాఁట లిఁకేలా ॥ పల్లవి ॥

పాదపువాఁ(వ్రాఁ?)తలు భావపుటీఁతలు
ఆదెసఁ జెలికిని యాసలఁబో
మోదపుఁబలుకులు ముంచినపులకలు
యీదెస నీకును యిక్కడఁ గలిగె ॥ గక్క ॥

కన్నులకెంపులు కాఁకలసొంపులు
వన్నెలసతికిని వలపునఁబో
సన్నపుఁజెమరులు సరసపుతిమురులు
నిన్ననేఁటనే నీకును గలిగె ॥ గక్క ॥

పైపైనుసురులు పయ్యదవిసరులు
నీపొందు చెలికి నిలువఁగఁబో
యేపున శ్రీవేంకటేశ్వర నీకును
యాపదఁతికూట మింతలోఁ గలిగె ॥ గక్క ॥ 388

తెలుఁగుఁగాంబోది

చెలఁగి నావిభుఁ డింతసేయుమనెనా
చలమరికోరికలు సాదించీఁగాక ॥ పల్లవి ॥

మాయదారిమరునేటు మనసులో గుఱి యింతే
కాయముమీఁదికినేల కాఁకరేఁగీనే
పాయపుమోహము లివి బయలీఁదేపను లింతే
ఆయపునిట్టూర్పులేల అలయించీనే ॥ చెలఁ ॥

చందురునివెన్నెలలు జగమెఱిఁగిన వింతే
పందెమాడి నన్నునేల భ్రమయించీనే
కుందనికోవిలకూఁత కుత్తికలో పస యింతే
సందడి నాగుండె యేల జాలిరేఁచీనే ॥ చెలఁ ॥

పంతపుటీచల్లగాలి పాణముతోలంకె యింతే
వింతలుగా నన్నునేల వేసరించీనే
యింతలోన శ్రీవేంకటేశుఁడు గలయఁగాను
చింతలెల్లాఁ బాపెఁగాక సిగ్గులేల ముంచీనే ॥ చెలఁ ॥ 389

మేఁచబౌళి

నటనలు రెండూ నడపేవే
కుటిలపునవ్వులుఁ గోపముఁ గలదా ॥ పల్లవి ॥

వదనకమల మిటు వంచేవేమే
చదురులమాఁటలు చల్లుచును
పెదవులు గదలఁగఁ బిలిచి గొణఁగేవే
చెదరనిపొం దిటు సేయుచును ॥ నట ॥

చెక్కుచేతితో చింతయిదేమే
వొక్కమంచమున నుండుచును
మొక్కలలోనే ములిగేవేమే
చొక్కులచూపులఁ జూచుచును ॥ నట ॥

రతివేళనె యీరాజసమేమే
అతిబాసలు నన్నడుగుచును
యితవుగ శ్రీవేంకటేశుఁడఁ గూడితి
మతకములేలే మైమఱచుచును ॥ నట ॥ 390

రేకు 968 భైరవి

ఏల దూరీ నేల పోరీ నితఁడే తాను
వేళతో బుద్ధిచెప్పఁగా వినవైతినా ॥ పల్లవి ॥

అత్తి నే నలిగితిఁబో అప్పుడే రమణుఁడు
హొత్తుకు రమ్మనఁగా నేఁ బోనైతినా
మత్తుఁడై యాపొద్దుకట్టె మఱచెఁబో ఇప్పుడైనా
వత్తునని చెప్పెంపఁగా వద్దంటినా ॥ ఏల ॥

వుంటిఁబో నాచలముతో నోరుపుగలవాఁడై తే
నంటుగాఁ దా నవ్వఁగా నే నవ్వనైతినా
కంటకాన నొకతప్పు గలిగెఁబో ఇఁకనైనా
జంటన నన్నుఁ జెనకఁగా సమ్మతించకుంటినా ॥ ఏల ॥

తతితో సిగ్గున నే తలవంచుకుండితిఁబో
రతులఁ గరఁచఁ గరఁగఁగనైతినా
ఇతవై శ్రీవేంకటేశుఁ డింతసేసి నన్నుఁ గూడె
కతగా, ఇదె తొల్లి కాదంటినా ॥ ఏల ॥ 391

పళవంజరం

ఒకటి కొకటి గూడ దువిదకడకు నిట్టె
వెకలివిభుఁ జేర విచ్చేయుమనవే ॥ పల్లవి ॥

పతియింటికేఁగేటిపడఁతివేగిరానకు
సతిపిరిఁదిభారము సంగరమాయ
మతిలో నాతనిఁ బొందేమచ్చికకోరికలకు
మితిలేనివలపులే మీఁదమీఁదఁ దొడుసు ॥ ఒక ॥

సొలసి యాతనిఁ జూచేచూపులవాండ్లకు
చెలియానందజలాలు చిట్టంట్లాయ
మలసి యాతనితోడ మాటలాడేయందుకు
నిలువునివ్వెరగులు నేరములై నిలిచె ॥ ఒక ॥

కమ్మర నాతని రతి కాఁగిలించేయందుకు
కొమ్మకంకణరవాలే కొండెములాయ
ఇమ్ముల శ్రీవేంకటేశుఁ డింతలో విచ్చేసి కూడె
నెమ్మది నున్నారు నేఁడు నిన్ననే యింతాయను ॥ ఒక ॥ 392

లలిత

తనిసితి నుండనీవే తనవలసినయట్టు
చినుకులేనిచిత్తడి సిగ్గులేలే ఇఁకను ॥ పల్లవి ॥

ఆడినదే మాటా ఆతఁడే యెరుఁగును
యేడలేనిబుద్దులు మీరేమిచెప్పేరే
గోడలేనిచిత్తరువు కొలచీ నందే కొలవు
తాడులేనికట్టు వట్టితగులేలే యిఁకను ॥ తని ॥

తుద నేమనీనే దూరులెల్లా వచ్చె
పదమనవే యింకఁ బనిలేదు
యెదురులేనిమాట కదురువలెనే వుండు
పెదవిపై తేనెలప్రియమేలే యిఁకను ॥ తని ॥

యింటికిఁ దా వచ్చినదే యిన్నిటికీ గురియాయ
జంటలయెడమాటలు చాలుఁజాలునే
అంటిముట్టి శ్రీవేంకటాద్రీశుఁ డిదె కూడి
వెంటవెంటఁ దిరిగీని వెరపేలే యిఁకను ॥ తని ॥ 393

మంగళకౌశిక

ఏలసేసే వడియాస లిందాఁకాను
ఆలకించి వున్నదాన నందాఁకాను ॥ పల్లవి ॥

వచ్చి వచ్చి వేగిరాలు వలవనిజాగరాలు
యిచ్చల నడపితిగా యిందాఁకాను
వెచ్చనిపూరుపులును వీరిడినేరుపులును
అచ్చుపడె నాకై తే నందాఁకాను ॥ ఏల ॥

మాటలలో తీపులును మాయదారి చూపులును
　　యేఁటవెట్టి నడపితి విందాఁకాను
　　వాఁటమైన కాఁకలును వట్టి కొమరాఁకలును
　　ఆఁటదాన నేఁ బడితి నందాఁకాను ॥ ఏల ॥

నెలవులనగవులు చే చాఁచి తగవులు
　　యెలమిఁ జేసితివిగా యిందాఁకాను
　　చెలఁగి శ్రీవేంకటేశ చెక్కునొక్కి కూడితి నే-
　　నలవోకతోడ నుంటి నందాఁకాను ॥ ఏల ॥ 394

## ముఖారి

తగిలి నేఁ దడవితేఁ దడవఁగవలెఁ గాక
　　మిగుల వాసికానికి మేరమీరఁజెల్లునా ॥ పల్లవి ॥

చూడకుండఁగానే తాను చూచీ తప్పక నన్ను
　　యేడాను జగడగాని కింతగలదా
　　ఆడకుండఁగానే మాటలాడించీ నూరకైన
　　జాడతో మాసటీనికి చంచలము చెల్లునా ॥ తగి ॥

ఇంటికిఁ బోఁకుండఁగ మాఇంటికి వచ్చీఁ దాను
　　అంటి చలపాదిగాని కది దగునా
　　అంటుకోకుండఁగ తానే అంటుకొనీ నామేను
　　దంటపంతగానికి దైన్యమింత చెల్లునా ॥ తగి ॥

కాఁగిలించకుండఁగానే కాఁగిలించీ నిదె నన్ను
　　యేఁగేటియెమ్మెకానికి నిది దగునా
　　కాఁగిననన్ను శ్రీవేంకటపతి యిదె కూడె
　　చేఁగదేరేదొరలకు చేఁత లింత చెల్లునా ॥ తగి ॥ 395

శంకరాభరణం

ననుపున నూరకె నవ్వకురా! నీ
మనసు రానె నే మాటాడేరా ॥పల్లవి॥

మొదలిమాఁట నిను మోచివచ్చితే
వదనకమల మిఁక వంచకురా
కొదలు మాని నాకొంగు వట్టితే
పదివేలు దెలిపేఁ బదగదరా ॥నను॥

సారెకు నీచేఁత సరిగాఁ జూపిన
బీరముతోఁ గోపించకురా
తారుకాణలకు దగ్గరి వచ్చిన
తేరకొనఁగ నిటు తెలిపేరా ॥నను॥

అలమి కాఁగిటను ఆయము లంటిన
మలసి సొలసి మైమఱవకురా
యెలమిని శ్రీవేంకటేశ కూడితివి
నెలవయి యురమున నిలిచితిరా ॥నను॥ 396

రేకు 969 సామంతం

నీవేమి నేసినాను నిన్ను నేర మెంచరాదు
మూవంక నానిజానికే మొక్కేఁ జుమ్మీ ॥పల్లవి॥

కన్నుల నీమర్మములు కాఁడిపారఁ జూచితి
వున్నతి నాతప్పు నీవే వోరుచుకొమ్మీ
వెన్నెలనవ్వులు నవ్వి వేఁడిసిగ్గు రేఁచితి
మున్నుమున్నె యిందుకు మొక్కితిఁజుమ్మీ ॥నీవే॥

మాటలనే నీమనసు మాయింటికిఁ గొంటఁ(చుఁ?)బోతి
యేఁటికైనా నన్ను నెగ్గు లెంచకుమీ
వాఁటపువినయముల వలపు లీఁదించితి
మూఁటగా వేవేలకు మొక్కేఁజుమ్మీ ॥నీవే॥

కూడుతానే కాఁగిటిలో కొనగోరు సోఁకించితి
వేడుక నన్ను వెనకవేసుకొమ్మీ
యీడనే శ్రీవేంకటేశ ఇన్నియు నేఁ జేసితి
మోడిసేసి ఇందుకేకా మొక్కేఁజుమ్మీ ॥నీవే॥ 397

దేవగాంధారి

నెలఁతకుఁ జీఁకటి నీకే వెన్నెల
చలువయు వేఁడియు సంగడిఁ గలిగె ॥పల్లవి॥

వాడినమోమును వంచినశిరసును
యేడఁ గలిగెనో యీచెలికి
పీడెపుమోవియు వేడుకనవ్వులు-
నీడనే రమణుఁడ నీకే కలిగె ॥నెలఁ॥

చెక్కుమీఁదిచేయి చెదరిననెరులును
యెక్కడఁ గలిగెనో యీచెలికి
తక్కినకళలును తనువుచెమటలును
నిక్కపుదొరవగునీకే కలిగె ॥నెలఁ॥

తొట్టినతమకము తొడుసగువెరగులు
యెట్టు గలిగెనో యీచెలికి
యిట్టె శ్రీవేంకటేశ కూడితివి
నెట్టన సతిరతి నీకే కలిగె ॥నెలఁ॥ 398

సామంతం

చెప్పకు నీసుద్ది సరిచేసుకోకు నిన్ను నన్ను
వుప్పు గప్పురమువలె నుండితేనే ఆయనా ॥ పల్లవి ॥

కన్నులే తెల్లనగానీ కాయమెల్లా నలుపే
యన్నిటా నన్ను నేరా లెంచవచ్చేవా
చన్నులే ఘనముగాక సరి నానడుము చిన్న
వన్నెల నేనూ నీవంటిదాననా ॥ చెప్ప ॥

చేతులే నాలుగుగానీ చెలులు పదారువేలు
పోతరించి నీవు నాకు బుద్ధిచెప్పేవా
ఆతల మాఁటలే వాఁడి యధరము మెత్తన
యీతల నీతో నన్ను నీడువెట్టేవా ॥ చెప్ప ॥

చూడ బాలుఁడవుగానీ సోఁకేది మేను మిన్నంత
కూడేటి నావలపులు గోరసేసేవా
యీడనే శ్రీవేంకటేశ యిట్టె నీతో నేకమైతి
మేదెపురతుల నన్ను మెచ్చకుండేవా ॥ చెప్ప ॥ 399

మలహరి

కందుఁగుందు నింత గావలెనా
అందరిలోపల నవుననరాదా ॥ పల్లవి ॥

చేరి నాపొందులు చిత్తము రాకున్న
నారుకొనఁ గొంత నవ్వరాదా
మారుమాటాడఁగ మనసు రాకున్న
వూరకైనఁ గొంత వూఁకొనరాదా ॥ కందుఁ ॥

పైకొని నారాక పరాకై యుండిన
　చౌకగాఁ బైఁ జేయి చాఁచరాదా
　యేకడో నీచిత్త మెరవై యుండిన
　ఆకుమడి చిచ్చే నందుకొనరాదా ॥ కందు ॥

కాఁగిట నీమేను కడుమఱచిన
　వేఁగి నాపై మేనువేయరాదా
　చేఁగపలపుల శ్రీవేంకటేశ్వర
　పాఁగినరతులఁ బంత మీరాదా ॥ కందు ॥ 400

గుజ్జరి

కడదాఁకా నీమేలే కాణాచై వున్నది
　అడియాల మిఁక వేరే అరయఁ జోటేదిరా ॥ పల్లవి ॥

నించినకూరిమి నాపై నిజముగ నున్నది
　మంచినీగుణాలు నామనసులో నున్నవి
　అంచెల నీసరసము లంగముపై నున్నవి
　కొంచి కొంచి ని న్నింకఁ గొసరఁ జోటేదిరా ॥ కడ ॥

చెప్పిపంపిననీరాక చెవులనే వున్నది
　రెప్పలెదుట నీరూపు రేపుమాపు నున్నది
　చిప్పిలునీమోవితేనె సెలవుల నున్నది
　వుప్పతించి నిన్ను నిఁక నొరయఁ జోటేదిరా ॥ కడ ॥

కందువ నీమర్మమెల్లా కాఁగిటిలో నున్నది
　అంది నీముద్దుటుంగర మదె నావేల నున్నది
　ఇందుకే శ్రీవేంకటేశ ఇటు నన్నుఁ గూడితివి
　చిందేటిసిగ్గులు నీపైఁ జిమ్మఁగఁ జోటేదిరా ॥ కడ ॥ 401

శ్రీరాగం

చింతవంత లిఁకనేల చెలుల దూరఁగనేల
దొంతులరతులే నీకుఁ దోడాయఁగా ॥ పల్లవి ॥

తలఁచఁగానే వచ్చె తనుఁదానే రమణుఁడు
మలసి నీకిఁక మొక్క మనసాయఁగా
అలుక లిన్నియుఁ బాసె నతఁడె నీతో నవ్వె
పలుకుఁబంతము నొక్కపాటాయఁగా ॥ చింత ॥

అనుమానించఁగనే యతఁడు నీచేయి వట్టె
యెనయునీకోరికెల్లా నీడేరెఁగా
చనవెల్లా నీకుఁ జెల్లె సరసుఁడు నిను మెచ్చె
కొనకెక్కినవలపు గురుతాయఁగా ॥ చింత ॥

మొక్కఁగా నాతఁడు నీకు ముందర వరము లిచ్చె
చక్కనైనసకినాలు సరిదాఁకెఁగా
చెక్కులెల్లాఁ జెమరించె శ్రీవేంకటేశుఁడు గూడె
యెక్కువ నీసంతసము లిరవాయఁగా ॥ చింత ॥ 402

రేకు 970. సామంతం

మానరా నవ్వు మానరా వద్దు మానరా
మాతో మానరా యేల మానరా। నీవు
మానకుంటే నిన్ను నిందరు వినఁగా
మాటలఁ దిట్టక మానరా ॥ పల్లవి ॥

వారి వీరితోడ వావులు చెప్పెంపే
వట్టిదోసమేల కట్టేవురా
తేరకొన నన్నుఁ జూచి వట్టి యాస-
దేర నుస్సుర నేఁటికి రా
పోరి పోరి నీవే నిజమరి నంటా
బొంకుచు నన్నేల ముట్టేవురా
కోరి వూరకున్నవారి కింతేసి-
కొడిమె లేఁటికి వచ్చీరా ॥ మాన ॥

చక్కనివారికి నీయెదుట నేఁడు
సారె నిలువరాదటరా
వొక్కమాఁటలోనే నీవింత గరఁగి
వొళ్లు చెమరించనేఁటికిరా
చిక్కనిచన్నులు నాకుఁ గలిగితే
చింతఁ బొరలఁగ నీ కేలరా
మొక్కలాన నీవు నేనేరోఁతలకు
మొదలనే నాకు సిగ్గవురా ॥ మాన ॥

కారణములేక వూరివారితోడ
కాలుదొక్క నేలవచ్చేవురా
నీరువంక తుంగవంటివాఁడ వింతే
నీతోడిపొందుకు నేనోపరా
కూరిమితోడుత శ్రీవేంకటేశ్వర
కూడితివి నిన్ను నేమందురా
కోరినకోరికలెల్లాఁ దలకూడె
గోరనన్ను నూఁదనేఁటికిరా ॥ మాన ॥ 403

నాదరామక్రియ

ఇటువంటివేడుక లెవ్వరికిఁ గలవమ్మ
తటుకన మఱచేరు తమలోనే మేనులు ॥ పల్లవి ॥

కలికి రమణునికిఁ గస్తూరినామముపెట్టి
చెలరేఁగి తాఁ జూపెఁ జెక్కుటద్దాలు
ములువాఁడికొనగోళ్ళ ముంచి కొప్పు దువ్విదువ్వి
తొలసితో మొల్లలట్టె తురిమీఁ జూపులను ॥ ఇటు ॥

పడఁతి విభునిమీఁదఁ బన్నీరు చిలికించి
తడియొత్తీఁ గుచముల తగుపొట్లాల
చిదుముడి సొమ్ములతో సింగారములు సేసి
అదరి నివాళించీ నంగపుఁగాంతులను ॥ ఇటు ॥

సోవగాఁ బీతాంబరము చుంగులువారఁ గట్టి
మోవి యాని తమ్ములు మిమ్ములఁ బెట్టెను
ఆవేళ శ్రీవేంకటేశు నట్టె మోహించి చూచి
తావిమంచానకుఁ దీసి తమకించి కూడెను ॥ ఇటు ॥ 404

ఆహిరి

ఏమి నెఱుఁగను నేను ఇఁక నీచిత్తమురా
దోమటివయసు నాపైఁ దోసినట్టె తోయరా ॥ పల్లవి ॥

తలఁపెల్లా నీది తమకమే నాది
చెలఁగి యేమిసేసినాఁ జేయరా నీవు
పలుకు నీతోనే పంతమే నాలోను
చలివలపులు నాపైఁ జల్లినట్టు చల్లరా ॥ ఏమి ॥

వాలుఁజూపులు నీపై వడియుఁజెమట నాపై
కేల నాచన్నులు పిసికినట్టే పిసుకరా
ఆలకింపు నీకొరకు అలయిక నాకొరకు
నాలిసేసి నీవు నాతో నవ్వినట్టే నవ్వరా ॥ఏమి॥

కాఁగిలిదె నీకు కళదాఁకేది నాకు
యేఁగక నీమోవి నాకు నిచ్చినంతా నియ్యరా
పాఁగినశ్రీవేంకటేశ పైకొని కూడితినదె
ఆఁగె నిద్దరిమనసు లంటినట్టె యంటరా ॥ఏమి॥ 405

సాళంగం

కానవచ్చె నందులోనె కాదామఱి
ఆనవెట్టి అడిగిని అట్టెకాదా మఱి ॥పల్లవి॥

వున్నతి నేమీఁజేయక వుండఁగానేఁ దన్నుఁజూచి
కన్నుల నవ్వితినట కాదామఱి
చిన్నిచెక్కులమీఁదటిచిఱుఁజెమటలు చూచి
మిన్నక మొక్కితినట మేలుగాదా మఱి ॥కాన॥

వుమ్మడి నీతనివేలివుంగర మెక్కడిదంటా
కమ్మఱఁ జూచితినట కాదామఱి
కమ్మినట్టితనమేనికస్తూరివాసనలకు
సమ్మతించనైతినట సటగాదా మఱి ॥కాన॥

తీపులైనతనమోవి తెగువ చూపితినట
కాఁపురము లెస్సాయ కాదామఱి
పైపై శ్రీవేంకటాద్రిపతి నన్ను నిటు గూడె
చేపట్టి తనకిన్నిఁ జెల్లెఁ గాదామఱి ॥కాన॥ 406

కేదారగౌళ

ఓయమ్మ యేడకేదే వోయమ్మా
యీయెడ మీసాలతేనె యీవలపు ॥పల్లవి॥

రమ్మని పిలువరాదు రాకుండితేఁ దిట్టరాదు
యెమ్మెలఁ గొండంతదొరే యీవిభుఁడు
బిమ్మిటి మెడవట్టము పెట్టరాదు ముక్కునాకు
గుమ్మడికాయంతముత్తెమే యీకూటమి ॥ఓయ॥

పూస వేఁగిరించరాదు బొంకితే నలుగరాదు
యీనెలఁత లెందరైనా నీతనికి
తానూఁ జేతికి నీఁడు దగ్గరి తీసుకోరాదు
యేనుగచేతిచెఱకే యీమోహము ॥ఓయ॥

మించి చేయి చాఁచరాదు మొనగోరు మోపరాదు
మించిన శ్రీవేంకటాద్రిమేఁటి యీతఁడు
కంచపుమో విచ్చి కూడె కడుఁదమకాలు రేఁచె
యెంచఁగఁ జుక్కలలెక్క యీమరుల ॥ఓయ॥ 407

దేసాళం

ఇద్దరిచలముఁ జెల్లె నిదే మేలు
వద్దువద్దు నాతోడి వట్టినవ్వు లేఁటికి ॥పల్లవి॥

వేడుకలేనిపనికి వేసరివుండుటే మేలు
కూడనిమాఁటకు వట్టిగుట్టే మేలు
యీడుజాడకాఁపురాన కేదనుండినా మేలు
తాడుపడె వలపులు తలవయ్య నీవు ॥ఇద్ద॥

చనవులేనిచోటికి చాయపాట్లే మేలు
పెనఁగినా రాకుంటే బిగువే మేలు
మనసురానియందుకు మఱి మఱచుటే మేలు
వెనకఁ జెప్పేఁగాని విడవయ్య కొంగు ॥ ఇద్ద ॥

వాలసీనొల్లనిపొందు పూరకైనపాటే మేలు
కలసినరతులకుఁ గలంతే మేలు
అలయించి శ్రీవేంకటాధిప కూడితి నన్ను
వులివచ్చికాఁగిలేల వుండవయ్య యీడనే ॥ ఇద్ద ॥ 408

రామక్రియ

చేతికిఁ గొంత చేరనీవే
ఘాతలఁ దనమేను కరఁగించేఁగాని ॥ పల్లవి ॥

రానీవే వాని రవ్వసేయక
ఆనిపట్టి నేనే అడిగేను
పూని తొలుతనంటే బొంకీని
నానినకాఁగిట న్నవించేఁగాని ॥ చేతి ॥

తిరుగనీవే వానిఁ దెగనాడక
మరిగించే నేనే మాఁటలను
తరవాత నేమనినాఁ దలవంచీని
మరుతంత్రములన్నీ మరి నేసేఁగాని ॥ చేతి ॥

వుండనీవే వానినొకటాడక
అండనే రతికేలి నలయించేను
దండి శ్రీవేంకటదైవ మీతఁడే
నిండి వురముమీఁదనే మొక్కేఁగాని ॥ చేతి ॥ 409

ముఖారి

సారె సారె మీరేల సందడిఁబెట్టేరే
మారునిమాయలు నేఁడు మందులఁ బొయ్యీనా ॥ పల్లవి ॥

వలపు వెంచఁగఁబోతే వంతులకుఁ జవులవునా
అలవానిపొందు మానుమని యేల చెప్పేరే
తలఁ పాతనిమీఁదటఁ దనువు యీడనే యింతే
యెలమి మీరేమన్నా నిఁక మానఁబొయ్యేనా ॥ సారె ॥

మనసునఁ బాలు దాగ మజి కడుపు నిండునా
పొనిగేల యెడమాటఁ బొడ్డువుచ్చేరే
కనుచూ పాతనిమీఁద కాఁక లివె నామీఁద
వెనక మీరేమన్నా వినఁబొయ్యేనా ॥ సారె ॥

మాటలు విసుకఁబోతే మాపుదాఁకా మెత్తనౌనా
పూఁట పూఁట నాకేల బుద్దిచెప్పేరే
యీటులేని శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
మేటుల నేఁ డిఁకనేల మీరే నేఁగానా ॥ సారె ॥ 410

పాడి

రమ్మనవే చెలువుని రవ్వ మమ్ముఁ జేయనేల
తమ్మిపువ్వులవాట్లు దాఁకుదాఁకౌనా ॥ పల్లవి ॥

గక్కనఁ జూచినంతనే కన్నులనే పెండ్లాయ
వెక్కసపుతలఁబాలు వేగినంతానా
పక్కన నవ్వినంతనే పాలకూళ్లు సెలవాయ
మక్కువతో బువ్వములు మాపుదాఁకౌనా ॥ రమ్మ ॥

తొలుతటిసిగ్గులె దొడ్డ తెరమఱఁగాయ
వలిపెపుతెరమాటు వడి నింకానా
సొలపులమాటలనే సోబాన పాటలాయ
చలివాసె పేరటాండ్ల సంద డింకానా ॥ రమ్మ ॥

పైనొరగినప్పుడే పరవనిపరపాయ
నానఁబెట్టి నాగవల్లినాఁటిదాఁకానా
ఆనుక శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
మేనిలోనిసంతసాలు మెచ్చుదాఁకానా ॥ రమ్మ ॥ 411

వరాళి

నేరుపరి వౌదువే నీడకు రావే। నాకుఁ
దారుకాణలాయ నిఁక తప్పులేలే ॥ పల్లవి ॥

కిన్నెరమీట్లలోని గిలిగింతలూ నీ—
సన్నలచాయలలోని చలివేండ్లు
వన్నెలకాఁకలమేనివసివాడులూ నే—
మిన్నిటికి లోనైతి మిఁకనేలే పసులు ॥ నేరు ॥

జంకెనచూపులలోని సరిబేసులూ నీ—
తెంకులమాటలలోని తెల్లనల్లలు
కంకినగవులలోనికాయపండ్లు
మంకు లిన్నిటాఁ బడితి మరియేలే కతలు ॥ నేరు ॥

అచ్చపుసిగ్గులలోని అంగభంగాలూ నీ—
అచ్చుపడ్డకాఁగిటిలో నరమఱలూ
తచ్చి శ్రీవేంకటపతిఁ దగిలి నేఁ గూడితిని
యెచ్చుకుందులెల్లాఁ గంటి నిపుడేలే బొంకులూ ॥ నేరు ॥ 412

సామంతం

పంతము పాడియు నీభావములోనే కంటి
యెంత(ప్రియముచెప్పినా నిది మెచ్చుగామరా ॥పల్లవి॥

చిత్తములో తమకము చిఱుఁజెమటలఁ గంటి
కొత్తకొత్తనీపొందులు కొప్పుపువ్వులనే కంటి
తత్తరపునీగుణాలు తనుపులకలఁ గంటి
రుత్తమాట లేమన్నా రుచిగావు మానరా ॥పంత॥

కాఁకల నీవసివాడు కనుచూపులనే కంటి
వేఁకపునీయలపెల్లా వెడనిట్టూర్పులఁ గంటి
సోఁకుల నీవేడుకలు సొంపుఁగళలనే కంటి
వూఁకొనేఁగాని నీసుద్దు లొడఁబాటు గావురా ॥పంత॥

నాటకపునీవిద్దె నగవులలోఁ గంటి
గాఁటపునీవలపెల్లా కాఁగిటిలోనే కంటి
పాటించి శ్రీవేంకటేశ పైకొని నన్నుఁ గూడితి—
విటు రాఁ దొల్లిటివలె నిందులోఁ జెల్లదురా ॥పంత॥ 413

రేకు 972 బౌళి

నేనే యందుకు రానటరా
పోసీపోసీ యింతసేసి వట్టిపొందులనే నిందవేసితి
అట్టేకానీకానీ శ్రీవేంకటరాయా ॥పల్లవి॥

చెలులతో నిన్నమాపే చెప్పిపంపనా నీకు
యెలమి మాయింటికి నేలవచ్చితి। కానుక లిచ్చితి
వేగిరించితి శ్రీవేంకటరాయా ॥నేనే॥

నెప్పున మేడపై నీకు నిక్కి సన్న సేయనా
యిప్పుడే చన్నువట్టేవు యేమిరా నీవే
నేమురా బలిమేలరా శ్రీవేంకటరాయా ॥ నేనే ॥

నిచ్చలు మాచన వొలినిలయా నేఁ గోరఁగానే
మెచ్చుగా నన్నుఁగూడి మేలమాడితి। మేలుమేలురా
శ్రీవేంకటరాయా ॥ నేనే ॥ 414

ఆహిరి

కోపగించుకొన నోప గొరబూ నోప
తీపులమీఁదటియెత్తు తెలిసేఁగాని ॥ పల్లవి ॥

చెలుల దూరగనోప చిల్లరవాదుల కోప
చలపట్టి పతితోడ జంకించనోప
అలిగి పానుపుమీఁద నవ్వలిమోమై యుండఁగఁ
గలిగినపాటే మేలు కనుకొనేఁగాని ॥ కోప ॥

దైవము దూరఁగ నోప తమకించి పడనోప
మోవనాడేవెంగెములు మొదల నోప
చేవదేరేచింతతోడ చెక్కుచేత నుండఁగాను
కావలసినపనులు కనుకొనేఁగాని ॥ కోప ॥

పంతములియ్యఁగ నోప బచ్చెనమాటల కోప
వంతువాసులకు నోప వరుస లోప
ఇంతట శ్రీవేంకటేశుఁ డిటు నన్నుఁ గూడె నేఁడు
కాంతుఁ డితనితలఁపు కనుకొనేఁగాని ॥ కోప ॥ 415

సాళంగం

వద్దువద్దు దోసమూ వావిగాదు నీకు నాకు
అద్దో తొలఁగుబావ వంటుకోకువయ్యా ॥ పల్లవి ॥

యేమి సేసేవోయంటా నిటు నన్నుఁ జూడనంపె
దీమసపునీతలఁపు తెలియ నంపె
వాములైన నీలోనివలపులు రేఁచఁగ నంపె
కామించి నీవేల నన్నుఁ గాఁగిలించేవయ్యా ॥ వద్దు ॥

ఇందుకే విచ్చేసేవంటా నెదురుగా నన్నంపె
కందువ నీనేరుపెల్లాఁ గనుకో నంపె
చందమామగుటుకలు చవులుచూడఁగ నంపె
యిందులోనే నీవు నాతో నేల నవ్వేవయ్యా ॥ వద్దు ॥

చేరువకు వచ్చి నిన్నుఁ జెలి యచ్చరించ నంపె
బీరాన నాచేత నిన్నుఁ బిలువ నంపె
యీరీతి శ్రీవేంకటేశ యీడ నన్నుఁ గూడి యాకెఁ
గూరిమిఁ గూడితి విట్టె కొత్త యేఁటిదయ్యా ॥ వద్దు ॥ 416

భైరవి

ఎంత నమ్మనిదానవు యేమే నీవు
చింతతోఁ బగచాటేవు చెల్లఁబో నీవు ॥ పల్లవి ॥

జమళిమోహాలు మనసరుసనే వుండఁగాను
తమకించి మాటలాడఁ దగవా నీవు
చెమటకాఁగిలి మనచేతులలో నుండఁగాను
అమరనివెంగెమాడే వౌనే నీవు ॥ ఎంత ॥

నూఁటినమోవులు మననోళ్ళలో నుండఁగాను
యేఁటికిఁ గొసరఁజొచ్చే వేమే నీవు
కూటములు చెక్కులపై గుఱుతులై వుండఁగాను
పాటించి యేడవోయంటా భ్రమసేవే నీవు ॥ ఎంత ॥

బచ్చనరతులు మనపానుపుపై నుండఁగాను
ఇచ్చగించి మఱచేవు యేమే నీవు
పచ్చిగా శ్రీవేంకటాద్రిపతి నేఁ గూడితి నిన్ను
మెచ్చితి మొకరొకరి మేలే నీవు ॥ ఎంత ॥ 417

పాడి

ఊరకుండేవో లేదో వోసి చెంచెతా। వోరి
కోరి నిన్ను నెంచుకొంటి గొల్లఁడవుగదరా ॥ పల్లవి ॥

జమళిపీకిలిదండ సరి నీకేలే
నెమలిచుంగులపాగా నీకేలరా
అమరెనే సంకుఁగడె మందుకుఁ దోడు
భ్రమసి నీవేల గుల్ల పట్టుకున్నాఁడవురా ॥ ఊర ॥

పలుమెకాలవెంటను పారేవేలే। నీవు
యెలమిఁ బులుగునేల యెక్కితివిరా
పలచనిపారెటాకుపయ్యే దేఁటికే
అల మత్తేకుపానుపు అది నీకు నేలరా ॥ ఊర ॥

కాకిపైఁడిబొట్టు నీకుఁ గడుప్రియమా
ఆకుఁదొలసిదండ నీకది టాఁతా
కైకొంటి శ్రీవేంకటాద్రిఘనుఁడ నిన్ను —
నేకమైతిఁ గదరా నీయిందిరాదేవిని ॥ ఊర ॥ 418

నాగవరాళి

ఆడా నీడా నదివో రమణుఁడు
వేడుకలు రేఁచీ వింటి నేననవే ॥పల్లవి॥

కానీకానీ కసుగాటుమాఁటలు
నానఁబెట్టిని నాతోను
రానీపోనీ రాజస మెఁ(మెం?)తైనా
మానఁ డెంతయినా మఱవకుమనవే ॥ఆడా॥

మేలుమేలు మేనరికమే నాకుఁ
జాలాఁ గట్టెను సరసాను
మూలమూలా ముసిముసినవ్వులు
చాలుకొనెనట సరిదాఁకెననవే ॥ఆడా॥

నవ్వి నవ్వి నను శ్రీవేంకటపతి
జవ్వనము రేఁచి సరిఁగూడెను
దవ్వులటు మాని దగ్గరి నావద్దఁ
బవ్వళించెను పదరకుమనవే ॥ఆడా॥ 419

రేకు 973 లలిత

వీడెపుఁబెదవితోడి విట్ఠలేశుఁడు
వేడుకలే పచరించీ విట్ఠలేశుఁడు ॥పల్లవి॥

నిలుచున్నాఁ డలవాఁడు నిక్కి నామోము చూచి
వెలుపల సన్నసేసె విట్ఠలేశుఁడు
నెలవుల నవ్వి చెలితోడ మాటలాడి
వెలుగొందీ సొమ్ములతో విట్ఠలేశుఁడు ॥వీడె॥

కన్నులనే మెచ్చుమెచ్చి కందువకుఁ జేయిచాఁచి
విన్నపము లడిగీని విట్ఠలేశుఁడు
తన్నుఁదానె విఱ్ఱవీఁగీ తనమీఁద నానవెట్టీ
వెన్నదిన్ననోరితోడి విట్ఠలేశుఁడు ॥ వీడె ॥

బడిబడినే వచ్చి పైకొని నన్నుఁగూడి
విడువఁడు నాచెఱఁగు విట్ఠలేశుఁడు
కడుఁగడుఁ దమకించీ కప్పురమే చేతికిచ్చి
వెడఁగు శ్రీవేంకటాద్రివిట్ఠలేశుఁడు ॥ వీడె ॥ 420

వసంతవరాళి

చెప్పితే[1] నారచికత చెప్పకుండితే వెత
దప్పికి నీరే మందు తలపోయఁగదరే ॥ పల్లవి ॥

చిగురులోపలిచేఁగ చెప్పరే మీరు
నిగురులోపలి నిప్పు నిలుపరాదె
పగలు చీఁకటి గమ్మి పాయ దెంతైనా
తెగరానిచోట తరితీపులమందేదే ॥ చెప్పి ॥

ఆకాశపంచాంగము అందుకుఁ బేరేదే (?)
రాకపోకజగడము రాఁజీనదే
వాకునిష్ఠూరాలు వచ్చీ వసముగా దెంతయినా
యేకచిత్తమైనమందు యెన్నఁ డిచ్చేరే ॥ చెప్పి ॥

వానలేనిచిత్తడికి పైపు లిఁకఁ జూచుకోరే
కానరానిగుఱుతులు కాఁడిపారెనే
ఆనుక శ్రీవేంకటేశుఁ డంతలో విచ్చేసి కూడె
వీనుల వినేమందు వేధించె దేహము ॥ చెప్పి ॥ 421

---

1. అరచికత=రహస్యపుకతయా? ఇదిగూడ ప్రకరణముతో నూహ్యము. చూ:- 1401 రేకు

ఆహిరి

చేసేనావినయములు చేకొంట గాక
ఆసలే కాఁకరేఁచితే అందుకేమిసేతమే ॥ పల్లవి ॥

చెక్కు నొక్కఁబోఁగాను చేతిగోరు దాఁకె నింతే
వెక్కసాన విదిలించివేసేవేమే
పక్కన విందువెట్టి పలురుచులు సేయఁగా-
నక్కడాఁ గరఁగదు అందుకేమిసేతమే ॥ చేసే ॥

సరసమాడఁబోఁగా చన్నులు బయటఁబడె
యిరవై యిందుకేల యీసడించేవే
గరిమ సొమ్ములు నీకుఁ గడుఁగడుఁ బెట్టఁగాను
అరగొరవెతయైతే నందుకేమిసేతమే ॥ చేసే ॥

పొంది కొంగువట్టఁ బోఁగా పోఁకముడి వీడె నింతే
చిందువందై యిందుకేల సిగ్గువడేవే
కందువ శ్రీవేంకటాద్రిఘనుఁడ నేఁ గలసితి
అందపుటాయాలు సోఁకె నందుకేమిసేతమే ॥ చేసే ॥ 422

దేసాళం

ఊరకే గడించుకొనీ నొకటొకటే తాను
రారమ్మని పిలువఁగ రానైతినా ॥ పల్లవి ॥

పట్టినచలముతోడఁ బదరవద్దంటిఁ గాక
యిట్టె మోవి యడిగితే నియ్యనంటినా
దిట్టతనానఁ బయ్యద తియ్యకుమనంటిఁ గాక
నట్టుకొట్టి తనతో నవ్వనంటినా ॥ ఊర ॥

పల్లదపుమాటలకుఁ బగచాటితిఁ గాక
చెల్లఁబోఁ తాఁ జెప్పినట్టు సేయనైతినా
వొల్లకొల్లకుండఁగానే వొడఁబడనైతిఁ గాక
తొల్లింటివలెనే అఱతే తుదకెక్కనా ॥ ఊర ॥

పయ్యెదకొంగు దియ్యఁగా బలిమిచూపితిఁ గాక
వొయ్యనే రతులకు నోపనంటినా
యియ్యెడ శ్రీవేంకటేశుఁ డింతసేసి కూడెఁ గాక
నెయ్యమున నపుడే నేఁ దనుఁ బిలువనా ॥ ఊర ॥ 423

సౌరాష్ట్రం

తనజాడ లేలమాను తానే తాను
ననిచియున్నాఁడే నాకు నాటకీఁడే తాను ॥ పల్లవి ॥

రాతిరెల్లా వద్దనుండె రవ్వగా నవ్వుచునుండె
ఆతల నప్పుడే మాటలాడీనే తాను
చేతికిలోనాయనంటా సేస నాపైఁ బెట్టెనంటా
కాఁతరించి వుండఁగాను కాఁకచల్లీఁ దాను ॥ తన ॥

కొప్పు కొనగోర దువ్వె కూరిమితో బుజ్జగించె—
అప్పుడే పరాకయ్యీ నదేమే తాను
కప్పుర మిచ్చినందుకు కొంతలు చెప్పినందుకు
నెప్పున నేఁ జెనకఁగ నిద్దిరించీఁ దాను ॥ తన ॥

కాఁగిట నిట్టె కూడె కడునలయుచు వాడె
మూఁగినమోహాన నాకు మొక్కీనే తాను
కాఁగి భూపతిచెరువుకాడ శ్రీవేంకటేశుఁడు
వీఁగకుండ రతి నన్ను వెలయించెఁ దాను ॥ తన ॥ 424

గుండక్రియ

సిగ్గులు సింగారాలు చెల్లునే నీకు
నిగ్గులు నీడలు మాతో నెరపఁగఁజెల్లునే ॥ పల్లవి ॥

వుక్కున నీరమణుఁడువొత్తినరేకలు దాఁచ
చెక్కుమీఁదిచేయి నీకు చెల్లునే నేఁడు
పెక్కుటధరపానపుపెదవిచొప్పులు మాప
ముక్కుమీఁదివేలు నేఁడు మోప నీకుఁ జెల్లునే ॥ సిగ్గు ॥

పొంది నీమేనిమీఁది పులకలన్నియు దాఁచ
చెందినపయ్యదకప్పు చెల్లునే నీకు
కందువ నీసమరతి కళలు మొరఁగుటకు
చిందేముసిముసినవ్వు చెల్లునే నీకు ॥ సిగ్గు ॥

అంగపుకాఁగిటిలోనిఅలపు లన్నియు దాఁచ
సింగారపుతోఁట కేఁగఁజెల్లునే నీకు
రంగగు శ్రీవేంకటాద్రిరాయఁడు నిన్నుఁ గూడె
ముంగురులు జారినవి ముడువఁగఁజెల్లునే ॥ సిగ్గు ॥ 425

రేకు 974 ముఖారి

కానీకానీ ఇప్పుదేల కడుఁబంతాలు
తాను నేనుఁ గూడితేఁగా తలపోఁతలు ॥ పల్లవి ॥

చెక్కుచెక్కుఁ గదియించి చేయిఁజేయి బిగియించి
అక్కడగా నీతో నామాటలు
పుక్కిటితమ్ముల మిడి బుజాన గడ్డమానించి
చిక్కించుకొన్నపుడుగా నేసేచేఁతలు ॥ కానీ ॥

పాదము పాదానఁదొక్కి పానుపుపైఁ బవ్వళించి
పాదుకొన్నప్పుడుగా నాబలిమెల్లాను
పోదిగాఁ జన్నులు మోపి పులకలు మేన రేఁచి
ఆదెస నింతేకా నెయ్యపునవ్వులు ॥ కానీ ॥

కాయముఁ గాయము మోపి కమ్మరనే మోవి ఇచ్చి
యీయెడ నింతేకా నాఇంపుసొంపులు
పాయపు శ్రీవేంకటాద్రిపతి నన్ను నిదె కూడె
చాయల నీమీఁదఁగా నాసరసములు ॥ కానీ ॥ 426

సామంతం

చెయ్యి ముంచినవానికి చెప్పితే రోఁత
తియ్యనినోరఁ జేఁదు తెగి నంజేనా ॥ పల్లవి ॥

కూర వండి కస వేరఁగూడదు నాకు నయితే
యేరా నిన్నుఁగూడి యింకా నెగ్గుపట్టేనా
నీరువంకతుంగవంటినిమన సెందుండినాను
ఆరయఁగ నేనింక నడ్డపెట్టేనా ॥ చెయ్యి ॥

గోడఁబూసినసున్నము కూడపెట్ట నేరనోప
ఆడుకోలు మాటదప్పెనని యెంచేనా
జీడిపంటిగింజ[1]వంటి చెంగియుండె నీగుణము
కోడెమాఁనికత్తికి గురిసేసేనా ॥ చెయ్యి ॥

వెన్నచేతఁబట్టి నేయి వెదక నేఁ జాలఁగాక
నన్ను నీవు గూడుండఁగ నవ్వకుండేనా
ఇన్నిటాను శ్రీవేంకటేశ నీకు నాకు నొక్క-
పన్నుగడ దైవ మిచ్చె పచ్చిసేసేనా ॥చెయ్యి॥ 427

---

1. ఈ 'వంటి'కి క్రియావిశేషణమగు 'వలె' అని యర్థమా?

బౌళి

అప్పుడు గాని కానరా దాయములుఁ బాయములు
రెప్పలెత్తి చూడఁగానే రేసు లింకా నేలరా ॥ పల్లవి ॥

వచ్చి వచ్చి మామీఁద వలపే చల్లేవుగాని
చొచ్చి నారతిఁ జెనకి చూడవేలరా
మచ్చికల నాలోనిమననే చూచేవుగాని
ముచ్చట నీతేనెగారేమోవి ఇయ్యవేలరా ॥ అప్ప ॥

మాటకు మునుపనే మందులు నూరేవుగాని
గాఁటపుగుబ్బలకు దగ్గరవేలరా
చీటికిమాటికి నాతో సిగ్గులే పడేవుగాని
నాటనిసెలవులను నవ్వ వింక నేలరా ॥ అప్ప ॥

చల్లనికాఁగిటిలోన చవులే చెప్పేవుగాని
అల్లిబిల్లి తగుఁదగదన వేలరా
యెల్లగా శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
బల్లిదుఁడు నిమిషముఁ బాయ విఁక నేలరా అప్ప 428

సామంతం

ఇంత నీకు వెఱపేల ఇద్దరిఁ గన్నులఁ గంటి
యెంతైనా నీహితవే ఇటు నాహితవురా ॥ పల్లవి ॥

యెవ్వతెకు నీవు మోహించి వుండినాను
నివ్వటిల్ల నాకె నాకు నీమానే
జవ్వనియెవ్వతెతోడ సారె నీవు నవ్వినాను
నవ్వుగాదు అది నీవు నాతో నవ్వుతరా ॥ ఇంత ॥

ఇద్దరు మీరేకతాన నేమి మాటలాడుకొన్నా
ముద్దుల నవి నాతోడి ముచ్చటలురా
గద్దించి యెవ్వతె నిన్నుఁ గాగిలించుకొన్నాను
కొద్దిమీరినట్టివే నాకూటములురా ॥ ఇంత ॥

చెక్కునొక్కి యెవ్వతైనాఁ జేఁత నిన్నుఁ జేసినాను
అక్కరతో నాచేఁత లవియెల్లారా
ఇక్కువతో శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
నిక్కముగ వారెల్లా నే నొకతెనేరా ॥ ఇంత ॥ 429

శంకరాభరణం

సరిమోహా లిద్దరికి సాటికిఁ బెనఁగఁ జొచ్చె
వరుసతో జవ్వనము వావెరుఁగునా ॥ పల్లవి ॥

పొంచి నీతో నవ్వఁబోతే పోఁకముడి నాకు జారీ
నించి యంతలోఁ జెమట నీకుఁ గారీని
పంచలఁ జెలులివి చూచి పకపక నవ్వేరు
చించుకొని వలపులు సెగ్గెరుఁగునా ॥ సరి ॥

మాట నీతో నాడఁబోతే మర్మములు గరఁగె నాకు
గాఁటమై నీ కంతలోనే గరుపారెను
తేటతెల్లమాయనంటా తెలివ లాడుకొనేరు
వాఁటమైన మనసిది వాసెఱుఁగునా ॥ సరి ॥

కాఁగిట నిన్నుఁ గూడఁగా కళదాఁకె నాకు నేఁడు
మూఁగినపరవశాలు ముంచె నీకును
చేఁగదేరఁ గూడితిమి శ్రీవేంకటేశ మనము
దాఁగరాని రతులివి తతెఱుఁగునా ॥ సరి ॥ 430

సామంతం

కైకొనఁగవచ్చుఁగాని కడమవెట్టఁగరాదు
దీకొని యిన్నియుఁ దానే తెలుసుకొమ్మనవే ॥ పల్లవి ॥

పొందుసేయఁగవచ్చుఁగాని పురివిచ్చి పాయరాదు
అందునుండే యెదమాట లాడుటే చాలు
అంది నవ్వవచ్చుఁగాని అఁపరాదు తమకము
చందమామగుటుకలే చాలుఁజాలుననవే ॥ కైకొ ॥

కన్నులఁ జూడఁగవచ్చు కాఁకలఁ బొరలరాదు
విన్నవినుకులలోనివేడుకే చాలు
మన్ననఁ బొందఁగవచ్చు మరితీలుపడరాదు
సన్నలచాయలనుంటే జాణతనమనవే ॥ కైకొ ॥

చిత్త మియ్యఁగవచ్చుఁగాని సిగ్గునఁ బడఁగరాదు
పొత్తులవలపుతోడిభోగమే చాలు
యిత్తల శ్రీవేంకటేశుఁ డింతలోనె నన్నుఁ గూడె
కొత్తలాయ నిన్నియును గుఱుతాయననవే ॥ కైకొ ॥ 431

రేకు 975 భైరవి

నీవూఁ బోయి వెదకరా నిలుచుండనేల యీడ
తేవల నామాట గల్లైతే మఱిరారా ॥ పల్లవి ॥

చెప్పేరా నీకొకసుద్ది చెవులపండుగఁగాను
ఇప్పు డొకతె వెదకె నిందాఁకా నిన్ను
వొప్పగుదోమతెరలో నున్నదో కాక నీ—
చప్పరమాళిగెలోన సరి నొంటి నున్నదో ॥ నీవూఁ ॥

ఇచ్చెరా నీకొొకమేలు ఇదివో వొకతె వచ్చి
గచ్చుల నీపేరఁ గమ్మ గట్టిపోయను
మెచ్చులనీమాణికాలమేడపై నెక్కున్నదో
ముచ్చటసింగారవనములోన నున్నదో ॥ నీవూఁ ॥

అంటెరా పాదములు ఆకె నీవురముమీఁద
నొంటులు నోదించ వచ్చి చొచ్చేనంటాను
నంటుసేసి యప్పటిని నన్నుఁ గూడితివి నేఁడు
దంటవు శ్రీవేంకటేశ తా నిన్ను నేమన్నదో ॥ నీవూఁ ॥ 432

పాడి

[1]ఒకటొకటికి మాట వొనగూడెనే
వొకటి కినుమడౌరా వుప్పొలికితేను ॥ పల్లవి ॥

మఱచితినే మేను మంచినీమాటలకే
మఱవక బోయపగా మముబోఁటికి
కరఁగెనే నామనసు కాయము పన్నసోఁకితే
కరఁగఁ గరఁగ వన్నె కనకమౌఁ గదరా ॥ ఒక ॥

విడువఁజూమ్మీ నీవేడుకపొందు
విడువ ముడువ నేమి విసమా ఇది
కడిగినట్టు చెమట గారె నామేను
కడుగఁ గడుగ రొంపి కడచోట నీకు ॥ ఒక ॥

చిగిరించెఁ బులకలు చెక్కుల నాకు
చిగురుఁగొమ్మ చేఁగె చెప్పితే నిన్ను
తగిలితి శ్రీవేంకటోత్తముఁడ నిన్ను
తగులువిరికూటములు తార్కాణ నాకు ॥ ఒక ॥ 433

1. ఇది వాకోవాక్యము

శంకరాభరణం

మించి యెప్పుడును నేము మీవారమే
కంచపుపొత్తు గలసి కసిగాటులేఁటికే ॥ పల్లవి ॥

చిక్కనివెన్నెలతేట చిందీ నెలవులను
చెక్కుమీఁది చేయేల చెలియ నీకు
మొక్కళపుఁదుమ్మెదలు మూఁగీఁ గన్నులతుద
ముక్కునఁ గోపములేలే ముట్టినంతలోననే ॥ మించి ॥

పూఁపలుఁ బిందెలు నట్టెపొదమెఁ బయ్యదలోన
కైపునేసీ నీనడుమఁ గరవేఁటికే
పైపైఁ బదారువన్నెపసిఁడిపొడి రాలీని
కోపపుగుంపెనలేలే కొంగు వట్టితేను ॥ మించి ॥

నిలువు నూరుఁ బండీని నిచ్చలు నీసింగారాలు
తలకొన సిగ్గులలో దాఁగేవేలే
యెలమితో శ్రీవేంకటేశుఁడ కూడితి నిన్ను-
నలివేణి మఱపేలే ఆయ మంటితేను ॥ మించి ॥ 434

లలిత

పెళ్ళిచెట్టు మందుగాదు పెద్దకొండ లెక్కి తెచ్చే-
నెల్లిచెట్టు చవిగాక నేమేల నీకు ॥ పల్లవి ॥

చెచ్చెరఁ బోరువెట్టినసితకమ్మ వుండఁగాను
నిచ్చలుఁ బ్రియముచెప్పేనేమేల నీకు
చొచ్చి వలచివచ్చిన సుప్పనాతి వుండఁగాను
నెచ్చెలినై పాయకుండేనేమేల నీకు ॥ పెళ్ళి ॥

పట్టితెచ్చినచెరలు పదారువే లుండఁగాను
[1]నిట్టిపిడిమేనదాన నేనేల నీకు
గుట్టున వెలవెట్టనిగోపసతు లుండఁగాను
నెట్టన వుంకువగొన్న నేమేల నీకు ॥ పెళ్ళి ॥

బూతుమాటలకుఁ జిక్కి పురసతు లుండఁగాను
నీతితో బుద్ధులుచెప్పేనేమేల నీకు
యీతల శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
నీతోఁ గాదనఁబోతే నేమేల నీకు ॥ పెళ్ళి ॥ 435

పళవంజరం

ఏలే నిష్ఠూరము లింత యేమిగట్టుకొంటి విందు
గాలిఁబోయేవాసనలు గంటుగట్టె నందురా ॥ పల్లవి ॥

అన్నువ నీమోము చూపి అంతలోనే దాఁచేవేమే
పున్నమచందురుఁడైనా పోదొ కరాత్రి
తిన్ననిగుబ్బలకు నాదిష్టి దాఁకెనంటాఁ గప్పి
యెన్నఁగ దిక్కులఁ గొండ కెండదాఁకీ నందురా ॥ ఏలే ॥

నవ్వునవ్వి కొంతగొంత నాతో దాఁచే విదియేమే
పువ్వువంటివెన్నెలైనాఁ బోదొకవేళ
జవ్వనముపైరు వి త్తి చాఁచి చేయిదీసేవేమే
మవ్వానఁ బారిననీరు మగుడించే నందురా ॥ ఏలే ॥

కోరి నాతో వచ్చేనని కొంకి ఇట్టే బొంకితివి
ఆరునెల్లుఁ గోయిలకూఁతైన నిజము
వేరులేక శ్రీవేంకటవిభుఁడ నేఁ గూడితిని
నారువోసి వలపులు నాటుకొనె నందురా ॥ ఏలే ॥ 436

---

1. 'నిట్టి' 'నిట్ట' కు మారురూపమా? వ్యావహారికమా?

లలిత

చేతికిలోనైనపతిఁ జేకొందుఁగాక
ఆతలివారిమాటల కానవెట్టనేలే ॥ పల్లవి ॥

అంది మాటాడకతొల్లె అవుఁగాములు చెల్లుఁగాక
అందముగాఁ గూడి విడనాడఁగనేలే
పందెములాడకతొల్లే బలుములు చెల్లుఁగాక
నిందమోపి యాతనినే నేరమెంచనేలే ॥ చేతి ॥

చేయిమోపకతొలుతే సిగ్గువడఁ జెల్లుఁగాక
కాయము లంటినమీఁదఁ గడమలేలే
రాయడి దవ్వులనుండే రాజసాలు చెల్లుఁగాక
యీయెడ మోమోము చూచి యెడమాఁటలేలే ॥ చేతి ॥

క్రొత్తవలపులకెల్ల గురుతులు చెల్లుఁగాక
హత్తి ననుపైనమీఁద నాసుద్దులేలే
యెత్తుక శ్రీవేంకటేశుఁ డింతచేసి నిన్నుఁ గూడె
పొత్తుగూడినమీఁదట బొరపొచ్చమేలే ॥ చేతి ॥ 437

రేకు 976 కన్నడగౌళ

ఇంకనేల మారుమాట లింతితోను
లంకె చేసుకొనె చెలి లావులకే పెనఁగి ॥ పల్లవి ॥

మాటలతేనెలతీపు మరిగి । నిన్నుఁ
గాటుక కన్నులఁ జూచీ కలికి
పాటించి నీనవ్వులకే భ్రమసి అట్టె
నాటించె గుబ్బల నిన్ను ననుపుతోఁ గదిసి ॥ ఇంక ॥

త_త్తరాన నీమన్నన దలఁచి
హ_త్తి చేతులె_త్తి మొక్కి నతివ
వొ_త్తినసీకొనగోరి కులికి
గు_త్తపు నీకొంగువట్టె కొంత గొంత కరఁగి ॥ ఇంక ॥

తెల్లమి నీరతులెల్లాఁ దెలిసి
వుల్లము నీకొప్పగించె నువిద
కొల్లగా శ్రీవేంకటేశ కూడితివి। యీకె
పల్లదాన నిన్నుఁ గూడె బాసగొనెఁ గొసరి ॥ ఇంక ॥ 438

సామంతం

తనకే సంతోసమైతే దప్పితో నేనుండరాదా
పొనిఁగి యెట్టుంటిమేమి పొమ్మనరాదా ॥ పల్లవి ॥

రాకుంంటేఁ దా మానెఁగాక రతిరాజుయేట్లకు
చేకొని ములుగరాదా సిగ్గుతో నేము
ఆకెకే మోహించుఁగాక ఆపసోపపుఁదాపాన
చీకాకుపడి నాలోఁ జిన్నఁబోరాదా ॥ తన ॥

పవ్వళించుఁగాక తాను పంచ౯నే కాచుకుండి
అవ్వల నాలో నుస్సురనఁగరాదా
దవ్వులై_తే నాయఁగాక తలఁపులో దన్నుఁ జూచి
పువ్వువంటికోరికతో పొద్దుగడపరాదా ॥ తన ॥

పరాకై_తే నాయఁగాక పట్టి తనకాఁగిటిలో
సరాగానఁ గూరిములు చల్లఁగరాదా
విరాళిఁ గూడెను శ్రీవేంకటేశుఁ డిటు నన్ను
సురాళమైనరతిఁ జొక్కి వుండరాదా ॥ తన ॥ 439

సామంతం

మిక్కిలిపంతాలు నేఁడు మీతోనేలే
పక్కనఁ బైఁడమ్ములిడఁ బారవేయవలెనా ॥ పల్లవి ॥

ఆయలేరే యెదమాట లఁ(లం?)దరికిఁ జెప్పనోప
చేయిముం చాతనిఁ గండేఁ జెప్పేలేరే
వేయకురే వాల నాపై వెన్నెలగలప్పుడే
ఆయెడ నల్లునేరేళ్ళనుట యెఱఁగరా ॥ మిక్కి ॥

వింటిలేరే మీమాట వీనులు చొరవు నాకు
అంటిముట్టి పతిఁ గండే నడిగేఁ బోరే
కంటకము లాడకురే గాలిగలయప్పుడే
తొంటిబాస వెళ్ళనాడి తూరుపెత్తే నిఁకను ॥ మిక్కి ॥

వచ్చిఁ బిలువకురే వడి నిట్టె విచ్చేసితేఁ
గొచ్చి శ్రీవేంకటపతిఁ గూడే నేను
విచ్చనవిడినే యేళ్ళవెనకవే చాళ్ళవుత
తచ్చితచ్చి కాఁగిటిలోఁ దారుకాణ లాయను ॥ మిక్కి ॥ 440

ఆహిరి

శిరసుండ మోకాల శేస యేఁటికి
సరసము లాకెపైనే చల్లరాదా నీవు ॥ పల్లవి ॥

ఆకెతో మారుత్తరము లాడరాదా విచ్చేసి
పైకొని మమ్మే వాదఁబరచే వీడ
యీకడ మాకుఁ బ్రియము లేలచెప్పే వింతేసి
తూకొని మొక్కఁగరాదా తొయ్యలికే నీవు ॥ శిర ॥

అంగనతో వచ్చేనంటా నానవెట్టుక రారాదా
వుంగిటి మాతో వట్టివాస్లేఁటికి
సంగతిగానిమాతోడి[1] జాణతనా లేమిటికి
కంగువాయఁ జెలితోనే కడునవ్వరాదా ॥ శిర ॥

వొక్కమారే ఆకెమీఁద నొరగుకొనఁగరాదా
వెక్కసాన మాపైఁ జేయివేయ నేఁటికి
ఇక్కువ శ్రీవేంకటేశ ఇంతి నేఁడు గూడితివి
పక్కన నెన్నఁడు నింకఁ బాయకుండరాదా ॥ శిర ॥ 441

## శ్రీరాగం

నాకుఁ జేసినదియెల్లా నడుమ నీదేకాదా
దాకొని యిన్నియును నేఁడు తారుకాణలాయఁగా ॥ పల్లవి ॥

కందువ నీవిరహాగ్నిఁ గాఁగినట్టినామేను
యిందు నీకాఁగిటికి నెక్కెఁగా నేఁడు
అంది కడువేఁడిగాఁగా నలిగి చూచినచూపు
సందడినీకూటములో చల్లువెదలాయఁగా ॥ నాకుఁ ॥

తెగి నీతో వాదడచి తిట్టుకొన్న యీనోరే
నగి నీతో మాటలాడ నసుపాయఁగా
చిగురుచింతలచేఁ జెక్కుచేరిచినచేయి
పగటున నేఁడు చెట్టపట్టఁగఁ బాలాయఁగా ॥ నాకుఁ ॥

వడి నీవు పిలువఁగ వంచినట్టియీశిరసు
అడరుమోవితేనియ లంది ఇచ్చెఁగా
యెడలేక శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
విడువనిసిగ్గులెల్లా విడిపించితివిగా ॥ నాకుఁ ॥ 442

1. 'తోఁడ'కు, 'తోఁడి' అని అక్కడక్కడ గలదు.

లలిత

ఏల రేచీ నన్ను నింత యేమనినా వెగటౌను
గాలి మూటగట్టఁబోతే కడునవ్వుఁబాట్లు ॥ పల్లవి ॥

మారుమాట లాడఁబోతే మనసునొచ్చీఁ దనకు
కేరికేరి నవ్వఁబోతే కేరడమౌను
తారుకాణించఁగఁబోతే తనకుఁ గొరఁతవచ్చు
నేరనైతి నాఁడే నాఁడే నిజము నిష్ఠూరము ॥ ఏల ॥

కనుఁగవ నవ్వఁబోతే కడువెంగెమౌఁ దనకు
కొనగోర నంటఁబోతే కోపమునౌను
చనవునఁ దిట్టఁబోతే జగడాలు ముదురును
వినకున్నాఁ జెప్పఁబోతే విందువెట్టీఁ బగలు ॥ ఏల ॥

కదిసి మోవడిగితే గంట్లు తనకు రాఁగు
పదరి కాఁగిలించితే పచ్చిదేరును
అదన శ్రీవేంకటేశుఁ డంగవించి నన్నుఁ గూడె
అద నెరిఁగినయడుగకుగే నిక్షేపము ॥ ఏల ॥ 443

రేకు 977 రామక్రియ

చాయలసన్నలఁ దన్ను సాదించనేలే
పోయినదే పొల్లుగాక పురివిచ్చ నేఁటికే ॥ పల్లవి ॥

కాయమిది తనసొమ్ము కాఁకలే నాసొమ్ము
ఆయాలు మోవఁ దన్ను నాడనేఁటికే
నేయరానిచేఁత చేసె చెక్కుచేయి నాకు వచ్చె
దాయగాఁడు తనతోడిదంటతన మేఁటికే ॥ చాయ ॥

మనసెల్లాఁ దనసొమ్ము మచ్చికలే నాసొమ్ము
చెనకి తన్నంత రట్టుసేయ నేఁటికే
తనకే నిఘర యెచ్చె తగె నాకు జాగరాలు
ఘనుఁడు తన్నింక నే గద్దించఁగలనా ॥ చాయ ॥

కాఁగిలిదె తనసొమ్ము కళదాఁకేది నాసొమ్ము
తోఁగి చూచి తనతోడి దొమ్ము లేఁటికే
వీఁగక శ్రీవేంకటాద్రివిభుఁ డిట్టె నన్నుఁ గూడె
పాఁగితి నే నన్నిటాను పంతమాడ నేఁటికే ॥ చాయ ॥ 444

తెలుఁగుకాం(ఁగాం?)బోది

ఏల వట్టిబోలిసేసే వేమిగట్టుకొంటి విందు
కాలమందె యీమేలు గట్టుకొనరాదా ॥ పల్లవి ॥

వండవండనట్లాయ వలచినతరితీపు
యెండమావులాయ నీపై నెచ్చినయాస
వుండ దీయాసలఁ జెలి వొగి నే వచ్చినదాఁకా
అండనే ఇంకొకమాట ఆనతియ్యరాదా ॥ ఏల ॥

పుచ్చఁబుచ్చ పున్నమాయ పూఁచిననీసరసాలు
వచ్చీరానిపాటలాయ వట్టిప్రియాలు
ఇచ్చల నే వచ్చేనంటా నిందుకే కాచుకున్నది
అచ్చముగ నన్ను నాడ కంపివిడరాదా ॥ ఏల ॥

వూరవూర నూటలాయ వొప్పగు నీమోవితేనె
చేరఁ జేరఁ జేరువాయ చెలికాఁగిలి
యీరీతి శ్రీవేంకటేశ ఇద్దరుఁ గూడితి రీడ
సారెకు నీపొందు లిట్టె జరపఁగరాదా ॥ ఏల ॥ 445

ఆహిరి

ఇటు చేసినదేవర నేమని మెత్తు నే నిఁక
కటకటా నే నిందుకే కరఁగుచురా ॥ పల్లవి ॥

తనువులే వేరులై తలఁ పొక్కటైనమీఁద
ననిచి నిన్నేమనినా నన్ను [1] నంటేపో
వెనుకొని నీవు రానివేళ గోపించఁబోతే
జునిగి నాగుండె నాకే చుఱుకనురా ॥ ఇటు ॥

వయసులు సమములై వావులు గూడినమీఁద
నయమై నీమేలెల్లా నామేలే పో
ప్రియము చెప్పేవేళ పెనఁగఁగఁబోయి నేనే
దయదలఁచి నీమీఁదఁ దమకింతురా ॥ ఇటు ॥

కాఁకల నిందాఁకాఁ బొంది కాఁగిటఁ గూడినమీఁద
యేఁకట నీ కెంతగల్లా నిది నాదేపో
సోఁకుల శ్రీవేంకటేశ చొక్కించితివి నన్ను
వేఁకపుగుబ్బలముద్ర వేసితి నీపైరా ॥ ఇటు ॥ 446

మాళవశ్రీ

నీ వేమిసేతువయ్యా నేరమి నాదే కాక
కావిరి నాయాసలకుఁ గడపు లేదు ॥ పల్లవి ॥

కొంతవడి నీరాక గోరుదు నీవు వచ్చితే
అంతమీఁద నీతో మాటలాడఁగోరుదు
చెంత మాటలఁ దనిసి చేయివేయఁ గోరుదు
దొంతుల నాయాసలకు తుద యెందు లేదు ॥ నీవే ॥

1. అంటే=అనుటే?

ముచ్చట నొకవేళ నీమోము చూడవలె నందు
వచ్చి యామీఁద నీమోవి వలె నందును
కచ్చుపెట్టి రాఁగా రాఁగాఁ గాఁగిలించవలెనందు
అచ్చపునాయాసలకు నరకువే లేదు ॥ నీవే ॥

మేనులంటినట్టిచోట మేలములే కొసరుదు
కోనల నప్పటి రతి గొసరుదును
కానీలే శ్రీవేంకటేశ కైకొని కూడితి నన్ను
మేనిలోనియాసలకు మితి మేర లేదు ॥ నీవే ॥ 447

లలిత

ఇచ్చకమాడితే మీకు నేమిదోసమాయ నేఁడు
అచ్చమైనమీకు మాతో నంతచలమేలే ॥ పల్లవి ॥

చెప్పకురే చెలులార చెలువుని మానుమని
అప్పుడే వీనులకు వెట్టయి తోఁచీస
తిప్పకురే నామనసు తెమ్మలుగా వలచితి
నెప్పున నేఁ బాయ వట్టినిష్ఠూరమేలే ॥ ఇచ్చ ॥

తీయకురే చేయివట్టి తెగి వానింటికిఁబోఁగా
కాయమెల్ల నిందువంకఁ గాఁకరేఁగిని
పాయ మాతని కిచ్చితి పంతానకు దక్కితిని
యీయెడ వట్టికయ్యానకేల పెనఁగేరే ॥ ఇచ్చ ॥

వుప్పతించకురే వానివద్ద నేఁ గూచుండఁగాను
రెప్పలఁ గోపము మీపై రేసులెక్కీని
చొప్పుగ శ్రీవేంకటేశుఁ డూరడించి నన్నుఁ గూడె
కప్పర మియ్యరే మీలోఁ గడమ లింకేలే ॥ ఇచ్చ ॥ 448

రామక్రియ

పొన్నలలో వేగెఁ బొద్దు పోసీవే యిఁక
కన్నదె కంటి గురుమ కానీవే యింక ॥పల్లవి॥

వంచించి యెందు వోయినా వచ్చీఁగానీ తా నీదకు
పొంచి యానలువెట్టక పోసీవే యింక
యెంచరాదు పంచరాదు యివే మింటిపై చుక్కలు
కంచుపెంచుమాటలాడీ కానీవే ఇంక ॥పొన్న॥

యీరీతి మాయింటిగుఖు తెలిఁగఁడా తానేమి
పోరి సారెఁ బిలువక పోసీవే యింక
నీరులేదు మేరలేదు నిండినయెండమావులు
కారపువలపు చల్లీఁ గానీవే యింక ॥పొన్న॥

యెందుండి వచ్చినారానీ యేమనినా నియ్యకొనే
పొందులెల్ల నొనగుదె పోసీవే యిఁ(యిం?)క
విందువలె శ్రీవేంకటవిభుఁడు నన్నుఁ గలసె
కందుకుందులెల్లాఁ బాసె కానీవే ఇంక ॥పొన్న॥ 449

రేకు 978 కాంబోది

పట్టకురా ముట్టకురా పసలేనిపనులకు
యెట్టువలసినా వచ్చు నిదివో చేసన్నలు ॥పల్లవి॥

అంతనవ్వు నవ్వకురా అలవాటయ్యీ నీకు
బంతినే రాఁగా రాఁగా భావము లౌను
రంతులు సేయకురా రచ్చకెక్కీఁ బనులెల్లా
ఇంతటిమీఁదటిపను లిపుడే చెప్పేను ॥పట్ట॥

నన్ను నంతమెచ్చకురా నాటకమే నిజమౌను
నిన్ను నన్ను నెంచుకొంటే నిక్కము లౌను
మిన్నక దగ్గరకురా మితిమీరుఁ దమకము
కన్నసుద్ది చెప్పకున్న కడుఁగడుదోసము ॥ పట్ట ॥

వోరగండ్లఁ జూడకురా వుపమే నెపమౌను
సారెకు రతులమీఁద చలమెక్కును
యేరా శ్రీవేంకటేశ యింతలో నన్నుఁ గూడితి
కోరినకోరికలెల్లాఁ గొఱఁత లేదిఁకను ॥ పట్ట ॥ 450

ఆహిరి

ఇదివో నావంకఁ దప్పు ఇంతే మరేమీ లేదు
యెదురుగాఁ బైకొన్న దిది నేరమాయను ॥ పల్లవి ॥

వొంటిఁ దనతో వెంగె మొకమాటు నాడక
కంటగించి తా ముట్టితేఁ గసురుకొనక
దంటతనానఁ జెలులఁ దారుకాణ సేయక
ఇంటిలో నే నూరకున్న దిది నేరమాయనే ॥ ఇది ॥

యెందువోయినా వెంట నింతుల నే నంపక
కందువ మైకాఁకలకుఁ గాఁతాళించి పడక
సందడించి వేగుదాఁకా జాగుల నే పెట్టక
ఇందు రమ్మని పిలుచు టిది నేరమాయనే ॥ ఇది ॥

అట్టే కాఁగిలించరాఁగా నవ్వవిమోము గాక
వెట్టగా రతులఁ దన్ను వెస నలయించక
గట్టిగా శ్రీవేంకటేశుఁ గలసితి నీవేళ
ఇట్టె పైఁ గాలుమోఁచీ నిది నేరమాయను ॥ ఇది ॥ 451

ఆహిరి

అడుగరే చెలులాల ఆతనినే యీమాట
యెడసినవిరహము యెవ్వరిదో కాని ॥ పల్లవి ॥

చూపులలోపలియాస చూచుదాఁకా వేగిరము
యేపునఁ దనకు నాపై నెట్లోకాని
ఆపైఁ జన్నులయాస అంటుదాఁకా వేగిరము
వోపిక దనకుండునో వుండదోకాని ॥ అడు ॥

మనసులోపలియాస మాటాడుదాఁకా వేగిర—
మెనలేనితనకిఁక నెట్లోకాని
తనువుమీఁదటియాస దగ్గుదాఁకా వేగిర—
మనుగు తనకు సమ్మతౌనో కాదో ॥ అడు ॥

కాఁగిటియాస రెంటెము గప్పుదాఁకా వేగిరము
యేఁగివచ్చెఁ దనకైతే నెట్లోకాని
వీఁగక శ్రీవేంకటాద్రివిభుఁడు నన్ను మన్నించె
చేఁగవేరె వలపులు సిగ్గులేవో కాని ॥ అడు ॥ 452

శంకరాభరణం

సరికిబేసికి మీరు చలము లింకానేలే
సరసములు విరసములు చొకగదే ఇపుడు ॥ పల్లవి ॥

మనసులోపలిగుట్టు మాటలలోపలిరట్టు
చనవుగలపతితోడ జరపఁదగునా
కొనచూపులో కొసరు గొణఁగులో నసురుసురు
మునుపనే [1]పతికి పతి ముంచెఁగదె అతఁడు ॥ సరి ॥

---

1. 'పతికి ప్రతి' అనుటకు వ్యావహారికము.

సెలవిలోపలి నగవు చేసన్నలో బిగువు
పిలువఁగాఁ బతితోడ పెంచఁదగునా
నిలువులో నివ్వెరగు నిండుఁజెమటలకరఁగు
చలివాయ నీమీఁదఁ జల్లెఁగదె అతఁడు ॥ సరి ॥

పచ్చిదేరేటియాస పదరి అడిగెడిబాస
ముచ్చట శ్రీవేంకటేశు ముంచఁదగునా
పెచ్చువెరిగేటి ప్రియము బిగువుఁ గాఁగిటినయము
నిచ్చలును నీమీఁద నెరపుఁగదె అతఁడు ॥ సరి ॥ 453

మాళవిగౌళ

అంపవయ్యా నేఁ బోయే నట్టని వావాత
తెంపున నాయంతనైతే తెగరాదు పనులు ॥ పల్లవి ॥

కోపము గాదుగదా గొబ్బున నే వచ్చినది
ఆపెతో నీ వేకతము లాడేవేళ
చేపట్టి నేఁ దొలఁగితే సిగ్గువుచ్చినట్టయ్యీ
యీపొద్దు నీవద్దనుంటే నేమౌనో నీయాస ॥ అంప ॥

యెగ్గు లెంచవుగదా ఇట్టె ముసుఁగు దీసితే
వొగ్గి ఆకెతోడిరతి నున్నవేళను
కగ్గి కమ్మరఁ గప్పితే కల్ల మోపినట్టయ్యీ
నిగ్గుల నే నూరకున్న నీ కెంతవెఱపో ॥ అంప ॥

నేరమి గాదుగదా నే నిన్నుఁ గాఁగిలించితి
నేరపున నాకెఁ గూడి నిద్రించేవేళ
యేరా శ్రీవేంకటేశ యెఱఁగనట్టె నన్ను
యీరీతిఁ గూడితివి నీ విక(క్క-?)డి మోమగుచు ॥ అంప 454

పాడి

దూతికలకు నీతోఁ బొద్దులు వుచ్చఁదగునా
నీతిగాదు యీడనుండే నింద వచ్చుఁజుమ్మీ ॥ పల్లవి ॥

యేమని చెప్పుదు నేను యింతితో మారుమాటలు
నేమాన నన్ను నంపవు నీవును రావు
కోమలినే రమ్మందునో కొంత వోరుచుమందునో
జాము వోయె నంపరాదా చాలుఁజాలు తడవు ॥ దూతి ॥

నేను వచ్చినపనికి నెలఁత కుత్తర మేది
పూని నాచేయి విడువవు పొందు గానము
నీనవ్వులు నెరపేవో నిజమును నిట్లనో
కానీలే మమ్మంపరాదా కడుబలి మేఁటికి ॥ దూతి ॥

అంతేకదా ఆపెతోడి ఆడుకోలుమాట నీకు
ఇంతివాకిట నిలిచే వేమో నవ్వేవు
పంతాన శ్రీవేంకటేశ పడఁతిఁ గూడితి విట్టె
పొంతనే మమ్మంపరాదా పొసఁగె మాపనులు ॥ దూతి ॥ 455

రేకు 979 సాళంగనాట

నీ వెఱఁగవా యింత నిండుదొరవు
చేవలే చిగురులౌను సిగ్గునమంటేను ॥ పల్లవి ॥

అంటి విడె మిచ్చేవు అందుకొనకుండరాదు
వెంటనే పెండ్లికో వీడుకోలుకో
వొంటి నున్నదాన నేను వొకరు సాకిరి లేరు
ఇంటివా రేమందురో నే నియ్యకొంటేఁగనక ॥ నీవె ॥

చెక్కు గోర నదిమేవు చేయివట్టి తోయరాదు
పక్కనఁ గూరిమికో పగసేసేవో
చిక్కితి నీపాల నేను చెప్పిచూప నెడలేదు
వొక్కట గురుతుపడి వూరకుండితేను ॥ నీవె ॥
కాఁగిలించవచ్చేవు కాదని తొలఁగరాదు
ఆఁగినజెట్టిసామో అంగరతియో
మూఁగుచు శ్రీవేంకటేశ ముంచి నన్నుఁ గూడితివి
కాఁగి ఇఁకనేమన్నా కైతప్పులౌను ॥ నీవె ॥ 456

సాళంగం

[1]అళగరి చక్కనళగరి వోయళగరి
తలఁచుకోర నామాట తారుకాణసుమ్మీ ॥ పల్లవి ॥
అలిగితేఁ బోనీదు ఆకెకు లోనైనమీఁద
వలపు రేఁపుచు నిన్ను వంచుఁగాని
పలుకక పోనీదు పక్కననవ్వినమీఁద
సళుపుఁజూపులు నీపైఁ జాఁచుఁగాని ॥ అళ ॥
చవులుచూపకపోదు సరసమాడినమీఁద
చివురుఁగెమ్మోవి గంటిచేసుఁగాని
అవల మాటాడనీదు అతివఁ జేకొన్నమీఁద
తివిరి నీవెంటవెంటఁ దిరుగాడుఁగాని ॥ అళ ॥
నిన్ను మెచ్చించకపోదు నెలఁతఁ గూడినమీఁద
కన్నులు దేలగిలంగఁ గరఁచుఁగాని
అన్నిటా శ్రీవేంకటాద్రి నళగుఁదిరుమలను
కన్నె నీవురముమీఁదఁ గాఁపురమౌఁగాని ॥ అళ ॥ 457

1. *அழகிய கிரி* అని అరవము. ఇదియే 'అళగరి' కావచ్చు. అళగిరి సింగం అని అహోబిల నృసింహస్వామికి పేరు. అళగిరి=అందమైనకొండ. అదే స్వామికి పేరై యుండవచ్చు.

ఆహిరి

నే నొకటి సేయఁబోతే నేరుపు వేరొకటాయ
నానెను వలపులెల్లా నాఁడెనాఁడే అయ్యా ॥ పల్లవి॥

మొక్కఁబోఁగానేపో ముంచినపయ్యద జారె
గక్కన నీతో నవ్వఁగాఁ గారెఁ జెమట
వెక్కసాన మాటాడఁగా వేఁడినిట్టూర్పులు రేఁగె
యెక్కడిగొడవ మాఇంట నుండేనయ్యా ॥ నేనొ ॥

దగ్గరి రాఁగాఁబో తనువెల్లాఁ బులకించె
సిగ్గువడఁగానేపో చింతరేఁగెను
వొగ్గి విడె మియ్యఁగాఁబో వొడలెల్లాఁ గాఁక పుట్టె
యెగ్గుతప్పులకు నోప ఇంటనుండేనయ్యా ॥ నేనొ ॥

కాఁగిలించఁగానేపో కళదాఁకె మేనెల్లా
రాఁగుఁదమకాననేపో రచ్చకెక్కెను
పాఁగిన శ్రీవేంకటేశ పైపైఁ గూడితి నిన్ను
[1]యేఁగుఁబెండ్లితో మాయింట నుండేనయ్యా ॥ నేనొ ॥ 458

లలిత

ఆడకే నె వచ్చినప్పు డయ్యీఁగాని
బూడిద వసంతమాడఁ బొమ్మనవే వానిని ॥ పల్లవి ॥

వలపు జాతెఱఁగదు వాసి నీతి యెఱఁగదు
కలిమి ముందువెనక గాననియ్యదు
తెలిసితేఁ బసలేదు దిష్టమాయ మాకిన్ని
పొలసి కొసరనేల పొమ్మనవే వానిని ॥ ఆడ ॥

1. పెండ్లి మెరవణి.

కోపము దయయెఱఁగదు కూటమి సిగ్గెఱఁగదు
తీపులమోవి దప్పితీరనియ్యదు
రాఁపుసేయఁ బనిలేదు రచ్చకెక్కెఁ బనులెల్లా
పోపో అదేడసుద్ది పొమ్మనవే వానిని ॥ అద ॥

పాయము భీతెఱఁగదు పంతము తన్నెఱఁగదు
చాయలసన్నలముద్దు చవెఱఁగదు
యీయెడ శ్రీవేంకటేశుఁ డిపు డిట్టె నన్నుఁ గూడె
పోయి ఇట్టే వచ్చీఁగాని పొమ్మనవే వానిని ॥ అద ॥ 459

రామక్రియ

పాపమంటాఁ బాలిచ్చితేఁ బైపై నోకిలింతలాయ
కోపము శాంతముతోడఁ గూడెఁగా నీచనవు ॥ పల్లవి ॥

నిండినది నామనసు నీమేఁద నేపొద్దు
పండెను నాకెమ్మోవి పంటలుగాను
వండ వండనట్లాయ వలపులు నీకైతే
యెండలు నీడలు నాయ నిదివో నీకరుణ ॥ పాప ॥

ననిచెను నాచూపు నంటిననీమేనిమీఁద
మొనసెను నానవ్వు ముంచి నీతోను
పొనిఁగి పుచ్చఁగఁ బుచ్చ పున్నమాయఁ బొద్దు నీకు
ఇనుము బంగారమాయ నిదివో నీమాటలు ॥ పాప ॥

తతివచ్చె నాకు నీకు దగ్గరి కాఁగిటిలోన
ప్రతివచ్చె నిద్దరికిఁ బాయములివి
ఇతవైన శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
కతకుఁ గాళ్లవచ్చెఁ గలిగె నీమన్నన ॥ పాప ॥ 460

సామంతం

నీవెఱఁగనిబుద్ధులు నేము చెప్పేమా
భావమే యెరుఁగుఁగాన పచ్చినేయఁగలమా ॥ పల్లవి ॥

పూవువంటిది వయసు భోగించవలెఁగాక
చేవదేరే యీసిగ్గు చెల్లఁబోయెలే
మీవంటివారికా మీరరానివొట్లివి
దైవము దూరుతగాక తగదనఁగలమా ॥ నీవె ॥

కప్పురమువంటి దిట్టె కలిగె నీమోహము
నిప్పువంటి విరహము నీకేలే
యిప్పుడిది వేళా ఇద్దరి యెగ్గులకును
చెప్పరానిచేఁత మీచేఁ జేయించఁగలమా ॥ నీవె ॥

పండువంటిది మోవి పదరి చేకొంటగాక
కొండవంటికోపము చేకొన నీకేలే
అండనే శ్రీవేంకటేశు నలమి కూడితి విట్టె
మెండుననుండేటిమిమ్ము మెచ్చనైనఁగలమా ॥ నీవె ॥ 461

రేకు 980 బౌళి

ఏమని తా భావించునో యెరఁగ నేను
చీమక(ల?)దొంతరమేలు చిమ్మిరేఁగెననవే ॥ పల్లవి ॥

అప్పుడే వచ్చేనంటి నటు నావిభునితోడ
అప్పస మెవ్వతుండునో యని మానితి
కప్పుర మంపేనంటిఁ గదియ నీవిరహాన
వుప్పతిల్లుఁ దాపమంటా నూరకుంటిని ॥ ఏమ ॥

వీడెమిచ్చి యంపేనంటి వెలఁదిచేతఁ దనకు
ఆడ వేళదెలియక అంపనైతిని
వేడుక విరులబంతి వేసేనంటా నుంటి
ఆడ నవి మరునమ్ము లవునని మానితి ॥ఏమ॥

కాఁగిటఁ గూడినవేళఁ గళలు రేఁచేనంటి
మాఁగినరతుల నేనే మఱచితిని
చేఁగదేర నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు వచ్చి
దాఁగనినవ్వులు నేనే తనమీఁదఁ జల్లితి ॥ఏమ॥ 462

శంకరాభరణం

ఒక్కటే విన్నపమిది వున్నవెల్లా నేమిటికి
పక్కన విచ్చేయు మా కాపని గాదుసుమ్మీ ॥పల్లవి॥

తమకించినది చెలి తడవాయ నే వచ్చి
నిమిషము రాకున్న నీకే తెలుసు
చెమటలవెల్లి వారె చింతాజలధి నిండె
భ్రమసితి మిఁక మాకుఁ బనిగాదుసుమ్మీ ॥ఒక్క॥

చూపుల నున్నది యాస సుదతిమనసు లేఁత
యేపాటి గలఁగినా నిఁక నేమౌనో
మోపులాయఁ గోరికలు ముక్కున నూర్పులు రేఁగె
పాపము పుణ్యము మా కాపని గాదుసుమ్మీ ॥ఒక్క॥

దోమతెర మీకు మాటు తొయ్యలికి వినవచ్చు
యేమాటయిన నాడు ఇఁక మమ్మంపు
సామాన శ్రీవేంకటేశ సంధించి కూడితి విట్టె
భామ మెచ్చె నిఁక మా కాపని గాదుసుమ్మీ ॥ఒక్క॥ 463

సామంతం

నిండెను కళలు సతినిలువెల్లను
పండినజవ్వన మేరుపరచేటిదెల్లో ॥పల్లవి॥

చిత్తము చీఁకటివడె చెలి నిన్నుఁ బాయఁగాను
వొత్తులఁ జుక్కలుగానెఁ బులకలను
బిత్తరపుమోనానఁ బికములు గూండ్లెక్కె
వుత్తలాన కాంత కిఁక నుదయమౌ టెపుడో ॥నిండె॥

మెలుఁతకు కొప్పు వీడి మేఘములు ముంచుకొనె
జలజలఁ జెమటలజడి వట్టెను
కలువకన్నులు మంచికారుమెఱుఁగులు మించె
కలికికి వెలుతురు గనియేది యెపుడో ॥నిండె॥

పడఁతికి నీరాక పచ్చిగాలియై వీచె
చిడుముడిఁ గోరికలె చిగురించెను
యెడయక శ్రీవేంకటేశ ఇంతిఁ గూడితివి
కడఁగె వసంతవేళ కందువ యిఁకేదో ॥నిండె॥ 464

పాడి

నిచ్చా జగడమేల నీ వెఱఁగవా
యిచ్చట నీమేన నవే యియ్యకోరాదా ॥పల్లవి॥

తప్పనిబొంకనిమాఁట తలఁపులోపలితేఁట
నెప్పున నే నాడనేల నీ వెఱఁగవా
కప్పురవిడెముకాఁక కమ్మఁబులకలమూఁక
చొప్పువట్టిచ్చీ నద్దము చూచుకోరాదా ॥నిచ్చా॥

చుక్కలు నిండినమోవి సొలపుఁగన్నులకావి
నిక్కమౌత కల్లవుత నీవెఱఁగవా
ముక్కున నీబుసకొట్టు ముసిముసినవ్వులగుట్టు
దిక్కులవారి నడిగి తెలుసుకోరాదా ॥ నిచ్చా ॥

వుబ్బునఁజేసినచేఁత వాడలిపై గోరివాఁ(వ్రాఁ?)త
నిబ్బరపురతివేళ నీవెఱఁగవా
గొబ్బున శ్రీవేంకటేశ కూడితివి నన్ను నిట్టె
తబ్బిబ్బు తడఁబాట్లు దాఁచుకోరాదా ॥ నిచ్చా ॥ 465

గౌళ

అసురుసురుల నీకు నలపేఁటికే
వసమై యతఁడు నీవద్ద నుండీఁగాక ॥ పల్లవి ॥

యెలజవ్వనివి నీవు యేల చిన్నఁబోతివే
వలచినపతి నేఁడే వచ్చీఁగాక
నిలువునఁ దలవంచి నేలవాఁ(వ్రాఁ?)త లేఁటికే
చెలువపునీచనవే చెల్లించీఁగాక ॥ అసు ॥

చెక్కుచేతితోడ వట్టి చింతఁ బొరల నేఁటికే
వొక్కటై పతిఁగూడి నీ వుండేవు గాక
ముక్కున వేలుమోపి మోనపువెర గేఁటికే
మిక్కిలి విభుఁడు నిన్నే మెప్పించీఁగాక ॥ అసు ॥

పచ్చికస్తూరి నుదుటఁ బట్టుపెట్ట నేఁటికే
మచ్చిక నీరమణుఁడే మన్నించీఁ గాక
అచ్చపు శ్రీవేంకటేశుఁ డాతఁడే నిన్నుఁగూడె
యిచ్చట నొడఁబాటేలే యీడ నుండీఁగాక ॥ అసు ॥ 466

ముఖారి

కప్పురము దిననేల కడుఁజలిఁ బడనేల
అప్పటికి నాభాగ్య మంటి నంతె చాలును ॥పల్లవి॥

వద్దు వద్దు అంతలేసివట్టిచనవులు మాకు
పెద్దరికముతో నుండేబిగువే చాలు
తిద్దనేల నీగుణాలు తిట్టించుకొననేల
అద్దో యీడ నుండఁగా నైనపాటే చాలును ॥కప్పు॥

ఆయ నాయ జాణతనా లంతేసి కోప। నేను
చేయి చెక్కిటితో నుండేసిగ్గే చాలు
ఆయము లంటఁగనేల అద్దలింపించుకోనేల
చాయల సన్నలలోని సంతసమే చాలును ॥కప్పు॥

పట్టకు పట్టకు నీతో పంతము నెరపఁగనేర
గుట్టుతో నీసముకపుఁగొలువే చాలు
యిట్టె శ్రీవేంకటేశ యిదె నన్నుఁ గూడితివి
జట్టిగొన్న నీ మోవిచవులే చాలును ॥కప్పు॥ 467

రేకు 981 రామక్రియ

ఆతనిఁ గూడినప్పుడే అన్నియు సాదించవమ్మా
రాతిరాయ నిఁకనైనా రమ్మనవమ్మా ॥పల్లవి॥

అంపినమాట కుత్తర మానతియ్యవమ్మా
వంపుమోముతో నలుక వలదమ్మా
పంపుడుచెలుల మింతే పలుక విదేమమ్మ
చెంప జారినతురుము చెరుగుకోవమ్మా ॥ఆత॥

తమకించేపతితో సీతలఁపు లేమందుమమ్మ
కొమరుఁజూపులలోన కోపమేలమ్మా
జమళి నిద్దరి కూడిగముఁలవారమమ్మ
చెమరించె మేనెల్లాఁ జిన్నఁబోకువమ్మా ॥ అత ॥

యెదురుగా వచ్చు నాతఁ డిట్టె మమ్మంపవమ్మ
కదిసితి విఁక నీకుఁ గడుమేలమ్మా
యెదుట శ్రీవేంకటేశుఁ డేఁగివచ్చి నిన్నుఁ గూడె
వదలఁడు దిన మిట్టె వచ్చీ నోయమ్మా ॥ అత ॥ 468

పాడి

గక్కున నింట లేఁడి గానుగకాడ నున్నదా
నక్కువడ నిందుకేపో నవ్వితి నే ననరే ॥ పల్లవి ॥

తా నేడనుండిన నేమి తలఁ పొక్కటైనఁ జాలు
ఆనలు సత్యాలుఁ జెప్పి యంపవలెనా
దానికే మెదురుమాట తనతో నే నాడేనా
మోనాన నిట్టె తనకు మొక్కితి నే ననరే ॥ గక్కు ॥

యేదిక్కు చూచిననేమి యీడకు విచ్చేసెఁ జాలు
యీదెస నొడఁబరచ నింతవలెనా
కాదని తనచేఁతలు ఖండించఁజెల్లునా
వాదు లడువక తలవంచితి నే ననరే ॥ గక్కు ॥

అసురుసు రై తేనేమి అట్టె నన్నుఁ గూడెఁ జాలు
వసమై నాకిఁక వెరవఁగవలెనా
యెసఁగి శ్రీవేంకటేశుఁ డిన్నిటా నన్ను మన్నించె
రసికుఁడు తాను నారపమాయ ననరే ॥ గక్కు ॥ 469

ముఖారి

దగ్గరి కూడుటకంటె దవ్వులపొందే మేలు
సిగ్గుతో నున్నది చెలి చిత్తమిఁక ననవే ॥ పల్లవి ॥

చిత్తమును నీరుచేసె చిగిరింపించెఁ గోరిక
వుత్తలపువిరహాగ్ని వొప్పదా యేమి
హత్తి తనపొఁ(పొం?)దైతే నంగనమర్మము గాఁడి
వత్తివలె వాడించె(చి?) వడచల్లీ నిదివో ॥ దగ్గ ॥

తలఁపించెఁ దనరూపు తమకము పెడరేఁచె
వొలసి చెక్కిటిచేయి వొప్పదా యేమి
బలిమిఁ దనకాఁగిలి పడఁతిని భ్రమయించి
నిలువెల్లా మఱపించె నేర మిందుఁ గలిగె ॥ దగ్గ ॥

తఱవు రతికి రేఁచె తనువెల్లా నెచ్చరించె
వొఱపైనకొనగోరు వొప్పదా యేమి
గుఱి శ్రీవేంకటేశుఁడు కూడినకూటములయితే
మఱవనీక సతికి మరులాయ ననవే ॥ దగ్గ ॥ 470

దేసాళం

కానమే నే మింత తాను కదిరికాఁడౌత
మోనాన నే నూరకున్న మోముచూచీఁ దాను ॥ పల్లవి ॥

నగుతా నేనొకమాఁట నాలో గొణఁగుకొంటే
తగిలి సూడుకుఁ బాడు తానిదేమే
మొగి నాపుక్కిటితమ్మ ముందర నే నుమిసితే
జగడానకే వచ్చీ జాణఁడౌనే తాను ॥ కాన ॥

పేదిఁ బోతా చమ్మాళిగె వెస నేఁ దాటించితేను
ఆదిగాని కోపగించీ నదేమే తాను
సేదదేరి బొమ్మలను చెలుల నే జంకించితే
పోదితో వహించుకొని పోరీనే తాను ॥ కాన ॥

కివిసి మాగోడండఁ గేకరించుకొంటేను
చెనకి నాకొంగువట్టీ చెల్లఁబో తాను
యెనసి శ్రీవేంకటేశుఁ డేమీ ననకుండితేను
తనివితో నునుఁగూడె తలఁగఁడే తాను ॥ కాన ॥ 471

వరాళి

ఎంతచెప్పినా మాన విందాఁకా నేము
అంతలోఁ బెద్దరికములాయనా నేఁడు ॥ పల్లవి ॥

చెక్కునొక్కి సేసవెట్టె చెలియ నీకాలు దొక్కి
తెక్కుల నీజగడాలు దీరెనా నేఁడు
చుక్కలు మోవిపై నాఁటె చొక్కుపుగుబ్బలు మోపె
వక్కణించి నీపంతము వచ్చెనా నేఁడు ॥ ఎంత ॥

కన్నువేసె మాటలాడె కమ్మనినవ్వులు నవ్వె
చిన్ననాఁడే, నీచలము చెల్లెనా నేఁడు
మున్ను నీకుఁ జేత మొక్కె ముచ్చటలన్నియుఁ జెప్పె
పన్ని ననీలోనిచింత పాసెనా నేఁడు ॥ ఎంత ॥

చేయివేసె చెట్టవట్టె సిగ్గు నీ కొప్పగించె
చాయల నీ కిదియైనా సమ్మతా నేఁడు
యీమెడ శ్రీవేంకటేశ ఇంతి దానే నిన్నుఁ గూడె
మాయపునీమేనికాఁక మానెనా నేఁడు ॥ ఎంత ॥ 472

రామక్రియ

ఆతనికి నీకే తగు నందుకే పోవే
యీతల నే మిందుకెల్లా నిట్టే తలవంతుమే ॥ పల్లవి ॥

సటలివి మాటైతే సగియించ వింకాను
నటన నాతనితోనే నవ్వవే పోయి
యిటువలెఁ జేసి మాయింటికి వచ్చే వప్పటి
కటకటా నేమైతే కడుసిగ్గు విడమే ॥ ఆత ॥

చెంగట నీమాట వింటే చిమ్మిరేఁగీ మేనెల్లా
అంగడి నాతనితోడ నాడవే పోయి
వెంగలితనాన నాకే విడెమియ్య వచ్చేవు
యింగితాన నేమైతే నింతరొచ్చు కోపమే ॥ ఆత ॥

నిలువెల్లాఁ గాఁకరేఁగీ నిన్నుఁజూచితే నాకు
వాలిసి నీపతివద్ద నుండవే పోయి
యెలమి శ్రీవేంకటేశుఁ డిప్పు డిట్టె నన్నుఁ గూడె
వలచి నే మిందుకెల్లా వాసిదెచ్చుకొందుమే ॥ ఆత ॥ 473

రేకు 982 భైరవి

నీకేల ఇంతవెరపు నేనుండఁగా
చేకొని నీకిచ్చకాలు సేయవద్దా నాకును ॥ పల్లవి ॥

పూని మాయింటికి రాను పొంచి సిగ్గువడేవు
దానికేమి యేమైనానుఁ దప్పునేసితో
పోసీలే బలిమి నిన్నుఁ బొలఁతు లేమిసేసినాను
కానఁబడ నొకతప్పు గానవద్దా నాకును ॥ నీకే ॥

మోముచూడ వెఱచేవు మొదలనే తలవంచి
యేమైనా మావారు నేరాలెంచిరా నిన్ను
భామ లెవ్వరైనా నిన్ను [1]బతిమి చెరిచినాను
వేమారు నిన్ను వెనకవేసుకోక పోవునా ॥ నీకే ॥

మాఁటలాడఁ గొంకేవు మచ్చిక నిన్నిటు గూడి
తూఁటమోవి గంటైతే దోసమా యేమి
నేఁటనే శ్రీవేంకటేశ నీవే నన్నుఁ గూడితివి
నాఁటకీఁడవైన నిన్ను నమ్మవద్దా ఇపుడు ॥ నీకే ॥ 474

సౌరాష్ట్రం

**మమ్ము** నింకఁ దడవక మానేవయ్యా
నెమ్మి వేవేలు దండాలు నీకుఁ బెట్టేమయ్యా ॥ పల్లవి ॥

చెప్పరానినాచింత చేతిమీఁదికి వచ్చె
తప్పక నన్నేమి చూచి తడవేవయ్యా
నెప్పున వలచినట్టినేరమి నావొళ్ళఁ గద్దు
వొప్పులుఁ దప్పులు నీవే వోరుచుకోవయ్యా ॥ మమ్ము ॥

కన్నులలోపలికాంక్ష కడుఁ బయ్యెద దడిసె
నన్నుఁ జూచి ఇఁకనేమి నవ్వేవయ్యా
పన్ని నీతో నలిగినఫలమెల్లా నేఁ గంటి
ఇన్నిటికి నీకుఁ బంత మిచ్చేము కోవయ్యా ॥ మమ్ము ॥

తలకెక్కె వలపులు తనుఁదానె దిగజారె
మలసి మాతో నేఁటిమాటలయ్యా
యెలమి శ్రీవేంకటేశ ఇట్టె నన్నుఁ గూడితివి
చెలఁగి మాచనవులు చెల్లించవయ్యా ॥ మమ్ము ॥ 475

---

1. బతమునకు రూపాంతరమా? వ్యావహారికమా?

కాంబోది

కటకటా మీఁదబెత్తు కానదాయ నెవ్వతెరా
కుటిలపుఁబులకలు కుప్పవడీ మేనను ॥ పల్లవి ॥

కడు నీమోవిచిగురు గంటిసేసె నెవ్వతెరా
వడిసీఁ దేనెలు అందువంక నింతాను
వొడమించె చెమటలు వొలిఁతి యెవ్వతెరా
కడలేసినీమనసు కరఁగు నందునను ॥ కట ॥

రేసులనిట్టూరుపులు రేఁచిన దెవ్వతెరా
గాసిగా నీవలపులు గాలిఁబోయీని
తోసి నీకన్నుల నిద్ర తొట్టించిన దెవ్వతెరా
వోసరిలి తమకము లుమ్మగిలీ నందు(న)ను ॥ కట ॥

గందపు గుబ్బలముద్ర కడునొత్తె నెవ్వతెరా
అందువల్ల సిగ్గు నీకు నచ్చుపడెను
కందువ శ్రీవేంకటేశ కలసితి విటు నన్ను
విందవానె నిందువంక నేఁ డెందున్నదిరా ॥ కట ॥ 476

పళవంజరం

సారె నాటిసుద్ది నేఁడు చవులనవే
కోరి నేఁడు రాజైతే కూరిమివోదనవే ॥ పల్లవి ॥

మంచముపై నన్నమాట మఱవకుమనవే
లంచపునామోవి తలఁచుకొమ్మనవే
అంచల నాకొప్పు దువ్వె నది నీవడుగవే
యెంచ నేఁడు తా దొరైతే నేమిదోస మనవే ॥ సారె ॥

దాకొన్నమోవిగంటి తానే చూచుకొమ్మనవే
లేకలు ముంజూరు నిండె లెక్కించుకొమ్మనవే
ఆకు మడి చిచ్చినది అనవాలాయననవే
యీకడఁ బెద్దరికాన కేమిదప్పె ననవే ॥సారె॥

నాలత్తుకరేక చిన్నినామమాయ ననవే
చాలుఁజాలు నీకనేల సటలనవే
యేలెను శ్రీవేంకటేశుఁ డిదె నన్నుఁ గాఁగిటను
పోలించి తా దేవుఁడైతే పొందు మానదనవే ॥సారె॥ 477

బౌళి

ఎంత వలపించితివో యేమిమాయ సేసితివో
పంతములాడుదుఁగాని పాయలేనురా ॥పల్లవి॥

కోపగించేనంటా వచ్చి గొబ్బున నీమోము చూచి
దాపుగా నే మొగమోడి తలవంతురా
పోపొమ్మని యలిగి నేఁ బోయేనంటాఁ బోయి
తీపునీమోవి దలఁచి తిరుగుదురా ॥ఎంత॥

వెంగెమాడేనంటాఁ జూచి వినయాల నినుఁ గని
కుంగుచు నానిట్టూర్పు గుక్కుకొందురా
వుంగిటినీమాట నీకే వొప్పగించేనంటా వచ్చి
నింగి మోవఁ జేతులెత్తి నేనే మొక్కుదురా ॥ఎంత॥

మిక్కిలి వింతరేకలు మేననెల్లా సోదించి
గక్కున నే నుండలేక కాఁగిలింతురా
పక్కన శ్రీవేంకటేశ బాసగొనేనంటా వచ్చి
యెక్కువతో నిన్నుఁ గూడి ఇన్ని మఱచితిరా ॥ఎంత॥ 478

వరాళి

అలిగినయలుకెల్లా నరచేత నున్న దిదె
తలపోసి చూచుకొంటే తనకేమి బాఁతే ॥పల్లవి॥

కుప్పవడ్డయలకలు కుమ్మరింపుఁజెమటలు
చిప్పిలుమోవితేనెలు సేనాసేన
రెప్పలతుద కెంపు రేసువడ్డచల్లఁజంపు
దప్పిదేరీ నివియెల్లా తనకేమి బాఁతే ॥అలి॥

మాసినట్టిపైచెఱఁగు మంతనములో కరఁగు
పోసపుబాస పోఁకకుఁ బుట్టెదేసి
వేసర నీకుంటెనలు వేవేలు వెంటెనలు
తాసున వేసి చూచితే తనకేమి బాఁతే ॥అలి॥

కాఁగిటికలయికలు కందువ అలయికలు
చేఁ(గ)గలవావి చెట్టునఁ జేటఁదేసి
ఆఁగి కూడెను శ్రీవేంకటాధిపుఁడు నను నిట్టె
దాఁగరానిసరసాలు తనకేమి బాఁతే ॥అలి॥ 479

రేకు 983 సామంతం

ఓపనోప నింతేసికి వోయయ్యనేను
కోపగించకున్నాను కొడిమె లెంచేవు ॥పల్లవి॥

నగితిఁబో అందుకేమి నాలోనే వొకవేళ
నీమీఁద నెప్పైనా వొచ్చె మంటినా
చిగురుఁబెదవి గొంత చిమ్మి కదలించితిఁబో
జగడించ నీకేల సారెకుఁ దిట్టితినా ॥ఓప॥

వుసురంటిఁబో నే నొడలియలపుతోడ
    కసరి నిన్నేమైనాఁ గాదంటినా
    అసుదై వూరకుంటిఁబో అంతలోనే నీవు నన్ను
    వెస నిట్టే జరసేవు వేగిరపడితినా ॥ ఓప ॥

కాఁగిలించితిబో నిన్ను కాఁకలు మేన నిండఁగా
    రాఁగిననీమేఁకాఁక రవ్వపెట్టేనా
    వీఁగక శ్రీవేంకటేశ వేడుక నన్నుఁ గూడితి
    దాఁగనేల నీమాట దాఁటఁగలనా ॥ ఓప ॥ 480

కాంబోది

ఏమమ్మ యశోద మీయింటికి నేము వచ్చితే
    గాముపంటిబిడ్డ నిచ్చి కల్లుపడఁజేసితి ॥ పల్లవి ॥

పాలు గారీ సెలవులఁ బక్కనఁ జెక్కుమీఁటితే
    వేలువెట్టితే లోకాలు వెల్లివిరిసీ
    పీలి నేము వుగ్గుపెట్ట వెరతుము మీవాఁడు
    బాలుఁడా దయ్యముగాక పట్టవమ్మా ॥ ఏమ ॥

నెమ్మిఁ దొడమీఁద నుండి నిలువు నూరు వండీని
    పమ్మి నాల్గుమోములపాపఁడు లోన నున్నాఁడు
    నెమ్మదిఁ బాలు వోయఁగ నే వెరతు మీవాఁడు
    ఇమ్ముల వీఁడు మానిశా యెవ్వఁడో కాక ॥ ఏమ ॥

పక్కన నీరార్చితిఁ బయ్యదలో నిడుకొంటి
    మక్కువ నాకే తాను మగఁడైనాఁడు
    చిక్కనపను లింకేమిఁ జెప్పఁగ నే వెరతును
    యెక్కువ శ్రీవేంకటేశుఁ డితఁడేపో యమ్మా ॥ ఏమ ॥ 481

బౌళి

ఎట్టు నమ్మవచ్చు నిన్ను నిటువంటివానిని
నెట్టన నేఁడిదె నిన్ను నీవే మఱచితివి ॥ పల్లవి ॥

కాటుకకన్నుల నాకె గక్కన నిన్నుఁ జూచితే
మాటలు నాతో నాదేది మఱచితిగా
చీటికిమాటికి నట్టే చిరునవ్వు నవ్వేనంటా
నాటిన మనసుతోడ నన్ను మఱచితివి ॥ ఎట్టు ॥

పెద్దబెట్టుమాట లాడి పిలిచెనంటానే
వొద్దనున్న నన్ను మఱ చుస్సురంటివి
ముద్దు చూపి దవ్వులనే మొఱఁగులు చల్లితేనే
పొద్దుగూఁకుపొదపు లిప్పుడే మఱచితివి ॥ ఎట్టు ॥

చిగురుఁజేతుల నాకె చేసన్న సేసితేనే
తగవు మఱచితిగా దగ్గర నుండే
మిగులా శ్రీవేంకటేశ మించునాకాఁగిటఁ గూడి
అగపడి రతిఁ జిక్కి అన్నీ మఱచితివి ॥ ఎట్టు ॥ 482

రామక్రియ

ఇరవై మన్నించవయ్య ఇంతిగుణ మిదివో
తరుణివారముగాన తగులఁ జెప్పితిమి ॥ పల్లవి ॥

కొమ్మ నీతో పొందుచేసి కొరి పిన్ననాఁ డాడే-
బొమ్మలఁ దేనియ్యదు నీపొందు దగిలీనంటా
ఇమ్ముల సవతిపోరు కిసుమంత కోప దీకె
యెమ్మె కెవ్వతెఁ దెచ్చినా నెట్టవునో పనులు ॥ ఇర ॥

నీవూఁ దానుఁ గూచుండఁగా నిలువుటద్దములోన
సోవగాఁ బతిరూపులు చూడనోపరు
తావులఁ దననీడకు తా నలిగిని చెలి
ఆవలి ఇంతిఁ దెచ్చితే నప్పు డేమేమౌనో ॥ ఇర ॥

తనరూపు వ్రాసి వేరేతరుణి యయ్యీనంటా
యెనలేనితననంది నిడుకొనెను
ఘనుఁడ శ్రీవేంకటేశ కైకొంటివి ఇంతిని
ననుపుచెలులపొందు నవ్వుఁబాటు సుమ్మీ ॥ ఇర ॥ 483

ముఖారి

ఇద్దరు నేకములైన యెదురు మీ కిఁకలేదు
చద్దివేఁడివలపులకు సటలు మరి లేవు ॥ పల్లవి ॥

తనువు లేకములైన తప్పులునొప్పులు లేవు
మనసు లేకములైన మరఁగులే లేవు
చనవు లేకములైన సాదింపు మరి లేదు
వనిత విచ్చేయఁగదే వరుసఁ బతికడకు ॥ ఇద్ద ॥

పలుకు లేకములైనఁ బైకొసరు మరి లేదు
తెలువు లేకములైన తెగువలే లేవు
చెలిమి సరిదాఁకితే చింతలే మరి లేవు
వెలఁది విచ్చేయఁగదే వెనకకతలేల ॥ ఇద్ద ॥

వయసు లేకములైన వంతులువాసులు లేవు
ప్రియము లేకములైన బిగువులే లేవు
దయను శ్రీవేంకటోత్తముఁడు నినుఁ గూడె నిదె
ప్రియురాల విచ్చేయు పిలిపించుకొనక ॥ ఇద్ద ॥ 484

లలిత

మంకు విడిచిన నిదె మంచి బుద్ది
సుంకుల మీలోనే మీరు చూచుకొనరాదా ॥ పల్లవి ॥

నీడలెల్ల నెండలాయ నెలఁత నీవు రాకున్న
వేడుకెల్లా వేసటాయ వెచ్చఁదనాన
వాడిక నడుమ వేరే, వయసు రిత్తవోయీని
కూడినకూటాలమేలు కొల్లలాడరాదా ॥ మంకు ॥

కప్పురమే కారమాయ కదిసేమాటలు లేక
దప్పులెల్లాఁ దనివాయ దగ్గరి రాఁగా
రెప్పవేసేయంతలోనే రేసులెక్కు నీ మనసు
తెప్పలఁ దేలఁగరాదా దిష్టపుమీరతుల ॥ మంకు ॥

దవ్వులెల్లఁ జేరువాయఁ దరుణి నీవియ్యకోఁగా
పువ్వులెల్లఁ బిందెలాయఁ బూఁటపూఁటకు
యివ్వల శ్రీవేంకటేశ యింతి నీవు గూడఁగాను
నవ్వులాయ మాకెల్ల నమ్మికియ్యరాదా ॥ మంకు ॥ 485

రేకు 984 సామంతం

అడియాలాలెల్ల నిందె నంపరాదా। నీ–
వడిగినట్టెల్లా నాయ నంపరాదా ॥ పల్లవి ॥

కన్నుల నిద్దుర దేరెఁ గందువలు చెమరించె
[1]అన్నివనులును నాయ నంపరాదా
వన్నెమోవి కదురాఁగె వసివాడె మైఁదీగె
అన్నిటా జాణఁడవౌదు వంపరాదా ॥ అది ॥

1. అన్ని+పనులు

కాయమెల్లా మఱపాయఁ గగఁగె నామనసెల్ల
ఆయములు సరిదాఁకె నంపరాదా
పాయములు ఫలమందె పంతము లొక్కట్లాయ
ఆయెడకే వత్తుఁగాని అంపరాదా ॥ అది ॥

మచ్చికలే తనివొందె మంతనాలే చవులాయ
అచ్చుపడెఁ గూటములు అంపరాదా
ఇచ్చకుఁడ శ్రీవేంకటేశ నన్నుఁ గూడితి—
వచ్చికములెల్లఁ బాసె నంపరాదా ॥ అది ॥ 486

సావేరి

వెఱతుమయ్యా నీకు వింత లింకానేమైనా
మఱి నిన్ను నెప్పుడుఁ గమ్మరా విడువరా ॥ పల్లవి ॥

పిలువవచ్చినసతిపెదవులెల్లాఁ బొక్కె
వెలయ నీపె రెంతపేఁడోకాని
చలువకు మందులేక సాదించ నే వచ్చితిరా
పలుకకుండితే మోవి [1]పతిపొక్కించింతురా ॥ వెఱ ॥

చూడవచ్చినట్టిఇంతిచూపులెల్లాఁ గెంపువారె
జాడ నీరూ పెంతటిబాసటమోకాని
వేడుక నిది మానుప వేఁడుకో నే వచ్చితిరా
తోడనే నీ పూరకున్న తుదమీరఁ జేతురా ॥ వెఱ ॥

ఆకుమడిచిచ్చేసతియంగమెల్లాఁ జెమరించె
చేకొని నీవేమిచేఁత సేసితోకాని
దాకొని శ్రీవేంకటేశ దగ్గరి నేఁ గూడుండఁగా
నాకన్నీఁ జెప్పకుండితే నవ్వు నవ్వింపింతురా ॥ వెఱ ॥ 487

1. ప్రతి.

వేళావళి

నీకునీకే యాడుకోకు [1]నియ్యాన
కైకొని నేనే నీపై గడియించేఁగాని ॥ పల్లవి ॥

అంతవాఁడ వవుదువు అంగనల వలపించి
వంతులకు నీవే నవ్వనోపుదువు
పంతమాడఁ బనిలేదు పలుమారు మాకెల్లా
కాంతుఁడ విన్నెప్పుడుఁ బొగడవలెఁగాని ॥ నీకు ॥

మంచివాఁడ వవుదువు మచ్చికలే పచరించి
వంచి సవతులఁ జూపి వాసిరేఁచను
కొంచ నీఁకఁబనిలేదు కోడెతనానకు నీవే
చంచులకు రాజవంటాఁ జాటవలెఁగాని ॥ నీకు ॥

రసికుఁడ వౌదువు రతులఁ గాఁగిటఁ గూడి
మిసిమిమమ్మెల్లా నీవు మెప్పించను
యెసగి శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
పసగానిమన నీఁకఁ బట్టవలెఁగాని ॥ నీకు ॥ 488

వరాళి

ఏమిబాఁతి నిజములు యీకాలము
జాముజాము కొాకలైనసటలే చాలు ॥ పల్లవి ॥

గక్కన మాఁటాడఁబోతేఁ గలది గలట్టె
మొక్కలాన నూరకుండుమోనమే చాలు
చక్కఁ జూడఁబోతేను సందేహాలే యప్పటిని
వక్కణించరానితలవంపులే చాలు ॥ ఏమి ॥

1. నీ + అన. వింత త్రిక సంధి

పచ్చిగా నవ్వఁబోతే పనులెల్లాఁ గానఁబడీ
కొచ్చి మమ్ముఁ దడవకు కోపమే చాలు
అచ్చపుటేకతమైతే ఆయములు రేఁగీని
యిచ్చటఁ జెలుఁలసందడిదియే చాలు ॥ ఏమి ॥

పానుపుమీఁదికిఁ బోతేఁ బంతమెల్లా బయలయ్యీ
నానఁబెట్టి యీయెదుటినటనే చాలు
మానక శ్రీవేంకటేశ మరి నన్నుఁ గూడితివి
కానఁబడ్డ ఇందుకంటె కతలే చాలు ॥ ఏమి ॥ 489

సాళంగం

మఱచినపని రేఁచ మాకేలే
తఱవాతిపను లిట్టే తమకించనేలే ॥ పల్లవి ॥

పెనఁగి మాయింటికిఁ బిలువఁగ నిలువఁగ
మనసు వచ్చునో రాదో మాకేలే
తనయంతలేనిది తడవ నేమిటి కెంత-
పనిగలిగున్నాఁడో పలికించనేలే ॥ మఱ ॥

తెరయెత్తి నేఁ జూచి తిరిగితే జరిగితే
మరుతంత్ర మేమౌను మాకేలే
సరసాలే విరసాలు చవిగానిపనులకు
పరిణామ మడిగి నేఁ బచరించనేలే ॥ మఱ ॥

ఆరసి యప్పటిసుద్దు లడుగఁగ నొడుగఁగ
మారాక కూరకుండఁగా మాకేలే
చేరువఁ గడపలోన శ్రీవేంకటేశ్వరుఁడు
గారవాన నన్నుఁ గూడెఁ గాదననేలే ॥ మఱ ॥ 490

తెలుఁగుకాంబోది

చెప్పరాదు చూపరాదు చెలియభావము నేఁడు
వుప్పతిల్లఁజెమటతో నుస్సురనీనమ్మా ॥ పల్లవి ॥

చక్కఁదన మొకవంక జవ్వన మిదొకవంక
మొక్కలపుపతిమీఁదిమోహ మొకవంక
వొక్కటొక్కటికిఁగా కువిద నివ్వెరగుతో
ముక్కుమీఁదివేలితోడ మోము వంచెనమ్మా ॥ చెప్ప ॥

చిత్తపుకోరికలతో సిగ్గరిభావముతోడ
హొత్తులచెలులుచెప్పేబుద్దులతోడ
యెత్తినతమకమున నెదురుమాఁటాడలేక
తత్తరానఁ దనలోన తానే నవ్వీనమ్మా ॥ చెప్ప ॥

కన్నులఁ గావులుదేరె కళలు మోమునఁ దేరె
తిన్ననికెమ్మోవినెల్లా తేనెలు గారె
వెన్నెలవంటివలపు వేడుకఁ దలకెక్కఁగా
యిన్నిటా నిట్టె శ్రీవేంకటేశుఁడు గూడెనమ్మా ॥ చెప్ప ॥ 491

రేకు 985 శంకరాభరణం

[1] ఔలేరా జాణతనాలాడేవు నీవు
లేలే నే నీవలె లెక్కలువెట్టేనా ॥ పల్లవి ॥

కప్పకురా నీగుణాలు కందువ పొద్దాయ; నేఁ-
గప్పినట్టే నీకుచాలు గప్పేవు గాక
ముప్పిరిఁ గరఁగకురా ముదితలఁ జూచి; నీవే
కప్పురము నోరిలోనే కరఁచేవుగాక ॥ ఔలే ॥

1. ఇది వాకోవాక్యము.

కన్నులు గిఁటకురా కాంతలకు; నేనా నీవే
కిన్నెరతంత్రుల గోర గిఁటేవు గాక
యెన్నిక చెమట చింద నేలరా చెక్కులవెంట;
చిన్నిమోవిఁ దేనె నీవే చిందేవే యిపుడు ॥ ఔలే ॥

జాఱనీకురా సిగ్గు సంగడిరతుల; నీకే
జాఱెఁగదే మునిగొంగు సంతసాలతో
మీఱి శ్రీవేంకటేశ్వర మేలుతోఁ గూడితివి;
ఆఱడికూటములెల్లా నబ్బెఁగదే నీకు ॥ ఔలే ॥ 492

పాడి

నిక్కి యెండదాఁకనేల నీడకుఁబోనేల నాకు
చక్కనినీకెమ్మోవి చవిగొంటే చాలును ॥ పల్లవి ॥

కందువ నీమాటలకుఁ గల్లపరచఁగనేల
అందుకొని అవి నిజమననేల
నిందలాడేవారు నీవు నెఱిఁ దగవాడుకోఁగా
విందువలెఁ జెవులార వింటే నాకుఁ జాలును ॥ నిక్కి ॥

గుట్టున నీచేఁతలకుఁ గోపగించుకొననేల
వెట్టఁబడి కమ్మటిని వేఁడుకోనేల
తిట్టులాడి నీవు వారుఁ దీదీపులాడఁగాను
నట్టనడుమ నేవచ్చి నవ్వుటే చాలును ॥ నిక్కి ॥

చేసన్నచేసి నిన్నుఁ జేరఁ బిలువఁగ నేల
దోసాలు నీపై నించి తోయనేల
నేసవెట్టి కడపలో శ్రీవేంకటేశ నన్ను
వాసిమీరఁ గూడితివి వద్దనుంటేఁ జాలును ॥ నిక్కి ॥ 493

సామంతం

చిగురో చేఁగ చూపఁజెల్లదే నీకు
అగపడె నీరమణుఁ డదిగో నీకు ॥ పల్లవి ॥

వలపులే కడుఁబెంచి వాలుకరెప్పలు వంచి
నెలవినవ్వులనేల చిందేవే సిగ్గు
నిలువునఁ దమిరేఁచి నెయ్యపుటాసలు పూఁచి
మలసి యంతలోనే మానవేలే నీకు ॥ చిగు ॥

మాటలతేనెలు చూపి మదనముద్రలు మోపి
యీటునఁ దలఁపుమాటు కేల పొయ్యేవే
గీఁటుచుఁ గన్నుల నవ్వి కెందటిమోహాలు దవ్వి
మాటికిమాటికి మేనిమఱపేలే నీకు ॥ చిగు ॥

కాఁగిటిరతికిఁ జొచ్చి కమ్మటి నీకెమ్మోవి ఇచ్చి
కాఁగినగుబ్బలనేల ఘాతసేసేవే
వీఁగుచుఁ గూడితివి శ్రీవేంకటేశుని వి(ని?)ట్టె
మూఁగినపులకల యీమోపేలే నీకు ॥ చిగు ॥ 494

సాళంగనాట

[1]అరుదు రామునిచేఁత లదిగో పుష్పకమును
సొరిది మనబాలులే సోద్యము గదమ్మా ॥ పల్లవి ॥

హరునివిల్లు విరిచె అట్టె సీతఁ బెండ్లాడె
పరశురాముని బాహుబలము గొనె
సురలకు మునులకు సొరిది నభయమిచ్చె
వరుస నయోధ్య యేలవచ్చె నటవమ్మా ॥ అరు ॥

1. 495, 496 పాటలు అధ్యాత్మ కీర్తనలు.

వాలిఁ గొటి సుగ్రీవువరరాజ్య మిచ్చెనట
చాలుగాఁ గొండలనే జలధిగట్టి
తీలుగా రావణుఁ జంపి తెగి లంక సాధించి
వాలినసేనలఁ గూడి వచ్చెనటవమ్మా ॥ అరు ॥

కాంతయైనసీతఁ గూడి కలుషములెల్లఁ బాపి
పంతమ తో విభీషణుఁ బట్టముగట్టి
ఇంతటా శ్రీవేంకటాద్రి నిరవున వేఁటలాడి
వంతులకు రాజ్య మేలవచ్చెనటవమ్మా ॥ అరు ॥ 495

వేళావళి

అన్నియు నందె యున్నవి అదిగో మాట
యెన్నుకొనె దినములు ఇదిగో మాట ॥ పల్లవి ॥

సీత నీకుఁ జెప్పి పంపి శిరోమణి నీకిచ్చె—
నాతల నే మెఱఁగము అవేమాట
[1]చేతినీవుంగరమును శిరసున నెత్తుకొనె
యేతలఁపు లెట్లానో ఇదిగో మాట ॥ అన్ని ॥

తాడుపడ్డమేనితోడ తలఁపు నీకొప్పగించి
యేడవుతా నెఱఁగదు ఇదివో మాట
పాడిదప్ప దించుకంతా పదిల మాకెగుణము
ఆడ నేమీఁ జోటులేదు అదిగో మాట ॥ అన్ని ॥

తెఱవ నీకు బాసిచ్చె దేవతలమాట విను
యెఱిఁగినదే ఇందరు ఇదిగో మాట
గుఱుతై శ్రీవేంకటాద్రిఁ గూడితి రిద్దరు మీరు
అఱిముఱి రామచంద్ర అదిగో మాట ॥ అన్ని ॥ 496

---

1. 'నీచేతి వుంగరము' అనుట సహజము

నాదరామక్రియ

కంటిమిగా నీగుట్టు కాలమందునే
అంటితేనే లోనైతి వయ్యో నాయకుఁడా ॥ పల్లవి ॥

కన్నులనే మాటలాడి కప్పురపుసిగ్గు చల్లి
కిన్నెరమీంట్ల నాకె గిలిగించెను
నిన్నుఁ జూడవలె నింక నిలువెల్లాఁ జెమరించి
అన్నిటా మెయిమఱచితి వయ్యో నాయకుఁడా ॥ కంటి ॥

వయ్యద బయలుచేసి పగడవాతెర చూపి
తియ్యనివలపులనే తేలించెను
[1]నియ్యిచ్చ దెలి[2]సిదెపో నివ్వెరగు నీకు నిందె
అయ్యెడ నుండి పాయవు అయ్యో నాయకుఁడా ॥ కంటి ॥

కాఁగిటనే వలవేసి కందువ రతికిఁదీసి
తీఁగెసరసాల నాకె తెరవేసెను
వీఁగక శ్రీవేంకటేశ వేగిరమే ఆకెఁ గూడి
ఆఁగి నన్నుఁ గూడితివి అయ్యో నాయకుఁడా ॥ కంటి ॥ 497

రేకు 986 హిజ్జిజి

ఎదురుచూచీఁ జెలి యేమయ్యా
నిదుర కన్నులఁ దేరీ నీ కేలయ్యా ॥ పల్లవి ॥

చెక్కుటఁబెట్టినచెయ్యి చిత్తములోపలినుయ్యి
యెక్కడికిఁ గాదు చెలి యేమయ్యా
పక్కననవ్వేవు కొప్పు పైపైగోర దువ్వేవు
నెక్కొని వట్టిదోసాలు నీకేలయ్యా ॥ ఎదు ॥

---

1. నీ + ఇచ్చ. ఇవి యీ వాఙ్మయములో కొన్ని చోట్ల వింతలు.
2. తెలిసి + ఇదే. ఇవి చాలసహజము లీవాఙ్మయములో.

పాదపునేలలవ్రాఁత బలిసె నూరుపుమోఁత
యీదెస చెలియకేల యేమయ్యా
మోదమున నొరగేవు మొక్కలానఁ దిరిగేవు
నీదయ నేఁడు దాఁచఁగ నీకేలయ్యా ॥ ఎదు ॥

మూపుపైజారినకొప్పు ముంచినచెమటచొప్పు
యేపొద్దుఁ జెలికిఁ బాయ దేమయ్యా
దాపై శ్రీవేంకటేశ తరుణిఁ గూడితి విట్టె
నీపరవశాలు చూప నీకేలయ్యా ॥ ఎదు ॥ 498

వరాళి

ఎవ్వరి నడుగనేల యేడలేనియానలేల
దివ్వె చేతఁబట్టుకొని తెరువు దప్పకురా ॥ పల్లవి ॥

పంతమాడ నోపఁగాని భావము నీ దిట్టిదని
పొంతనే నేఁ దక్కననుఁ బోసి చూపేరా
యెంతదాఁచినను బోదు యేల నాతో బొంక నీవు
అంతా నీకే కానవచ్చీ నద్దము చూచుకోరా ॥ ఎవ్వ ॥

నిన్నుఁ గల్ల సేయఁ గాని నీకుఁ గలమోహమెల్లా
వన్నెగాఁ బూవులచేరువలె నెత్తేరా
కన్ను గిరిపితేఁ గాదు కాంతలెల్లా నెరిఁగిరి
మొన్నటినిన్నటివి నీమోముపై నున్నవిరా ॥ ఎవ్వ ॥

వాదడువఁ జాలఁగాని వక్కణించి నీ గుట్టెల్లా
సాదించి నీరుకంటెఁ బలచనసేసేరా
పోదిగా శ్రీవేంకటేశ పొంచి నన్నుఁ గూడితివి
వేదేల నావుంగరము వేల నీ కున్నదిరా ॥ ఎవ్వ ॥ 499

శంకరాభరణం

నీకుఁ దెలయదుగాక నీమంచిగుణాలే కావా
    పైకొని మమ్మింతచేసి భ్రమయించేవి ॥పల్లవి॥

వంచి నీరెప్పలలోనివాలుకచూపులు గావా
    మంచితనమున నామెయి మఱపించేవి
    ఇంచుకంత నెలవుల యీనవ్వులే కావా
    తుంచి తుంచి ఆయములు తూరిపారేవి ॥నీకుఁ॥

కొంత కొంత గొణఁగుల కొనమాటలే కావా
    చింతతో నాచెక్కిటికిఁ జేయి దెచ్చేవి
    పంతపుటలుకలతో పచ్చివొట్లే కావా
    అంతలోనే నన్నుసురనిపించేవి ॥నీకుఁ॥

కూరిమి నీ వేకతానఁ గూడినరతులే కావా
    తారుకాణలై సారెఁ దలఁపించేవి
    యీరీతి శ్రీవేంకటేశ యిద్దరము నున్నారము
    సారె నీపొందులేకావా చవులయినవి ॥నీకుఁ॥ 500

శంకరాభరణం

మొదల నేమి నెఱఁగదాయ ముంచిన దెంతపరవశంబో
    కదిసినప్పటిచేఁతలు; విభునిఁ గనుచు విభుని దూరెను ॥పల్లవి॥

ఇంతి మోము గడుగఁబోయి యెలమి దోసిట నీరు నించి
    అంతట మోవికెంపులనీడ యందుఁ జూచి నవ్వెను
    రంతుసేసి ముంజేతిచిలుక రతిపలుకు లప్పుడు నుడుగ
    అంతలోనే పంజరమున నదిమి శిరసువంచెను ॥మొద॥

నెలఁత సొమ్ములు వెట్టఁగఁబోయి నిలువుటద్దములోన మదన-
కళలు చెదరుఁగురులు చూచి గక్కున సిగ్గున మునిఁగెను
చెలులమీఁదఁ జేయివేసి చేతనున్నవిభునివేలి-
అలరుముద్దుటుంగరంబు అపుడు చూచి భ్రమసెను ॥ మొద॥

పానుపుమీఁదఁ బవ్వళించ పడఁతి యేఁగి యందుమీఁద
తానకమైనవిభునిఁ జూచి దగ్గరి కాఁగిలించెను
ఆనిన శ్రీవేంకటేశుఁ డంతటిజాణ గనక కలసి
మోనముతోడఁ జొక్కిచొక్కి మున్నిటివెల్ల నడిగెను
॥ మొద ॥ 501

## పాడి

ఇంచుకంత చాలదా యీడవారికి
పెంచిపెంచి నీవె రచ్చఁబెట్టుకోవయ్యా ॥ పల్లవి ॥

చిటుకంటేఁ జాలదా సిగ్గుగలదానికి
తటుకన నీవద్దఁ దలవంచను
కటకట నవ్వఁబోయి కన్నవారిచేతనెల్ల
దిటముగా నీవలెఁ దిట్టించుకోవలెనా ॥ ఇంచు ॥

గొణఁగితేఁ జాలదా గుటుతోడిదానికి
వొణఁకె(కు?)తోఁ గన్నుల నీ రొలికించను
అణఁగక కన్నవారి ఆయాలకుఁ జేచాఁచి
సణఁగుల నీవలె ఁంకెఁబడవలెనా ॥ ఇంచు ॥

దగరితేఁ జాలదా తమకించేదానికి
వొగ్గినరతులలో నోలలాడను
నిగ్గుల శ్రీవేంకటేశ నీవు నన్నుఁ గూడితివి
బగ్గన నీవలె వేరేపంత మియ్యవలెనా ॥ ఇంచు ॥ 502

రామక్రియ

ఎవ్వరుంటా నెఱఁగవు యేరా నీవు
యివ్వల దగ్గరిననా కిది వెద్దలా ॥పల్లవి॥

మానరా నీవు నాతోడిమందెమేళాలు
నానఁబెట్టి యేడనైనా నవ్వవచ్చేవు
నేనూ నీపొరుగైతే నేరమాయనా
పూని మావా రిదిగంటే పోరులు రావా ॥ఎవ్వ॥

గుట్టుతోడ నుండరా కొంతైనా నీవు
చిట్టకానకు నామీఁదఁ జేయివేసేవు
ఇట్టె నీమోము చూచితే నియ్యకొంటినా
గట్టిగా మగనాలనుఁ గానా నేను ॥ఎవ్వ॥

ఆయరా నేఁ డింతలోనే అన్నిపనులు
ఆయములు సోఁక నన్ను నానవెట్టేవు
యీయెడ శ్రీవేంకటేశ యెనసితివి । నన్ను
చాయల సన్నల నిదె సతమాయఁగా ॥ఎవ్వ॥ 503

రేకు 987 పాడి

ఈవల కాంతలగుణా లేకమే కావా
పూవులవాటు కోపవు పూఁపవాటు కోపేవా ॥పల్లవి॥

కప్పురపువీడెముతో కలికి మాటలాడఁగ
దప్పిదేరే వేఁటికోయి దగ్గరివుండి
చెప్పరానికారాలే చిందీ మాకన్నులను
యిప్పుడే నన్నుఁ జెనకే విందు కోపేవా ॥ఈవ॥

చిగురుచేతుల నిన్నుఁ జెలియ విలువఁగానే
వొగరుఁజెమటలతో నుస్సురనేవు
మిగులవాఁడిమొనలు మెరిచీ మాచన్నులను
యెగువ నన్నుఁ బిలిచే విందు కోపేవా ॥ ఈవ ॥

అద్దపుమెఱుఁగుఁజెక్కులాకె నిన్ను వలపించి
ముద్దుచూపితే భ్రమసి మోమువంచేవు
పొద్దుపొడపుగోళ్ళపొలఁతి నన్నుఁ గూడితి—
విద్దరికి శ్రీవేంకటేశ వోపేవా ॥ ఈవ ॥ 504

తోండి

కానీవే గొల్లెతా కమ్మటి నవ్వకువే
నాననీవే రేపటికి నయమవును దాఁచవే ॥ పల్లవి ॥
తీపుచేసి వలపులు తీర నాపైఁ జల్లకువే
పోపో నీగొల్లచల్ల పుల్లనేకాదా
మాపటంత వచ్చేఁగాని మగుడి చూడకువే
చేపట్టి చూడఁజూడఁగ చీఁకటిండ్లే వెలుఁగు ॥ కానీ ॥
మాటలనే నామీఁద మందులు నూరకువే
మూటగట్టితే గొల్లముంజులేకావా
చీటికిమాటికి నాపై చేతులు చాఁచకువే
వాఁటమైతే నీరు[1]వారు వచ్చే నే నాడకు ॥ కానీ ॥
చేయివట్టి తియ్యకువే చేరి నన్ను లోనికి
పాయపుగొల్లెతలకు బలువేకాదా
వేయిటికిఁ గూడితి శ్రీవేంకటేశుఁడను నేను
యీయెడ జాతొకటాయ నింటికి వచ్చేనే ॥ కానీ ॥ 505

1. నీరు + పారు

మాళవి

ఎట్టు నమ్మవచ్చునే ఇంతి నీమనసు నేఁడు
పొట్టి యొకవేళబుద్ధి యొకవేళ వచ్చునా ॥ పల్లవి ॥

వెన్నెలబయట నుండి వేఁడిఁబడి యిందాఁకా
సన్నల నీపతిఁ గూడి చల్లనైతివి
వున్నతపుఁజందురుఁ దొక్కఁడే వెన్నెలొక్కటే
కన్నెభావాలు రెండుగతులాయ నివిగో ॥ ఎట్టు ॥

కోయిలకూఁతలకే గుండె బెదరి యిందాఁకా
యీయెడ నీపతిఁ గూడి యిచ్చగించేవు
ఆయెదాఁ బలు కొక్కటే అప్పటి నీవు నీవే
రాయడి నీగుణములే రండుదెఱఁగులాయ ॥ ఎట్టు ॥

వేడుక చల్లగాలికి విసిగితి విందాఁకా
కూడి శ్రీవేంకటేశుతో కోరే వదియే
ఆడనే నీయాలవట్ట మదియును నొకటే
యీడా నాడాఁ దలపోఁత లివియే వేరు ॥ ఎట్టు ॥ 506

లలిత

ఊరకే గడించుకొనీ నోయమ్మా। తన—
నోరే ఘనముచేసీనో చూడరమ్మా ॥ పల్లవి ॥

తనివార నొకమాఁటు తప్పక చూచితి నింతే
వెనక తనచేఁతకు వెంగెమా యిది
ననుపైనదానఁగాన నవ్వితే నింతే కాక
చెనకేతనతో గేలిచేసితినా ॥ ఊర ॥

వుబ్బసపోక నేనే వుస్సురంటి నొకమాఁటు
గొబ్బుననుఁ దనమీఁది కోపమా యిది
నిబ్బరానఁ దనమాఁటే నిజమంటిఁగాక నేను
దబ్బరలుచేసినట్టితలఁపా యిది ॥ ఊర ॥

కడుఁదమకానఁ దన్నుఁ గాఁగిట నించితిఁగాక
సుడిగొన్నతనకాఁక చూచుటా యిది
యెడయక శ్రీవేంకటేశుఁడు గాఁగాఁ, దన్ను
బడివాయఁగాక యిది పైయద్దికములా ॥ ఊర ॥ 507

## భైరవి

తరవాతిపనులెల్లఁ దా నెఱఁగఁడా
బిరుదే నెరపుఁగాక పిలిపించనేఁటికే ॥ పల్లవి ॥

గోరుకొన సోఁకకతొలుతే కోపగించేవాఁడు తాను
యీరీతి సంగరము నా కేఁటి కంపెనే
పీరివారిమాటలకు వెలి పింతగలవాఁడు
దారకుఁడై వుండుఁగాక దగ్గరి రానేఁటికే ॥ తర ॥

వీసము నేయనందుకే విడనాడేవాఁడు దాను
ఆసమాటలేల చెప్పియంపెనే నాఁడు
వాసిమెరమెచ్చులకు బయలీఁదించేటివాఁడు
వేసాన నే నున్నచోటు వెదకఁగనేఁటికే ॥ తర ॥

అండకు రాకమునుపే యంతా మఱచేవాఁడు
నిండినమోహము నాపై నించనేఁటికే
మెండగు శ్రీవేంకటాద్రిమేటి ఇట్టె నన్నుఁ గూడె
వుండినట్టే వుండి నన్ను వూరడించనేఁటికే ॥ తర ॥ 508

పాడి

గుట్టున నుండుటచాలు కూడినదాఁకా
అట్టె ఆమీఁదిపను లప్పుడే చెప్పేను ॥ పల్లవి ॥

చూడకురా అద్దము సొంపగు నీ నుదుటను
యేదో లత్తుక చూచి యెంత సిగ్గవునో
ఆడకురా మాఁటలు ఆయపునీమోవిమీఁది—
నీడ కెంపులు రాఁగితే నీ కెంత నొచ్చునో ॥ గుట్టు ॥

వెలి వెళ్ళకురా నీవేఁడిచెమట గారితే
చెలుల యెదుట నెంత చింత వుట్టునో
కులికి నవ్వకురా కొప్పునేస రాలితే
యెలమి నీబాసలు ని న్నేమనునో ॥ గుట్టు ॥

కాఁగిటఁ బెనఁగకురా కమ్మఁగస్తూరిబేంట్లు
చేఁగలై రాలితే నీచిత్త మెట్టవునో
తూఁగుబడి నన్ను నీవు తోడుతనే కూడితివి
పాఁగినశ్రీవేంకటేశ వచ్చి యెంత దోఁచునో ॥ గుట్టు ॥ 509

రేకు 988 ఆహిరి

చిక్కితి మీపాలనూ చేయరె యీవేళనూ
ఇక్కడనే వేగిరించే రేమందు నేనూ ॥ పల్లవి ॥

చెక్కిటిమీఁదికి చెయ్యి చిత్తములోనిది నుయ్యి
యెక్కడిబుద్ధులు నాకు నేమిచెప్పేరే
ముక్కుమీఁదటిది వేలు మోహములు వేవేలు
ఇక్కువ లెఱఁగలేరు యేమందు నేను ॥ చిక్కి ॥

నిలువెల్లా నివ్వెరగు నిద్దుర రెప్పమరఁగు
కలిగినమీఁదఁబెత్తు కనుఁగొనరే
సెలవులనే నగవు చెప్పఁబోతేనే బిగువు
యెలమి మీరు మొక్కఁగ నే నేమందునే ॥ చిక్క ॥

చెదరిన సీ(యీ?)కురులు సేసకొప్పున విరులు
తుదమొద లెఱఁగరు తొలఁగరే
యెదుట శ్రీవేంకటేశుఁ డిదె వచ్చి నన్నుఁ గూడె-
నిదెవో మీతో నింక నేమందు నేను ॥ చిక్క ॥ 510

శ్రీరాగం

ఇచ్చకమే మదిఁ దోఁచీ నేమందునే
వచ్చినది పదివేలు వాని నేమందునే ॥ పల్లవి ॥

కన్నులఁ జూచినప్పుడే కాఁకలెల్లాఁ బెడఁబాసె
యెన్నికల కేడలేదు యేమందునే
మున్నిటిసుద్దు లెంచితే మోహములు చవిదప్పీ
విన్నదే విందవుత మేలు విభుని నేమందునే ॥ ఇచ్చ ॥

సెలవి నవ్వినప్పుడే చిక్కులెల్లాఁ బెడఁబాసె
యెలయించఁ దరిగాదు యేమందునే
పలికితే సంతోషభావములు చవిదప్పీ
పిలుపే కోటానఁగోటి ప్రియుని నేమందునే ॥ ఇచ్చ ॥

కాఁగిట నించినప్పుడే కడమలు వాసె నిట్టె
యేఁగకున్నఁ జవిదప్పీ నేమందునే
పాఁగినశ్రీవేంకటాద్రిపతి యిన్నిటా నాతో
రాఁగినమోవితేనెలరసికు నేమందునే ॥ ఇచ్చ ॥ 511

నాగవరాళి

నీవు మంచివాఁడవే నీచేఁతలే నన్ను
చేవముంటి(ముట్టి?) పోటులై చిమ్మరేఁచీఁగాని ॥ పల్లవి ॥

కన్నులు నీవి మంచివి కడలఁ గెంపులు నిండి
యెన్నఁగఁ గోపమురేఁచె నిదే కానిది
అన్నిటా నీమాట లెస్స అందులోనే దగదొట్టి
విన్నని నీయలపులే వెతరేఁచీఁ గాని ॥ నీవు ॥

ముంగిటినవ్వు మంచిది మోవిని పొక్కులు నాకు
చెంగటఁ జిగురుచేఁదులే చేసీఁగాని
అంగడిఁ జక్కనివాఁడ వొదువు నీమేనిమీఁది-
వుంగిటివింతవాసన లుడికించీఁగాని ॥ నీవు ॥

అతిరతి నీయధరామృతము తియ్యనే
సతులెల్లాఁ జవిగొంటేఁ జప్పన గాని
ఇతవుగా శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
కతలుగావా నిన్నుఁ గైకొంటేఁ గాని ॥ నీవు ॥ 512

ఆందోళి

ఇంతులాల నావంక నిదే తప్పు
కొంతైనాఁ బిలువనంటాఁ గొసరీ మనసు ॥ పల్లవి ॥

మాటకు మాటాడను మరి కల్లలెంచను
నాఁటుకొన్న చూపులతో నవ్వితి నేను
గీఁటెఁ గొనగోరఁ దానే కిందుపడ నొక్కెఁ దానే
కూటమికి రానంటాఁ గోపగించీఁ దాను ॥ ఇంతు ॥

పతికిఁ బతి సేయను పను లేమి నడుగను
అతికాఁకఁ దనమేనే అంటితి నేను
కతలు చెప్పీఁ దానే ఘాతలుసేసీఁ దానే
తతితో దగ్గరనంటాఁ దమకించీఁ దాను ॥ఇంతు॥

కాదుగూడ దనను కఱకరి సేయను
యీదెసఁ దనకుఁ బంతమిచ్చితి నేను
నేదదేర నన్నుఁ గూడె శ్రీవేంకటేశుఁడు దానె
పోదితో మెచ్చితినంటాఁ బొదిగీఁ దాను ॥ఇంతు॥ 513

లలిత

[1]నవ్వితినే గొల్లెతా నాయ మవుర గొల్లఁడా
యెవ్వ రేమనిరే నిన్ను నియ్యకొంటిఁ బదరా ॥పల్లవి॥

కానీవే గొల్లెతా కద్దులేరా గొల్లఁడా
బొనా మఱవకువే అట్టె కానీరా
నే నేమంటిని నిన్ను నీకే తెలుసురా
మానితినే ఆమాట మంచిదాయఁ బదరా ॥నవ్వి॥

అదియేమే గొల్లెతా అందుకేరా గొల్లఁడా
కదిసెఁ గడుపనులు కల్లగాదురా
ఇది నిక్కమటవే ఇంతకంటె నటరా
పదరకువే నీవు పలుమారు నేలరా ॥నవ్వి॥

మెచ్చితినే గొల్లెతా మేలు లేరా గొల్లఁడా
కుచ్చితిఁ గాఁగిట నిన్నేఁ గూడుకొంటిరా
యిచ్చకుఁడ శ్రీవేంకటేశుఁడను నేనే
యెచ్చరించవలెనా, యెఱుఁగుదుఁ బదరా ॥నవ్వి॥ 514

1. ఇది కృష్ణ—గోపికాసరససంవాదము.

తోండి

మరిగిననీకేకాక మాకేలరా
తెరమఱుఁ గింతే నీవు తీసివేయనేలరా ॥పల్లవి॥

ఆడకురా నాముందర ఆకెగుణములు సారె
గోడ గడుగ నసలే కుప్పవడీని
వోడక నీ కితవైతే వుట్టి గట్టు కుందు గాని
సూడుబంటుతో బలాలు చూపి చెప్పనేలరా ॥మరి॥

యెంచకురా ఆకెపొందు యెక్కుడుగా నాయెదుట
యెంచఁబోతే మంచముకిందింతా నుయ్యే
కంచముపొత్తు గలితే కలవెల్లా నితవుగా–
నించుకాఁ జలిలేకున్న నెండగాయ నేలరా ॥మరి॥

కప్పకురా ఆకెచీర గట్టుకొంటి వదె నీవు
వుప్పాలికి యినుమడౌ నొద్దికైతేను
యిప్పుడె శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
దప్పికి నీరేకాక తగ నీ నెయ్యేలరా ॥మరి॥ 515

రేకు 989 లలిత

ఎంతటఁగాని మెచ్చవు ఇంకా నిది
పంతానకు నీవే పైకొనవద్దా యిది ॥పల్లవి॥

పక్కు(క్క?)న నలిగినట్టిపడఁతి ఇవ్వలిమోమై
చక్కఁగా నిన్నుఁ జూచెఁ జాలదా యిది
గుక్కక కానిమాటలు గొణఁగిననోటనే
గక్కున నిన్నుఁ బిలిచెఁ గాదా యిది ॥ఎంత॥

వలవంతఁ గోపగించి వంచినట్టిరెప్పలనే
మెలుపున నిన్నుఁ జూచె మేలుగా యిది
చలములే యిందాఁకా సాదించినట్టినీ—
చెలియ నీతో నవ్వె చెల్లదా యిది ॥ ఎంత ॥

వేఁకుక నీవు వట్టితే విదిలించుకొన్న చేత
వీడెమిచ్చి వూరకుండె వెలితా యిది
వీడుపడ్డచోనే శ్రీవేంకటేశ కూడెఁ జెలి
యీడఁ దనివిదీరదా ఇంకా నిది ॥ ఎంత ॥ 516

హిందోళం

నీడా యండా నొక్కటే నినుఁబోఁటికి
ఆడకురా మారుమాట లాయనాయఁ బదరా ॥ పల్లవి ॥

తెల్లనివెల్లాఁ బాలే తెలిసితి వవులేరా
గొల్లదోమటాయ [1]నాఁడుఁగులమెల్లాను
చల్లలమ్మఁ బోనీరా సారె నన్నుఁ బట్టకురా
చల్లువలపులు పైపైఁ జప్పనాయఁ బదరా ॥ నీడా ॥

కన్నదే కంటి గురుమ కంటివి నీవవులేరా
అన్నిటా నీ కాఁడుఁబోడి అగ్గువా యను
నన్ను నింటి కేఁగనీరా నవ్వులెల్లఁ జాలుఁజాలు
వెన్న నున్నగా నూరితే వేసటాయఁ బదరా ॥ నీడా ॥

పట్టినదే పంతమాయఁ బైకొంటి వవులేరా
కట్టినకంకణమాయఁ గొంతలెల్లాను
ఇట్టె శ్రీవేంకటేశ ఇరవై కూడితి నన్ను
దట్టమైనతమకమే తగులాయఁ బదరా ॥ నీడా ॥ 517

1. ఆఁడుఁగులము = ఆఁడువారిజాతి ?

శంకరాభరణం

ఎరవులకోపఁ బిఁ(పంబి(?)కనేల
తెరమఱఁగున నీకుఁ దిరుగఁగవలదే ॥ పల్లవి ॥

చెలియ నీనగవు సెలవుల నుండఁగ
యెలమి మారుమొగ మీకుఁ దగదే
కలిగినయాసలు కన్నుల నుండఁగ
చలముల బొమ్మల జంకెన దగదే ॥ ఎర ॥

ననుపులమాఁటలు నాలుక నుండఁగ
పెనఁగేటిబిగువులు పెంచకువే
చెనకేటితమకము చేతుల నుండఁగ
యెనలేనిజగడ మీకుఁ బేర్చకువే ॥ ఎర ॥

కరఁగినభావము కాఁగిట నుండఁగ
పరగేటిమోనము పనిలేదే
యిరవుగ శ్రీవేంకటేశుఁడుఁ గూడితి
సరి వెనకటి వెంచఁగఁ బనిలేదే ॥ ఎర ॥ 518

శ్రీరాగం

నిన్నుఁ బాసి రమణికి నిమిష మెందును [1]నేఁడే
మన్నించితి రమణుఁడ మాచెలిని నేఁడే ॥ పల్లవి ॥

చిత్తమెల్లా నీరాయ చెమట లేరులు వారె
యెత్తినవానకాల మింతా నేఁడే
మొత్తమిఁ జెలితురుముమొయిలు విరిసె నిదె
హత్తి వెలుతురుఁగాల మది నేఁడే ॥ నిన్నుఁ ॥

1. ఎందునున్ + ఏఁడే.

చలిసిగ్గులెల్ల ముంచె పులకలమంచు ముంచె
చలిమంచికాలాలు సతికి నేఁడే
తలఁపెల్లాఁ జిగిరించె తమకపుటెండ గాసె
వెలయువసంతము వేసవియు నేఁడే ॥ నిన్నుఁ ॥

పగడపుమోవివంటిపచ్చివెచ్చికొండ నిండె
మొగి యామనికాలము మొదల నేఁడే
నిగిడి శ్రీవేంకటేశ నీవే యింతిఁ గూడితివి
బగివాయ నిద్దరికిఁ బండుగలు నేఁడే ॥ నిన్నుఁ ॥ 519

లలిత

జయ [1]లక్ష్మి వరలక్ష్మి సంగ్రామవీరలక్ష్మి
ప్రియురాలవై హరికిఁ బెరసితివమ్మా ॥ పల్లవి ॥

పాలజలనిధిలోని పసనైనమీఁగడ
మేలిమితామరలోని మించువాసన
నీలవర్ణునురముపై నిండిననిధానమవై
యేలేవు లోకములు మమ్మేలవమ్మా ॥ జయ ॥

చందురుతోడఁబుట్టినసంపదలమెఱుఁగవో
కందువ బ్రహ్మలఁ గాచేకల్పవల్లి
అందినగోవిందునికి అండనే తోడునీడవై
వుందానవు మాఇంటనే వుండవమ్మా ॥ జయ ॥

పదియారువన్నెలతో బంగారుపతిమ
చెదరనివేదములచిగురుఁబోడి
యెదుట శ్రీవేంకటేశునిల్లాలవై నీవు
నిదుల నిలిచేతల్లి నీవారమమ్మా ॥ జయ ॥ 520

1 ఇది ఆధ్యాత్మకీర్తనలలో నుండ దగినది.

ముఖారి

చెలువుఁడ వెంతైనాఁ జెల్లదా నీకు
నెలవు వెట్టితి మాకు చెల్లదా నీకు ॥పల్లవి॥

వారసి నేమిద్దరము నూరకే వాదు లడువఁగ
శిరసువంచుకుండఁగఁ జెల్లదా నీకు
పరగ మాలో నేమే పగలు చాటుకోఁగా
సిరులతో నవ్వేవు చెల్లదా నీకు ॥చెలు॥

ముప్పిరి నీకుఁగా మొకాలు చూడకుండఁగ
చెప్పవచ్చేవు సాకిరి చెల్లదా నీకు
రెప్పలతుదల మాకు రేసులు వుంటుండఁగాను
చిప్పిలి మోముకళలు చెల్లదా నీకు ॥చెలు॥

యిక్కడనే దగ్గరితి మిందరినడుమా వచ్చి
చెక్కుల నొక్కేవు యింతచెల్లదా నీకు
మక్కువ శ్రీవేంకటేశ మమ్ముఁగూడితి విద్దరి
చిక్కితిమి నీపాలఁ జెల్లదా నీకు ॥చెలు॥ 521

రేకు 990 హిజ్జిజి

ఒకటిపై నొకటేల వొద్దే యింత
చికురము వీడెఁ జాలు సిగ్గులు నీకేలే ॥పల్లవి॥

తియ్యనిపెదవినోటఁ దెగి వెంగెమాడఁబోతే
వొయ్యనే కారములయ్యీ వొద్దే యింత
పయ్యదలోనిజక్కవపక్షు లడిచేయట్టి-
కయ్యము చాలదా నాతో కయ్యము నీకేలే ॥ఒక॥

తెల్లనికన్నుల నీవు దిష్టించి చూడఁబోతే
వుల్లసపుచేఁగదేరీ వొద్దే యింత
చెల్లఁబో నడపుకరి సింహమునడుము నీమై
పెల్లునఁ బెనఁగీ నాతోఁ బెనఁగ నీకేలే ॥ ఒక ॥

మెత్తనితామెరచేత మీఁటి నన్ను దొబ్బఁబోతే
వొత్తి మరునమ్ములయ్యీ వొద్దే యింత
యెత్తి నిన్ను శ్రీవేంకటేశుఁడ నేఁ గలసితి
పొత్తులరతులు చెల్లె పూఁపనవ్వ లేలే ॥ ఒక ॥ 522

శంకరాభరణం

ఎట్టు గడించుకొంటివే ఇవి చక్కఁదనమంటా
చుట్టములు గావే అవే సూడుబంట్లు ॥ పల్లవి ॥

తామెరలవంటివేమో తరుణి నీకన్నులు ఆ-
తామెరలే మరునికి తగ బాణాలు
సోమునివంటిదే నీసోఁపై (సొంపై ?)నమొగము ఆ-
సోముఁ డాతనిఁ గలసి జోడౌతెలిఁగవా ॥ ఎట్టు ॥

జక్కవలఁ బోలినవి సతి నీకుచములు ఆ-
జక్కవలే మరునికిఁ జనవరులు
మిక్కిలితేంట్లఁ బోలె మేలిమి నీకురులు
పక్కన నాతని కవి బంట్లౌతెలిఁగవా ॥ ఎట్టు ॥

చిగురుఁ బోలినదె చెలియ నీమేను ఆ-
చిగురేపో మరునికిఁ జేకత్తులు
నగుతా శ్రీవేంకటాద్రినాయకునిఁ గూడితివే
తగ నీతఁడే యాతనితంత్రౌ తెలిఁగవా ॥ ఎట్టు ॥ 523

### రామక్రియ

నీకే తెలుసుఁగాక నీవాళ్ళపనులు
కైకొని యెఱుఁగుదుమా కడమ నున్నవారము ॥ పల్లవి ॥

ఔరా నీమాట నిజమందునో కల్లందునో
దూరి దూరి యేమన్నా దోసమయ్యీని
యేరా నీమోవి యిది యెంగిలో పావనమో
యేరుపరచ వెఱతు మెఱఁగ మిఁతే(మింతే?)సి ॥ నీకే ॥

యేచిననీకన్ను లవి యెఱ్ఱనో తెల్లనో
సూచించితే నిజము నిష్ఠూరమయ్యీని
తాచి నీగుణము మంచితనమో కపటమో
చేచేత నడుగరా చెప్పేపు వీధిని ॥ నీకే ॥

నీవుగా సించినచీర నీదో నారులదో
భావించి యేమన్నాఁ బచ్చిదోఁచీని
శ్రీవేంకటేశ నేఁడు చేరి నన్నుఁ గూడితివి
నీవే నే ననుకొంటి నిండుకుఁడు(కుండు?) మిఁకను॥నీకే॥524

### శుద్ధవసంతం

ఇందరిలో బిగిసేవు యిప్పుడేలా
నిందలమాట లన్నియు నీపై నున్నవిరా ॥ పల్లవి ॥

పంతగాఁడ వవుదువు పలుకరా
యింతచాలదా కోప మిఁక నేలరా
దొంతినున్నది వలపు తొలఁగకురా
అంతచలము రతులయందునే చూపరా ॥ ఇంద ॥

చెల్లె నీకు రాజసము శిరసెత్తరా
తొల్లి నీకు మొక్కితి దూరులేలరా
వెల్లవిరాయఁ బనులు వెంటనే రారా। నీ—
పల్లద మేమిగల్లాను పానుపుపైఁ జూపరా ॥ ఇంద ॥

కడుజాణ వౌదువు కాఁగిలించరా
వడఁబడ నిఁకనేల వద్దువద్దురా
కడఁగి శ్రీవేంకటేశ కలసితిరా। నీ—
అడియాల మింతయు నాయంగముపై నించరా ॥ ఇంద ॥ 525

దేసాళం

ఎరవులు సతమౌనా యెందాఁకనే। కానీ
తరవాత నయ్యీఁగాక తరవెందాఁకనే ॥ పల్లవి ॥

తతిఁ దనయంతటనే తనకు లేనిమోహ—
మితరులు యెచ్చరించే దెందాఁకనే
పతిఁ బిలువకతొల్లే పైకొని వచ్చేరాక
సతుల నంపఁగ వచ్చె సట లెందాఁకనే ॥ ఎర ॥

మక్కువతోఁ దనంతనే మాటాడించనిమాట
యెక్కించి మీ రాడించే దెందాఁకనే
ఇక్కువ గరఁగి తానే యెదురుకొని కాఁగిలి
చిక్కి నేఁ గొసరఁగాను చేరే దెందాకనే ॥ ఎర ॥

సంతతము నిదేపనై జంటవాయకుండేపొందు
ఇంత దలఁపించి కూడే దెందాఁకనే
చింతదీర మన్నించె శ్రీవేంకటేశుఁడు నన్ను
దొంతులాయఁ బులకలు దూరులెందాఁకానే ॥ ఎర ॥ 526

నాదరామక్రియ

ఏమైనా నయ్యీఁగాక యెందాఁకనే
అమనిపచ్చలమీఁదిఆస లెందాఁకనే ॥పల్లవి॥

తానే వచ్చీఁగాక తగిలి పిలువనేల
యేనుగఁ గఁబా(గంబా?)నఁ దీసే దెందాఁకనే
కానీలేవే వానిచేఁత కాదుగూడదననోప
మాననిగుణములకు మందు లెందాఁకనే ॥ఏమై॥

తీటీ నలుకలు దానే దీమస మెడలనేల
యేటులు వంకలు దిద్దే దెందాఁకనే
ఆఅడి సేయఁగనేల అంది పొంది పాయనోప
నూతేటివెన్నలకు నును పెందాఁకనే ॥ఏమై॥

అండనే శ్రీవేంకటేశుఁ డాదరించి నన్నుఁ గూడె
యెండమావులదప్పు లెందాఁకనే
నిండుదొర వీనిమీఁద నేరమెంచ నే నోప
వండ వండనట్లయినవాసు లెందాఁకానే ॥ఏమై॥ 527

రేకు 991 శంకరాభరణం

ఇందాఁకా నెందు వోతివి యీపాటివాఁడవు
సందడిఁ బెండ్లి నేఁడు చక్కఁబెట్టరాదుగా ॥పల్లవి॥

నాటఁగ దొరవు నాతో నవ్వితివంటా నవ్వ
బూటకాన నే గాదెఁ బోయరాదుగా
గీఁటుచు వలపు చల్లి గిరిపేవు కన్ను లిట్టె
మూటగట్టి అవి నే మూలఁబెట్టరాదుగా ॥ఇందాఁ॥

సాగిన సబలిలోన సరసమాడితివంటా
చేగలనది వాడటము సేయరాదుగా
తీగెల మాటలాడి తేనెలు పూసితివంటా
వేగిరించి తమకము వెళ్లఁబోయరాదుగా ॥ ఇందాఁ ॥

కరఁగి నీ విట్టె నన్నుఁ గాఁగిలించితివంటా
మరునమ్ము వాఁడిచెడ మందు లేదుగా
ఇరవై శ్రీవేంకటేశ యేలితివి నన్ను నిట్టె
వొరసి నిన్నిట్లాడకుండరాదుగా ॥ ఇందాఁ ॥ 528

## ముఖారి

నిజమాడరా నాతో నీకు నీవే
[1] బజనచెడ్డవలపు పనిలేదురా ॥ పల్లవి ॥

అరయ నామీఁదితలఁ పంత నీ కున్నదా
వరుస వంతుకు నేనే వచ్చేఁగాక
సరసమాడేయందు చవిగద్దా నామీఁద
వొరసిన నాచేతివొత్తులుగాక ॥ నిజ ॥

వసమా నాకు నీవు వద్ద నుండి వూరకైనా
అసముదించనిమాట లాడేఁగాక
సుసరమా నీపొందు సుదతు లిందరిలోన
కసుగాటు నీవలపు కైకొనేఁగాక ॥ నిజ ॥

ఆరీతి నాపై తమక మంత నీకుఁ గలదా
గోరపెట్టి నిన్ను నేనే కూడేఁగాక
నేరిచి యానవెట్టేవు నీవు నాపై మోహమంటా
యేరా శ్రీవేంకటేశ యియ్యకొంటిలేరా ॥ నిజ ॥ 529

1. బజన = ప్రీతి ?

సాళంగం

ఆయనాయ నూరకుండు మంతే చాలు
చాయలు సన్నలు నైతేఁ జప్పనయ్యీ నీకను ॥ పల్లవి ॥

కన్నులు దెరచి చెలి గక్కన రెప్పలు వంచె
వెన్నెలో అది నీకు వేసఁగో కాని
మున్నిటిమీ మోహముల ముచ్చటలకొలఁ దింతే
పన్ని నేము చెప్పఁబోతే పచ్చిదోఁచు నీకను ॥ ఆయ ॥

పెదవులు గదలించి పేరుకొన కూరకుండె-
నది నీకుఁ జిగురో చేగాయనో కాని
యెదుట మీలోలోనే యెనసినకొలఁ దింతే
పొదిగి యేమన్నాను పొరయెత్తీ నీకను ॥ ఆయ ॥

చేరి నీయెదుట నుండి చిఱునవ్వు నవ్వె నింతె
పేరడి నీకవి పాలో పెరుగోకాని
కూరిమి శ్రీవేంకటేశ కూడితి రిద్దరు నిట్టె
మేరతో నెవ్వ రేమన్నా మితిమీకీ నీకను ॥ ఆయ ॥ 530

సామంతం

చెలిపలుసోఁకులే నీసింగారము
అలరె నీకిన్నియును అవధారు నేఁడు ॥ పల్లవి ॥

అంగన నిన్నుఁ గూడఁగ నటు నీపై వడిసేటి-
అంగపుఁజెమట నీకు నభిషేకము
వుంగిటిఁ గొప్పువిరులు వుపరిసురతవేళ
సంగతి రాలేటిచల్లు వేదపూజ ॥ చెలి ॥

నించినకాఁగిటిలోనినెలఁతనిట్టూర్పుగాలి
అంచులుమోవ విసరేయాలవట్టాలు
అంచెల మర్మమునోఁక నాడుకొనేమాటలే
కాంచనపుగిన్నెలతో కప్పురబాగాలు ॥ చెలి ॥

వనిత విడెముతోడ వంచినమోవితేనె
నను పైననీకు మహానైవేద్యము
యెనసి శ్రీవేంకటేశ యిన్నియుఁ గలిగె నీకు
మొనగోరిమాచేతిమొక్కు లిందవయ్యా ॥ చెలి ॥ 531

## రామక్రియ

ఏరా నీవప్పుడే నన్ను నెంతగాఁ జూచితివి
మేరమీరి నీచేతనే మెప్పించుకోనోపనా ॥ పల్లవి ॥

ఇట్టె నామోహము నీవే యెఱఁగేవనుంటిఁ గాక
నెట్టన నిన్ను రప్పించనేరనా నేను
చిట్టకానకు నన్నింతసేయవని వుంటిఁగాక
గట్టిగా నాచేయి మీఁదుగా నడవ(ప?)నేరనా ॥ ఏరా ॥

తెమలించి నీవే మాట తీసేవని వుంటిఁగాక
తమిరేఁచి నిన్ను నాఁగ తడవా నాకు
సముఁడవై నవ్వే వింతే సటలని వుంటిఁగాక
రమణులతో నవ్వితే రచ్చవేయలేనా ॥ ఏరా ॥

ఆసాసల నీమాటకు నడ్డమాడనైతిఁ గాక
వాసి దెచ్చుకొని నిన్ను వంచుకోలేనా
బాసిచ్చి శ్రీవేంకటేశ పైకొని కూడితిగాక
వేసరినదాఁకా నిన్ను వెంటఁ దిప్పకుందునా ॥ ఏరా ॥ 532

శుద్ధవసంతం

[1] ఇన్నేసివావులతో నిందరిపాలఁ గలిగె
పిన్నపెద్దై మేలుసేసీ పెంచరే యీబాలుని ॥ పల్లవి ॥

నరకాసురునితండ్రి నడురేయి జనియించె
అరుదుగఁ గంసుని కల్లఁడాయను
నిరతి శిశుపాలునినెయ్యపుమఱఁది వుట్టె
పెరుగఁగా మేలుసేసీ పెంచరే యీబాలుని ॥ ఇన్నే ॥

వొద్దిక పాండవులకు నుదయించె మేనబావ
బుద్ధితో వసుదేవునిపుత్రుఁ డాయను
వుద్దండపుగొల్లెతల కొఁగి మగఁడు గలిగె
పెద్దవాఁడై మేలుసేసీ పెంచరే యీబాలుని ॥ ఇన్నే ॥

నేరనిదుష్టులకెల్లా నిండుచిచ్చరపిడుగు
నేరిచినశిష్టులకు విధానము
యీరీతి శ్రీవేంకటేశుఁ డితఁడె బాలకృష్ణుఁడు
పేరడిగా మేలుసేసీ పెంచరే యీబాలుని ॥ ఇన్నే ॥ 533

రేకు 992 లలిత

గుఱిగా శ్రీకృష్ణుఁడు మనకు దొర దూరువాఁడు
వెఱవక చేతికొద్ది వెఱఁజరో మీరు ॥ పల్లవి ॥

పెట్టిరి గొల్లెతలెల్ల పెరుగు నెయ్యి వుట్ల
కొట్టరో కొట్టరో మీరు కోలలవారు
తిట్టేరు వారల్లదివో తెగి దగ్గరకతొల్లె
పట్టరో వారలు మీరు పైఁగారేపాలు ॥ గుఱి ॥

1. 533, 534 పాటలు ఇవి అధ్యాత్మకీర్తనలలో నుండదగినవి.

యెంచిపెట్టిరి దొంతుల నేడలేసిచక్కిలాలు
దించరో కుండలతోనే దిగువకును
పెంచులయినదాఁకా పెనఁగేరు మనతోడ
తుంచి నోరవేసుకొని తొలఁగరో మీరు ॥గుజి॥

తక్కక యదుకులెల్లా దాఁచిరి తమసొమ్మంటా
చిక్కెఁ జిక్కెఁ దీసుకోరో సేన వున్నవి
యెక్కెను శ్రీవేంకటాద్రి ఇదివో మనకృష్ణుఁడు
చక్కనాయఁ బనులెల్లాఁ జాలించి రారో ॥గుజి॥ 534

శంకరాభరణం

ఎవ్వనికి వలతువే చెలియా
యెవ్వలఁ బిలిచిన నెఱఁగవే చెలియా ॥పల్లవి॥

చక్కఁగఁ బయ్యదజారిన దెఱఁగవు
యెక్కడ చూచేవే యిటు చెలియా
చెక్కులవెంటఁ జెమటలు వడియఁగ
ముక్కున నూర్పులు ముంచేవే చెలియా ॥ఎవ్వ॥

జాఱినకొప్పనుఁ జక్కఁగఁ బెట్టవు
మీఁతేవు పరాకున నేమే చెలియ
మాఱుమాటలును మాతో నాడవు
తీఱక లోవెలిఁ దిరిగేవే చెలియా ॥ఎవ్వ॥

వెలయ హారములు వెనకకు వేసితి
తలఁ పెందున్నదె తగఁ జెలియ
కలసెను శ్రీవేంకటపతి న(ని?)ను నిటు
కులికి యితనిఁ బేర్కొనవే చెలియా ॥ఎవ్వ॥ 535

ముఖారి

ఎఱఁగ విన్నవించేను యిప్పుడే నేను
  తఱవాతఁ దలఁచుకో తప్పదు మాచేఁతలు ॥ పల్లవి ॥

కొప్పు ముడువఁగఁబోతే కుచములు నాఁటుఁ జేసు—
  నప్పు దోరువఁగలవా ఆయముచోటు
  చిప్పిల నేఁ జూచితేనే చెమరించె నీమేను
  చెప్పి మాచేత సేవలు సేయించుకోఁగలవా ॥ ఎఱ ॥

కుంకుమ పూయఁగఁబోతే గోరికొన దాఁకుఁ జేసు
  కొంకక సమ్మతించేవా గుండె దాఁకును
  అంకెల మాటాడఁగా నీకట్టే మదనమెత్తె
  ఇంక మాపూడిగము సేయించుకోనోపేవా ॥ ఎఱఁ ॥

హారములు గట్టఁబోతే నదె కాఁగిలాఁ జేసు
  యీరీతి మారుకొన నిఁక వచ్చునా
  యేరా శ్రీవేంకటేశ ఇంతలోనే కూడితివి
  చేరి మాచేతిపనులు చిత్తమువచ్చీనా ॥ ఎఱఁ ॥ 536

శంకరాభరణం

వలపు వేఁచి కొరుకవద్దే నేఁడు
  చెలి నింత సేయఁగాను నెలవేమే తనకు ॥ పల్లవి ॥

చిగురుఁబోడికి నేఁడు చింత ఇంత దగునా
  వెగటు మాని యతని విచ్చేయుమనవే
  తగదు యీపె అలపు తనది గాదా
  మగవాఁడే ఇంతైతే మానుపరాదనరే ॥ వల ॥

కమలగంధికి నేఁడు కాఁక లింత దగునా
తమకానఁ జేకొని దయఁజూడుమనవే
అమరదు యీదోస మంతేసి మేలా
తమబోఁటు లిట్లై తేఁ దప్పించరాదనరే ॥ వల ॥

వెసఁ గోమలికిని విరహము దగునా
యెసఁగి శ్రీవేంకటేశు నీపెఁ గావుమనవే
అసము దించక నేఁ డంతలో విచ్చేసి కూడె
రసికులచేఁతలెల్లా రతికెక్కెననరే ॥ వల ॥ 537

పాడి

ఇంత కింతే చాలదా యేఁటికమ్మా
దొంతులాయ వలపులు తొలరో వోయమ్మా ॥ పల్లవి ॥

ఆయనాయ వానిసుద్ధు లందుకేమి నే మీకుఁ
జేయఁగల పనులకుఁ జెప్పరమ్మా
పోయినపనులు పోనీ పొద్దువోదా మీకేమి
చాయలు సన్నలు నింక చవులు గావమ్మా ॥ ఇంత ॥

యేడ నుండెనేమి వాఁడు యేమిగారణము మీకు
యీడకు వచ్చినపని యేదమ్మా
యేడకేడ తలపోఁత లింకా మరవరా
నీడలకు యెండలకుఁ గూడునా వోయమ్మా ॥ ఇంత ॥

పుక్కట వీనికిఁగాను పూనుక రావద్దు గాని
తక్కక వేరొకమాట తలఁచరమ్మా
గుక్కక శ్రీవేంకటేశుఁ గూడి మీమాట వింటి
యెక్క మీచలము నేఁడు యెన్నికాయసమ్మా ॥ ఇంత ॥ 538

ఆహిరి

ఓప నోప తియ్యకురే వాడివట్టి రమ్మంటా
యీపొద్దు కాతనివద్ది కేఁగరే మీరు ॥పల్లవి॥

బొలేవే తనసుద్దు లందరుఁ దెలిసేరా
తేలింపుసటలు నాకే తెలుసుఁగాక
వోలి సూడుబంటౌట వొండెఁ జుట్ట మవుట గాక
మైల గొంత అందులో మణుఁగూఁ గొంతా ॥ఓప॥

వింటిలేవే వానికిఁగా వేఁడుకొనే మీమాఁట
రెంటికిఁ గలఁడు తనరీ తెరుఁగుదు
ఇంట నుండవలె నొండె యీడకే రావలె నొండె
కుంటెనలు గొంత మరి కూటములు గొంతా ॥ఓప॥

అట్టేకాదా మీకుఁ దెల్లనైనవెల్లాఁ బాలవును
గట్టిగఁ దనగుణాలు కన్నవే నేను
యెట్టకేలకు శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
తిట్టు గొంతా ఇందాఁక దీవె నిఁకఁ గొంతా ॥ఓప॥ 539

రేకు 993 శంకరాభరణం

ఊరకున్నవారి కూరోపదన్నట్లు
నేరనైతి నే నింక నిన్నేల కొసర ॥పల్లవి॥

మగిడి చూడఁగఁగదా మనసు నీపైఁ దగిలె
తగులు గలుగఁగదా దైవారె వలపు
నగుతానే ఇంతాయ నావంకనే నేఁడు
ఇగిరించెఁ గోర్కి నీవేమి సేతువురా ॥ఊర॥

మాటలాడఁగఁగదా మర్మములు గడునాటె
నాటుఁదమకము గదా ననుఁ బాయనీదు
తేటతెల్లమి సేసె తెగనినాయాసలే
వాటపుఁదప్పు నీవల్ల నిఁకనేదీ ॥ ఊర ॥

మొకమోటమునఁగదా మొలచె నివ్వెర గొకటి
వొకటి కొకటికి లంకె లమరె మన కిపుడు
వెకలినై కూడితివి వింతగా నిను నేను
అకట శ్రీవేంకటేశ అనఁగఁ జోటేది ॥ ఊర ॥ 540

వరాళి

విచ్చేయవయ్యా వెలఁదిఁ జూతువు గాని
ఇచ్చకములాడేము యెట్టయినాఁగాని ॥ పల్లవి ॥

మరుఁడు పువ్వుల నేసె మగువ నేలలు వ్రాసె
ఇరవగునీవలపు లింతగాఁ జేసె
తెరమరఁ గిది నీవు దీసినఁగాని పోదు
యెరవుసేయక నే మేమన్నా వాదు ॥ విచ్చే ॥

చందురుఁడు జామెక్కె సతి చింతలోఁ జిక్కె
అందపునీచలములే అన్నియు దక్కె
నింద లిన్నియు నిట్టె నీమీఁద గురియాయ
అందిపొంది నేఁడు మాకు నాడఁ చరియాయ ॥ విచ్చే ॥

చల్లగాలి కడుహెచ్చె సతి గరఁగఁగజొచ్చె
ఇల్లిదే నీమాటపట్టు లిప్పుడే వచ్చె
చెల్లుఁబడిఁ గూడితివి శ్రీవేంకటేశ యీచెలి
బల్లిదురాలాయ నేము పైతరపుసేయ ॥ విచ్చే ॥ 541

సామంతం

తానేడ నేనేడ దగ్గరి వీఁడు
 పూని కన్నులఁ దిట్టినా పోఁడే వీఁడు ॥ పల్లవి ॥

సారెకుఁ దప్పకచూచి జాణతనాలాడీని
 పోరి పోరి వద్దన్నాఁ బోఁడే వీఁడు
 పేరుకొని పిలిచీని పెదవుల గొణఁగీని
 పూరకున్నా నవ్వుతాను వొరసీనే వీఁడు ॥ తానే ॥

పానుపుపైఁ బవళించీఁ బలులుచెప్పఁ బిలిచీ
 మోనాన నే నుండినాను మొక్కీనే వీఁడు
 మానములు సోఁక నవ్వీ మంతనాలే వెదకీని
 వీనులు చొరఁగనీఁడు విన్నపాలు వినఁడు ॥ తానే ॥

పట్టినచలమే పెంచీఁ బైఁ జేయివేసీని
 గుట్టున నుండఁడు నాతోఁ గొంతైనా వీఁడు
 యిట్టె శ్రీవేంకటేశుఁ డెలయించి నన్నుఁ గూడె
 అట్టె కెక్కించెను నన్నాలడి సేసి వీఁడు ॥ తానే ॥ 542

శ్రీరాగం

చెప్పఁగ సిగ్గులువడే విదే చేఁతలు నేమే కంటిమి
 ఇప్పుడుగా మాకోరిక లిటు ఫలియించినది ॥ పల్లవి ॥

చెక్కుల జారినచెమటలు చిందరవందరకురులును
 గక్కన నరవిరిబాగులు కంటిమి నీకిపుడు
 మొక్కలమగుకన్నెవు నీమొలకకుచంబులమీఁదట
 ఇక్కువలంటినచందురు లెక్కడివే నీకు ॥ చెప్పఁ ॥

మోమునఁ దేరేటికళలును ముంచిన కన్నులతేటలు
కామించినభాగ్యంబులు గలిగెనే నీ కిపుడు
నేమే చెప్పిన నొల్లవు నీయంతనే నీ కిప్పుడు
యీమోహపుటసురుసురులు యెక్కడివే నీకు ॥ చెప్పఁ ॥

సదమదమగురతియలపులు సారెకు సారెకు వెరగులు
నిదురలు మిక్కిలి మించెను నేఁడే నీ కిపుడు
కదియుచు శ్రీవేంకటపతికాఁగిటఁ గూడఁగఁ గలిగెను
ఇదివో ఇంతకముందర యెక్కడివే నీకు ॥ చెప్పఁ ॥ 543

ముఖారి

అందరి మెప్పించుదాఁకా నణఁగేఁ గాక। నే-
నిందులోనే పాలు నీరు నేరుపరచలేనా ॥ పల్లవి ॥

ఇంకాఁ దానే యెరిఁగీని ఇప్పుడేలంటాఁ గాక
అంకెలం బదరనైతి నయ్యో నేను
వంకలొత్తి నేఁ దనవంటిదాననైతేఁ గన
లంకెల మీతోఁ దనలాగులెల్లఁ జెప్పనా ॥ అంద ॥

ఇప్పటికోపము మీఁద నిట్టే వుండదని కాక
కప్పుదునాచేఁతలెల్లఁ గంటే నేను
తప్పని నాగుణములు తనగుణములఁ బోలితే
చొప్పుతో నక్కునఁ బోసి చూపనా మీకు ॥ అంద ॥

పోరానిచుట్టరికపుపొందు దనదని కాక
చేరి నోరు మూసుకొంటి చెల్లఁబో నేను
ఆరీతి శ్రీవేంకటేశుఁ డంతలోనె నన్నుఁ గూడె
తాడుకాణ లిఁక నేల తానే నేను ॥ అంద ॥ 544

దేశి

అటుగనక నినుఁ దలఁచు కంతట నుండుటమేలు
అటుమటము లెందాఁక నంపరా నీవు ॥ పల్లవి ॥

చెంతల వేరొకతెపై చిత్తము నీకుండఁగా నే
యెంతప్రియము చెప్పిన నేమిసెలవు
ఇంతట గుట్టున నుండ నెరిఁగేవు గాక నీవే
కాంతుఁడ నిద్రించువారికాళ్ళ గడుగవశమా ॥ అటు ॥

అవ్వల నెవ్వతెపసకో అసురుసురు గాఁగ నిను
నవ్వించఁబోవు టిస్సీ నగుఁబాట్లు
దవ్వులపొందులే చవులు దగిలేవు నీవు నను
నెవ్వగ నీరువట్టుకును నేయి మందగునా ॥ అటు ॥

వేరే యేసతినో తలఁచి వేడుకలు చెలఁగఁగ
కూరిమి నేఁ బైకొనుట కూళతనము
చేరువనే కూడితివి శ్రీవేంకటేశ్వరుఁడ
తేరిపోయినపనికి తిరుగ మాఁటేలా ॥ అటు ॥ 545

రేకు 994 దేసాళం

పోయినపనులకేల పోనీవయ్యా
చాయ నేసుకొంటినా సమ్మతైతిఁ గాక ॥ పల్లవి ॥

వలవవద్దంటినా వడి నీవెవ్వరికైనా
అల మాయింటికి రాకుమంటిఁ గాక
పిలువవద్దంటినా పేరుకొ నెవ్వతెనైనా
వలవనిమాట మాతో వద్దంటిఁగాక ॥ పోయి ॥

చూడఁగవద్దంటినా సుపతులవంక నిన్ను
ఆడా నీడా మమ్మంటకుమంటిఁ గాక
వేడుకకాఁడవై నీవు వీది నుండవద్దంటినా
యేడలేనిప్రియాలు నా కేఁటికంటిఁగాక ॥ పో యి ॥

నగఁగా వద్దంటినా సనుపుసతులతోడ
యిగురుమో వడుగకు మిట్టంటిఁగాక
అగపడి శ్రీవేంకటాధిప కూడితి నిన్ను
మొగమోడకుండితినా మొక్కనైతిఁ గాక ॥ పో యి ॥ 546

## పాడి

వాఁడిగో దగ్గరివచ్చె వద్దే యింత
ఆఁడుదాన వెదురేఁగి యందము గైకొనవే ॥ పల్లవి ॥

యీతఁడు విచ్చేయుచేడ ఇంతేసి మాట లేడ
రాతిరెల్లా నీవు నిద్రవోతివో పోవో
చేతికి లోనైనవేళఁ జేతురా యింత యగడు
యేతువ [1]లెత్తాడఁ బతి నిల్లాలికిఁ జెల్లునా ॥ వాఁడి ॥

నిన్నతఁడు చూచుటెంత నీవు తలవంచుటెంత
కన్నెకోప మెంత మూఁట గట్టుకొంటివో
మన్నించవచ్చినవేళ మగవానిఁ బరతురా
తిన్ననిపంతాలు చూప దేవులకుఁ జెల్లునా ॥ వాఁడి ॥

మగఁ డాడ వుండనేల మంచాన నీ వుండనేల
బిగువే నీకు వెన్నెతోఁ బెట్టిరో యేమో
నగుతా శ్రీవేంకటాద్రినాథుఁడు గూడెఁ గమ్మటి
్ గడాలు రాణివాసములకుఁ జెల్లునా ॥ వాఁడి ॥ 547

1. ఎత్తి+అడన్.

బౌళి

నిన్నింతసేసినందుకు నే నేమిసేతు దాని
    అన్నిటా నెక్కెనుఁ గోప మప్పటినుండీరా ॥ పల్లవి ॥

నగవులు వెదచల్లి నయములు మాటలాడి
    జిగురువలె నిన్నది చిక్కించెఁగా
    పగటులు పచరించి పడఁతి కనుచూపుల
    సగమే జళిపించి జట్టిగొనెఁగా ॥ నిన్నిం ॥

నటనలనే నడచి నంటువినయాలు సేసి
    యిటువలె నది బయలీఁదించెఁగా
    సటల సిగ్గులు చూపి చాయలు సన్నలు సేసి
    కటకటా నిను నింత కరఁగించెఁగా ॥ నిన్నిం ॥

కొప్పు దువ్వి నీచెక్కు కొనగోర నంటించి
    ముప్పిరిఁ జెమటలలో మునిఁగిఁచెఁగా
    ఇప్పుడె శ్రీవేంకటేశ యిటు నన్నుఁ గూడితివి
    అప్పు డాకె నిన్నుఁ గూడి అలయించెఁగా ॥ నిన్నిం ॥ 548

గుజ్జరి

బాపు బాపు మెచ్చితిని పదవే నీవు
    తీపులోనఁ జేఁదేల తెగకువే నీవు ॥ పల్లవి ॥

సెలవి నే నవ్వుటేడ చేరి నీ గొణఁగు లేడ
    మెలఁకువ లెస్సాయ మేలే నీవు
    అలిగినదే లేమ అంతక తొల్లే మనము
    పిలిచితే బిగిసేది పెద్దరికమటవే ॥ బాపు ॥

పొంది నేఁ జేయిచేయు పెంత బొమ్మల నీజంకె నెంత
అంచు కందుకు లెస్సాయ నౌనే నీవు
కందువైనమనలోనఁ గపట మించుక లేదు
యిందరుఁ జూడఁగఁ గోప మేడనుండి వచ్చెనే ॥ బాపు ॥

కాఁగిట నేఁ గూడుపెట్టు కరఁగే వింతలో నెట్టు
రాఁగె నిదివో వలపు రావే నీవు
చేఁగదేరఁ గూడితిని శ్రీవేంకటేశుఁడ నేను
ఆఁగినరతుల నింత అలయఁగఁదగునా ॥ బాపు ॥ 549

ఆహిరి

అండఁ గూచుండెను చెలి యంత చాలదా
నిండునీతో జూజమాడ నేఁడే నేరుచునా ॥ పల్లవి ॥

పగడవాతెర యెత్తి పలికెను చాలదా। నీవు
మగువను మంతనాన మాటాడియ్యఁగా
తగినకన్యక ఇంతే(త?)తమకించనేల
ఇగిరించె సిగ్గులు నేఁ డిప్పుడే తేరునా ॥ అండఁ ॥

తలుపుమాటున నుండి తమిఁ జూచెఁ జాలదా। నీవు
పిలిచి చేయివట్టి పెనఁగఁగను
చలివాయ నిప్పు డిట్టె సరసము లేల
వొలసి రట్టడితన మొక్కమాఁటే వచ్చునా ॥ అండఁ ॥

కాఁగిలించఁగా నీతోఁ గరఁగెను చాలదా। నీవు
మాఁగినమోవి ఇచ్చి మచ్చు చల్లఁగా
పాఁగిన శ్రీవేంకటేశ పడఁతిఁ గూడితివి
ఆఁగి నీతో రతిసేయ కప్పుడే పోనిచ్చునా ॥ అండఁ ॥ 550

గౌళ

ఏమని చెప్పుదమే ఇద్దరిభావములును
ప్రేమము లీరూపములై పెనఁగఁగఁ జొచ్చినవి ॥పల్లవి॥

కోపగించుకొని రాఁగా కొంగువట్టీ రమణుఁడు
వోపనంటేఁ బెనఁగీనే వొయ్యనే చెలి
పైపై కాఁగిటఁబట్టి బలిమిసేయఁగఁబోఁగా
తీపులపెదవి వంచి తిట్టీ నతనిని ॥ఏమ॥

పెదవి గొణఁగుకోఁగా ప్రియుఁ డాకెచెక్కు నొక్కె
చెదర నాడుత(చు?) లోనై చిక్కిఁ జెలి
మొదలఁ గోలుముంమగ మోవి గంటిసేసె నాడ
అదివో చురుముఁ(కుఁ?)జూపు లాకె చల్లీ మీఁదను ॥ఏమ॥

పక్కన నానవెట్టఁగ పానుపుపైఁ బడవేసీ
చొక్కుచుఁ గరఁగి తానే సొలసీఁ జెలి
యిక్కువైన శ్రీవేంకటేశుఁడు గూడె నిట్టె
ముక్కుమీఁదివేలితోన మోనమున నున్నది ॥ఏమ॥ 551

రేకు 995 ఆహిరి

అల్లదె మేడమీఁద నతివ
వెల్లవిరయ్యీ నిట్టె విచ్చేయవయ్యా ॥పల్లవి॥

వాలుకచూపులు నీపై వంచీ
వేలుఁబులకలు మేనఁ బెంచీ
తాలిమెంచు దాఁచెనో తాను । నీకే
మేలుసేసి వున్న దిదె మిక్కిలి మాపిన్నది ॥అల్ల॥

మనసు నీపైఁ గడుమరిగీ
వానరుఁజెలులమీఁద నొరగీ
తనివిదీర దెంతైనా తాను। నీకే
అనయము దలఁచితి నన్నది మాపిన్నది ॥ అల్ల ॥

తమకపుఁజెమటలఁ దడిసీ
జమళికోరికలచే జడిసీ
నెమకి శ్రీవేంకటేశ నిన్నుఁ గూడి
గములై నసీగుణాలు కన్నది మాపిన్నది ॥ అల్ల ॥ 552

నాదరామక్రియ

అంది తెలియఁగరాదా అంగననేరుపులెల్లా
కందువతారుకాణలు గలిగె మీకిప్పుడు ॥ పల్లవి ॥

నిద్దపునొసలిమీఁద నిలుపుఁగస్తురిబొట్టు
అద్దము చూచి గోర నటుదిద్దఁగా
వొద్దిక వెనకవంకననుండినసీడ గని
ముద్దుచూపి సన్న నేసీ మొరఁగులేలయ్యా ॥ అంది ॥

గుబ్బలపై మాణికాలఁ గుచ్చినహారములు
అబ్బురానఁ దలవంచి యమరించఁగా
నిబ్బరాన నీవెదుట నిలిచితే నీనీడ
గబ్బితనమునఁ గని కాఁగిలించె నదివో ॥ అంది ॥

మించుబంగారుపావాలు మెట్టఁగ శ్రీవేంకటేశ
చంచుల నీవును దనసరి నుండఁగా
నించి గోరిమెఱుఁగులో నీరూపు వొడగని
అంచెల నిన్నుఁ గలసినది మెచ్చరాదా ॥ అంది ॥ 553

పాడి

బిగిసే వింకా నీవు పిలిచినరావు
 చిగురువలెనే వుండు చేఁగసుమ్మీ వలపు ॥ పల్లవి ॥

చిత్తజునియమ్ములనఁ జెలియచూపులు లోలోఁ
 బొత్తుల నున్నవి పాలువో దెన్నఁడు
 హత్తినజక్కవలును నంగనచన్నులు నొక -
 జొత్తుసుమ్మీ మీఁదబెత్తు చూచుకొందుగాని ॥ బిగి ॥

తుమ్మిదలపవుఁజులు తొయ్యలినెరిఁగురులు
 వుమ్మడి నున్నవి పాయ కొకటొకటి
 చిమ్ములపలుకులును చిలుకలుఁ దమలోన
 దొమ్మిచుట్టరిక మింకఁ దోఁచినది దెరువు ॥ బిగి ॥

చందురునివెన్నెలలు సకియలేఁతనవ్వులు
 ముందువెనకలు వాసి మొద లొక్కటే
 ఇందునె శ్రీవేంకటేశ ఇంతసేసి కూడితివి
 పొందినసతికి నీకుఁ బోదుసుమ్మీ యెపుడు ॥ బిగి ॥ 554

లలిత

చేసినట్టెల్లా నీవు సేయవయ్యా
 వోసరించి నవ్వుతా నే నూరకుండే నిఁకను ॥ పల్లవి ॥

మల్లడిమీగుణములు మానుమన మాకేల
 చెల్లుబడిగలవారే చెప్పేరు గాక
 ముల్లు ముంటనేకాక ముసలాన వచ్చునా
 వొల్ల వొల్ల నీవద్ద నూరకుండే నిఁకను ॥ చేసి ॥

కొత్తసుద్దులెల్ల నేము కోరి నీతో నాడనేల
చిత్తమువచ్చినవారే చెప్పేరుగాక
మెత్తనైనచోటికే మించినగుద్దలి వాఁడి
వొత్తనేల వింతవార మూరకుండే మిఁకను ॥ చేసి ॥

అంగపునీరేకలు అవి చూప మాకేల
చెంగట సలిగెవారే చెప్పేరుగాక
అంగవించి శ్రీవేంకటాధిప నన్నుఁ గూడితి—
వుంగిటిరతులతోడ నూరకుండే మిఁకను ॥ చేసి ॥ 555

శంకరాభరణం

ఇద్దరూ [1]నేకములైతే నేమాయనే
చద్దివేఁడి వలపులు జాగుసేయఁ జెల్లునా ॥ పల్లవి ॥

తుమ్మెదవంటివాఁడు తొలుతనే మగవాఁడు
యెమ్మెలకు నేడనున్నా నేమాయనే
తమ్మిపువ్వువంటి దింతే తగిలినయాఁటదెల్లా
సమ్మతించవలెఁగాక సడిఁబెట్టఁజెల్లునా ॥ ఇద్ద ॥

వెన్నెలవంటి దింతే వెస మగవానినవ్వే
యెన్నిచోట్లఁ గాసిన నేమాయనే
యెన్నఁ జకోరాలవంటి వింతులకనుఁగొనలు
అన్నిటాఁ బొందౌటగాక అలుఁగఁగఁజెల్లునా ॥ ఇద్ద ॥

సిరులగాలివంటిది శ్రీవేంకటేశుమనసు
ఇరవై యెందువారినా నేమాయనే
విరులతావివంటివెలఁదివి నిన్నుఁ గూడె
నరసుఁ డాతని నింక జరయంగఁ జెల్లునా ॥ ఇద్ద ॥ 556

1. ఏకమైతే అనుట సహజము.

సామంతం

అందుకే చింతయ్యీని అప్పటనుండియు నాకు
కందువ నెదుగఁబోయి కమ్మరఁ దేవుగా ॥ పల్లవి ॥

పదఁతి వాని నొడఁబరచి తోడుకరావే
కడు నీనేరుపు లిందే కనుఁగొనేఁగా
వడిఁ బరాకై తినంటా వాఁడే యలిగిపోయె
బడి నేఁగి నామారు పైకొని మొక్కవుగా ॥ అందు ॥

యెంతరానన్నా వాని సిపోద్దే తోడుకరావే
యిఁతి(యింతి?) నీవు సేసేమేలు ఇందుఁజూచేఁగా
పంత మేమోఅంటినంటా పట్టఁగా నలిగిపోయె
ఇంతలో నామాఱు వానిఇంటికి నేఁగవుగా ॥ అందు ॥

శ్రీవేంకటేశుని నన్నుఁ జేకొని కూడించితివే
యీవేళ నిన్ను మెచ్చే దిందువంకఁగా
పూవుల వేసితినంటాఁ బొదిగి నన్నిదె పట్టె
ఆవల నామారు నీవు అతని వేయవుగా ॥ అందు ॥ 557

రేకు 996 వరాళి

ఆఁడువారి కింతలోఁగే వదేమిరా
నేఁడు నాఁడు నొక్కఁడవు నీవే కదరా ॥ పల్లవి ॥

నవ్వుతా గోర నిటంటే నాఁటెనంటాఁ గోపించేవు
ఇవ్వల రాకాసికయ్యా లెట్టుసేసితో
పువ్వుల వేయఁబూఁచితేఁ బొరిఁ దప్పించుకొనేవు
రవ్వైనసీబిరుదెల్లా రతికెక్కెరా ॥ ఆఁడు ॥

1. పరదేవులోని యేక దేశమా ?

వెలయఁ గొంగువట్టితే విడుమంటాఁ బెనఁగేవు
యెలమి రోలఁగట్టితే నెట్టుంటివో
చిలికినపన్నీటిజిగి నుడ్డుకుడిచేవు
పలుజలధుల నెట్టు పవ్వళించితివిరా ॥ ఆఁడు ॥

సరి నన్నొకతెఁ గూడి సదమదమైతి విట్టె
యిరవై పదారువేల నెట్టు గూడితో
అరయ శ్రీవేంకటేశ అన్నిటా నన్నేలితివి
పరగ నాతోనే నీకు బలిమి చెల్లదురా ॥ ఆఁడు ॥ 585

ఆహిరి

చెప్పఁ గొలఁదులుగావు చెలియ సింగార మిది
చొప్పుగా నిందరికి సూచనై నిలిచె ॥ పల్లవి ॥

వెలఁదికుచములమీఁదివెలిపెంపుపయ్య దిదె
యెలమిఁ బోలింపరే యెట్లున్నది
కులికి పతిఁ గలియుచోఁ గురియుఁ జెమటలజడికి
మెలఁగి కొండల మొయిలు మేసినట్లాయ ॥ చెప్పఁ ॥

సుదతి నెన్నుదుటిపైఁ జూడఁ గుంకుమబొట్టు
యెదుటఁ బోలింపరే యెట్లున్నది
కదిసి తననాయకునిఁ గలసినప్పటివేళ
మదనరాగం బిపుడె మలసినట్లాయ ॥ చెప్పఁ ॥

సతితురుములో విరులు జారి పైరాలె నిదె
యితరులకుఁ బోలించ నెట్లున్నది
యితవుగా శ్రీవేంకటేశుఁ గూడినఇపుడు
చతురతలఁ బైనేస చల్లినట్లాయ ॥ చెప్పఁ ॥ 559

ముఖారి

ఎఱఁగఁజుమ్మీ యపు దేమీ నేను
మొఱఁగు లన్నిటికిని మొక్కే నే నిపుడు ॥ పల్లవి ॥

నిక్కమును దొరవంటా నిన్నుఁ జూడవచ్చితేను
చిక్కనివలపు నామైఁ జిమ్మిరేఁచితి
నెక్కొని నేఁ గళదాఁకి నీమీఁద నొరగితి
తక్కక నాకాలు చేయి దాఁకదుగదా ॥ ఎఱఁ ॥

ంటి నీ వున్నాఁడవంటా వూరకే నే వచ్చితేను
యింటివా రెఱఁగకుండా నింతసేసితి
జంటనై కాదనలేక సరిగా నేఁ గూచుంటి
అంటితిని మందెమేళా లాయనోకదా ॥ ఎఱఁ ॥

మంచివాఁడవని నీతో మాటలాడ వచ్చితేను
యెంచకే యింతసేసితి వేరా నీవు
కొంచక శ్రీవేంకటేశ కూడితి మిద్దరమును
అంచల నారతుల నీ వలసితివో కదా ॥ ఎఱఁ ॥ 560

మాళవి

ఇంత సేయఁ జెల్లునా యీరమణిఁ బెడఁబాసి
యెంతకెంత విన్నవించే నింక నీచిత్తమురా ॥ పల్లవి ॥

విరులు ముడువఁబోతే వెలఁది యేమోకాని
మరునిబాణములంటా మచ్చరించీని
నిరతిఁ గొప్పుదువ్వితే నిండుఁదుమ్మిదలగుంపు
వరుస రేఁచేరంటా వద్దనీఁ జెలి ॥ ఇంత ॥

పయ్యెద వెట్టఁగఁబోతే బలుజక్కవలతోడ
కయ్య మందించేనంటాఁ గసరీని
పుయ్యఁగ గందము చూచి పొరిఁ గాలకూటమంటా
నెయ్యపుఁజెలులఁ జూచి నేరమెంచీని ॥ ఇంత ॥

అరుదైనమాణికాలహారము లియ్యఁగఁబోతే
విరహాగ్నిశిఖలంటా వెఱచీని
గరిమ శ్రీవేంకటేశ కలసితి వింతలోనే
యిరవై యలమేల్మంగ యిటు మెచ్చీని ॥ ఇంత ॥ 561

ఆహిరి

అడుగువెట్టితే నీకు అకెపాదమాన సుమ్మీ
నిడు(దు?)జంగనడపేల నిలవయ్య పోక ॥ పల్లవి ॥

సారె జాఱె మొలనూలు జడిసె ముత్తేలపేరు
ఖారపుసొమ్ముతో నిన్నుఁ బట్టరాఁగాను
వూరకే యలిగిపోయే వువిదదిక్కు చూడక
నేరుచుకొంటివి నేఁడే నిలవయ్య పోక ॥ అడు ॥

కురులు చెమటఁదోఁగె కుచయుగ మిటురాసె
బెరసి నీచేయివట్టి పెనఁగఁగాను
శిరసు వంచుకొంటివి చెలియకు మొకమోడి
నెరవేరెఁ బనులెల్లా నిలవయ్య పోక ॥ అడు ॥

పులకలు మేన నిండె భోగపుఁగళలు మించె-
నలమేలుమంగ నిన్ను నలమఁగాను
యెలమి శ్రీవేంకటేశ యియ్యకొని కూడితివి
నెలవుల నిట్లానే నిలవయ్య పోక ॥ అడు ॥ 562

దేవగాంధారి

ఇంటికి విచ్చేసె నాతఁ డేమే నీవు
కంటకములాడేది కాదే నీవు ॥ పల్లవి ॥

అగడుఁజెమటతోఁడ నలసివచ్చినపతి
యెగసక్కేలే యాడే వేమే నీవు
మగవానిమోహ మింత మదివిచ్చి చూడఁబోతే
యిగురువంటి దింతే యేలే నీవు ॥ ఇంటి ॥

చెంతల నిన్ను నవ్వించి సిగ్గులెల్లాఁ బాపినాఁడు
యెంతైనా మెచ్చవైతి వేమే నీవు
పంతపుదొరలపొందు పచ్చిగాఁ బిసుకఁబోతే
యింతలోఁ బసురువేసు నిదియాలే నీవు ॥ ఇంటి ॥

నెయ్యాన గద్దమువట్టి నిన్నతఁడు వేఁడుకొనీ
యియ్యకొనవే పనికి యేమే నీవు
తియ్యఁగా శ్రీవేంకటాద్రిదేవునిఁ గూడితి విట్టె
అయ్యెడ నలమేల్మంగ వవునవునే నీవు ॥ ఇంటి ॥ 563

రేకు 997 సింధురామక్రియ

ఔరా రాజసము అంతేసి తగదా
గారవాన నీవా కెకుఁ గలకాలము ॥ పల్లవి ॥

నిలుచుండి పిలిచేటినీతో నంగన నేఁడు
మలగుపై నొరగుండే మాటలాడీని
వెలినుండి వేఁడుకోఁగా వెసఁ దలుపుమాఁటుగ
నెలవుల నవ్వీ నిన్నుఁ జెల్లురా యీసతికి ॥ ఔరా ॥

అంగవించి సరసములాడేటినీతోను
ముంగిటఁ దప్పకచూచీ మోనానఁ జెలి
చెంగటఁ బ్రియముచెప్పె చెక్కునొక్కఁగా నీవు
యెంగిలిమోవి గదల నించుకంత గొణఁగె ॥ ఔరా ॥

పూనిపట్టి కొప్పు దువ్వి బుజ్జగించె నియ్యెడకు
మేనెల్ల మఱచె నలమేలుమంగ
ఆని పట్టి శ్రీవేంకటాధిప కూడితి విట్టె
తానై తే నీవురమెక్కి తానకమై నిలిచె ॥ ఔరా ॥ 564

మాళవి

ఊడిగపు సతులాల వుండరే మీరు
ఆడరే [1]మెల్లనిమాట లంతంత మీరు ॥ పల్లవి ॥

మాటలాడే రిద్దరును మాణికపుటింటిలోన
తేటలుగ దేవుఁడును దేవులు నిదె
యేఁటికి దగ్గరిపోయే రిదివేళగాదు మీకు
బోఁటులాల పిలిచితే పోదముగాక ॥ ఊడి ॥

తూఁగుటుయ్యాల లూగేరు తొలఁకుమోహముతోడ
యేఁగివచ్చి లోని కేఁగి రింతకముందు
తోఁగిచూడకురే మీరు తొడరి తమంతనే
పాఁగి పిలిచినప్పుడే పలుకుదము ॥ ఊడి ॥

యేకతాన శ్రీవేంకటేశుఁ డలమేల్మంగయుఁ
బైకొని కూడున్నవారు పానుపుమీఁద
పోకురే చనవుచేసి పొలఁతు లిపుడే వారు
ఆకుమడువఁ బిలిచే రప్పుడే పోదము ॥ ఊడి ॥ 565

1. ఇది 'మెల్లనిచూపుల మందహాసమున్' వలెనా ?

ముఖారి

అప్పటి నెత్తము జూజమాడేవు పరాకున
యిప్పుడు నీవద్ద నున్న దిదివో చెలి ॥ పల్లవి ॥

ముంచిముంచి నవ్వునవ్వీ మొగలిరేకులకొప్పు
యించుకించుక గదల నిదివో చెలి
తుంచితుంచి నిన్ను వేసీ తోరపుఁబువ్వులదండ
ఇంచువిలుతునివలె నిదివో చెలి ॥ అప్ప ॥

చిత్తగించి మాఁటలాడీ చెక్కులమెరుఁగు మించ
యెత్తినవదనముతో నిదివో చెలి
తత్తరించి వీఁపునఁ దనపేరు వ్రాసీ౧
యిత్తల నేమీ నెఱఁగ దిదివో చెలి ॥ అప్ప ॥

తొడమీఁదఁ దొడవేసీఁ దోరపుకుచము లానీ-
నెడనెడ నొత్తుతాను యిదివో చెలి
పడఁతి శ్రీవేంకటేశ పరాకుమాని నిన్ను-
నెడయక గాఁగిలించె నిదివో చెలి ॥ అప్ప ॥ 566

సామంతం

వలెనా నీకింతదూరు వనితలతో నేఁడు
యెలమి నామాట విని యింటికి రావయ్యా ॥ పల్లవి ॥

ఆగడాలు నీవే సేసి యలిగేవు రానంటా నీ-
లాగులు చూచినవారు లండఁ డందురు
వేగుదాఁకా విరహాన వేసరి మావంటివారు
యేగతి మన్నించఁడు వీఁడెంత కూళందురు ॥ వలె ॥

వలచి చెయివట్టితే వాఁటముగా నవ్వేవు
తెలిసినవారు నిన్ను(?) దిమ్మ రందురు
తలపోసి నీకుఁగా దప్పిఁబడ్డయాఁడువారు
చలమరి వీఁడేడ జాణఁ డందురు ॥ వలె ॥

ముంచినప్రియముతోడ మొక్కినాఁ గైకొనకున్న
చంచలించినట్టివారు జడుఁ డంటురు
యెంచి చూచి శ్రీవేంకటేశ నన్నుఁ గూడితివి
వంచ నింత లేకుంకితే వడి గర్వి యందురు ॥ వలె ॥ 567

## ఆహిరి

జమళిఁ గల్యాణము సరసుఁడాడె నేఁడు
చెమట లేఁటికి వచ్చెఁ జెప్పరే ॥ పల్లవి ॥

తూఁగుమంచముమీఁదఁ దొయ్యలు లిద్దరిఁ
గాఁగిలించుకొంటాఁ గరఁగీని
యేఁగుబెండ్లికొడు కెవ్వరిపై మోహము
చేఁగదేర నిది సరిఁ జెప్పరే ॥ జమ ॥

ఇదె పెండ్లిపీఁటపై యిద్దరి కొంకమాఁటే
కదిసి పచ్చడము గప్పీని
యెదుగ దోసిట నించి యెవ్వరిపైఁ దలఁబాలు
చెదరకుండాఁ బోసెఁ జెప్పరే ॥ జమ ॥

పొలఁతులిద్దరితోడ బువ్వానఁ గూచుండి
చలివాయఁ గళ్లిచ్చీ సరిగాను
యెలమి శ్రీవేంకటేశుఁ డెనసె నీవేళ నే-
చెలులకుఁ జనవిచ్చెఁ జెప్పరే ॥ జమ ॥ 568

లలిత

దీపించఁ జక్కఁదనము దేవునికిని
పైపైఁ జల్లేరు నేఁడు పన్నీరుకాపు ॥ పల్లవి ॥

వుడివోనికల్పభూజ మొద్దికఁ గొమ్మలతోనే
పొదవెల్లాఁ దెల్లనై పూచెనోకాక
యెడలేక తిరుమేన నింతటా మెత్తిరిదివో
కడలేనిహరికిని కప్పురకాపు ॥ దీపిం ॥

తిరమై యాకాసమందు తెల్లనిచంద్రునిమీఁద
వరుస నిల మేఘము వాలెనోకాక
సరసనే శశివర్ణ[1]మైనందు
పురిగొన నించిరిదే పుణుగుకాపు ॥ దీపిం ॥

పొంచి నీలగిరిమీఁదఁ బొసఁగి బంగారుకొండ
అంచెలఁ గీలించినట్టియందమోకాక
మించి శ్రీవేంకటపతిమెడ నలమేలుమంగఁ
జంచులఁ బెట్టిపూసిరి చందనకాపు ॥ దీపిం ॥ 569

రేకు 998 లలిత

ఇందుకే నీవు వచ్చితి వీడనే నే నున్నవాఁడ
విందువంటినీగుణాలు వేవేలు గదవే ॥ పల్లవి ॥

మట్టెలు గల్లురనఁగ మగువ యెందు వోయేవే
యిట్టే నీకెదురుచూచి యీడ నున్నాఁడ
కట్టిన[2]నీదవ్వ(ప్ప?)టము గజభజించఁగ నీ—
దిట్టమాట లివి మాకుఁ దెలియపుగదవే ॥ ఇందు ॥

---

1. మైన్ + అందు = దేహముమీఁద? 2. నీది + అ + పటము.

వెదచల్లువాసనతో వెదకే వెవ్వరినే
యిదె నీవు రమ్మనఁగా నీడ నున్నాఁడ
కదిసి నీముఁ(ముం?)జేతికంకణాలరవళికి
చదల నీవిన్నపాలు సందడినే వున్నవే ॥ ఇందు ॥

కలకలనవ్వులతో కమ్మటి నేమిచూచేవే
యెలమి నిన్నుఁగాచుక యీడ నున్నాఁడ
చెలఁగి కూడితి నిదె శ్రీవేంకటేశుఁడ నిన్ను
పలుకుఁబంతము నింతబలువాయఁగదవే ॥ ఇందు ॥ 570

శంకరాభరణం

ఆయలేరా మాతోనే అంత యేఁటికి
చాయలకు సన్నలకు చవులువుట్టీనా ॥ పల్లవి ॥

బలిమిఁ బట్టకురా పనిగల దీవేళ
బలిమెల్లా నాఁడువారిపై నేయటరా
చల మింతేఁటికిరా సమ్మతి రేపయ్యీఁగాక
వలపు లింతటిలోనే వడ్డికిఁబారీనా ॥ ఆయ ॥

కొనగోర నొత్తకురా కుమ్మెవోయీ ముఁ(ముం?)జేయి
కొనఁబెట్టి(ట్ట?) మోహాలు కొనసాగీనా
వెనక వచ్చేరా వీరిడిఁ జేయకు నన్ను
ననిచినమన సిట్టే నాని మెత్తనాయనా ॥ ఆయ ॥

పయిఁ జేయివేయకురా పట్టరాదు మేనికాఁక
ప్రియములు పెంచఁ బెంచఁ బెంటలయ్యీనా
దయతో శ్రీవెంకటేశ తగిలి కూడితి నన్ను
క్రియ వచ్చె నిఁక నిన్నుఁ గేరడమాడేనా ॥ ఆయ ॥ 571

ధన్నాసి

విచ్చేయవయ్యా వేగమే అక్కడికి
అచ్చమైనకోరికతో నలసీఁ జెలి ॥ పల్లవి ॥

వుప్పరిగెలోన నీవు వున్నాఁడవంటా వచ్చి
అప్పుడే రావైతివంటా నడిగీఁ జెలి
తొప్పఁదోఁగేచెమటతో తూఁగుమంచముపైఁ బండి
ముప్పిరి మోహములోన మునిఁగీఁ జెలి ॥ విచ్చే ॥

వేడుకతో నీవు నిట్టే వీడెమిచ్చేనంటా వచ్చి
వీడుపడి యందు నిందు వెదకీఁ జెలి
వాడుచు మలగుమీఁద వడి నొరగుండి తాను
పాడించుకొనీ నీపై పాటలిన్నీఁ జెలి ॥ విచ్చే ॥

పుట్టిపడి నీవు కొలువున్నాఁడవంటా విని
అట్టె నిన్ను రమ్మని చెప్పెంపీఁ జెలి
గుట్టున శ్రీవేంకటేశ కూడి యలమేలుమంగ
నట్టనడుమ నిందుకే నవ్వీఁ జెలి ॥ విచ్చే ॥ 572

హిందోళం

ఎంతమోహమో మీకు నిట్టే బతుకరయ్య
సంతసపువేళ మీకు చవి చెరిచితిఁగా ॥ పల్లవి ॥

యిద్దరు నొక్కపచ్చడ మిటు గట్టుక మీరు
అద్దరిపాటు నే రాఁగా అట్టే లోఁగేరు
వొద్దు వొద్దు మీకునేల పూరకే వట్టిభయము
గద్దరి నేం(నే?) బుద్ది మీకు కంటైతిఁగా ॥ ఎంత ॥

చూపుల మీ రిద్దరూను సొరిదిఁ గరఁగుకొంటా
యేపున నుండఁగ నే నేలవస్తినో
రాపుల నాకుఁగా మీరు రహిఁ దియ్య నింతయేల
తీపులమీగుండెలకు దిగులైతిఁగా ॥ ఎంత ॥

మించి యిద్దరునుఁ గూడి ముచ్చటలే యాడుకోఁగా
యెంచక పొడచూపితి నిట్టే నేను
అంచెల శ్రీవేంకటేశ అలమేలుమంగను నే
మంచమెక్కి కూడుటకు మనసైతిఁగా ॥ ఎంత ॥ 573

వరాళి

ఎరవు సతమవునా యెప్పుడు నేము నేమే
మురిపెపుటాకెఁ గని మొగమోడితివి ॥ పల్లవి ॥

మగువ కప్రమునోట మాటలాడీ వినవయ్య
వెగటైననేమేమన్నా వినవైతివి
బిగి ఘంగరపువేలఁ బిలిచీఁ బోవయ్యా
జిగి నేము యెంత విలిచినా రావైతివి ॥ ఎర ॥

మొనగోరిచేత నాకె మొక్కీఁ జేకొనవయ్య
పనివడి మాతోనే పరాకైతివి
ననుపున నాకె నీతో నవ్వీ నీవు నవ్వవయ్య
చనవున మానవ్వు చవిగాదు నీకు ॥ ఎర ॥

గందము వూసినమేనఁ గాఁగిలించీ మెచ్చవయ్య
ఇందుకుఁగా మాతోడ నింత నేసితివి
అందపుశ్రీవేంకటేశ అలమేలుమంగ నిన్నుఁ
బొందఁగాఁ జొక్కితివి మాబుద్ధులు చవాయఁగా ॥ ఎర ॥ 574

ముఖారి

ఎదురు చూచీ నీవు యెప్పుడు వత్తువో యంటా
 [1]పదఁగదవే నీతో పాలుపడ్డాఁ డతఁడు ॥ పల్లవి ॥

కొంకక కూడినదాఁకా కొండవంటిది వలపు
 అంకెకు వచ్చినదాఁకా నాయమువంటిది చింత
 సంకెదేరినందాఁకా చలివంటిది సిగ్గు
 యింకా నేఁటికి రావే యీడనున్నాఁ డతఁడు ॥ ఎదు ॥

మనసు గలయుదాఁకా మరులువంటిది తమి
 యెనయఁ బిలుచుదాఁకా యేరువంటిది కోరికె
 కని మాటాడుదాఁకా చీఁకటివంటిది మోనము
 కినియకువే నీవాకిటనున్నాఁ డతఁడు ॥ ఎదు ॥

సరిఁ గాఁగలించుదాఁకా జాలివంటిది వయసు
 ధరఁ దలయెత్తుదాఁకా తలుపువంటిది చూపు
 ఇరవై శ్రీవేంకటేశుఁ డీడకే విచ్చేసి కూడె
 వరు సడుగక రావే వద్దనున్నాఁ డతఁడు ॥ ఎదు ॥ 575

రేకు 999 వరాళి

ఏమోయని వుంటి మిందాఁకా
 యీమాటలేకా యిఁక నేలరా ॥ పల్లవి ॥

అందరిఁ బొమ్మని యంకెకుఁ బిలిచేవు
 యిందుకా వోరీ యిందాఁకా
 అందుకు మావారి నడిగి వచ్చేఁగాని
 పొందుగా దీవేళ పోపోరా ॥ ఏమో ॥

---

1. అరసున్న విచార్యము.

జఱయుచుఁ బిలిపించి సరసములాడేవు
యెఱఁగనైతిరా యిందాఁకా
మఱి జంకించకు కడమా నేఁ జెప్పేఁగాని
తఱిగాదు యీవేళ తడవకురా ॥ ఏమో ॥

చెక్కునొక్కి నన్నుఁ జేకొని కూడితి
యెక్కెరా నీచల మిందాఁకా
చిక్కినినవ్వుల శ్రీవేంకటేశుఁడ
దక్కితి నిఁక నెందూఁ దలఁగకురా ॥ ఏమో ॥ 576

శంకరాభరణం

ఎక్కడౌతా నెఱఁగదు యెంత వలచెనోకాని
చిక్కువడ్డవేళ బుద్ధిచెప్పరే చెలులు ॥ పల్లవి ॥

కోరి మాఁటలాడీఁ గాని కొప్పు వీడు టెఱఁగదు
ఆరయ విభునితోడ నయ్యో చెలి
పారితెంచీఁ జనుఁగొంగు బయలౌతా నెఱఁగదు
గారవించి మీరైనాఁ గప్పరే చెలులు ॥ ఎక్క ॥

తప్పక చూచీఁగాని తన్నుఁదానె యెఱఁగదు
అప్పుడే మోహము నాఁటీ నయ్యో చెలి
చిప్పిలఁ బైనొరగీని చెమరించు టెఱఁగదు
దప్పిదేర విసరరే దగ్గరైన(జె(నచె?)లులు ॥ ఎక్క ॥

కాఁగిలించుకొనీఁగాని కళదాఁకు టెఱఁగదు
ఆఁగి తనివిదీరక అయ్యో చెలి
వీఁగక కడపలోన శ్రీవేంకటేశుఁ గూడి చెలి
చేఁగవేర నవ్వీ సన్నసేయరే చెలులు ॥ ఎక్క ॥ 577

సామంతం

కొలువున్నాఁ డదివో గోవిందరాజు
కొలఁదిలేనిసొమ్ముల గోవిందరాజు ॥ పల్లవి ॥

గారవానఁ బాదములు కాంతలపైఁ బారఁజాఁచి
కూరిములు వెదచల్లీ గోవిందరాజు
దీరత సంకుఁజక్రాలతెల్లనికన్నులతోడ
కోరినవరము లిచ్చీ గోవిందరాజు ॥ కొలు ॥

దట్టపుంగరాలవేళ్ల దాపలిచెయి వారఁజాఁచి
గుట్టుతో నూరకున్నాఁడు గోవిందరాజు
పొట్టుకొనె వలకేలు వున్నతిశిరసుకింద
కొట్టఁగొననవ్వులతో గోవిందరాజు ॥ కొలు ॥

చిప్పిలుతా నొత్తగిలె శేషునిపడగెనీడ
గొప్పకిరీటముతోడ గోవిందరాజు
అప్పుడే బొడ్డునఁ గనె నజుని శ్రీవేంకటాద్రి–
కుప్పెకటారముతోడ గోవిందరాజు ॥ కొలు ॥ 578

కేదారగౌళ

వద్దుసుమ్మీ ఇది నీవువలచిననీరమణి
వొద్దనుండఁగానే యింత వుమ్మలఁబెట్టేవు ॥ వల్లవి ॥

చెక్కులెల్లాఁ జెమరించెఁ జెలియకు విభుఁడ నీ–
వక్కడనెందో పరాకై వుండఁగా
ముక్కునఁ గోపము నించె ముందరనుండినయీపె
తక్కించి నీవు పరులఁ దప్పకచూడఁగను ॥ వద్దు ॥

తనువెల్లాఁ గాఁకరేఁగె తరుణి చూడఁగ నీవు
మనసిచ్చి సతులతో మాటలాడఁగా
కనుఁగొన లెత్తునాయ కలికి నవ్వఁగ నీవు
యెనలేనితలపోఁత లెక్కుడో పెంచఁగను ॥ వద్దు ॥

మచ్చికలే దైవారె మగువవిన్నపము నీ-
విచ్చగించి ఇన్నిటికి నియ్యకొనఁగా
పచ్చిగా శ్రీవేంకటేశ పైకొని కూడితి చెలి-
నచ్చలములెల్లాఁ దీరె నంతేసి సేయఁగను ॥ వద్దు ॥ 579

ఆహిరి

వేగిరించకురే మీరు వెలఁదులాల
బాగుగా నారమణుఁడు పాదెఱఁగఁడా ॥ పల్లవి ॥

దగ్గరి వచ్చినవాఁడు తానే మాటాడఁడా
యెగ్గువట్టీ నుండరే యిదేమనక
బగ్గన రమ్మన్నవాఁడు పైకొనక మానీనా
సిగ్గువడీ మానరే చేరి విన్నవించక ॥ వేగి ॥

నన్ను మన్నించినవాఁడు నవ్వక మానీనా
సన్నలు సేయకురే జడిసీఁ దాను
అన్నిటా వలచినాఁడు ఆదరించకుండునా
యిన్నేసి దూరకురే యేమసీనో అతఁడు ॥ వేగి ॥

ఇయ్యకొనినట్టివాఁడు ఇటమీఁదెఱఁగఁడా
కొయ్యతనాలాడకురే కోపగించీని
ఇయ్యెడనే శ్రీవేంకటేశుఁ డిట్టె నన్నుఁ గూడె
నెయ్యములే నెరపరే నిందుదొర ఇతఁడు ॥ వేగి ॥ 580

శ్రీరాగం

చిన్నదానవైనాను చేఁతలివి మేలమ్మ
నిన్నుఁజూచినసతులెల్లా నేఁడు మెచ్చేరమ్మా ॥ పల్లవి ॥

చెక్కునఁబెట్టినచేయి సెలవినవ్వినవ్వు
తక్కక వోచెలి నీకే తగునమ్మా
పక్కన నిట్టూర్పులును పతితోడిమాటలు
నెక్కొని యింతేసి యాడ నేరిచితివమ్మా ॥ చిన్న ॥

తేలగింపుఁజూపులును తియ్యనివినయములు
కాలమందే నీయందే కంటిమమ్మా
తాలిమి నివ్వెరగులు తమకపుఁగరఁగులు
వేళతో విభునిమీఁద వేసితివమ్మా ॥ చిన్న ॥

వసివాడునటనలు వలపులఘటనలు
యెసరెత్తితివి నేఁడే యేమమ్మా
కొసరి శ్రీవేంకటేశుఁ గూడితి వింతటిలోనే
రసికతనము నీకు రతికెక్కెనమ్మా ॥ చిన్న ॥ 581

రేకు 1000 నాదరామక్రియ

ఆతని నేఁపేనంటా నట్టే నీవు వేఁగేవు
యీతలఁబోయేపొద్దు లెవ్వరికి సెలవే ॥ పల్ల ॥

తడఁబాటుపతితోడ తలుపుమాఁటున నుండి
యెడమాట లాడించే వేమే నీవు
ఒడిసి యాతనితోడి చలానకు నీవు నట్టె
వుడికేవు స(ను?)రాఁకల వోరువఁగఁ గలవా ॥ ఆత ॥

ఆడనుండే తెరలోన అక్కరైనపతికిని
వీడెమిచ్చి పంపే వేమే వెలఁది నీవు
వేడుక నాతని నీవు విరహానఁ బెట్టేనంటా
తోడ నీవు విరహానఁ దొలఁకేవు గదవే ॥ ఆత ॥

మాటలాడేపతితోడ మంచముమీఁదనే వుండి
కాటుకకన్నులఁ జూచి కరఁగేవేలే
యీటున శ్రీవేంకటేశుఁ డింతలో నిన్నుఁ గలసె
వాటమై నీవూఁ గలసి వసమైతి గదవే ॥ ఆత ॥ 582

సామంతం

రెంటికి వచ్చుఁగదే నీరీతులు చెలి
ఇంటనుండి మమ్ము నేఁప నింతేలే నీకు ॥ పల్లవి ॥

[1] సిగ్గుతోఁ బెట్టినయట్టి చెలి నీచెక్కిటిచేయి
వెగ్గళపుఁ జింతలంటా వెరచితిమే
బగ్గన నీవుయ్యాలపై నూఁగేపయ్యదజారు
నిగ్గుల విరహమంటా నివ్వెర గందితిమే ॥ రెంటి ॥

ముసిముసినవ్వులతో మోనాన నీవున్నకీలు
పసురుఁగోపములంటా భ్రమసితిమే
అసురుసురులతోడి యలవోక నిద్దురలు
కొసరునలుకలంటాఁ గొంకితిమే నేము ॥ రెంటి ॥

శ్రీవేంకటేశుతో నీచేముట్టినసరసాలు
తావుల మీవాదులంటాఁ దలఁకితిమే
వోవరిలో మీరిద్దరు నొనగూడి వుండఁగాను
చేవదేరెఁ బనులంటాఁ జెలఁగితిమే ॥ రెంటి ॥ 583

1. "చెలి, సిగ్గుతోఁ బెట్టినయట్టి నీ చెక్కిటి చేయి" అనుట సహజము.

పళవంజరం

చెప్ప వెఱతుము నీకు చేరి సారెసారెకును
యిప్పు డిట్టె రారాదా యిది యేమే నీవు ॥ పల్లవి ॥

వంచిన శిరసుతోడ వలపు చింతల నీడ—
నంచల నీపతి వున్నాఁడదె కదవే
మించినచెమట గార మీఁటుకొనీఁ గొనగోర—
నించుకంతా దయసేయ విదియేమే నీవు ॥ చెప్ప ॥

నిట్టూరుపు మోఁతలును నేలపై వాఁ(వ్రా?)తలును
పొట్టుక నీపతి లోన నున్నాఁడదె
అట్టె కఁ(కం?)బాన నొరగె ఆయములు లోఁ గరఁగె
యెట్టని మాఁటాడవైతి విది యేమే నీవు ॥ చెప్ప ॥

నిండినకోరిక వెంచి నెరిఁ బులకలు ముంచి
అందనే శ్రీవేంకటేశుఁ డదె నీపతి
పండినకెమ్మోవితోడ పైకొని నిన్నిటు గూడె
యెదనీద కన్నెఱఁగ విది యేమే నీవు ॥ చెప్ప ॥ 584

రామక్రియ

వద్దే యింతేసి మాతో వట్టిసణఁగు
గద్దరివై యీపంతమే కడకూ నడపేవా ॥ పల్లవి ॥

కప్పుర మియ్యఁగఁబోతే కాఁతాళించి చూచేవు
వొప్పదా నీకిది నేఁడు వూరకే రాఁగా
కొప్పు గోరదువ్వితేనే గొణఁగేవు సారెసారె
అప్పుడే నే నంటితేనే ఆయములు దాఁకెనా ॥ వద్దే ॥

పొంచి చేయివేసితేనే బొమ్మముడివెట్టేవు
 నించి చన్నుఁగొండలానేసీ కిది వేఁగా
 మంచముపైకిఁ దీసితే మరిఁ దలవంచేవు
 యెంచఁగలపనులాయ నిఁకనేలే కొంకు ॥ వద్దే ॥

అంది కాఁగిలించుకొంటే నసురుసు రయ్యేవు
 కందువరతులు నేఁడే ఘనమాయనా
 విందువలెఁ గూడితి శ్రీవేంకటేశుఁడను నేను
 ముందువెనక వాసింతే మొక్కలములేలే ॥ వద్దే ॥ 585

## లలిత

ఎంతటివాఁడవౌ(డౌ?)త్తా నెఱఁగ వీతని నీవు
 ఇంతట నీపతియైతే నిటు సేయఁజెల్లునా ॥ పల్లవి ॥

పువ్వొడి చల్లఁగదమ్మ పూఁచి నీవెంట రాఁగాను
 చిప్పిం నీపతిమేను చెమరించెను
 కప్పుర మియ్యఁగదమ్మ కడు నీతో మాటాడఁగా
 దప్పిదేరీఁ గెమ్మోవి తగఁ జూడరాదా ॥ ఎంత ॥

పచ్చడము గప్పవమ్మ బడి నీపైనొరగఁగా
 పచ్చిదోఁచి గరుపారెఁ బతిమేనెల్లా
 మెచ్చి కొప్పువెట్టవమ్మ మేరమీరీ నీపనులు
 ఇచ్చకానకుఁ జేయఁగ నిదె వీడెఁ దురుము ॥ ఎంత ॥

తూఁగుమంచ మూఁచవమ్మ తుద శ్రీవేంకటేశుఁడు
 కాఁగిట నిన్నుఁ గూడి కడు నలసె
 ఆఁగి ముచ్చటాడవమ్మ అట్టె నీవద్ద నుండఁగా
 మాఁగినరతుల మేనుమఱచియున్నాఁడు ॥ ఎంత ॥ 586

బౌళి

ఇన్నిఁ గన్నవే నేము ఇంకాఁ గొన్నేలరా
పన్ని ననీసటలేల పదరా ఇంటికిని ॥ పల్లవి ॥

పంతపునకుములను బయలీఁదేవారము
ఇంతేసిమాటల బయలీఁదించేవా
బంతిఁ దొల్లె జవ్వనపుభారములవారము
రంతుల నీమోహపుభారము గొంత గట్టేవా ॥ ఇన్నిఁ ॥

గొబ్బునఁ బెరిగేచనుఁగొండలలో వారము
వుబ్బించి కొండ లెక్కించే వూరకే నీవు
దొబ్బరానిచీఁకటితురుములవారము
తబ్బిబ్బుఁగాఁగలజీకు తవ్వించేవా నీవు ॥ ఇన్నిఁ ॥

బచ్చనల సిగ్గులచప్పరములోవారము
యిచ్చఁ జప్పరానకు నన్నిటు దీసేవా
మెచ్చ శ్రీవేంకటేశుఁడ మిమ్ముఁ గూడినవారము
నిచ్చలుఁ బైకొని నన్ను నీవూఁ గూడేవా ॥ ఇన్నిఁ ॥ 587

శ్రీః శ్రీః శ్రీః

## ౧ వ అనుబంధము

* * *

## సంకీర్తన రాగముల అకారాది సూచిక.

| రాగములు | | సంకీర్తన సంఖ్యలు |
|---|---|---|
| అమరసింధు | ... | 40,115,218 |
| ఆందోళి | ... | 513 |
| ఆరబి | ... | 130,307 |
| ఆహిరి | ... | 11, 37, 63 65 82. 89 109. 119. 139, 161, 164 190, 220, 227, 229, 250, 273 278, 294. 321. 325, 331, 340, 342 367, 374, 405, 415 422 441, 446, 451 452, 458, 510. 539 550, 552 559, 562 568, 580 |
| ఆహిరినాట | ... | 55, 113, 133 |
| కన్నడగౌళ | ... | 5 71, 135. 145. 171 207, 272. 314 366, 438 |
| కాంబోది | ... | 68, 187, 209 363 450. 476. 481, 484 |
| కుంతలవరాళి | ... | 222 263 |
| కురంజి | ... | 32, 153, 302 |
| కేదారగౌళ | ... | 10, 52 69, 87, 112, 184, 226, 381. 407, 579 |
| కొండమలహరి | ... | 195 |

గంభీరనాట ... 76

గుండక్రియ ... 53, 425

గుజ్జరి ... 248, 262, 401, 549

గౌళ ... 21, 203, 225, 322, 466, 551

ఛాయానాట ... 79, 157, 228

తెలుఁగుకాం(గాం)బోది ... 8, 44, 66, 312, 329, 369, 389, 445, 491

తోండి ... 290, 505, 515

దేవగాంధారి ... 4, 28, 69, 122, 165, 198, 260, 292, 377, 398, 563

దేశా(సా)క్షి ... 7, 58, 81, 136, 151, 213, 253, 298

దేశి ... 296, 545

దేసాళం ... 1, 22, 33, 83, 148, 175, 192, 217, 265, 408, 423, 471, 525, 546

ద్రావిళభైరవి ... 108, 336

ధ(ద)న్నాశి(సి) ... 91, 163, 254, 264, 572

నట్టనారాయణి ... 80, 147, 277,

నాగగాంధారి ... 49, 246

నాగవరాళి ... 70, 168, 239, 357, 419, 512,

నాట ... 86, 288, 317, 368,

నాదరామక్రియ ... 95, 150, 167, 234, 311, 324 387, 404, 497, 527, 553, 582

నారాయణి ... 268

నీలాంబరి ... 236

పళవంజరం ... 65, 123, 275 291, 392. 436, 477, 584

పాడి ... 23. 26 45, 90, 128, 140, 143, 159, 176, 189 204, 216 219, 231, 244, 255, 281, 287, 299, 320 339, 345 350, 360, 383, 411, 418, 433 4 5 465, 469, 493, 502, 504, 5 9, 538 547, 554

పూరీవి ... 308

పూర్వగౌళ ... 201

బౌళి ... 38, 129, 158, 159, 170, 188, 215, 233, 238, 293, 303, 315, 332, 362, 414, 428, 462, 478, 482, 548, 587

బౌళిరామక్రియ ... 106, 149, 343

భల్లాటి ... 25

భైరవి ... 117, 141, 162, 183, 205, 237, 243, 280, 391, 417, 432, 474 508

మంగళకౌశిక ... 6, 110, 284, 372, 394

మధ్యమావతి ... 24, 100, 202, 245

మనోహరి ... 31

మలహరి ... 72, 104, 144 400

మాళవశ్రీ ... 447

మాళవి ... 2, 50, 375, 506, 561, 565

మాళవగౌళ ... 152, 169, 180, 214, 256 310, 454

ముఖారి ... 17, 35, 99, 101, 120, 155, 181, 212, 235, 269, 337, 338, 395, 410, 426, 467, 470, 484, 521, 529, 536, 544, 560, 566, 575

మేఘరంజి ... 301

మేచబౌళి ... 84, 328, 390

రామక్రియ ... 20, 30, 56, 92, 134, 172, 177, 193, 208, 240, 285, 286, 305, 335, 354, 364, 409, 444, 449, 460, 468, 473, 483, 503, 524, 532, 585

రీతిగౌళ 64, 241, 304

రేవగుప్తి ... 270

లలిత ... 13, 39, 182, 230, 236, 282, 283, 297, 346, 352, 380, 393, 420, 435, 437, 443, 448, 459, 485, 507, 514, 516, 520, 534, 555, 569, 570, 586

వరాళి 15, 34, 125, 146, 191, 206, 224, 289, 318, 341, 348, 361, 370, 412, 472, 479, 489, 499, 541, 558, 574, 576

వసంతం ... 349, 359

వసంతవరాళి ... 46, 60, 271, 421

వేళావళి ... 19, 74, 247, 488, 496

శంకరాభరణం ... 18, 57, 67, 94, 97, 131, 138, 174, 258, 259, 313, 323, 334, 344, 371, 386, 396, 430, 434, 453, 463, 492, 500, 501, 518, 523, 528, 535, 537, 540, 556, 571, 577

శ్రీరాగం ... 16, 29, 59, 77, 142, 175, 193, 199, 249, 279, 319, 327, 402, 442, 511, 519, 543, 581

శుద్ధదేశి ... 43, 127, 154

శుద్ధవసంతం ... 9, 27, 61, 105, 186, 200, 211, 232, 300, 326, 525, 533

శోకవరాళి ... 118

సామంతం ... 51, 62, 73, 96, 103, 126, 160, 223, 251, 261, 237, 347, 353, 356, 358, 376, 379, 397, 399, 403, 413, 427, 429, 431, 439, 440, 461, 464, 480, 486, 494, 531, 542, 557, 567, 578, 583

సామవరాళి ... 93, 197

సాళంగం ... 12, 47, 88, 116, 166, 179, 274, 316, 333, 355, 365, 373, 382, 384, 406, 416, 457, 490, 530

సాళంగనాట ... 3, 42, 75, 107, 114, 178, 196, 257, 306, 378, 456, 495

సావేరి ... 487

సింధురామక్రియ ... 36, 54, 102, 111, 252, 385, 564

సోమరాగం ... 124, 295

సౌరాష్ట్ర ... 41, 132, 137, 185 210, 276, 388, 424, 475

హిందోళం ... 121, 242, 309, 330, 517, 573

హిందోళవసంతం ... 48, 78, 156, 221

హిజ్జిజి ... 14, 498, 522

## అకారాదిగ సంకీర్తన, రాగ, సంఖ్యా సూచిక


| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| అంగనఋష్వన | దేవగాంధారి | 260 |
| అంగనలీరే | లలిత | 346 |
| అండకు రావయ్యా | దేసాళం | 1 |
| అంతమనసున | సామంతం | 126 |
| అంతలోనె | శ్రీరాగం | 16 |
| అందరికి సి రీతే | భైరవి | 183 |
| అందరి మెప్పించ | ముఖారి | 544 |
| అంది తెలియ | నాదరామక్రియ | 553 |
| అందుకుంగా | మధ్యమావతి | 202 |
| అందుకే చింత | సామంతం | 557 |
| అందుకేపో | నాదరామక్రియ | 150 |
| అందుకేమి | ముఖారి | 337 |
| అందులోనె వున్న | సౌరాష్ట్రం | 137 |
| అందులోనేకాన | లలిత | 283 |
| అండంగూచుండె | ఆహిరి | 550 |
| అంపవయ్యా | మాళవిగౌళ | 454 |
| అటుగనక | దేశి | 545 |
| అడియాలా | సామంతం | 486 |
| అడుగరే చెలులాల | దేశాక్షి | 298 |
| అడుగరేచెలులాల | ఆహిరి | 452 |
| అడుగరే చెలులాల | హిందోళవసంతం | 221 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| అడుగు వెట్టితే | ఆహిరి | 562 |
| అతఁడు నాకు | సామంతం | 353 |
| అతనికి నీకే | రామక్రియ | 473 |
| అతనిపై | సాళంగం | 365 |
| అదివో నీ | ఆహిరి | 63 |
| అదె నీ పెద్దరిక | మాళవిగౌళ | 256 |
| అన్నిటా మీ | గుజ్జరి | 248 |
| అన్నియుఁ జేసిన | శ్రీరాగం | 327 |
| అన్నియుఁ దెలిసి | దేసాళం | 148 |
| అన్నియునందె | వేళావళి | 496 |
| అన్ని సేవలును | మంగళకౌశిక | 110 |
| అప్పటినెత్తము | ముఖారి | 566 |
| అప్పటిమానవు | పాడి | 350 |
| అప్పుడుగాని | బౌళి | 428 |
| అరుదు రాముని | సాళంగనాట | 495 |
| అలమేలుమంగవు | మనోహరి | 31 |
| అలసేవు | కన్నడగౌళ | 135 |
| అల్లదెజవ్వని | మాళవి | 375 |
| అల్లదె మేడ | ఆహిరి | 552 |
| అల్లవాఁడె | పాడి | 345 |
| అలిగిన | వరాళి | 479 |
| అలివేణిని | శంకరాభరణం | 18 |
| అళగరి చక్క | సాళంగం | 457 |
| అవునయ్యా | రామక్రియ | 20 |
| అసురుసురుల | గౌళ | 466 |
| ఆకెఁబిలువ | శంకరాభరణం | 57 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఆఁటదియేమి | పళవంజరం | 85 |
| ఆడకు వచ్చె | శంకరాభరణం | 323 |
| ఆడకే నే వచ్చి | లలిత | 459 |
| ఆడరాని మాట | శంకరాభరణం | 334 |
| ఆడనీడానదివో | నాగవరాళి | 419 |
| ఆఁడువారి | వరాళి | 558 |
| ఆతనిఁగూడి | రామక్రియ | 468 |
| ఆతని నే | నాదరామక్రియ | 582 |
| ఆతని నేల | శుద్ధదేశి | 154 |
| ఆదరించవయ్యా | భైరవి | 117 |
| ఆనతియ్యవయ్య | తెలుఁగుఁగాంబోది | 66 |
| ఆనతియ్య వయ్యా | సాళంగం | 316 |
| ఆపెకంటె | రామక్రియ | 193 |
| ఆయ నాయనుండ | సాళంగం | 116 |
| ఆయ నాయనూర | సాళంగం | 530 |
| ఆయ లేరా | శంకరాభరణం | 571 |
| ఆయలేవయ్యా | సామంతం | 73 |
| ఆఅడిఁబెట్టఁగ | రామక్రియ | 208 |
| ఆసపడ్డ వారి | ద్రావిళభైరవి | 108 |
| ఇంక నెంతగా | తెలుఁగుఁగాంబోది | 329 |
| ఇంక నేమి | శంకరాభరణం | 138 |
| ఇంక నేలకొంకను | పాడి | 90 |
| ఇంక నేలమారు | కన్నడగౌళ | 438 |
| ఇంక విచారము | బౌళి | 188 |
| ఇంకా నేమనే | నాగగాంధారి | 49 |
| ఇంకా నేలదాఁచేవు | హిందోళం | 309 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఇంకా నేలదాఁచేవు | హిందోళం | 309 |
| ఇంకా నేలదాఁచేవు యెదు | బౌళి | 129 |
| ఇంకా ముమ్మ్ము | గంభీరనాట | 76 |
| ఇంచుకంత | పాడి | 502 |
| ఇంటికివిచ్చేసె | దేవగాంధారి | 562 |
| ఇంతకాకు | కురంజి | 33 |
| ఇంతకింతే | పాడి | 588 |
| ఇంతకువచ్చె | వరాళి | 191 |
| ఇంతటానీ | బౌళి | 238 |
| ఇంత వొడ్డ వాఁడ | వరాళి | 318 |
| ఇంత నాపై | ధన్నాసి | 264 |
| ఇంతనీకు | సామంతం | 429 |
| ఇంతబట్టు | ఆహిరి | 229 |
| ఇంతలోనే | వరాళి | 341 |
| ఇంతవని | నాదరామక్రియ | 311 |
| ఇంత సేతు గా | మలహరి | 104 |
| ఇంత సేయ | మాళవి | 561 |
| ఇంత సేసిన | భైరవి | 237 |
| ఇంత సేసినవాడవు | కన్నడగౌళ | 145 |
| ఇంతులాల | ఆందోళి | 513 |
| ఇం తేసి | శుద్ధవసంతం | 61 |
| ఇందరము | కాంబోది | 363 |
| ఇందరిలో | శుద్ధవసంతం | 525 |
| ఇందరు నెరిఁగి | మాళవిగౌళ | 169 |
| ఇందరు నెఱిఁగి | దేసాళం | 22 |
| ఇందాఁకా నెందు | శంకరాభరణం | 528 |
| ఇందుకు నేనేమి | వరాళి | 206 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఇందుకే నీవు | లలిత | 570 |
| ఇందులో | కుంతలవరాళి | 222 |
| ఇచ్చకమాడితే | లలిత | 448 |
| ఇచ్చకమే | శ్రీరాగం | 511 |
| ఇచ్చలోనిదాన | భైరవి | 162 |
| ఇటమీఁద | ఆహిరి | 331 |
| ఇటువంటిదాన | కన్నడగౌళ | 366 |
| ఇటువంటిపను | కురంజి | 302 |
| ఇటువంటి వేడుక | నాదరామక్రియ | 404 |
| ఇటు సేసిన | ఆహిరి | 446 |
| ఇట్టె రాఁగద | ఛాయానాట | 157 |
| ఇదిగో నావంక | ఆహిరి | 451 |
| ఇదివో సీతోడి | మేఘరంజి | 301 |
| ఇదివో నీ మహిమ | వరాళి | 361 |
| ఇదివో నీ మహిమలు | నాగగాంధారి | 246 |
| ఇదివో మా | సాళంగనాట | 42 |
| ఇదివో మీ | శ్రీరాగం | 193 |
| ఇద్దరము | పాడి | 216 |
| ఇద్దరిఁ గూర్చ | కేదారగౌళ | 52 |
| ఇద్దరి చలము | దేసాళం | 408 |
| ఇద్దరి వసంతము | హిందోళం | 121 |
| ఇద్దరు నేకము | ముఖారి | 484 |
| ఇద్దరూ నేకము | శంకరాభరణం | 556 |
| ఇదె వచ్చె | లలిత | 380 |
| ఇన్నాళ్లవలె | వరాళి | 224 |
| ఇన్నాళ్లునేడ | నట్టనారాయణి | 277 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఇన్నిటానీ | ఆహిరి | 164 |
| ఇన్నిటా సిగ్గులు | వేళావళి | 247 |
| ఇన్నీఁ గన్న | బౌళి | 587 |
| ఇన్నేసి వావుల | శుద్ధ వసంతం | 533 |
| ఇప్పటనుండే | శ్రీరాగం | 199 |
| ఇప్పటికి | శుద్ధదేశి | 43 |
| ఇప్పుడే విన్న | వరాళి | 289 |
| ఇయ్యకొంటి | మాళవి | 2 |
| ఇరవై మన్నించ | రామక్రియ | 483 |
| ఈకెకు నప్పుడు | నాట | 317 |
| ఈడనుండే | నట్టనారాయణి | 80 |
| ఈఁతకు మిక్కిలి | నాట | 368 |
| ఈరుదియ్య | నాదరామక్రియ | 324 |
| ఈవలకాంతల | పాడి | 504 |
| ఉచిత మెఱఁగ | అమరసింధు | 40 |
| ఉద్దగిరి కృష్ణు | శంకరాభరణం | 174 |
| ఊడిగపునిబ్బరాన | ధన్నాసి | 91 |
| ఊడిగపు సతు | మాళవి | 565 |
| ఊరకుండే | పాడి | 418 |
| ఊరకున్న వారి | శంకరాభరణం | 540 |
| ఊరకేగడించు | దేసాళం | 423 |
| ఊరకేగడించుకొనినో | లలిత | 507 |
| ఊరకేనన్నిటు | శుద్ధవసంతం | 186 |
| ఊరకేల దాఁచేవు | రామక్రియ | 285 |
| ఎంత కాకు | హిందోళవసంతం | 78 |
| ఎంతకు లేదునీ | బౌళి | 170 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఎంతకులేదు రమ్మ | కొండమలహరి | 195 |
| ఎంత కెంత | ధన్నాశి | 254 |
| ఎంతగద్దో | ముఖారి | 120 |
| ఎంతగోస | నాదరామక్రియ | 95 |
| ఎంత చెప్పినా | వరాళి | 472 |
| ఎంతటఁగాని | లలిత | 516 |
| ఎంతటి వాఁడవు | రామక్రియ | 56 |
| ఎంతటి వాఁడవో | లలిత | 586 |
| ఎంతదక్కరిఁడే | పాడి | 204 |
| ఎంతనమ్మని | భైరవి | 417 |
| ఎంతనీవు | సింధురామక్రియ | 111 |
| ఎంతబత్తో | అమరసింధు | 115 |
| ఎంత మేలు | మధ్యమావతి | 245 |
| ఎంత మోహమో | హిందోళం | 573 |
| ఎంత లేదునీ | అహిరినాట | 55 |
| ఎంత లేదునీయాసోద | వరాళి | 34 |
| ఎంతవలపించి | బౌళి | 478 |
| ఎంత వేడుక కాఁడవు | సింధురామక్రియ | 36 |
| ఎంత వేడుక కాఁడవో | పళవంజరం | 123 |
| ఎంత సేసినా | పాడి | 189 |
| ఎంతైనా | పాడి | 26 |
| ఎందువోయీ | గౌళ | 225 |
| ఎక్కడగడించు | నాగవరాళి | 168 |
| ఎక్కడౌతా | శంకరాభరణం | 577 |
| ఎగసక్కెలాడ | అహిరి | 190 |
| ఎచ్చుకుందు | సింధురామక్రియ | 385 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఎటువంటివలపులో | ఆహిరి | 161 |
| ఎటువంటివలపో | మధ్యమావతి | 24 |
| ఎటువంటివాఁడ | మంగళకౌశిక | 6 |
| ఎట్టుగడించు | శంకరాభరణం | 523 |
| ఎటుదరించ | శ్రీరాగం | 29 |
| ఎట్టునమ్మవచ్చు | బౌళి | 482 |
| ఎట్టునమ్మవచ్చునే | మాళవి | 506 |
| ఎట్టునమ్మించేవో | పాడి | 128 |
| ఎట్టువలపించితివి | ద్రావిళభైరవి | 336 |
| ఎట్టైనా | కేదారగౌళ | 381 |
| ఎడసికూడిన | ఆహిరి | 37 |
| ఎడసితే | సామంతం | 376 |
| ఎదురుచూచీఁ జెలి | హిజ్జిజి | 498 |
| ఎదురుచూచీ నీవు | ముఖారి | 575 |
| ఎప్పుడుమన్నించే | ఆహిరి | 11 |
| ఎప్పుడూనీ | కన్నడగౌళ | 171 |
| ఎరవులకోప | శంకరాభరణం | 518 |
| ఎరవుఁదాన | ఆహిరి | 250 |
| ఎరవులుసతమా | దేసాళం | 526 |
| ఎరవులేనీ | కేదారగౌళ | 88 |
| ఎరవుసతమవునా | వరాళి | 574 |
| ఏమనివిన్నవించే | ఆహిరి | 278 |
| ఏమనివిన్నవించేము | సామవరాళి | 93 |
| ఏమనివిన్నవించేము | మాళవిగౌళ | 310 |
| ఏమనివినెనో | దేవగాంధారి | 69 |
| ఏమనీనేరమణుఁడు | సామంతం | 251 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఏమనేమయ్యా | దేశాళి | 7 |
| ఏమమ్మయశోదమీ | కాంబోది | 481 |
| ఏమమ్మయశోదయిదె | శంకరాభరణం | 258 |
| ఏమయ్యాయింత | సాళంగం | 12 |
| ఏమాయనయా | బౌళిరామక్రియ | 106 |
| ఏమిగట్టుకొంటివినీ | సామవరాళి | 197 |
| ఏమిగట్టుకొంటివియింతేసి | దేసాళం | 192 |
| ఏమిచెప్పేది | సాళంగనాట | 178 |
| ఏమిచెప్పేము | లలిత | 236 |
| ఏమిజాణ | రామక్రియ | 134 |
| ఏమిటికిఁజలము | వేళావళి | 19 |
| ఏమిటికిఁజేసే | కాంబోది | 98 |
| ఏమిటికిఁదల | సామంతం | 103 |
| ఏమిటికి దూరేవు | రీతిగౌళ | 64 |
| ఏమిటికి మాముందర | భల్లాటి | 25 |
| ఏమినెరపేవు | రామక్రియ | 92 |
| ఏమినెఱుఁగను | ఆహిరి | 405 |
| ఏమిశాంతి | వరాళి | 489 |
| ఏమివిన్నవించేము | శోకవరాళి | 118 |
| ఏమిసేయవచ్చు | ముఖారి | 212 |
| ఎఱగఁజుఁజుమ్మీ | ముఖారి | 560 |
| ఎఱఁగరానీ | శ్రీరాగం | 59 |
| ఎఱఁగవిన్న | ముఖారి | 536 |
| ఎఱిఁగినపనుల | మలహరి | 72 |
| ఎవ్వతెకో నేఁడు | ఆహిరి | 82 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఎవ్వతెతో | మేచబౌళి | 84 |
| ఎవ్వనికివంతు | శంకరాభరణం | 535 |
| ఎవ్వరినడుగ | వరాళి | 499 |
| ఎవ్వరిముందర | పాడి | 159 |
| ఎవ్వరుంటా | రామక్రియ | 503 |
| ఎవ్వరుమంచి | సౌరాష్ట్రం | 185 |
| ఎవ్వరువద్ద | సామంతం | 347 |
| ఎవ్వరెట్టయినా | సాళంగనాట | 75 |
| ఎవ్వరేమి | ఆహిరి | 109 |
| ఏంటికిగుంపెన | మలహరి | 144 |
| ఏంటికి నన్ను | ముఖారి | 101 |
| ఏంటికింబరాకు | కేదారగౌళ | 226 |
| ఏంటివంతకములో | పళవంజరం | 275 |
| ఏంటికిసఖ్యాలు | వరాళి | 15 |
| ఏడలేని | శ్రీరాగం | 175 |
| ఏదినిజమని | శుద్ధదేశి | 127 |
| ఏపాటిబత్తి | మధ్యమావతి | 100 |
| ఏమన్నాహితవే | వరాళి | 348 |
| ఏమనిచెప్పుద మే | గౌళ | 551 |
| ఏమని తా | బౌళి | 462 |
| ఏమిసేయవచ్చు | సౌరాష్ట్రం | 210 |
| ఏమిసేసినా | బౌళి | 303 |
| ఏమేయింతటి | పళవంజరం | 291 |
| ఏమేవిభుని | ముఖారి | 35 |
| ఏమైనానయ్యో | నాదరామక్రియ | 527 |
| ఏమోయని | వరాళి | 576 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఏరానీవప్పుడే | రామక్రియ | 532 |
| ఏలకూరిమి | సాళంగం | 166 |
| ఏలగడించు | ఆహిరి నాట | 113 |
| ఏలతమకము | సోమరాగం | 295 |
| ఏలతలవంచీనే | కన్నడగౌళ | 314 |
| ఏలదూరీనేల | భైరవి | 391 |
| ఏలనన్ను రమ్మనీ | బౌళి | 362 |
| ఏలపంతాలాడేవు | పాడి | 244 |
| ఏలయెడతాకించే | బౌళి | 293 |
| ఏలరేఁచీనన్ను | లలిత | 443 |
| ఏలవట్టిజోలి | తెలుఁగుఁగాంబోది | 445 |
| ఏలసేసేవడియాస | మంగళకౌశిక | 394 |
| ఏలేనిష్ఠూరము | పళవంజరం | 436 |
| ఒకటికొకటి | పళవంజరం | 392 |
| ఒకటిపైనొకటేల | హిజ్జిజి | 522 |
| ఒకటొకటికి | పాడి | 433 |
| ఒక్కచేవిన్నప | శంకరాభరణ | 463 |
| ఒక్కరిఁగాదన | ఆరిబి | 130 |
| ఒక్కరునోచిన | వరాళి | 125 |
| ఒద్దనున్న | సింధురామక్రియ | 102 |
| ఓపనోపతి | ఆహిరి | 539 |
| ఓపనోపనింతే | సామంతం | 480 |
| ఓపినంత | గుజ్జరి | 262 |
| ఓపుదువెంత | నాదరామక్రియ | 234 |
| ఓయమ్మయేడ | కేదారగౌళ | 407 |
| ఔనయ్యామంచి | సౌరాష్ట్రం | 276 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| ఔనయ్యామంచివాఁడ | సాళంగం | 179 |
| ఔరా రాజసము | సింధురామక్రియ | 564 |
| ఔలే రాజాణతనాలా | శంకరాభరణం | 492 |
| కందము నీసరితలు | శుద్ధవసంతం | 300 |
| కందుఁగుందు | మలహరి | 400 |
| కందువుగాని | నారాయణి | 268 |
| కంటిఁగంటి | సామంతం | 358 |
| కంటిమయ్య | దేశాక్షి | 136 |
| కంటిమయ్యానీ | పాడి | 299 |
| కంటిమిగా | నాదరామక్రియ | 497 |
| కంటిమినీలాగులు | ముఖారి | 235 |
| కంటిమియీభాగ్యము | రామక్రియ | 177 |
| కంటిమేనీవల్ల | తోండి | 290 |
| కంటివిగా | నాదరామక్రియ | 167 |
| కంటిమివింటిమి | బౌళి | 158 |
| కక్కసమిపుడే | శంకరాభరణం | 386 |
| కటకటామీఁద | కాంబోది | 476 |
| కడదాఁకానీ మేలే | గుజ్జరి | 401 |
| కనుకొనరాదా | ముఖారి | 181 |
| కప్పురముదిననేల | ముఖారి | 467 |
| కమ్మటినెవ్వరి | పాడి | 143 |
| కాంతలనెల్లా | శుద్ధవసంతం | 200 |
| కానమేనేమింత | దేసాళం | 471 |
| కానవచ్చీనందు | పూర్వగౌళ | 201 |
| కానవచ్చెనందు | సాళంగం | 406 |
| కానీకానీ | ముఖారి | 426 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
| --- | --- | --- |
| కానీవచ్చె | శ్రీరాగం | 319 |
| కానీతే | సాళంగనాట | 306 |
| కానీవయ్యా | పూరిబి | 308 |
| కానీవయ్యా | భైరవి | 280 |
| కానీవేగొల్లెతాకమ్మటి | తోడి | 505 |
| కానీవేగొల్లెతాగబ్బి | లలిత | 13 |
| కానుకకుఁజేయు | మాళవిగౌళ | 152 |
| కామునిబలము | సాళంగం | 382 |
| కామునిభావము | సామంతం | 267 |
| కిందుమీఁదు | ఛాయానాట | 228 |
| కుందణపుదట్టి | సామంతం | 261 |
| కైకొనఁగవచ్చు | సామంతం | 431 |
| కొత్తసింగారాలు | పాడి | 339 |
| కొలువున్నాఁడదివో | సామంతం | 578 |
| కొలువులోపల | దేసాళం | 33 |
| కోపగించుకొన | ఆహిరి | 415 |
| కోరికలీడేర | తెలుఁగుఁగాంబోది | 312 |
| కోరినీపైఁదొల్లి | మాళవిగౌళ | 180 |
| గక్కనసిద్దరు | సౌరాష్ట్రం | 388 |
| గక్కనలాలించ | భైరవి | 141 |
| గక్కునినింట | పాడి | 469 |
| గుట్టుగల | సాళంగం | 274 |
| గుట్టునుండవే | శంకరాభరణం | 131 |
| గుట్టునుండుట | పాడి | 509 |
| గుఱిగా | లలిత | 534 |
| గొల్లెతల | సామంతం | 351 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| గోరఁబోయేవని | ఆహిరి | 325 |
| ఘనుడైనవాని | ఆహిరి | 89 |
| చాయలసన్నల | రామక్రియ | 444 |
| చాలుఁజాలు | సామంతం | 379 |
| చాలునింత | తెలుఁగుఁగాంబోది | 369 |
| చింతవంతలిఁక | శ్రీరాగం | 402 |
| చిక్కితిమీపాలనూ | ఆహిరి | 510 |
| చిగురుఁబెదవి | శ్రీరాగం | 249 |
| చిగురో చేఁగ | సామంతం | 494 |
| చిత్తగించవోయి | లలిత | 39 |
| చిత్తగించినీవు | ఆహిరి | 65 |
| చిత్తగించుతమక | పాడి | 255 |
| చిత్తగింతువు | ధన్నాసి | 163 |
| చిత్తజుని | వరాళి | 370 |
| చిత్తాననోరుపు | నాట | 86 |
| చిన్నదానవై నాను | శ్రీరాగం | 581 |
| చూచితివో | నీలాంబరి | 266 |
| చూడఁబిన్నవు | మంగళకౌశిక | 284 |
| చూడవయ్యా | సౌరాష్ట్రం | 41 |
| చూడవే | హిందోళం | 242 |
| చూతువుగానీ | పాడి | 176 |
| చెక్కునొక్కి | బౌళి | 38 |
| చెప్పకునీసుద్ది | సామంతం | 399 |
| చెప్పగదవయ్యా | ఆహిరి | 220 |
| చెప్పఁగసిగ్గులు | శ్రీరాగం | 543 |
| చెప్పఁగొలదులు | ఆహిరి | 559 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| చెప్పదుఘెంతైన | శంకరాభరణం | 67 |
| చెప్పమనేవు | రీతిగౌళ | 304 |
| చెప్పరయ్యామీరిద్దరు | పాడి | 320 |
| చెప్పరయ్యావూడిగాలు | సౌరాష్ట్రం | 132 |
| చెప్పరాదుచూపరాదు | తెలుఁగుకాంబోది | 491 |
| చెప్పవద్దాబుద్దులు | మాళవిగౌళ | 214 |
| చెప్ప వెఱతుము | పళవంజరం | 584 |
| చెప్పితేనారచి | వసంతవరాళి | 421 |
| చెప్పితేనిష్టూరము | సాళంగం | 373 |
| చెప్పుడుమాటలు | లలిత | 297 |
| చెయ్యిముంచిన | సామంతం | 427 |
| చెలఁగినావిభు | తెలుఁగుఁగాంబోది | 389 |
| చెల్లదానీవే | దేశాక్షి | 151 |
| చెలిపలుసోఁకు | సామంతం | 531 |
| చెలులాలచూడరే | గౌళ | 21 |
| చెలువుఁడవెంతైనా | ముఖారి | 521 |
| చేతికిలోనైన | లలిత | 437 |
| చేతికిఁగొంత | రామక్రియ | 409 |
| చేసినట్లెల్లా | లలిత | 555 |
| చేసేనావినయ | ఆహిరి | 422 |
| జంకించేవు | శుద్ధవసంతం | 9 |
| జమళిఁగల్యాణము | ఆహిరి | 568 |
| జయలక్ష్మివరలక్ష్మి | లలిత | 520 |
| జవ్వనపుదా | హిందోళవసంతం | 156 |
| జోడుగూడితి | దేవగాంధారి | 292 |
| తగవులుచెప్పమనీ | శంకరాభరణం | 259 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| తగిలినేఁడడవి | ముఖారి | 395 |
| తెగుతగునీదొర | వేళావళి | 74 |
| తనకేసంతోస | సామంతం | 439 |
| తనజాడలేల | సౌరాష్ట్రం | 424 |
| తనిసితి | లలిత | 393 |
| తనువిందు | ఆహిరి | 340 |
| తమ్ముఁడా మే | బౌళి | 315 |
| తరవాతిపనులెల్ల | భైరవి | 508 |
| తరుణిచెనకులు | లలిత | 230 |
| తరుణులతోడ | పాడి | 45 |
| తెలవమొక్కఁగా | ఆహిరి | 119 |
| తలఁచుకొమ్మన | కాంబోది | 209 |
| తలపోసి | నాగవరాళి | 357 |
| తానేడనేనేడ | సామంతం | 542 |
| తారుకాణ | నాగవరాళి | 239 |
| తెలిపిచెప్పఁగ | ఆరిబి | 307 |
| తెలియఁజెప్ప | పాడి | 231 |
| తెలియరాదు | రేవగుప్తి | 270 |
| తెలిసినపనులకు | దేవాగాంధారి | 377 |
| తేటతెల్లమిగ | కన్నడగౌళ | 207 |
| తొలుతనెలఁగవా | సాళంగనాట | 3 |
| తొల్లె ఇన్నిటా | సింధురామక్రియ | 54 |
| దగ్గరికూడుట | ముఖారి | 470 |
| దయఁజూడవయా | తెలుఁగుఁగాంబోది | 8 |
| దీపించ | లలిత | 569 |
| దూతికలకు నీతో | పాడి | 455 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| దేవరగుణములు | దేవగాంధారి | 4 |
| దేవరవుగాదా | గుండక్రియ | 53 |
| దేవరవుగావా | నట్టనారాయణి | 147 |
| దేవవాసుదేవ | బౌళి | 332 |
| దొడ్డవాఁడవవుదువు | బౌళి | 215 |
| నటనలురెండూ | మేఁచబౌళి | 390 |
| నడుమనేకంటి | ముఖారి | 269 |
| ననుఁజూచి | అహిరి | 294 |
| ననుఁజూడవే | వసంతవరాళి | 46 |
| ననుపుననూరకె | శంకరాభరణం | 396 |
| నలినాక్షి | వసంతవరాళి | 271 |
| నవ్వితినే | లలిత | 514 |
| నవ్వేవారి | రామక్రియ | 305 |
| నవ్వేవారినెఱఁగవు | రామక్రియ | 240 |
| నాకుఁజేసినది | శ్రీరాగం | 442 |
| నాకుఁదెలుసు | దేశి | 296 |
| నాకేలవేగిరము | కాంబోది | 187 |
| నాకోరకునిన్ను | మేఁచబౌళి | 328 |
| నాఁడేనీవిచ్చిన | శ్రీరాగం | 142 |
| నాతోనేలా | కేదారగౌళ | 68 |
| నా మొగముచూచిన | శంకరాభరణం | 313 |
| నా మోముచూచి | బౌళి | 233 |
| నిండెనుకళలు | సామంతం | 464 |
| నిక్కియెండదాఁక | పాడి | 493 |
| నిచ్చనిచ్చవాదు | రామక్రియ | 364 |
| నిచ్చజగడమేల | పాడి | 465 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| నిజమాడ రాదా | ముఖారి | 529 |
| నిజము చెప్ప | లలిత | 352 |
| నిన్నింత సేసి | బౌళి | 548 |
| నిన్ను దూరఁబని | సాళంగనాట | 378 |
| నిన్నుఁ బాసి | శ్రీరాగం | 519 |
| నివ్వెరగుతోడ | గౌళ | 203 |
| నీకుఁ దెలియదుగాక | శంకరాభరణం | 500 |
| నీకుఁ దెలియదుగాని | సాళంగం | 333 |
| నీకు నీకే | వేళావళి | 488 |
| నీకే తెలుసుఁగాక | రామక్రియ | 524 |
| నీకే తెలుసునిఁక | అహిరి | 374 |
| నీకేల ఇంత | భైరవి | 474 |
| నీచేత నౌనె | నాట | 288 |
| నీచేఁతలే ఇవి | సాళంగం | 88 |
| నీడాయండా | హిందోళం | 517 |
| నీదు సేఁతలకు | బౌళి రామక్రియ | 149 |
| నీరువట్టుక | పాడి | 383 |
| నీపలెను | ముఖారి | 17 |
| నీవు మంచివాఁడ | నాగవరాళి | 512 |
| నీవు మొదలు | ముఖారి | 99 |
| నీవూఁ బోయి | భైరవి | 432 |
| నీ వెఱఁగని | సామంతం | 461 |
| నీ వెఱఁగవా | సాళంగనాట | 456 |
| నీవేమి సేతు | మాళవశ్రీ | 447 |
| నీవేమి సేసినా | సామంతం | 397 |
| నీవే యెఱుఁగుదు | తెలుఁగుఁగాంబోది | 44 |

| సంకీర్తన | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| నీవై నానానటి | కేదారగౌళ | 112 |
| నీవొళ్ళఁగల్ల | వరాళి | 146 |
| నెలఁతకుఁజీఁకటి | దేవగాంధారి | 398 |
| నేఁడుగొత్తలా | ఛాయానాట | 79 |
| నేనేబుద్ధిచెప్పుకొనే | లలిత | 282 |
| నేనేయందుకు | బౌళి | 414 |
| నేనొకటి | నాగవరాళి | 70 |
| నేనొకటిసేయ | ఆహిరి | 458 |
| నేమిందాఁకా | కన్నడగౌళ | 272 |
| నేమూనీవలెనే | రామక్రియ | 172 |
| నేమేయంటా | దేశాక్షి | 253 |
| నేరిచినాఁడన్ని | సింధురామక్రియ | 252 |
| నేరుపరవౌదు | వరాళి | 412 |
| పంతముపాడియు | సామంతం | 413 |
| పట్టకురా | కాంబోది | 450 |
| పదియుఁబదియు | రామక్రియ | 335 |
| పరగనేఁజేసి | వసంతవరాళి | 60 |
| పాపమంటా | రామక్రియ | 460 |
| పాయపుమదము | దేసాళం | 217 |
| ప్రియముచెప్పే | దేసాళం | 265 |
| పెళ్ళిచెట్టు | లలిత | 435 |
| పొందుగలిగితే | సాళంగనాట | 196 |
| పొద్దువోక | పాడి | 140 |
| పొన్నలలో | రామక్రియ | 449 |
| పోయినపనుల | దేసాళం | 546 |
| పోవలెమా | శంకరాభరణం | 371 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| బడలెనుపానుపు | దేవగాంధారి | 122 |
| బలిమిసేయఁగ | రీతిగౌళ | 241 |
| బాపుబాపు | గుజ్జరి | 549 |
| బాయిటఁబడె | కన్నడగౌళ | 71 |
| బిగిసేవింకా | పాడి | 554 |
| బొంకనితప్పని | పాడి | 23 |
| మంకువిడిచి | లలిత | 485 |
| మంచివాఁడవయ్యా | దేశాక్షి | 58 |
| మంచివాఁడవు | రామక్రియ | 286 |
| మంచివాఁడవే | శుద్ధవసంతం | 211 |
| మంతనాననాఁడే | సాళంగనాట | 257 |
| మగవానికేడ | శుద్ధవసంతం | 232 |
| మచ్చికతోనేల | పాడి | 281 |
| మమ్మునిఁక | సౌరాష్ట్రం | 475 |
| మరిగిననీకే | తోండి | 515 |
| మఱచినపని | సాళంగం | 490 |
| మఱితముఁబాసిన | పాడి | 360 |
| మాకేలవిన్నవించ | హిందోళవసంతం | 48 |
| మాటలాడఁగదె | శంకరాభరణం | 94 |
| మాతోనేమి | దేవగాంధారి | 198 |
| మాతోనేమి | సోమరాగం | 124 |
| మానరానవ్వు | సామంతం | 403 |
| మాపుదాఁకా | దేశాక్షి | 213 |
| మాముందర | ఆహిరినాట | 133 |
| మాయలేలసేసేవు | సామంతం | 160 |
| మారుమాటలాడ | సామంతం | 62 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| మించియెప్పుడు | శంకరాభరణం | 434 |
| మిక్కిలిపంతాలు | సామంతం | 440 |
| మిక్కిలి మేలుది | దేవగాంధారి | 28 |
| మూసిదాఁపిరము | లలిత | 182 |
| మూసిమంతనాల | సామంతం | 356 |
| మెచ్చవలదా | కురంజి | 153 |
| మెఱుఁగువంటిది | సాళంగం | 355 |
| మేలు మేలునీగుణము | సామంతం | 51 |
| మొక్కవేపాదాలకు | కుంతలవరాళి | 263 |
| మొగమూనోడి | శంకరాభరణం | 344 |
| మొదలనేమి | శంకరాభరణం | 501 |
| రమ్మనవేచెలియా | దేశాక్షి | 81 |
| రమ్మనవేచెలువు | పాడి | 411 |
| రాజవునీకెదురేది | దేవగాంధారి | 165 |
| రెంటికివచ్చు | సామంతం | 583 |
| వచ్చేవో రావో | వసంతం | 359 |
| వట్టిబాఁతి | రామక్రియ | 30 |
| వడినీజవ్వనాన | శుద్ధవసంతం | 326 |
| వద్దనేమా | ఆహిరి | 139 |
| వద్దువద్దు | సాళంగం | 416 |
| వద్దుసుమ్మీ | కేదారగౌళ | 579 |
| వద్దేమామాట | గౌళ | 322 |
| వద్దేయింతేసి | రామక్రియ | 585 |
| వలచినదానికే | పాడి | 287 |
| వలపులలో | దేసాళం | 83 |
| వలపువేఁచి | శంకరాభరణం | 537 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| వలపేమివెగటా | శ్రీరాగం | 77 |
| వలపేలదాఁచేవే | సాళంగం | 47 |
| వలసినట్టా | మంగళకౌశిక | 372 |
| వలెనానీకింత | సామంతం | 567 |
| వాడికనీ | నాదరామక్రియ | 387 |
| వాఁడిగోదగ్గరి | పాడి | 547 |
| వాఁడేవాఁడే | బౌళిరామక్రియ | 343 |
| వానగుఱియక | సాళంగం | 384 |
| వింటిమయ్యా | శంకరాభరణం | 97 |
| వింటిమియీకొత్తలు | కేదారగౌళ | 10 |
| వింతేదయ | ఆహిరి | 273 |
| విచారించుకో | ఆహిరి | 227 |
| విచ్చనవిడి | కేదారగౌళ | 184 |
| విచ్చేయవయ్యా వెలఁది | వరాళి | 541 |
| విచ్చేయవయ్యా వేగమే | ధన్నాసి | 572 |
| విచ్చేయుమును | ఆహిరి | 342 |
| వినవేడుక | హిజ్జిజి | 14 |
| విన్నవించరే | శ్రీరాగం | 279 |
| విరహాంబు | ఆహిరి | 367 |
| వీడెపుఁబెదవి | లలిత | 420 |
| వెక్కసపువలపుల | సాళంగనాట | 107 |
| వెలుతుమయ్యా | సావేరి | 487 |
| వెలఁదినిఁక | ముఖారి | 338 |
| వెల్లవిరాయఁబనులు | దేసాళం | 173 |
| వేగిర కాఁడవు | మాళవి | 50 |
| వేగిరించకురే | ఆహిరి | 580 |

| సంకీర్తన మొదలు | రాగము | సంకీర్తన సంఖ్య |
|---|---|---|
| వేడుకకాఁడవౌ | సాళంగనాట | 114 |
| వేడుకకువెల | శుద్ధవసంతం | 105 |
| వేడుకవసంతము | వసంతము | 349 |
| శిరసుండ | ఆహిరి | 441 |
| సంతోసించుకొనుచే | ఆహిరి | 321 |
| సందుసుడిదాన | సామంతం | 223 |
| సరసములాడ | హిందోళం | 330 |
| సరికిబేసికి | శంకరాభరణం | 453 |
| సరిమోహాలిద్దరికి | శంకరాభరణం | 430 |
| సవతులమిందరము | భైరవి | 243 |
| సాదుఁగొయ్యవై | పాడి | 219 |
| సారెనాటిసుద్ది | పళవంజరం | 477 |
| సారెవలపందరి | సామంతం | 96 |
| సారెసారెమీరేల | ముఖారి | 410 |
| సిగ్గున మునిఁగెను | రామక్రియ | 354 |
| సిగ్గులువడితే | అమరసింధు | 218 |
| సిగ్గులుసింగారాలు | గుండక్రియ | 425 |
| సిగ్గువడనీక | భైరవి | 205 |
| సూటిగానన్నేమి | శుద్ధవసంతం | 27 |
| సేసతోఁబెండ్లాడి | కన్నడగౌళ | 5 |
| సొరిది నీసరితలు | ముఖారి | 155 |

T. T. D. Religious Publications Series No. 179

రూ 14=00

తిరుమల తిరుపతి దేవస్థానంవారి ప్రచురణ